


# మా నాయన బాలయ్య

వై.బి. సత్యనారాయణ

# మా నాయన బాలయ్య

వై. బి. సత్యనారాయణ

*అనువాదం : పి. సత్యవతి*

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

| | | |
|---|---|---|
| ధర | : | రూ. 100/– |
| HBT ప్రథమ ముద్రణ | : | జూన్ 2013 |
| ఆంగ్లమూలం | : | My Father Balaiah, Harper Collins,<br>New Delhi, 2011 |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85, బాలాజీనగర్<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,<br>126, శాంతినగర్, హైదరాబాద్ – 28<br>ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# అభినందన

డాక్టర్ వై. బి. సత్యనారాయణ వ్రాసిన "మానాయన బాలయ్య" పుస్తకానికి ముందుమాట వ్రాయడం నాకు చాలా సంతోషమిచ్చింది. ఈ పుస్తకం తన తండ్రి యెలుకటి రామస్వామి( బాలయ్య) కీ, తన పూర్వీకులకూ డాక్టర్ సత్యనారాయణ చేసిన గౌరవాభివందనం. సమాజపు అట్టడుగునుంచీ బయల్దేరి ఉన్నత స్థాయికి చేరుకోడానికి ఒక తెలంగాణా దళిత మాదిగ కుటుంబం చేసిన పోరాటాన్ని విశదంగా కళ్లముందుకు తెచ్చిన జీవిత చరిత్ర ఇది. ఆర్థిక సామాజిక ఆంక్షలనూ, అడ్డంకులనూ వీరోచితంగా ఎదుర్కొని విజయంసాధించిన యెలుకటి కుటుంబ చరిత్ర ఇది. దాదాపు రెండు శతాబ్దాలపాటు, మూడు తరాల జీవితకాలంలో సమాజంలో వచ్చిన మార్పుల్నీ ఇంకా రాకుండా వుండిపోయిన మార్పులనూ కూడా ఈ పుస్తకం మన కళ్ళముందుంచుతుంది. ఇది కేవలం ఒక కుటుంబ చరిత్రేకాదు. వివిధ ప్రాంతాల్లో వివిధ నేపథ్యాలలో, విభిన్న పరిస్థితుల్లో కొన్ని దశాబ్దాలపాటు మాదిగ కులస్థుల అనుభవాలనుకూడా వర్ణించిన సామాజిక చరిత్ర ఇది.

"మానాయన బాలయ్య" అస్పృశ్యుల జీవితాలలోని వివిధ దశలచిత్రణ, సమాజం విధించిన అనుల్లంఘనీయమైన ఆంక్షలమధ్య, జీవితంకొనసాగిస్తున్న వారి సాంఘిక ఆర్థిక సాంస్కృతిక పరిస్థితులు, వారిలో వారికున్న పరస్పర అవగాహనా, సంబంధబాంధవ్యాలూ, జీవన విధానాలూ, వృత్తులూ, ఆశలూ, అడియాశలూ పోరాటాలూ రాజీలూ, ఔన్నత్యాలూ లోపాలూ మొదలైన అనేక విషయాలను తడిమిన రచన ఇది. అణిచివేతే ధ్యేయంగా నిర్మితమైన, నిచ్చెనమెట్ల వర్ణవ్యవస్థలో అప్పటి, భూస్వామ్య సమాజంలో అనేక వివక్షలనూ, అవమానాలనూ, అవహేళనలనూ ఎదుర్కుంటూ అస్పృశ్యులుగా పరగణింపబడిన ఒక సామాజిక వర్గం చేసిన అలుపులేని పోరాట చరిత్ర ఇది. అస్పృశ్యతలోని అమానవీయత, కులవ్యవస్థలోని క్రూరత్వం, వాటిని నిస్సహాయంగా జీర్ణించుకుని అంతర్గతంచేసుకోవడం ఆనాటి పరిస్థితి. అయితే అప్పుడుకూడా కొంతమంది ఇతర కులస్థులు, ముఖ్యంగా ఉపాధ్యాయులు చూపిన సహానుభూతి సహకార వాత్సల్యాలను కూడా రచయిత ప్రస్తావించారు.

నేను ఇండియన్ ఎడ్మినిస్ట్రేటివ్ (IAS) సర్వీస్ లో ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తున్నప్పుడు నిరుపేదల మధ్య, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల, తెగలవారి మధ్య పనిచేసే అదృష్టం కలిగింది. చట్టపరంగా నిషేధింపబడినప్పటికీ అస్పృశ్యత ఎంత పాశవికంగా ఇంకా అమలవుతున్నదో కళ్ళారా చూశాను. ఒక దళిత స్త్రీ ఒక చెరువుగట్టున బిందె పట్టుకుని,

చెరువునుంచీ నీళ్ళు ముంచిపోసే వాళ్లకోసం నిరీక్షిస్తూ కూచున్న దృశ్యం నేనెప్పటికీ మర్చిపోలేను. ఆమె దళిత మహిళ కనుక చెరువులోనుంచీ నీళ్ళు ముంచుకోరాదు. వాళ్ళ తక్కువతనాన్ని సూచించడానికి వాళ్లపేర్ల చివర ఎంత అవమానకరమైన పదాలు చేరుస్తారో చూసి, విని నేను అవాక్కయ్యాను. వెట్టిచాకిరి లో వున్న వారి పై జరిగే దోపిడీని ప్రత్యక్షంగా చూశాను. భూస్వాములనుంచీ చిన్నచిన్న మొత్తాల్లో అప్పుతీసుకుని అది తీర్చలేక తరాలుగా వెట్టిచేస్తున్నవారిని చూశాను. తెలంగాణాలో 'దొర'లని పిలవబడే. పెద్ద భూస్వాముల సమక్షంలోవున్నప్పుడు వాళ్లమొహాల్లో కనపడే భయాన్నీ, అదితెలియచెప్పే అణిచివేత స్వభావాన్నీ కూడా చూశాను. "నీ బాంచెన్ కాలు మొక్కుత" అనేది అస్పృశ్యులు భూస్వాములకు చేయవలసిన తప్పనిసరి అభివాదం. యెలుకటి కుటుంబ చరిత్రతో పాటు అస్పృశ్యులు అనుభవించిన క్షోభా, నిరవధిక అవమానమూ కూడా చిత్రించారు రచయిత.

ఈ రచన నాకు మరింత చేరువగా తోచడానికి మరొక కారణం కూడా వుంది. నా బాల్యంలో నేనుకూడా రైల్వే కాలనీల్లో నివసించాను. ఇందులో వర్ణించబడిన రైల్వే కాలనీల్లో, వర్ణవివక్ష అసలే లేదనను కానీ, కాస్త సడలించబడడాన్ని నేనుకూడా చూశాను. గ్యాంగ్ మెన్, పాయింట్స్ మెన్. షంటర్స్ వంటివారిని చిన్నప్పుడు దగ్గరగా పరిశీలించాను. వీళ్ళంతా దాదాపు తక్కువ కులాలనబడే కులాల నుంచీ, స్టేషన్ మాస్టర్లూ రైల్వే గార్డులూ అగ్రకులాలనబడే కులాలనుంచీ వుండేవాళ్ళు. వ్యక్తిగతంగానూ, అధికారపరంగానూ. వాళ్ళ పరస్పరసంబంధాలు ఎట్లావుండేవో కూడా గమనించాను. ప్లాట్ ఫామ్ మీద ఒకరు ఆకుపచ్చజెండా ఊపుతూ నిలబడగా, అక్కడ ఆగకుండా దూసుకుపోయే రైళ్లను చూసి ఆశ్చర్యపోయేవాడిని అప్పుడప్పుడూ. ఆరోజుల్లో ఆగివున్న ఇంజెన్లనుంచీ నీళ్ళు పట్టుకుపోయే స్త్రీలను కూడాచూశాను. రైల్వే ఉద్యోగుల పిల్లలు టికెట్ లేకుండా ప్రయాణించడంకూడా "చట్టసమ్మతంగా"నే వుండేది అప్పట్లో. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే వరకూ కూడా తమ ఉద్యోగులకోసం రైల్వే చౌకగా సరుకులు సరఫరా చెసేది. గ్రామాల్లో భూస్వాములకింద వుండే జీవితానికీ ఇక్కడ జీవితానికీ గల తేడా చూపించడానకి రచయిత ఈ వివరాలన్నీచెప్పారు, తక్కిన సమాజనికన్న రైల్వే ఒక భిన్న ప్రపంచం సృష్టించింది వాళ్లకోసం, అంటారు రచయిత. రచయిత తండ్రి బాలయ్యకు రైల్వే అవతలి ప్రపంచం తెలియదు. అందుకని ఆయన ధ్యేయం తనపిల్లలను చదివించి రైల్వేలో ఆఫీసర్లను చెయ్యడమే!

బ్రిటిష్ ప్రభుత్వం సైన్యంలోనూ, ఓడరేవుల్లోనూ, రైలు మార్గాలలోనూ గనులలోనూ మిల్లులలోనూ కొత్త ఉద్యోగాలను సృష్టించింది. ఇవి అస్పృశ్యులకు కొత్త అవకాశాలయినాయి. ఈ ఉద్యోగాలు అగ్రవర్ణాలనబడేవారికి నచ్చకపోవడం కూడా వీరికి దక్కడానికి ఒకకారణం. ఎందుకంటే ఈ పన్లు ప్రమాద భరితమైనవి. కష్టసాధ్యమైనవికూడా. అంతకంటే మైలపడతామన్న భయంకూడా! బాబాసాహెబ్ అంబేడ్కర్ కూడా మహు

అనే స్టేషన్లో ఒక సైనిక కుటుంబంలో జన్మించాడని చెప్పుకోడం ఇక్కడ అప్రస్తుతం కాదనుకుంటాను. రమాబాయ్ అంబేడ్కర్ కూడా అటువంటి కుటుంబంలోనే జన్మించారు.

రచయిత చెప్పినట్లు గ్రామాలలోని భూస్వామ్య అణచివేతలనుంచీ దళితులకువిముక్తి కలిగించే కొత్త ద్వారాలు తెరిచింది రైల్వేశాఖ. ఆ పన్లు కష్టమైనవైనా, ప్రమాదభరితమైనవైనా తక్కువ స్థాయికి చెందినవైనాగాని! అట్లా వాళ్ళు రైల్వే లో ప్రవేశించారు. రైల్వే క్వార్టర్స్ లో తక్కిన కులాలవారి పక్కన నివసించడం ఒక కొత్త అనుభవం. తమను అంటరాని వాళ్ళుగా చూసి వేరుపెట్టిన గ్రామాలనుంచీ విముక్తి కలిగింది. వీళ్లకు బొగ్గుగనులలో కూడా ఇటువంటి పనులు లభించాయి.

శ్రీ నర్సయ్య జీవితం ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా వంగపల్లి గ్రామంలో ప్రారంభమైంది. ఒకసారి హైదరాబాద్ నిజామ్ వంగపల్లి మీదనుంచీ పోతూండగా నర్సయ్య తండ్రి (ఆయన పేరుకూడా నర్సయ్యే) ఆయనకు దూడచర్మం తో కుట్టిన మృదువైన చెప్పులజత బహూకరించాడు. అవి చూసి ఆయన ఎంతో ముచ్చటపడి అప్పటికప్పుడు నర్సయ్యకి యాభై ఎకరాల పొలం ఈనామ్‌గా ప్రకటించాడు. ఆయన ఈ పుస్తక రచయితకు ముత్తాత. అయితే సాక్షాత్తూ నిజామ్ ఇచ్చినా సరే అతను ఆ పొలాన్ని అనుభవించడానికి వీల్లేదు, అప్పటి దొరల అధికారం అటువంటిది. ఆపొలం అంతా లాక్కుని రెండెకరాలు మాత్రం నర్సయ్యకిచ్చాడు దొర. అట్లా చేసినందుకు నర్సయ్యకు బాధగానీ కోపంగానీ కలుగకపోగా దొర కోపానికీ దెబ్బలకీ బలికానందుకు సంతోషించాడు అటువంటి పరస్థితులు ఇంకా కొన్ని గ్రామాలలో వున్నాయి . షెడ్యూల్డ్ కులాలకు ప్రభుత్వం భూమి ఇచ్చినప్పటికీ వాళ్ళు దాన్ని స్వాధీనం చేసుకుని సాగుచేసుకోనివ్వవు స్థానిక రాజకీయాలు.

రచయిత ఒక గ్రామ నిర్మాణం ఎలావుంటుందో ఈ విధంగా వర్ణిస్తారు.

“అప్పటికీ ఇప్పటికీ భారతదేశంలోని గ్రామాల నిర్మాణంలో పెద్ద మార్పు ఏమీ లేదు. గ్రామాలన్నీ దాదాపు మనువు సూత్రీకరించినట్టే నిర్మింపబడి వుంటాయి. గ్రామం వూరుగా(సవర్ణులకు), వాడగా(అవర్ణులకు) చీలి వుంటుంది మధ్యనొక సరిహద్దో లేకపోతే అవసరమైనంత ఖాళీ స్థలమో వుంటుంది.

అవర్ణులు లేక అస్పృశ్యులు అని పిలవబడే వారి మీదనుంచీ వచ్చే కలుషిత గాలి తమమీద వీయకుండా గ్రామంలోని వివిధ కులాల గృహ నిర్మాణం వుంటుంది. అంటే గాలి బ్రాహ్మణుల ఇళ్లమీదనుంచి ఇతర కులాల ఇళ్లమీదకు వీచే విధంగా గ్రామంలో వివిధ కులాల ఇళ్ళు వుంటాయి. సాధారణంగా గాలి పశ్చిమంనుంచీ తూర్పుకు వీస్తుంది. కనుక, ముందు పశ్చిమంలో బ్రాహ్మణుల ఇళ్ళుంటాయి. అస్పృశ్యుల ఇళ్ళు తూర్పున వుంటాయి. గ్రామంలో ప్రధాన వీధులన్నీ పశ్చిమంలో వుంటాయి. నిచ్చెన మెట్ల వర్ణ వ్యవస్థ తూర్పునుంచీ మొదలౌతుంది. శూద్రులు, వైశ్యులు, క్షత్రియులు, బ్రాహ్మణులు, అట్లా ఉత్పత్తి రంగంలో వుండే శూద్ర వర్ణాలన్నీ ఒక చోట గుంపుగా వుంటాయి. ఆఖరున గ్రామ ముఖ ద్వారంలో బ్రాహ్మణుల ఇళ్ళుంటాయి.

ఈ వాక్యాలు డాక్టర్ అంబేడ్కర్ మాటల్ని తలపింపచేస్తాయి. ఆయన కూడా భారతదేశంలోని గ్రామాల నిర్మాణాన్ని తీవ్రంగా విమర్శించారు. భారతీయ గ్రామాలను అత్యంత భావుకతతో వర్ణించడాన్ని అంబేడ్కర్ ఖండించారు.

"భారతీయ గ్రామాలు గణతంత్ర రాజ్యం అనే భావాన్ని అభావం చెయ్యడంలా వుంటాయి. అవి నిజంగా గణతంత్ర రాజ్యాలే అయితే అవి సవర్ణులకోసం సవర్ణులచేత పాలింపబడే గణతంత్రాలు. అవర్ణులకు అక్కడ ఏ హక్కులూ లేవు. వాళ్ళ సేవచెయ్యడానికీ నిరీక్షించడానికీ, అణిగివుండడానకీ మాత్రమే వున్నారు. అక్కడ స్వేచ్ఛకి తావులేదు. సమానత్వానికి తావులేదు. సహోదరత్వానికి తావులేదు."

అన్ని సామాజిక, మతపరమైన వ్యతిరేకతల మధ్య యెలుకటి కుటుంబంలోకి విద్య ప్రవేశించింది. కొన్ని శతాబ్దాలుగా, ఆ సామాజిక వర్గానికీ ఆ కుటుంబానికీ అందకుండా వుంచిన విద్యా సంపదకు విత్తు నాటింది ఒక ముస్లిమ్ ఉపాధ్యాయుడు. ఆ తొలి గురువైన ఆలీ సాహెబ్‌కు యెలుకటి కుటుంబంలో భవిషత్తు తరాలన్నీ ఋణపడి వుంటాయని రచయిత ఎంతో గౌరవభావంతోనూ కృతజ్ఞతతోనూ చెప్పినప్పుడు మన మనసు ఆర్ధ్రతతో నిండిపోతుంది.

తనకొడుకును గ్రామంలో వెట్టి చాకిరి నుంచీ రక్షించాలనుకున్నాడు నర్సయ్య. అగ్రకులస్థుల నిరంతర వేధింపులు భరించలేక అతను తన పూర్వీకులగ్రామాన్ని వదిలి రావడం నర్సయ్యనే కాక తరువాతి తరాలను కూడా బంధవిముక్తులను చేసింది. ఆత్మగౌరవమూ కృషీ మనుషులకు శక్తినీ ఆత్మవిశ్వాసాన్నీ గుర్తంపునీ ఇస్తాయనేది బాలయ్య నమ్మకం. ఆనమ్మకమే తన బిడ్డలను విద్యావంతులను చెయ్యాలనే జీవిత ధ్యేయాన్ని కలుగచేసింది. నగరానికి వలస రావడం రైల్వేలో నౌకరి సంపాదించడం. భూస్వాముల ఆగడాలకు దూరంగా కొంత అజ్ఞాతంగా వుండడానికి కూడా దోహదం చేసింది. అయితే కుల వ్యవస్థా, దానితో వచ్చిన అవమానమూ దళితులను అన్నిచోట్లా వెంటాడుతూనే వుంటాయని ఈ జీవిత కథ చెబుతుంది. విద్యాలయాల్లోనూ, ఇళ్ళు అద్దెకు తీసుకునేటప్పుడూ ఒక్కొక్కసారి కులందాచిపెట్టుకునే అవసరాన్ని కూడా పరిస్థితులు కల్పిస్తాయి. సామాజంలో మార్పుకు విద్య కీలకమైన పాత్ర పోషిస్తుందనీ, అది ఒక ఆయుధంవలె పని చేస్తుందనీ ఈ పుస్తకం నొక్కి చెబుతుంది. చదువుకునే క్రమంలో కొన్ని సామాజిక బృందాలలో ప్రత్యేకమైన చైతన్యం వికసిస్తుందనీ, ఆ సామర్థ్యం విద్యకున్నదని కూడా చెబుతుంది. చదువు కేవలం జీవిక కోసమే కాదనీ దళితుల విముక్తికి అదొక శక్తివంతమైన సాధనం అనీ, వారిపట్ల అమలయ్యే అన్యాయానికీ, అవమానానికీ విరుద్ధంగా పోరాడే శక్తి ఇస్తుందనీ అంబేడ్కర్ కూడా చెప్పి వున్నాడు.

జీవితంలోని అనేక అంశాలలో వచ్చిన మార్పులనూ పరిణామాలనూ కూడా ఈ రచనలో చూడవచ్చు. యెలుకటి కుటుంబానికి చెందిన మూడుతరాల వ్యక్తులు రైల్వేలో పనిచేశారు. దశాబ్దాలుగా రైల్వేలో వచ్చిన పరిణామాలకు వారు ప్రత్యక్ష సాక్షులు. గర్జిస్తూ

వచ్చే ఆవిరి ఇంజన్లనుంచీ నిశ్శబ్దంగా వచ్చే ఎలెక్ట్రికల్ ఇంజన్లవరకూ, మనుషులు ఇచ్చే సిగ్నల్స్ నుంచీ ఎలక్ట్రానిక్ సిగ్నల్స్ వరకూ, టెలిగ్రాఫిక్ సందేశాలనుంచీ కంప్యూటర్ ప్రోగ్రామింగ్ వరకూ చూశారు. అట్లాగే యెలుకటి కుటుంబపు జీవన విధానంలోనూ ఆహారపు అలవాట్లలోనూ వచ్చిన పరిణామాలుకూడా చూడొచ్చు. వంటకు మట్టికుండలు పిడతల నుంచీ అల్యూమినియం పాత్రలలోకి, జొన్న రొట్టెనుంచీ గోధుమ చపాతీలోకి, ఉమ్మడికుటుంబంనుంచీ వ్యష్టి కుటుంబాలలోకి నిరక్షరాశ్యతనుంచీ ఉత్తమ శ్రేణి సంస్థలలో ఉన్నత విద్యలోకి. విదేశాలలో సదస్సులలో పాల్గొనడానికి.

కిరోసిన్‌లాంతరు మసక వెలుగులో చదువుకుని మెట్రిక్యులేషన్ తరువాత, రైల్వేలో మామూలు సిగ్నలర్‌గా ఉద్యోగం ప్రారంభించి, మళ్ళీ చదవుకుని ఉస్మానియా యూనివర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసర్ గా పదవీ విరమణ చేసిన డాక్టర్ అబ్బసాయిలకు ఈ పుస్తకం ఒక ప్రశంస.

ఈ అద్భుతమైన రచనలో కేవలం వర్తమాన పరిస్థితులను గురించిన వివరణతో పాటు అన్ని అడ్డంకులనూ ప్రతికూలతలనూ ఎదుర్కునే శక్తిసామర్థ్యాలు మనుషులలో స్వాభావికంగా వుంటాయని కూడా అర్థం చేసుకుంటాం. ఇటువంటి కథనాలు ఆయా సమాజాలలోని ఇతరులనుకూడా ప్రభావితంచేస్తాయి. సామాజిక ఆర్థిక ప్రతిబంధకాలను తొలిగించుకోడానికి విద్యను ఎట్లా ఉపయోగించుకోవాలో అర్థంచేయిస్తాయి. సామాజపు నిచ్చెన మెట్లు అధిరోహించడం సాధ్యమేననే ఆశను ఉద్దీపింపజేస్తాయి.

హక్కులకోసం పోరాడుతున్న దళితులనుద్దేశిస్తూ 1947 ఆగస్టులో డాక్టర్ అంబేద్కర్ చేసిన ప్రసంగాన్ని ఉదహరిస్తూ ఈ ముందుమాట ముగిస్తాను.

“నేనిచ్చే సందేశం ఇదే. పోరాడాలి, మరింతగా పోరాడాలి. త్యాగాలు చెయ్యాలి, మరన్ని త్యాగాలు చెయ్యాలి. బాధనూ త్యాగాలనూ లెక్కచెయ్యకుండా పోరాడడమే వారికి విముక్తినిస్తుంది. తప్ప మరేదీ ఇవ్వదు.”

దళితులంతా ఉన్నతి సాధించడంకోసం ఒక ఉమ్మడి ఆకాంక్షను అభివృద్ధి చేసుకోవాలి. తమ ఆశయానికున్న పవిత్రతను విశ్వసించి దాన్ని సాధించాలనే సమష్టి నిర్ణయం తీసుకోవాలి. ఈ కార్యం చాలాగొప్పది. దాని లక్ష్యము చాలా ఉదాత్తమైనది. “కనుక అస్పృశ్యులంతా కలిసి ఇట్లా ప్రార్థించండి” తాము ఎవరిమధ్యనైతే జన్మించారో వారి ఉన్నతికోసం పనిచెయ్యడమనే తమ కర్తవ్యాన్ని నిర్వహించేవారు ధన్యులు. బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడే ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఎవరు తమ కాలాన్నీ, శారీరక, ఆధ్యాత్మిక శక్తుల్ని ధారపోస్తారో వారు ధన్యులు. మంచి జరిగినా, చెడు ప్రాప్తించనా, సూర్యకిరణాలు ప్రసరించినా తుఫానులు విరుచుకుపడినా, గౌరవం దక్కినా, అవమానాల పాలైనా, అస్పృశ్యులు తిరిగి తమ మనిషితనాన్ని పొందేవరకూ పోరాటం ఆపేదిలేదనే ధృడ నిశ్చయంతో వున్నవారు ధన్యులు.”

**ఎస్.ఆర్. శంకరన్**

మార్చ్ 2010

# నా మాట

'మై ఫాదర్ బాలయ్య' పేరుతో ఆంగ్లంలో వెలువడిన రచనకు తెలుగు అనువాదం ఈ పుస్తకం. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఓ మాదిగ రచయిత రాసిన మొట్టమొదటి ఆత్మ కథాత్మక జీవిత చరిత్ర ఇది. ఒక రకంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంగ్లీషులో వచ్చిన పూర్తిస్థాయి దళిత ఆత్మకథగా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. రచయిత దీన్ని తన మాతృభాష అయిన తెలుగులో కాకుండా ఇంగ్లీషులో ఎందుకు రాశారన్నది ఆసక్తికర అంశం. పుస్తకం చదువుతుంటే బాలయ్య, ఆయన కుటుంబం విద్యకు ఎంతటి ప్రాధాన్యం ఇచ్చారో మనకు అవగతమవుతుంది. అంటరానితనాన్ని, దాని మూలంగా నిత్య జీవితంలో అనుభవంలోకి వచ్చే తీవ్ర వివక్షలను అధిగమించటానికి విద్యను ఓ అత్యవసర సాధనంగా, మార్గంగా గుర్తించిన కుటుంబం వారిది. ఈ క్రమంలో రచయిత వై.బి. సత్యనారాయణ ఇంగ్లీషును మార్పుకు, ప్రభావశీలతకు కీలక సంకేతంగా కూడా గుర్తిస్తారు.

ప్రధానంగా రెండు లక్ష్యాలను ఆశించి మేమీ తెలుగు అనువాదాన్ని మీ ముందుకు తెస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంగ్లీషులో వచ్చిన తొట్టతొలి దళిత ఆత్మకథాత్మక జీవిత చరిత్రగా తెలుగునాట దీనికి సముచిత స్థానాన్ని కల్పించటం తొలి ఉద్దేశం. రెండోది – తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చిన మాదిగ, దళిత అనుభవాలు, కులానికి సంబంధించి ఎన్నో అంశాలను 'డాక్యుమెంట్' చేసిన ఈ రచనను తెలుగు పాఠకులకు అందుబాటులో ఉంచటం అవసరమని మేం భావిస్తున్నాం. ఇంగ్లీషులో ఈ ఆత్మకథపై రాష్ట్రంలోనూ, బయటా కూడా విస్తృతంగా చర్చ జరిగింది. వాటిలో అంబేద్కరిస్టు సామాజిక ఉద్యమం, ఆ పరిణామాలేవీ ఈ పుస్తకంలో ఎక్కడా ప్రతిఫలించలేదన్న విమర్శలు వినపడ్డాయి. అది ఎంత నిజమో, చీకటిలో ఉండిపోయిన ఎన్నో అనుభవాలను, అంశాలను ఈ పుస్తకం వెలుగులోకి తెస్తుందన్నదీ అంతే నిజం. విస్తృత రాజకీయ ఉద్యమాలకు ఎంతటి ప్రాధాన్యం ఉందో ఓ పేద మాదిగ కుటుంబం అనుభవించిన భావోద్వేగాలు, వాళ్లు చేసిన నిజ జీవన పోరాటాలకు కూడా అంతే ప్రాధాన్యం ఉంది. ఇది జీవన వాస్తవికతను ప్రతిబింబిస్తూ హుందాగా సాగిన రచన. దళిత జీవితాలను, దళితత్వాన్ని అర్థం చేసుకోవటానికి ఈ వాస్తవిక, సాధికారిక రచన ఎంతో మంది పాఠకులకు ఊతమిస్తుందని ఆశిస్తున్నాం.

**-హైదరాబాద్ బుక్ ట్రస్ట్**

# భూమిక

నేనొక విశ్రాంత అధ్యాపకుడిని. ఉద్యోగ విరమణవరకూ రసాయన శాస్త్రం బోధించాను. కానీ మా కుటుంబ చరిత్ర, మా దళిత కుటుంబచరిత్ర, వ్రాస్తానని నేను కలలో కూడా అనుకోలేదు. ఇది మాకుటుంబపు మూడుతరాల జీవిత కథ. మాతాత నర్సయ్య, మా నాయన బాలయ్య, నామేనత్త పెంటమ్మ, మా అక్క బచ్చమ్మలతో సుదీర్ఘ సంభాషణలు జరిపిన మీదట తవ్వితీసిన వారి జ్ఞాపకాల సమాహారమే ఇది. ముఖ్యంగా మానాయిన రిటైరైన తరువాత సాయంత్రాలప్పుడు ఆయనకిష్టమైన కల్లు తెచ్చిపెట్టి పక్కన కూర్చున్నప్పుడు, ఆయన తనూ మా అమ్మా మమ్ములను పెంచి పెద్దచెయ్యడానికి పడిన కష్టాలను గురించి చెప్పిన విషయాలే ఇందులోని అనేక సంఘటనలు.

ఈ కథ వివిధ ప్రదేశాలలో వివిధ కాలాలలో వివిధ వ్యక్తుల జీవితాలను గురించినది. తెలంగాణాలోని ఒక కుగ్రామమైన వంగపల్లిలో ప్రారంభమై అనేక వూళ్ళు తిరిగి ఆంధ్రప్రదేశ్ రాజధానికి జంటనగరమైన సికిందరాబాద్‌కి చేరి ముగుస్తుంది. భారత దేశం ఒక సంక్షోభాన్ని ఎదుర్కుంటూ కొన్ని పెనుమార్పులకు గురౌతున్న కాలంలో జరిగిన కథ. ఒక సామాజిక వర్గంలోని వ్యక్తుల జీవితాలలో వచ్చిన పరిణామాల చరిత్ర కూడా. తన తల్లితండ్రులనూ, భార్యనూ, ఉన్న భూమినీ కూడా కోల్పోయి, నిరాధారంగా నిస్సహాయంగా ఆరేళ్ళకొడుకుతో ఊరువిడిచి, ఒక ఆత్మీయమైన పంచ వెతుక్కుంటూ తన మేనమామల ఊరికి ఎంతో దూరంనడిచి వెళ్ళి, కొత్త జీవితం వెతుక్కున్న మాతాత నర్సయ్యతో మొదలయ్యే చరిత్ర ఇది. అంతేకాదు మా నాయన బాలయ్య, ఆయన వారసులు నిరక్షరాశ్యతలో నుంచీ విద్యార్హతలలో అత్యుత్తన్నత స్థాయి అందుకున్న క్రమం, పేదరికం నుంచీ స్వయం అభివృద్ధితో, జ్ఞానాన్వేషణకు తలుపులు తీసుకున్న క్రమం తెలియచేస్తుంది ఈ రచన.

ఇంకొక విధంగా, ఒక సమాజికవర్గపు కథ కూడా. దళితులు చేసిన అవిశ్రాంత పోరాటాన్నిగురించి ఇప్పటి దళితులకూ భవిష్యతరాలకూ తెలియచెప్పాలనేది నా చిరకాలవాంఛ. ఇరవైయో శతాబ్దపు ప్రారంభ దినాలలో దళితులు అస్పృశ్యులు. దుర్భరమైన పరిస్థితుల్లో జీవించారు. అస్పృశ్యత నేనుకూడా అనుభవించాను. భవిష్యత్ తరాలు ఈ దుష్ట సంప్రదాయాన్నుంచీ విముక్తి పొందుతాయని ఆశిస్తున్నాను. వలస ప్రభుత్వం తన ఆర్థిక ప్రయోజనాల కోసమే అయినప్పటికీ, చాలామంది దళితులకు

వివిధ శాఖలలో ఉద్యోగాలిచ్చింది. ఆ ఉద్యోగాలు ప్రమాదభరితమైనవైనా, తక్కువ స్థాయివైనా వేలాదిమందికి ఉపాధి లభించింది. ముఖ్యంగా రైల్వేలో, దానివలన వారికి క్రమబద్ధమైన వేతనం, ఊరుబయట వెలివేసినట్లుండే నివాసాలనుంచీ బయట పడి ఇతర శూద్రకులాల పొరుగున నివసించే అవకాశం లభించింది. ఇట్లా లబ్దిపొందిన ఎన్నో దళిత కుటుంబాలలో మాదికూడా ఒకటి. వేలాదిమంది అస్పృశ్యులకు ఈ విధంగా చదువుకునే అవకాశంకూడా దక్కింది. అట్లా వాళ్ళు తమ పిల్లలను ప్రధాన స్రవంతి లోకి పంపించగలిగారు. మా కుటుంబంలో మూడు తరాలు రైల్వేలో పనిచేసాయి. రైల్వే క్వార్టర్స్‌లో నివసించాయి. మా తాత తన గ్రామంవదిలిపెట్టి వుండకపోతే మా జీవితాలెట్లావుండేవో అని ఆశ్చర్యపడుతూ వుంటాను. బ్రిటిష్ ప్రభుత్వంలో ఏదో ఒక ఉద్యోగం వెతుక్కుని గ్రామాలనుంచీ బయటపడ్డ వారి కుటుంబాలలోనే అభివృద్ధి కనపడుతుంది, క్రాంతిదర్శీ, అత్యంత మేధావీ దళితజన బాంధవుడూ అయిన డాక్టర్ అంబేడ్కర్ తన అవిశ్రాంత పోరాటంతో కూడా దళితులు ప్రధానస్రవంతి సమాజంలో లీనమయ్యే స్వప్నం సాకారమవడాన్ని చూడలేకపోయాడు. భారత రాజ్యాంగ చట్టంలో దళితులకు హామీ ఇవ్వబడిన రిజర్వేషన్లూ, అవి అమలు పరిచే సక్రమమైన చర్యలూ చట్టాలూ కూడా చాలా దళితకుటుంబాల జీవితాలలో మార్పు తేలేకపోతున్నాయి. అట్లా గ్రామాల్లో పేదరికంలో మగ్గిపోతున్న అనేక కుటుంబాలలో మాదీ ఒకటిగా వుండేది మాతాత వలస రాకపోయివుంటే.

◆◆◆

బాలయ్య చదుకున్నది చాలా తక్కువే. పొరుగునుండే మసీదులో ముల్లా ఆలీ సాహెబ్ చొరవతీసుకుని అతనికి అక్షరాలు పరిచయం చెయ్యడం వలననే అతని బిడ్డలు డాక్టరేట్లు తీసుకోగలిగారు. అతని మనుమలు విదేశాలలోతాము కోరుకున్న చదువుకు పోగలిగారు. బాలయ్య విద్య ప్రాముఖ్యాన్ని గుర్తించాడు. తన వారసులకు తనొక ఉదాహరణగా నిలిచాడు. ఆయన ఎప్పుడూ రామాయణమూ భారతమూ చదువుతూ వుండేవాడు. అవి అంటరానివారికి నిషిద్ధమని, అవి చదవడం వలన ఆపదలు వస్తాయనీ తోటివారు చెప్పినా లెక్క చేసేవాడుకాదు. అతని ప్రాణానికే ముప్పు తెచ్చేటంత యాక్సిడెంట్ జరగినప్పుడు తమ మాట నిజమైందని కూడా వాళ్ళు అన్నారు. కానీ ఆయన తన విశ్వాసాలకు మాత్రమే కట్టుబడి వుంటాడు గాని ఎవరి మాటలకీ చలించడు. దేనికీ రాజీ పడడు. ఎవరికీ తలవంచడు. ఈ తత్వమే ఆయన తన పై అధికారులతోనూ ప్రదర్శించడం ఉద్యోగంలో ఎన్నో బదిలీలకు కారణం కూడా అయింది.

మా నాయన ప్రపంచం అంతా తాను పనిచేసే రైల్వేమాత్రమే. సమయపాలన, కష్టించి పనిచెయ్యడం క్రమశిక్షణ ఆయన బలాలు. తన పిల్లలు కలెక్టర్లో ప్రభుత్వంలో ఉన్నతాధికారులో కావాలని కోరుకోలేదు, కానీ బాగా ఇంగ్లీష్ నేర్చుకుని రైల్వేలో అధికార్లు

కావాలనుకునేవాడు. అంతకు మించిన ప్రపంచంలేదు... ఆయన పరిసరాలు ఆయన దృష్టిని అంతవరకే పరిమితం చేశాయి. తన పై అధికారులవలె తన కొడుకులుకూడా స్టేషన్ మాస్టర్లు కావాలనుకునేవాడు. అందుకు చదువే సాధనం అనుకున్నాడు. మా నాయనకు చదువు విలువతెలియకపోతే, ఆయన రైల్వేలో పనికి చేరకపోతే మేం ఇప్పుడున్నస్థితిలో వుండేవాళ్ళం కాదు. అప్పుడు మాపై వుండే వివక్షలు, ఆంక్షలు, అంటరానితనం వంటి, సాంఘిక దురాచారాల మధ్య మేము చదువుకోగలగడానికి మా నాయన దృఢ సంకల్పమే కారణం. పిల్లల చదువులకోసం తను చేసే ఉద్యోగమే కాక అదనంగా కూలీపని కూడా చేసేవాడు, మా అమ్మ నర్సమ్మకూడా పొలంపనికి పోయేది. మా నాయన అంబేద్కర్ రచనలు చదవకపోయినా సాంఘిక దురాచాలను ఎదిరించేవాడు. అస్పృశ్యతవంటి దురాచారాలపై తిరగబడడం చదువు వల్ల మాత్రమే సాధ్యమౌతుందని ఆయనకు తెలుసు . ఆయనకు పాఠశాల విద్యకు అనుమతి లేకపోయినా తనపిల్లల చదవుమీద అత్యంత శ్రద్ధ చూపించాడు ఆయన కొడుకులు. ముగ్గురు డాక్టరేట్లు తీసుకున్నారు. తరాలతరబడి చదువుల్లో వున్న కుటుంబాల్లోకూడా అరుదైన విషయం ఇది.

నా కుటుంబపు మూలాలను శ్రద్ధగా అధ్యయనం చెయ్యాలనుకున్నాను. బాలయ్య మనుమల, మనుమరాళ్ల బిడ్డలకు వారి కుటుంబచరిత్ర తెలియాలి. వారిముందు తరాలు అనుభవించిన కష్టాలు తెలియాలి. కొన్ని తరాల పాటు తమ పూర్వీకుల జీవితం ఎంత అమానవీయంగా గడిచిందో వారికి తెలియాలి. నేను ఈ రచన చెయ్యకపోతే మాకుటుంబ చరిత్ర రాబోయే తరాలకు ముఖ్యంగా దళితులకు తెలిసే అవకాశంలేదు. మెరుగైన జీవితంకోసంచేసే అన్వేషణలో తమ మూలాలను మర్చిపోతున్న వారికోసం. కూడా ఇది వ్రాయాలనుకున్నాను. 2005లో అమెరికాలో పుట్టిన నామనుమరాలిని చూసినప్పుడు ఈ కోరిక మరింత బలపడింది. గులాబీ బుగ్గలతో వంకీల జుట్టుతో, గుండ్రని పెద్దపెద్ద కళ్ళతో సమ్మోహనంగా వున్న ఈ పిల్ల పెద్దదైన తరువాత, భారతదేశానికీ ముఖ్యంగా దళిత సమాజానికీ పరాయిదైపోతుంది. అక్కడ అమెరికా దేశచరిత్ర, అక్కడి జాతివివక్ష, అక్కడ బానిసత్వ చరిత్ర చదువుతుంది. బానిసత్వంకన్న కూడా అమానుషమైన అస్పృశ్యత గురించి చదివే అవకాశమేముంది తనకి? తన పూర్వీకులగురించీ తన వారసత్వం గురించీ ఎట్లా తెలుసుకుంటుంది? అప్పుడే నేనీ రచన ప్రారంభించాను. మా నాయన ఎప్పుడూ చెప్తూవుండే మాట నామనసులో పెట్టుకున్నాను. "నువ్వు ఏపని తలపెట్టినా, అది ఎంత చిన్నదైనా అందులో శ్రేష్టత సాధించాలి" అని. మా ముత్తాత నిజాం మన్నన పొందేటంత శ్రేష్టంగా చెప్పులు కుట్టి వుండకపోతే, ఇప్పటికి కూడా అవమానాలు భరిస్తూ గ్రామాలలో వుంటున్న కొన్ని దళిత కుటుంబాలలాగే మేమూ వుండేవాళ్ళమేమో!

భారత ఆర్థికాభివృద్ధిలో ఒక్కొక్కసారి ప్రాణాలకు కూడా తెగించి తోడ్పడిన దళితుల పాత్రకు సరైన గుర్తింపులేదు. దానిని నమోదుచేసిన వారులేరు. ఆ ఆర్థికాభివృద్ధిని పంచుకోడానికి కూడా వాళ్ళు నోచుకోలేదు. మనకథలు మనం వ్రాసుకోవలసిన సమయం ఇది, 'అనగనగా ఒక బీద బ్రాహ్మణుడు" అంటూప్రారంభమయే కథలకు కాలం చెల్లింది. మాకుటుంబమే కాదు ఒక మంచి భవిష్యత్తు నిర్మించడం కోసం దళితులూ దళితేతరులూకూడా మా గతాన్ని తెలుసుకోవాలి అనేది నా అభిమతం.

వై. బి. సత్యనారాయణ

అంకితం

మా నాయన బాలయ్యకు
అక్షరాలెరుగని అమ్మ నర్సమ్మకూ

ఒకటో భాగం

# నర్సయ్య లోకం

ఈదురు గాలిలో వానచినుకుల మధ్య భారమైన హృదయంతో, దూరాన వున్న వాగు వైపు వడివడిగా నడిచి వెడుతున్నాడొక పొడవాటి మనిషి. అతను తన భార్య మృతదేహాన్ని వీపుకు కట్టుకున్నాడు. ఆపకుండా ఏడుస్తున్న మూడేళ్ళ కొడుకుని చెయ్యిపట్టుకుని దాదాపు. ఈడుస్తున్నట్టు నడిపించుకు పోతున్నాడు. ఆ పిల్లవాడి వంటిమీద బట్టలు కూడా పూర్తిగా లేవు.

దిగులు కమ్మిన ఆ సాయంత్రం, అతను నిస్సహాయంగా తన స్వంతవూరు విడిచి వెడుతున్నాడు. తెలంగాణాలోని కరీమ్‌నగర్ జిల్లా వంగపల్లిలోని హరిజనవాడ అతనిది. చీకటి పడే లోగా వాగు దగ్గరకు చేరాలని అతను వేగంగా నడుస్తున్నాడు. ఎవరి సహాయమూ లేకుండా తనొక్కడే గొయ్యి తవ్వి భార్యను ఖననం చెయ్యాలి. చినుకుల్లో తడుస్తున్నా. వీపు మీద భార్య మృతదేహం బరువుకు అతనికి చెమటలు పడుతున్నాయి. చీకటి పడే లోగా వాగు దగ్గరకు చేరగలనా లేనా, అనే విచారంతో, ఇంతటి విషాదంలో కూడా తనకు సాయం రాని తన కులం మనుషులను తిట్టుకుంటూ, తల్లిని కోల్పోయిన తన కొడుకు దురదృష్టానికి చింతిస్తూ సాగుతున్నాడతను.

◆◆◆

అతని పేరు నర్సయ్య. మాదిగ కులస్థుడు. అంటరాని వాడు. నిజామ్ వద్దనుంచీ యాభై ఎకరాల సారవంతమైన భూమిని ఈనాముగా పొందిన పెద్దనర్సయ్య కొడుకే ఇతడు. ఒక అంటరాని వాడికి అంత భూమి వుందంటే ఎవరూ నమ్మరు. ఒక నాడు దక్కన్‌ను పాలించే నిజామ్ నవాబ్ మీర్ తహ్నియత్ ఆలి ఖాన్ అఫ్జల్ ఉద్ దౌలా (అయదవ నిజామ్) తమ గ్రామం మీదుగా వెడుతుంటే, నర్సయ్య తండ్రి (అతని పేరు కూడా నర్సయ్యే! పెద్ద నర్సయ్య) అయనకు దూడ చర్మంతో కుట్టిన మెత్తని చెప్పులు బహూకరించాడు. ఆ చెప్పులు నిజామ్ గారి పాదాలకు సుతిమెత్తగానూ, సుందరంగానూ అమరడంతో ఆయన మురిసిపోయి అతని పనితనానికి మెచ్చి, యాభై ఎకరాల పంట భూమిని దఖలు చెయ్యమని తన పరివారంలోని రెవెన్యూ అధికారులను అజ్ఞాపించాడు. ఒక మాదిగ అంత భూమిని బహుమానంగా పొందడం అత్యంత ఆశ్చర్యం! అందులోనూ రెండు బావులున్న సారవంతమైన భూమి అది!

ఈ సంఘటన పంథొమ్మిదో శతాబ్దపు చివరి భాగంలో జరిగింది. అప్పటికీ ఇప్పటికీ భారతదేశంలోని గ్రామాల నిర్మాణంలో పెద్ద మార్పు ఏమీ లేదు. గ్రామాలన్నీ దాదాపు మనువు సూత్రీకరించినట్టే నిర్మింపబడి వుంటాయి. గ్రామం ఊరుగా (సవర్ణులకు), వాడగా (అవర్ణులకు) చీలి వుంటుంది మధ్యనొక సరిహద్దో లేకపోతే అవసరమైనంత ఖాళీ స్థలమో వుంటుంది.

అవర్ణులు లేక అస్పృశ్యులు అని పిలవబడే వారి మీదనుంచీ వచ్చే కలుషిత గాలి తమమీద వీయకుండా గ్రామంలోని వివిధ కులాల గృహ నిర్మాణం వుంటుంది. అంటే గాలి బ్రాహ్మణుల ఇళ్లమీదనుంచి ఇతర కులాల ఇళ్లమీదకు వీచే విధంగా గ్రామంలో వివిధ కులాల ఇళ్ళు వుంటాయి. సాధారణంగా గాలి పశ్చిమం నుంచీ తూర్పుకు వీస్తుంది కనుక, ముందు పశ్చిమంలో బ్రాహ్మణుల ఇళ్ళుంటాయి. అస్పృశ్యుల ఇళ్ళు తూర్పున వుంటాయి. గ్రామంలో ప్రధాన వీధులన్నీ పశ్చిమంలో వుంటాయి. నిచ్చెన మెట్ల వర్ణ వ్యవస్థ తూర్పు నుంచీ మొదలౌతుంది. శూద్రులు, వైశ్యులు, క్షత్రియులు, బ్రాహ్మణులు, అట్లా. ఉత్పత్తి రంగంలో వుండే శూద్ర వర్ణాలన్నీ ఒక చోట గుంపుగా వుంటాయి. ఆఖరున గ్రామ ముఖ ద్వారంలో బ్రాహ్మణుల ఇళ్ళుంటాయి.

ఆ రోజుల్లో వంగపల్లిలో శక్తిమంతులైన భూస్వాములు వెలమకులస్తులు. జనాభా ప్రకారం తక్కువమందే వున్నప్పటికీ, భూస్వాములైనందున గ్రామంలో వాళ్ళే అధికారం చెలాయించేవాళ్లు. వెలమలే గ్రామ ముఖ్యులు. ప్రజలనుంచీ పన్నులు వసూలుచేసి నిజామ్ ఖజానా కు అందచేసేవాళ్ళు. గ్రామ ముఖ్యుడిని దొర అనేవారు. అతని మాటే చట్టం. దొరకి గ్రామంలోని ప్రతి కుటుంబమూ అందులోని ప్రతి వ్యక్తీ తెలుసు. అతను అస్పృశ్యుల ఆడపిల్లలను లోబరుచుకోడానికి తన అధికారం ఉపయోగించుకునేవాడు. గ్రామం మొత్తం మీద అశక్తులు అస్పృశ్యులు. అంతకన్న ఎక్కువ అశక్తులు వారి ఆడవాళ్ళు.

అస్పృశ్యులకు హిందువుల దుశ్చర్యలను ప్రశ్నించే ధైర్యం లేదు. వాళ్ళ అమానుష చర్యలన్నింటినీ మౌనంగా భరించేవాళ్ళు. పరిస్థితులు ఎట్లా వుండేవంటే వీళ్ళు హిందువులకి ఎదురుబడకూడదు. వీళ్ళు ఎదురు పడితే వాళ్ళు మైల పడతారన్నమాట. ఈ అణగార్చబడిన వర్గానికి కనీసం సెంటు భూమి కావాలనుకోడం కూడా ఒక కలే!

ఇటువంటి సందర్భంలో పెద్దనర్సయ్యకి ఉన్నట్లుండి భూమి, అందులోనూ యాభై ఎకరాల భూమి వచ్చింది. అసలు తను దానిని స్వాధీన పరుచుకోగలడా? ఎట్లా? అతను ఈ విషయం భార్యకి చెబుదామని ఇంటికేసి పరిగెత్తబోయాడు. కానీ అంతలోనే ఎవరో మనిషి అతన్ని పేరుపెట్టి పిలవడంతో అక్కడే నిలబడిపోయాడు.

'అరె నర్సిగా, దొర పిలత్తాండ్రా' అన్నాడు ఆ మనిషి.

నర్సయ్య, తను నిజామ్ కు చెప్పులు బహూకరించినందుకు తనని తనే తిట్టుకుంటూ తనయింటికి బదులు దొర ఇంటికి నడిచాడు. ఆ బహుమతి తన వినాశనానికే వచ్చింది అనుకున్నాడు. దొర ఎర్రబడ్డ మొహం చూస్తూనే అర్థమైపోయింది ఆ విషయం.

'లంజకొడకా! సర్కార్ కు ఇనామిచ్చే మొనగానివైనావురా, నీకు భూమి కావల్నారా?' అరిచాడు దొర.

'నీ బాంచెన్, గులాపోన్ని, తప్పైంది దొరా, నీ కాళ్లకాడ పడుండేటోన్ని, మరి నన్ను మాఫ్ చెయ్యి' అన్నాడు నర్సయ్య, చేతులు జోడించి తలవంచుకుని, వీలైనంత దూరంగా నిలబడి.

'లంజకొడకా ! 50 ఎకరాలు ఏంజేసుకుంటవురా? నా కాళ్ల కాడ పడుండేటోన్వి, నాపక్కకు గూసుంటవురా?' దొర గర్జించాడు.

'లేదు, నీ బాంచెన్, అంత పాపం జేస్తనా దొరా! నాకండ్లు పోతయ్ నువ్వే నాదొరవు నాదేవుని'.

ఈ మాటలకి దొర కాస్త శాంతించాడు. అతని వంక కాస్త దయగాచూసి,

'అరె నర్సిగా ! రొండెకరాలు తీసుకో! ఎగుసం జేస్కపో" అని "తక్కిన భూమి మన పద్దులో రాసుకో కరణం' అన్నాడు.

నర్సయ్య ఊపిరి పీల్చుకున్నాడు. రెండెకరాల భూమి ఉంచుకోమన్నందుకే పరమానందం అయిందతనికి. దొర కోపానికి గురి కానందుకు, దొర తనని కొట్టించనందుకు మిక్కిలి సంతోషించాడు.

◆◆◆

నర్సయ్యని అతని కులం వారు బాగా గౌరవిస్తారు, చాలామందికన్న వయసులో పెద్దవాడవడం చేత, వివాదాల పరిష్కారానికి అతన్ని ఆశ్రయిస్తారు అతని కులం వాళ్ళు. అతను చెప్పులు కుట్టడమే కాక దొర పొలంలో కూడా పని చేస్తాడు. అతని భార్య పోచమ్మ నెమ్మదస్థురాలు. ఇంటిపనితో పాటు పొలంపనికి కూడా పోతుంది. నర్సయ్య కొడుకు చిన్న నర్సయ్య కి పదిహేనేళ్ళు. దొర దగ్గర జీతం భత్యం లేకుండా పొద్దస్తమానమూ పనిచేసే జీతకాడు. దొరా, ఆయన కుటుంబమూ ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాజరు కావడానికి. రాత్రి పూట గొడ్ల సావడిలో పడుకుంటాడు. దొరకు విశ్వాస పాత్రంగా వున్నందున ఆయనకు అనుగ్రహం కలిగినప్పుడు వడ్లో మరేవైనా ధాన్యమో ఇస్తూవుంటాడు అతనికి. నర్సయ్య కూతుళ్ళిద్దరికీ పెళ్ళిళ్లయి చుట్టుపక్కల గ్రామాల్లోనే వుంటున్నారు. వాడలోని అనేక కుటుంబాలకన్న నర్సయ్య కుటుంబం కాస్త సుఖంగా వుందిప్పుడు. నిజామ్ ఇచ్చిన భూమిలో అధిక భాగం పోయినా, దొర దయవల్ల రెండెకరాలు దక్కింది. తక్కిన వాళ్లకి అసలు భూమి అనేదే లేదు. వాడలో ఇంత గౌరవం వున్నా నర్సయ్య ఎంతో వినమ్రంగా వుండేవాడు.

నర్సయ్యా అతని భార్యా తరుచుగా వాళ్ళ కొడుకు వివాహం విషయం వాదించుకునే వాళ్ళు.

'ఊళ్ళె అందరి పన్లు జేస్తవ్ గని నీ కొడుకు పెళ్ళి ఫికర్ లేదు' అనేది పోచమ్మ, అతని గిన్నెలో గట్క పెట్టి దానిమీద కూర వేస్తూ.

'మంచి పిల్లను జూత్తాన్నా, అందంగా ఎర్రగా వుండాలి గదనే' అనే వాడు నర్సయ్య తాపీగా.

'ఎప్పుడు ? నేను సచ్చినంకనా? ఆన్కి పదారేండ్లయినై'.

'ఒర్రకే !సూత్తాన్న గద' నర్సయ్య చిరాకుపడేవాడు.

'అది గాదయ్య, లోకం ఏమనుకుంటది? ఆన్కేమో పెళ్ళీడచ్చింది' అనేది పోచమ్మ కాస్త శాంతించి.

'మనపోరడు మంచోడు, వాడేం చెడ్డపన్లు చెయ్యడు ఆన్కి సక్కని తెల్ల పిల్లని సూడనీ' అనేవాడు నర్సయ్య చేతులు కడుక్కుంటూ.

'ఎట్లజేస్తవో ఏమో! ఈ ఎండాకాలంల ఆని పెండ్లై పోవాలి. ఆడు గొడ్ల సావిట్ల పండడం తప్పుతది. దొర ఇంటికి పంపిస్తడు' అనేది ఆమె ఆవేదనగా.

◆◆◆

రాత్రి ఏడుగంటలైంది. భోజనం చేసి ఇంట్లోనుంచీ బయటకు వచ్చాడు నర్సయ్య. అతనిది ఇటీవలే కట్టుకున్నరెండు గదుల పూరిల్లు. కొడుకుకు పెళ్లైతే అతనికి ఒక గది అవసరమని ముందుగానే ఏర్పాటుచేశాడు. అతని పూరిల్లు శుభ్రంగా వుంటుంది. ఇంట్లో నులకమంచాలు, కప్పుకోడానికి గొంగళ్ళు, అల్యూమినియం వంటపాత్రలూ వున్నాయి. ఈ సౌకర్యాలన్నీ అతనికున్న రెండెకరాల పొలంనుంచీ వచ్చే ఆదాయం వల్లనే సాధ్యమైనాయి. నర్సయ్య ఇంట్లోనుంచీ బయట పడబోతుండగా ఒకతను 'అరే నర్సయ్య! యాడున్నవ్ ర! నువ్వు ?దినమంత దెవ్ లాడుతున్న' అంటూ వచ్చాడు.

'ఎందుకంట?' అన్నాడు నర్సయ్య విసుగ్గా, వెనక్కి తిరుగుతూ.

'మీ వోన్కి మంచి పిల్లను జూసిన పక్కూళ్ళె'.

నర్సయ్య అతని మొహం చూడకపోయినా గొంతు గుర్తుపట్టి, 'ఎల్లయ్య! మంచి మాట జెప్పినౌరా మా ఇంటిది సతాయిత్తాంది, ఇంతకి పిల్ల తండ్రెవలు' అన్నాడు.

'కల్లుక్కాం కాడ మాట్లాడుకుందాం రా. ' అన్నాడు ఎల్లయ్య.

'నేనిప్పుడె తిన్నరా, నాక్కల్లద్దు' అన్నాడు నర్సయ్య.

'నువ్వు తాగకపొతె తాగకపోతివి, నాక్దాపియ్, పుక్యానికి జెప్పాల్నారా?' అన్నాడు ఎల్లయ్య నవ్వుతూ. చీకట్లో అతని పళ్ళు తెల్లగా మెరిసాయి. వాళ్ళు అవీ ఇవీ మాట్లాడకుంట కల్లుకానానికి వెళ్ళారు.

రోజంతా కష్టపడి పనిచేసి ఆడామగా అంతా కల్లు దుకాణానికి పరిగెత్తుతారు కాస్త ఊరట కోసం. శూద్రులలోనే ఒక ఉపకులమైన ఈడిగ కులస్తులు గ్రామస్తులకు

ప్రీతిపాత్రమైన తాటి కల్లు గీచి అమ్ముతారు. కల్లుగీత వాళ్ళు, లేదా' గౌండ్లోళ్ళు' అనే వీళ్ళు ప్రాణాలకు తెగించి అతిపొడుగైన తాటి చెట్లెక్కి కల్లు తీస్తారు.

కల్లు దుక్నంలో అంటరాని వారికోసం ప్రత్యేకించిన చోట నిలబడి కల్లు కావాలని కేకేసేడు నర్సయ్య. గౌండ్లాయన కల్లుముంత తెచ్చి అక్కడ పెట్టగానే నర్సయ్య అతనికి కాస్త ఎడంగా డబ్బులు పెట్టాడు. అంటరాని మనిషి ముట్టుకున్న డబ్బు తాకితే తను మైల పడతాడు కనుక ఆడబ్బు పైన కాసిని నీళ్ళు చిలకరించి తీసుకుని ఇతరులకు కల్లు అందించడానికి పోయాడు గౌండ్లాయన. ముంత పట్టుకుని ఎల్లయ్య దగ్గరకు వెళ్ళాడు నర్సయ్య.

'నేన్ పిల్లన్ జూసిన, తెల్లగ సక్కంగుంది పదేడ్లుంటై' అన్నాడు ఎల్లయ్య కల్లు చప్పరిస్తూ.

అప్పట్లో బాల్య వివాహాలు సమ్మతంగావుండేవి పదేళ్ళ ఆడపిల్లలకి పెళ్ళీడు వచ్చినట్టే లెక్క. అయితే ఆ పిల్లకు పెళ్ళైనా ఈడొచ్చేదాకా పుట్టింట్లోనే వుండడం ఆనవాయితీ. ఒకప్పుడు పెళ్ళైన పిల్లలు పన్నెండు పదమూడేళ్ళకే గర్భవతులయ్యే వారు. వాళ్లకి అది చాలా గడ్డు సమయం. ప్రమాదకరమైనది కూడా. దీనికి తోడు సరైన పారిశుధ్యం లేకపోవడం, వైద్య పరిజ్ఞానమూ, కావలసినన్ని వైద్య శాలలూ లేకపోవడం వల్ల మాతా శిశుమరణాలు అధికంగా వుండేవి. స్త్రీలు కానుపు అయే వరకూ ఏదో ఒక కాయ కష్టం చేస్తూనే వుండేవారు. వృద్ధులైన స్త్రీలు గర్భవతుల పొట్టలను బట్టి వారి కాన్పు సమయాన్ని ఊహించి, ప్రసవంలో సహాయ పడేవారు. కొడవలితో బొడ్డుకోసి, మాయను ఒక కుండలో పెట్టి పూడ్చి పెట్టేవాళ్ళు. అప్పట్లో నువ్వెక్కడ పుట్టావని కాక, నీ మాయ ముంత ఎక్కడ పూడ్చారని అడగడం అలవాటుగా వుండేది. హిందూ స్త్రీల పరిస్థితికూడా ఇట్లాగే వుండేది. అయితే వాళ్లకు ప్రసవ సమయంలో మంగలి కులానికి చెందిన స్త్రీలు సాయపడేవారు.

'అయితె పిల్లతండ్రెవలు?' అనడిగాడు నర్సయ్య.

'నీకెర్కే. మల్లయ్య. మన పక్కూరే. ఆన్కి ముగ్గురాడిపిల్లలు. ఇద్దరి పెండ్లిండ్లయినయ్, ఈ పిల్ల ఆకిరిది. '

'అరె! ఆడు నాకెర్కే, రేబ్బోదామా, పిల్లన్ జూడడానికి'

'పోదామ్ పొద్దున్నే ఆరు గంట్లకు. ఎనిమిది గంట్లకు చేరుతం. '

ఇద్దరూ లేచారు. ఇంటికి పోవడానికి. ఈ మంచి వార్త తన భార్యకి అందించడానికి తొందరపడుతున్నాడు నర్సయ్య.

తెలతెలవారుతూనే గ్రామ ప్రజలు పనుల్లోకి పోవడానికి తయారైనారు. స్త్రీలు అన్నం మూటలు నెత్తిన పెట్టుకుని, కొడవళ్ళు చేత్తో పట్టుకుని పదాలు పాడుకుంటూ కోతల కోసం వరిచేల వైపు గుంపులు గుంపులుగా బయల్దేరారు. గొడ్లకాసే పిల్లలు కర్రలతో అదిలిస్తూండగా గొడ్లు దుమ్ము రేపుకుంటూ మేతకోసం పోతున్నాయి. నర్సయ్య

శుభ్రమైన బట్టలు వేసుకుని తలపాగా పెట్టుకుని ఎల్లయ్య కోసం చూస్తున్నాడు. గొల్ల సావిడి లో కాకుండా తన ఇంట్లో తన కొడుకు పడుకోడం కోసం అతనికి పెళ్ళి చెయ్యాలని తొందరపడుతున్నాడు నర్సయ్య. పిల్ల బాగుండాలని కూడా అనుకుంటున్నాడు. అతని భార్యకి కోడలు తెల్లగా వుండాలని పట్టుదల.

అంతలోనె ఆలస్యం అయినందుకు నొచ్చుకుంటూ ఎల్లయ్య వచ్చాడు.

'గట్నే తియ్' అన్నాడు నర్సయ్య.

ఊరి భూస్వాములు తమని పశువులకన్న అధ్వాన్నంగా చూస్తున్న సంగతి మాట్లాడుకుంటూ వడివడిగా నడుస్తున్నారు ఇద్దరూ. అట్లా మాట్లాడుకుంటూ మధ్య మధ్యలో ఎవరూ వినడం లేదుకదా, అని తప్పుచేసిన వాళ్ల లాగా అటూ ఇటూ చూస్తున్నారు.

మల్లయ్య ఇల్లు చేరేసరికే బాగా ఎండెక్కింది. మల్లయ్య ఎదురొచ్చి కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళిచ్చాడు.

'మస్తెండున్నది' అన్నాడు ఎల్లయ్య, తలపాగాతీసి తల తుడుచుకుంటూ.

'ఔ! నీల్దాగుతారా?' అంటూ భార్యను కేకేసి మంచి నీళ్ళు తెమ్మన్నాడు మల్లయ్య.

ఆ ముగ్గురూ తమ తమ ఊళ్ళలోని తమ కులస్థులను గురించి మాట్లాడుకున్నారు. తరువాత మల్లయ్య అవతల గదిలోకి వెళ్ళి కూతురికి చీరెకట్టి తయారుచెయ్యమని భార్యకి పురమాయించాడు.

నర్సయ్యా ఎల్లయ్యా పెళ్ళికూతురుకోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

'పిల్లేదీ' అన్నాడు ఎల్లయ్య.

'సిగ్గు పడతాంది. ఆల్లమ్మ తీసుకొత్తాంది' అన్నాడు మల్లయ్య.

ఆ అమ్మాయి తలుపు చాటున నిలబడి కొత్తవాళ్లకేసి తొంగి చూస్తోంది. చూడచక్కనిపిల్ల, తెల్లగా వుంది కూడా.

పిల్ల తల్లి చిరునవ్వు నవ్వుతూ 'ఇంటి పనంత జేస్తది, మేం పొలంబోయినప్పుడు ఇల్లుజూసుకుంటది' అన్నది.

'అట్లనా! పిల్ల పేరేంది?' అన్నాడు నర్సయ్య.

'అబ్బమ్మ 'అన్నది తల్లి.

'మీ పిలగాడేంజేస్తడు?' అన్నాడు మల్లయ్య.

'పెద్ద దొర గడిలో పనిజేస్తడు. ఆన్కి పదిహేనేళ్ళు. నా అంత పొడుగుంటడు' అన్నాడు నర్సయ్య.

'ఆన్కి అన్ని పన్లొస్తయ్' అన్నాడు ఎల్లయ్య ఉత్సాహంగా.

'ఆయన పేరు గూడా నర్సయ్యేనేనా?' అన్నాడు మల్లయ్య.

'అవ్ ను మా అయ్య గదె పేరు పెట్టిండు' అన్నాడు నర్సయ్య.

'అయితే మీకు మా సంబంధం గుదిరినట్లనిపిస్తే మా ఆడోళ్ళతో మీ ఇంటికస్తం' మల్లయ్య.

'మా ఇంటామెతో మాట్లాడి రొం(డ్రోజుల్లో చెప్పంపుత' నర్సయ్య.

'మంచిది. గింత కల్దాగుతరా?'.

'అద్దు. ఇప్పుడుగాదు, మాఇంటికొచ్చినంక, మాపిలగాన్ని జూసినంక దావత్ జేసుకుందాం'.

కొడుక్కి ఇంత మంచి సంబంధం చూసినందుకు ఎల్లయ్యకు కృతజ్ఞతలు చెబుతూ తనకీ సంబంధం నచ్చిందనీ త్వరలోనే పెళ్లిచేస్తాననీ సంతోషంగా చెప్పాడు నర్సయ్య.

◆◆◆

నర్సయ్య మధ్యాహ్నం ఇంటికొచ్చేటప్పటికి అతని కొడుకు అన్నంతింటూ ఇంట్లోనే వున్నాడు. పోచమ్మకి పెళ్ళి సంబంధం గురించి తెలుసుకోవాలని ఎంత ఆత్రంగా వున్నా కొడుకు ఎదుట ఆ విషయం కదిలించకుండా వూరుకుంది.

'నువ్వు గూడ బువ్వ తింటవా?'అని నర్సయ్యను అడిగింది.

'ఆ. ఆకలైతాంది 'అని అతను తినడానికి కూచున్నాడు.

తను మరునాడు బండి తోలుకుని దొరతో పాటు పట్నం పోవాలి కనుక రాత్రికి ఇంటికి రానని చెప్పి, తండ్రి అనుమతి అడిగి వెళ్ళిపోయాడు. కొడుకు నర్సయ్యకు అన్నం పెడుతూ వెళ్ళిన పని ఏమైందని అడిగింది పోచమ్మ.

'పిల్ల ఎర్రగ మంచిగున్నది' అన్నాడు నవ్వుతూ నర్సయ్య.

'గట్లనా?' అంది పోచమ్మ.

'ఆళ్ళు నీగ్గూడెర్కే. మన పక్కూళ్ళె మల్లయ్య ఆకరి పిల్ల'.

'గట్లనా! అయితే లగ్గమెప్పుడు పెట్టుకుందాం'అంది పోచమ్మ.

'సూద్దామ్ ! నిన్నడిగినంక పిలగాన్ని సూడ్నీకి ఆళ్లను రమ్మని సెప్పంపుదాం'.

◆◆◆

పిల్ల తల్లితండ్రులూ సమీప బంధువులూ వచ్చారు. పెళ్ళి నిశ్చయమైంది. కలిసి భోజనాలు చేశారు. పోచమ్మ తన కూతుళ్ళిద్దర్నీ పెళ్ళిపనుల్లో సాయం చెయ్యడానికి పిలిచి తనూ సన్నాహాలు మొదలుపెట్టింది. ఇంట్లో పెళ్లి సందడి మొదలైంది. నర్సయ్య కొడుకు పదిహేనేళ్ళవాడు స్ఫురద్రూపి. ఆరడుగుల పొడుగు, నల్లని వాడు. పొలంలో చేసే కాయకష్టం అతని శరీరాన్ని గట్టిపరిచింది. నర్సయ్య తాత అతనికి తండ్రి పేరే పెట్టాడు. ఊళ్ళోవాళ్లు అతన్ని చిన్న నర్సిగాడు అంటారు. లేదా చిన్న నర్సయ్య అంటారు. వాడలో చాలామందికి, ముఖ్యంగా వృద్ధులకి చిన్న నర్సయ్యంటే చాలా అభిమానం. అతను వాళ్లకి అవసరానికి సహాయ పడుతూ వుంటాడు.

నర్సయ్య కొడుకు పెళ్లి మండు వేసవిలో మే నెలలో తక్కిన ఇళ్లల్లో పెళ్లిళ్ల కన్న వైభవంగా జరిగింది. నర్సయ్య ఆ వాడలో అందరికన్న స్థితిమంతుడు కావడం వల్లనే కాకుండా అతనంటే వారికి గల గౌరవాభిమానాల వల్ల రెండు గ్రామాలనుంచీ చాలామంది

పెళ్లికి తరలి వచ్చారు. గొడ్డు మాంసానికి బదులు మేకమాంసం వండారు. కల్లుకూడా ఇచ్చారు. డప్పు వాద్యాల మధ్య ఆటపాటలతో పెళ్లి సంబరంగా జరిగింది. ఈ పెళ్ళి గురించి చాలా నెలలవరకూ జనం చెప్పుకుంటూనే వున్నారు.

పెళ్లి సందడి అణిగినాక కూతుళ్ళిద్దరూ అత్తవారిళ్లకు వెళ్ళిపోయారు. కొత్త కోడలు పుట్టింటికి వెళ్ళింది. జూన్ నెల వచ్చి ఎండవేడిమి తగ్గుమొహంపట్టింది. దుక్కి దున్ని విత్తనాలు వెయ్యడానికి సిద్ధమౌతున్నారు గ్రామస్తులు.

◆◆◆

ఆరోజుల్లో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలంగా వుండేవి. ముఖ్యంగా అస్పృశ్యులు నివసించే వాడల్లో కలరా ఎక్కువగా వస్తూ వుండేది. కలరాతో ప్రతి ఇంట్లో ఒకరో ఇద్దరో చనిపోతూ వుండేవాళ్ళు. గ్రామంలో కలరాని 'గత్తర' అనేవాళ్ళు. ఆ జబ్బుతో చనిపోయిన వారి శవాలను తాకడానికి కూడా జనం భయపడేవాళ్ళు. కుటుంబంలో వారే ఆ శవాన్ని కాటికి మోసుకుపోవలసి వచ్చేది.

అస్పృశ్యులు పూజించే దేవతలను వివిధ ప్రాంతాలలో వివిధ నామాలతో పిలిచేవాళ్ళు. ఈ దేవతల గుళ్ళు చాలా చిన్నగా వుంటాయి. సాధారణంగా మూడు నాలుగు అడగుల ఎత్తుంటాయి. పైకప్పు గుమ్మటంలా వుంటుంది. వాడలో వాళ్ళు ఈ దేవతలకి ప్రార్థనలు చేసి తాము తినేవేవో ఆమెకీ నైవేద్యం పెడతారు. తామేదైనా కోరుకున్నప్పుడూ, ఆ కోరికలు నెరవేరినప్పుడూ ఆ దేవతలకు మేకమాంసమో, పిట్టమాంసమో, కల్లో నైవేద్యం పెడతారు. ఈ దేవతలు హిందూ దేవతల వంటి దేవతలు కారు. వీరిని బ్రాహ్మణులు 'క్షుద్రదేవతలు' అని ఈసడింపుగా పిలుస్తారు. బ్రాహ్మణత్వంలో పూజారులంతా వారసత్వ పురుష బ్రాహ్మణులే వుంటారు. అక్కడ వుండేది వర్ణాశ్రమ ధర్మం. ఇక్కడ పూజారులంటూ ఎవరూ వుండరు. పూజచేసేవాళ్ళు స్త్రీలైనా పురుషులైనా వాళ్ళే పూజారులు. శూద్రులకు కూడా వారుండే ప్రదేశాలలో ఇటువంటి దేవతలున్నారు. కానీ వాళ్ళు ఈ దేవతలతో పాటు హిందూ దేవతలని కూడా కొలుస్తారు. శూద్రులు నిచ్చెన కింద మెట్లమీదే వున్నా, వారు అస్పృశ్యులు కానందున వారికి దేవాలయాల్లో ప్రవేశం వుంది.

వంగపల్లిలో కలరా వంటి వ్యాధులు రావడానికి గ్రామదేవతలైన మల్లమ్మ, ఎల్లమ్మ కట్టమైసమ్మలకు కోపం రావడమే కారణమని నమ్మేవాళ్ళు. మూఢనమ్మకాలు ప్రబలంగా వుండేవి. ఈ దేవతలు వృద్ధులైన మహిళల వంటిమీదకు వచ్చేవారు. అప్పుడు ఆ మహిళలకు పూనకం వస్తుందని నమ్మేవాళ్ళు.

ఆరోజు ఆదివారం. మధ్యాహ్నం అయింది. నర్సయ్య గోనెపట్టాలతో ఏర్పాటుచేసుకున్న పందిరిలాంటి దాని కింద కూచున్నాడు. అతని చుట్టూ కుట్టవలసిన తోలు చెప్పులు పరిచి వున్నాయి. అది అతని ఇంటికి దగ్గర. కానీ హిందువులుకూడా ఆ

దారిన నడుస్తూ వుంటారు. అతను చెప్పులు కుడుతూ వుండగా ఒకతను రొప్పుకుంటూ పరిగెత్తుకొచ్చి,

'నర్సయ్యా అందరూ నీకోసం సూత్తాన్రు. ఎల్లమ్మకు సిగమొత్తాంది. జల్ది రా. ' అన్నాడు.

నర్సయ్య చేస్తున్న పని విడిచిపెట్టి అతని వెనకే హడావిడిగా వెళ్ళాడు. వాళ్ళు ఒక గుంపు దగ్గరకు వెళ్లారు. గుంపు మధ్యలో పూనకం వచ్చిన ఆమె వుంది. ఆమె రెండు చేతుల్లోనూ వేపమండలు పట్టుకుని ఊపుతూ తనూ ఊగుతోంది. నర్సయ్య భక్తితో ఆమెకు తల వంచి.

'శరను శరను తల్లీ, వచ్చిన పని చెప్పు తల్లీ! కనికరించు' అన్నాడు.

'నేనెందుకొచ్చిన్నో నీకు తెల్వదారా, నర్సిగా, అమ్మకు కోపమొచ్చింది ఆమె బలి కావాలంటాంది, లేకుంటే ఊళ్ళొ 'గత్తరత్తది' అంది, మరింతగా ఊగిపోతూ.

నర్సయ్య వణికిపోతూ నెమ్మదిగా 'శాంతి, శాంతి తల్లీ !పెద్దజీవి గావాల్నా? చిన్నజీవి గావాల్నా? సంతోశంగ ఇస్తం' అన్నాడు.

'ఒక దున్నపోతు, బండెడు బువ్వ, కల్లు సంతోషంగివ్వాలె'.

అందామె గట్టిగా నవ్వుతూ.

'అంతేగద తల్లీ! సంతోషంగిత్తం'.

'సెలువు. సెలువు నేబోతాన్న' అంటూ ఎల్లమ్మ తన పక్కన నిలబడ్డ వ్యక్తి చేతులమీద వాలిపోయింది. ఆమె ముఖాన ఎవరో నీళ్ళు చిలకరించడంతో ఆ పూనకంనుంచి బయటపడింది.

ఆ సాయంత్రం నర్సయ్య తన కులం వాళ్లందర్నీ సంప్రదించి మరుసటి శుక్రవారం అమ్మవారి కొలువు ఏర్పాటుచేసేందుకు నిర్ణయించాడు. అందరూ కొలువుకు సిద్ధమై పోయారు. ప్రతి ఇంటినుంచీ బియ్యమూ డబ్బులూ సేకరించారు. దున్నపోతును కొనడానికి నర్సయ్య డబ్బిచ్చాడు. ఏర్పాట్లన్నీ నర్సయ్య పర్యవేక్షణలో జరిగాయి. మాదిగ ఇళ్లల్లో పండగ వాతావరణం వచ్చింది. మహిళలు పోచమ్మ గుడికి సున్నంవేసి, వేప మండలు కట్టారు. గుడి ముంగిలిని ఆవుపేడతో అలికి, గోడలకి పసుపు, కుంకం బొట్లు పెట్టారు. దున్నపోతు మొహానికి కూడా పసుపు రాసి బొట్టు పెట్టారు. పెద్దలంతా డప్పు మోగించుకుంటూ ఊరేగింపుగా దాన్ని గుడి దగ్గరికి తీసుకొచ్చారు. కొంతమంది యువకులు ఊరేగింపు ముందు నాట్యం చేస్తూ వచ్చారు. బలికి వేళ కాగానే ప్రార్థనల మధ్య ఒక బలిష్టుడైన వ్యక్తి వేటకత్తి తో దాని మెడమీద ఒక్కటే ఒక్క వేటు వేశాడు. బండినిండా అన్నంతెచ్చారు. ఒక గంపలో అన్నంతీసుకుని అందులో బలి ఇచ్చిన దున్నపోతు రక్తం కలిపారు. ఒక పెద్దాయన నెత్తిమీద పసుపుకుంకుమల బుట్ట పెట్టారు. అతనూ నర్సయ్యా మరికొందరూ అన్నాన్ని అన్ని ఇళ్లమీద చల్లుతూ వీధులన్నీ తిరిగారు.

ఇట్లా చేస్తే తమ ఇళ్లల్లోకి దుష్టశక్తులు ప్రవేశించవని వాళ్ల నమ్మకం. సాయంత్రం అందరి ఇళ్ళల్లో స్త్రీ పురుషులంతా విందు భోజనంతోపాటు కల్లు సేవించారు.

◆◆◆

ఆరేళ్ళు గడిచాయి. ఈలోగా గ్రామంలో చాలా మార్పులొచ్చాయి. పెద్దదొర పక్షవాతం వచ్చి చనిపోయాడు. ఆ స్థానంలో మధ్యవయస్కుడైన ఆయన కొడుకు గడీ (దొరల నివాసం) పెత్తనం చేపట్టాడు. దొరల 'గడీ' లో ఒక పెద్ద ఇల్లు, ఒక గొడ్ల సావడి. పశువులమేత కొరక చావడి. ఒక బావి వుంటాయి. ఈ కొత్తదొరకి మహాపొగరు. ఆయనంటే అందరికీ హడలు. అంటరాని వాళ్లకయితే అతని కనుచూపుమేరకు వెళ్ళడానికే భయం. ఈకొత్త దొర నర్సయ్యను పిలిచి ఆ రెండెకరాలపొలం కూడా తన స్వాధీనం చెయ్యమన్నాడు. నర్సయ్య చెయ్యక పోవడంతో అతనిమీద కోపం చూపిస్తున్నాడు. దొర దగ్గర పనిచేస్తూ తన పొలంలో కూడా పని చేసుకునేవాడు చిన్న నర్సయ్య. అయతే దొర అనుచరులు అతన్ని వేధించే వారు. అతనిపొలానికి నీళ్ళు రాకుండా చేశారు. అతను సేద్యానికి పూర్తిగా వర్షాల మీద ఆధారపడవలసి వచ్చింది. అందుకని వరి పండించడం మానేసి వర్షాధారపు పంటలే వేస్తున్నాడు. తమ పొలంలో పని చేసుకుంటున్న చిన్న నర్సయ్య భార్య అబ్బమ్మను కూడా దొర అనుచరులు ఏడపించేవాళ్ళు. ఆమెని దొర పొలంలో పనిచెయ్యమని వేధించేవాళ్ళు. ఆ వేధింపుల మధ్య ఒక ఆనందరేఖలా చిన్న నర్సయ్యకు కొడుకు పుట్టాడు.

అతనికి తాత పెద్ద నర్సయ్య రామస్వామి అని పేరు పెట్టాడు. ఆ పిల్లవాడు తల్లి రంగూ తండ్రి కనుముక్కు తీరూ వచ్చి చక్కగా వున్నాడు.

పెద్ద నర్సయ్య కలరా సోకి చనిపోవడం చిన్న నర్సయ్యకి తీరని వేదన కలిగించింది. దానికితోడు వారం తిరక్కుండా అతని తల్లి కూడా చనిపోయింది. వాళ్ళిద్దర్నీ తన చేతులమీదుగా ఖననం చేశాడు. పెద్ద నర్సయ్య మరణం తరువాత అతనికొడుకు చిన్ననర్సయ్యకు గ్రామంలో ప్రాముఖ్యం తగ్గిపోయింది. గ్రామస్తులెవరూ అతన్ని పట్టించుకోకపోవడంతో అతని కుటుంబంతో అతనక్కడ ఏకాకి అయిపోయాడు.

ఒకరోజు నర్సయ్య చెట్టుకింద కూచుని అన్నం తింటుండగా అతని భార్య అబ్బమ్మ 'మనం ఈ వూరు ఇడ్సిపెట్టి ఎక్కడైన పోయి బతుకుదాం' అన్నది.

'నేనూ అదే అనుకుంటున్న' అన్నాడు నర్సయ్య.

పంట చేతికి వచ్చాక ఆమె తల్లి తండ్రులు నివసించే పక్క ఊరికి వెళ్ళిపోదామని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ.

పంట నూర్పిళ్లతో గ్రామం హడావిడిగా వుంది. పెద్ద రైతులు అప్పటికే తమ ధాన్యాన్ని అమ్మకాలకి పట్నం తోలుతున్నారు. చిన్న రైతులు కూలీలకోసం నిరీక్షిస్తున్నారు. ముందు అగ్రకులాల రైతుల పొలాలలోనూ తరువాత అగ్రకుల శూద్రుల పొలాలలోనూ

కూలీ చేసిన అస్పృశ్యులు, తమ పొలాలలో పనిచేసుకోడానికి సిద్ధమయ్యారు. నర్సయ్య పొలం కూడా కోతకు సిద్ధంగా వుంది. అతను తన కులపు స్త్రీలు కొందరిని కోతకు సహాయం అడిగివున్నాడు. ఒక వారంలోగా అతని పనికి సాయపడతామని వాళ్ళు మాట యిచ్చారు. పంట తీసుకున్న తరువాత పొలం తనకి అప్పగించాలని నర్సయ్యను దొర బాగా ఒత్తిడి చేస్తున్నాడు. తండ్రి పోగానే పొలంకూడా పోతున్నందుకు అతనికి చాలా దుఃఖం వచ్చింది. అతని కులం వారెవరూ అతని తరపున నిలబడలేదు. అంటరాని వాడికి భూమి వుండకూడదని వాళ్ళ నమ్మకం.

ఒకరోజు నర్సయ్య భార్యకి జ్వరం వచ్చిబాగా వణికి పోతోంది. వాంతులుకూడా అవుతున్నాయి. నిస్సందేహంగా అది గత్తరే! నర్సయ్య వెంటనే ఆమె తల్లి తండ్రులకి కబురు చేశాడు. దురదృష్టం కొద్దీ వాళ్ళు వూర్లో లేరు. మరొక కూతుర్ని చూడడానికి దూరపు వూరు వెళ్ళి వున్నారు. మరుసటి రోజు మధ్యాహ్నానికి భర్తా కొడుకూ చూస్తుండగానే అబ్బమ్మ ఆకస్మాత్తుగా ఆఖరి శ్వాస విడిచింది. పట్టుమని పదహారేళ్ళు లేవు ఆమెకి. చిన్నతనంలోనే నర్సయ్య నెత్తిన పిడుగు పడ్డట్లైంది. అతను గుండెలు బాదుకుంటూ చిన్న పిల్లవాడిలా ఏడ్చాడు. అతని కొడుకు తల్లి శరీరంపై పడి ఏడ్చాడు. ఆ తండ్రీ కొడుకుల్ని ఓదార్చేవారెవరూ లేరు. గత్తర మూలంగా అతని కులస్థులెవరూ అతనింటికి రావడం మానుకున్నారు.

స్నేహితులూ బంధువులూ అందరూ విడిచిపెట్టేసిన నర్సయ్య, కొడుకుని అక్కున చేర్చుకుని, తరువాత నెమ్మదిగా తనను తాను కూడగట్టుకుని, ఆవూరు విడిచిపెట్టి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు.

తనవీ పిల్లవాడివీ బట్టలు మూటకట్టుకున్నాడు. అతని భార్య ఒక చిన్న ముంతకు గుడ్డచుట్టి చూరుకు వేలాడదీసి వుంచేది. అందులో ఆమె అప్పుడప్పుడూ చిల్లర దాచేది. ఆ మూట తీసుకుని మరొక సారి దుఃఖ వివశుడైనాడతను. అతని భార్య మరణం అతన్ని తన గ్రామస్తులనుంచీ ఏసహాయమూ అడగనీయకుండా చేసింది. పంట పోయినా సరే, ఇల్లు పోయినా సరే ఇంక ఆ వూర్లో ఒక్క క్షణం వుండకూడదనుకున్నాడు. భార్యతో గడిపిన ప్రతిక్షణాన్నీ జ్ఞాపకం చేసుకున్నాడు. వాళ్ళిద్దరూ కలిసి గడిపిన సమయం చాలా తక్కువ. ఆమెను అంత త్వరగా ఎత్తుకుపోయి, కొడకుని పసితనంలోనే తల్లిలేని పిల్లవాడిని చేసిన దేవుడిని తిట్టుకున్నాడు. ఆమె దేహాన్ని ఒక బట్టలో చుడుతూ వెక్కి వెక్కి ఏడ్చాడు. బయట వాన చినుకులు పడుతున్నాయి. మృత దేహాన్ని భుజానికెత్తుకుని దాన్ని వీపుకు కట్టుకున్నాడు. మరొక భుజం మీద బట్టల మూట పెట్టుకున్నాడు. చాలా దూరం నడవవలసి వుంది. కొడుకు చెయ్యి పట్టుకుని కాలు బయట పెట్టాడు. ఇంక తిరిగి ఆ వూర్ని చూడదలుచుకోలేదు. కన్నీటి ధారలతో వాడ దాటుతూ, ఒక సారి వెనుతిరిగి చూసి నడక వేగం పెంచి వాగు వైపుగా సాగాడు.

నర్సయ్య వాగు చేరేసరికి సాయంత్రం అయిదయింది. ఇంకా వాన పడుతూనే వుంది. నెమ్మదిగా ఆమె దేహాన్ని కిందకి దించాడు. ఆమె ముఖం అతనికి సజీవంగా వున్నట్లే కనిపించింది. తన వంక చూస్తూ, కొడుకుని జాగ్రత్తగా చూసుకోమని అర్థిస్తున్నట్లుగా వుంది. అతనికి మళ్ళీ ఉప్పెనలా దుఃఖం వచ్చింది. తమాయించుకుని గొయ్యి తవ్వడం మొదలుపెట్టాడు. చివరికి ఆమెకు నిరంతర విశ్రాంతి కలుగ చేశాడు.

ఎంత అకాల మరణం. ఆమెది! తన జీవితంలోకి వచ్చీ రాగానే ఆమె ఒక ఉల్కలాగా మెరిసి మండిపోయింది. కొడుకుని హత్తుకుని వాడితోపాటు తనూ ఏడ్చాడు. నర్సయ్య కాసేపు తరువాత తను వాగులో మొహం కడుక్కుని కొడుకు రామస్వామి మొహం కడిగి వాడికి జొన్న రొట్టె తినిపించి మోకాళ్లలో మొహం దూర్చి కూచున్నాడు. ఇప్పుడెక్కడికి పోవాలి? ఏంచెయ్యాలి? అతనికి తన అత్తమామల దగ్గరకు పోవాలనిపించ లేదు. ఉన్నట్లుండి అతనికి జనగాంలోని తన మేనమామల ఇంటికి పోతే బావుంటుందని పించింది.

అతనికి తన ఇద్దరు మేనమామలూ బాగా గుర్తు. వాళ్లు అప్పుడప్పుడూ తమ ఇంటికి వచ్చి కొన్నాళ్ళుండిపోయేవాళ్ళు. వాళ్ళెప్పుడొచ్చినా కొత్త బట్టలూ, పిండివంటలూ తెచ్చేవాళ్ళు. అమ్మకి తనంటే ఎంతప్రేమో వాళ్లకీ తనంటే అంత ప్రేమ వుండేది. అతనికి ఆరేళ్ళొచ్చాకకూడా భుజాలమీద కూచోబెట్టుకుని కల్లు దుకాణానికి తీసుకుపోయేవాళ్లు. ఇప్పుడు వెడితే తప్పకుండా తనని ఆదరిస్తారు. వాళ్ల సాయంతో ఏదైనా పని చూసుకుని కొడుకుని పెంచుకోవచ్చు అనుకున్నాడు నర్సయ్య. వాగులో స్నానం చేసి బట్టలు మార్చుకుని, భార్య ముంతలో దాచిన డబ్బు లెక్క చూశాడు. అందులో చిల్లరంతా కలిసి నాలుగు రూపాయలున్నాయి. ఈ దూర ప్రయాణంలో తనకి బాగా అక్కరకొస్తాయను కున్నాడు. ఆ వూరికి దాదాపు వంద మైళ్ళు నడవాలి. కొడుకుని భుజానికెత్తుకుని నడక సాగించాడు.

◆◆◆

మరునాడు మధ్యాహ్నం! ఒక చెట్టునీడన కూచున్నాడు నర్సయ్య. అతని దీర్ఘమైన నడకలో అదొక మజిలీ. పిల్లవాడు జొన్నరొట్టె తింటున్నాడు. అతను చుట్ట వెలిగించుకున్నాడు. ఆ చుట్ట వెలిగించుకోడానికి అతనిదగ్గర అగ్గిపెట్టె లేదు. రెండు రాతి ముక్కల రాపిడితో నిప్పు రగిలించి దానికి నారపీచు అంటించి, కాలుతున్న పీచుతో అంటించుకున్నాడు. ఆ కొత్త చోట, అంటే తన మేనమామలుండే రఘునాథపల్లిలో, తను ఏంపని చెయ్యగలడా అని ఆలోచించాడు. సాయంత్రానికి తను అక్కడికి చేరుకుంటాడు. మేనమామలు తనకి తప్పకుండా సహాయం చేస్తారు. ఏదో ఒక పని ఇప్పిస్తారని తనకి నమ్మకం. తన భార్యతో కలిసి అదివరకు అక్కడికి వెళ్ళి సంతోషంగా గడిపివచ్చిన దినాలు గుర్తొచ్చాయి. ఇప్పుడు కొడుకొక్కడితో వెడుతున్నాడు. భార్య ఆకస్మిక మరణం గురించి వాళ్లకు చెప్పడం ఎంత కష్టం!

ఆ సాయంత్రానికి అతను తన పెద్ద మేనమామ మల్లయ్య ఇంటికి చేరాడు. అతన్ని దూరంనుంచే చూసిన మల్లయ్య మేనల్లుడి దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చాడు. పిల్లవాణ్ని ఎత్తుకుని, 'అబ్బమ్మేదీ' అన్నాడు. దుఃఖం ఆపుకోలేని నర్సయ్య అరచేతుల్లో మొహం కప్పుకుని పెద్దగా ఏడ్చాడు. మల్లయ్య నిర్ఘాంత పోయి చేష్టలుడిగి అట్లాగే నిలబడిపోయాడు కొంతసేపు. అతని చంకలో పిల్లవాడు 'అమ్మ సచ్చిపోయింది. అయ్య బొందబెట్టిండు' అన్నాడు ఏడుస్తూ. మల్లయ్య నర్సయ్యను గట్టిగా కౌగలించుకున్నాడు. ఇద్దరూ వెక్కి వెక్కి ఏడవడం చూసి కుటుంబం అంతా చుట్టూ పోగయ్యారు. ఈ వార్త తెలిసిన మాదిగవాడ అంతా విషాద మౌనమైంది. తరువాత మల్లయ్య గుడిసెలో కూచుని మిగతా మేనమామలకూ, వారి కుటుంబాలకూ తన భార్య మరణాన్నీ ఆమెను తన చేతులతోనే ఖననం చెయ్యడాన్నీ రుద్ధమైన కంఠంతో వివరించాడు. తను తన గ్రామాన్ని విడిచిపెట్టేసిన సంగతి చెప్పి ముగించాడు. మేనమామలు అతన్ని ఓదార్చారు. తమ దగ్గరకు వచ్చి మంచిపని చేశావన్నారు. తనతల్లి బ్రతికి లేకపోయినా మేనమామల దగ్గరకు వస్తే తల్లి దగ్గరకు వచ్చినట్లే అనిపించింది అతనికి మేనమామలు తన తల్లి ఎంత ప్రేమ చూపించేదో అంత ప్రేమ చూపిస్తున్నారు. తన కొడుకు పెరగడానికి ఇదే మంచి చోటు అనిపించింది. "తను ఇప్పుడు అనాథ కాదు" అనుకుంటూ ఆరాత్రి ప్రశాంతంగా నిద్రపోయాడు నర్సయ్య.

◆◆◆

నర్సయ్య రఘునాథపల్లి వచ్చి ఇప్పటికి మూడు నెలలయింది. ఇంతవరకూ అతనికేమీ పని దొరకలేదు. మేనమామల మీద ఆధారపడి వుండవలసి వచ్చినందుకు బాధగా వుంది. పైగా వాళ్లు తన కొడుకు రామస్వామిని కూడా చూసుకుంటున్నారు. తక్కిన పిల్లలతో కలిసి ఆడుకుంటూ వాడు సంతోషంగానే వున్నాడు. కానీ ఎన్నాళ్ళు ఇతరులమీద ఆధారపడ్డం? అతని మేనమామలిద్దరూ రైల్వేగుడ్స్ షెడ్‌లో కూలీ పని చేస్తారు. దగ్గర వూళ్లనుంచీ ఎడ్లబండ్లమీద ధాన్యం గోనెబస్తాలలో రైల్వే స్టేషన్ కు వస్తుంది. ఈ బస్తాలను కూలీలు వీపులమీద వేసుకుని రైల్వే వాగన్లలో వేస్తారు. ఇది చాలా కష్టమైన పని. ఎక్కువగా అస్పృశ్యులే ఈ పని చేస్తూ తక్కువ కూలీకి వుంటారు. జీతగాళ్ళుగా దొరల దగ్గర పనిచేసే వాళ్లకన్న తన మేనమామలే బాగున్నారు. జీతగాళ్ళకు దొరలు ధాన్యం రూపంలో కూలీ ఇస్తారు, అదికూడా వాళ్లకు దయ వుంటేనే! నగదు ఇవ్వరు. పైగా అస్పృశ్యులను పిలిచే విధానంలోనే వారికున్న చిన్నచూపు కనపడుతుంది. ఒక హిందువు పేరు మల్లయ్య అయితే అతన్ని అంతా మల్లయ్య అనే పిలుస్తారు. కానీ ఒక అంటరాని వాడిపేరు మల్లయ్య అయితే అతన్ని 'మల్లిగాడు' అనిపిలుస్తారు. అతని పేరులోని 'అయ్య' కాస్తా'గాడు' గా మారుతుంది. అయ్య అంటే గౌరవంతో కూడిన మాట 'గాడు' అంటే అయిష్టతా అసహ్యమూ కలసిన మాట. అట్లాగే హిందూ పోచమ్మ 'పోచమ్మ'గానే

వుంటుంది. అంటరాని పోచమ్మ 'పోచి' అవుతుంది. అమ్మ అనే గౌరవపదం తీసేసి 'ఇ' చేరుస్తారు.

నర్సయ్య మేనమామలు అతనికి కూడా రైల్వేలో పని చూడాలనుకున్నారు. అవకాశం రాగానే వాళ్ళు రైల్వే స్టేషన్ తనిఖీ కొచ్చిన ఒక తెల్ల దొరను(బ్రిటిష్ ఆఫీసర్) కలిసి తమ మేనల్లుడికి పని ఇమ్మని అడిగారు. ఆయనకు నర్సయ్య దేహధారుఢ్యం నచ్చింది. వెంటనే ఆయన నర్సయ్యను 'పాయింట్స్ మన్'(points man) గా చేరమన్నాడు. మేనమామల ఆనందానికి మేర లేదు. నర్సయ్యకి కూడా ఆనందమే! కానీ, ఒక నెల ట్రెయినింగ్ అన్నారు. కొడుకుని విడిచి నెల వుండాలని దిగులేసింది. మామల కుటుంబాలు వాడిని బాగా చూసుకుంటాయని తెలుసు. కానీ వాడిని విడిచి వుండడం ఇదే మొదటిసారి!.

◆◆◆

ఇరవైయ్యో శతాబ్దపు తొలి దినాలు. హైదరాబాద్, మైసూర్, సంస్థానాలూ బెంగాల్ రాజస్తాన్ లలోని కొన్ని భాగాలూ తప్ప భారత దేశం మొత్తం బ్రిటిష్ పాలన కిందకి వచ్చింది. బ్రిటిష్ వారు తమ ఆర్థికాభివృద్ధి కోసం భారతదేశంలో మౌలిక వసతుల నిర్మాణం ప్రారంభించారు. పారిశ్రామికీకరణ చెందిన పశ్చిమ దేశాలలోని సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుని డ్యామ్‌లు, ఆనకట్టలు కట్టడం ద్వారా ఇండియాలో నీటిపారుదల వ్యవస్థను అభివృద్ధి చేయడం మొదలుపెట్టారు. రైల్వేల అభివృద్ధి, తంతి తపాలా వ్యవస్థా మొదలైనవి చేపట్టారు. అయితే భారత దేశ పరిపాలనలో కొద్ది మంది మాత్రమే బ్రిటిష్ అధికారులుండడం వలన కొన్ని స్థాయిలలో, భారతీయ అగ్రకులాలలో నుంచీ ముఖ్యంగా బ్రాహ్మణులనుంచీ ఉద్యోగులను తీసుకున్నారు. ఇందులో కొంతమందికి లండన్‌లో శిక్షణ ఇచ్చి ఇండియన్ సివిల్ సర్వీస్‌లోని ఉద్యోగాలలోకి తీసుకున్నారు. వీరిలో ఎక్కువమంది పశ్చిమ సంస్కృతి ప్రభావితులైనారు. బ్రిటిష్ వారికి విశ్వాస పాత్రులుగా వుండేవారు. వారి పద్ధతులను అలవాటుచేసుకున్నారు. వలసపాలన యంత్రాంగంకోసం నిర్మించబడిన విశాలమైన భవంతుల్లో పనిచేసేవాళ్లు. అయితే గ్రామాల విషయంలో పెద్ద మార్పేమీ లేదు. కరణాలుగా వుండే బ్రాహ్మణులే భూమికి సంబంధించిన రికార్డులు చూసేవాళ్ళు.

పంథొమ్మిదో శతాబ్దం చివరికే భారీ ఎత్తున రైలు మార్గాలు వెయ్యడం మొదలైంది. 1853వ సంవత్సరం ఏప్రిల్ 16 వ తేదీ మధ్యాహ్నం 3:30 కు మొట్టమొదటి ప్రయాణీకుల రైలు బొంబాయి స్టేషన్ నుంచీ 14 పెట్టెలతో 400 మంది ప్రయాణీకులతో బయలుదేరి ఇరవై ఒక్క మైలు పరిగెత్తి 4:30కు థానే స్టేషన్ చేరుకుంది. ఆ రైలును 21 గన్ సాల్యూట్‌తో పట్టాలమీదకు వదిలారు. అదొక చిరస్మరణీయమైనరోజు. రైల్వే శకానికి ప్రారంభం. అప్పుడు అది గ్రేట్ ఇండియన్ పెనిన్సులా రైల్వే. అది ఇప్పుడు ప్రపంచంలోకెల్లా విస్తృతమైన ఇండియన్ రైల్వేస్‌గా రూపొందింది. బ్రిటిష్ ప్రభుత్వం ఇంత పెద్ద రైల్వే

వ్యవస్థను రూపొందించడానికి మూడు కారణాలున్నాయి. ఒకటి వర్తక వాణిజ్యాల అభివృద్ధి, రెండు సత్వర సమర్థ పాలనా సౌలభ్యం, మూడు తమ సహ వలస పాలకులనుంచీ వచ్చే ప్రమాదాలను సత్వరం అణచివేయగల సౌకర్యం. దేశ వ్యాప్తంగా అంత పెద్ద రైల్వే లైన్లు వెయ్యడం బహు కష్టమైన పని. నదీ నదాలు, కొండకోనలు, అడవులు దాటుకుంటూ పట్టాలు వెయ్యడం ప్రమాదంతో కూడిన పని కూడా. ఈ ప్రాణాపాయకరమైన పనులకు సమాజంలో కింది మెట్లమీద వున్న శూద్రులు తప్ప మరెవరూ సిద్ధపడలేదు. అందుచేత అవి అస్పృశ్యులకు కూడా అందుబాటులోకొచ్చాయి. దేశ వ్యాప్తంగా ఈ పనులకు ఎక్కువమంది అస్పృశ్యులే వచ్చారు. ఇక్కడ కూడా వీరిని తక్కువ చూపు చూసేవాళ్ళు. వీళ్ళను గాంగ్‌మన్ అని పిలిచేవారు. అతిప్రమాదకరమైన ప్రదేశాలలో వీళ్ళు బరువైన రైలు పట్టాలను పదేసిమంది కలిసి భుజాలమీద మోసుకుపోయేవాళ్లు. చాలా సార్లు క్రూరజంతువుల వలనా, పాముల వలనా ప్రమాదాలు సంభవించేవి. కొందరి ప్రాణాలుకూడా పోయేవి. అయితే అంటరాని వారికి కొన్ని పన్లు దొరికాయి. రైల్వే వారి క్వార్టర్స్‌లో ప్రవేశం దొరికింది. కొంతమంది శూద్రుల పొరుగున వుండడం జరిగింది. కొన్నిసార్లు వాళ్ళుండే ఇళ్లల్లోనే వీళ్లకీ జాగా ఇవ్వడం జరిగేది. అయినప్పటికీ ఆ శూద్రులు ఇంకా అస్పృశ్యత పాటించాలని చూసేవాళ్ళు. ప్రతి గ్రామంలోనూ వాడల్లో దూరంగా అస్పృశ్యులుగా వుంచిన వాళ్ళు ఇప్పుడు తమ పొరుగున వుండడం ఒక వింత పరిస్థితిని సృష్టించింది! పరిసరాలు మారాయి. ఇప్పుడు అంటరాని వారికి ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం వచ్చింది. కేవలం పని గురించే కాదు. సమాజం గురించి, సమాజ నిర్మాణం గురించి కూడా! అంటరాని వారికి అభివృద్ధి ద్వారాలు తెరిచింది బ్రిటిష్ ఇండియా హయాంలోనని చెప్పాలి.

రైల్వే ప్రారంభ దినాలలో రైలుపెట్టెలను జతపరచి రైలుబండిని నిర్మించడానికి కూడా భారీ సంఖ్యలో పనివాళ్ళు కావలసి వచ్చారు. ఇంజనుకు అవసరమైనప్పుడు పెట్టెలను అతికించడం. అక్కర్లేనప్పుడు విడకొట్టడానికి కూడా మనుషులు అవసరమయ్యారు. ఈ ప్రక్రియను 'షంటింగ్' అంటారు. ఈ పనిచేసే వాళ్ళను ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్ పనివాళ్లంటారు. వీళ్ళు ప్రయాణీకుల రైళ్ళకూ గుడ్స్ రైళ్ళకు కూడా పనిచేసేవారు. ఈ పని వాళ్ళు ఉద్యోగులందరికన్న కింది స్థాయి వాళ్ళన్నమాట. వీళ్ళని పాయింట్స్ మన్ అంటారు. ఇది చాలా ప్రమాదంతో కూడినపని. ఈ పాయింట్స్ మన్ రైలు పట్టాల మధ్య పరిగెత్తాలి. నిలిచి వున్న బోగీ తాలూకు (దాదాపు వంద కిలోల బరువున్న) లోహపు గొలుసును ఎత్తి ఎదురుగా నెమ్మదిగా సమీస్తున్న మరొక బోగీకి జతచెయ్యాలి. ఎంత శిక్షణ పొందినా ఒక్కొక్కసారి ఈ పనిచేసేవారి కాళ్ళో చేతులో విరిగిపోయేవి. వాళ్ళు రైలుపట్టాలమధ్య పరిగెత్తేటప్పుడు జారిపడి తీవ్రమైన గాయాలయ్యే ప్రమాదం

కూడా వుంది. ఒక్కొక్కప్పుడు వాళ్ళు కదిలే రైలుబండి చక్రాల కిందపడే ప్రమాదమూ వుంది. ఈ శాఖలో చేరడానికి భారతదేశం నలుమూలలనుంచీ అస్పృశ్యులు వచ్చారు.

నర్సయ్యకి వచ్చిన ఉద్యోగం ఇదే. అతనిని మేనమామల ఊరి సమీపంలో ఒక చిన్న గ్రామంలో వేశారు. రైళ్ల రాకపోకలకు గంట మోగించి సిగ్నల్ ఇవ్వడం, ఔటర్ సిగ్నల్ దగ్గరా, హోమ్ సిగ్నల్ దగ్గరా వుండే కిరోసిన్ దీపాలను పరిగెత్తుకుంటు పోయి వెలగించడం అతని పని. అంతే కాక బ్రిటిష్ వాడైన స్టేషన్ మాస్టర్ భార్యకు ఇంటిపనిలో సాయం చెయ్యాలి. తల్లితండ్రులను కోల్పోయి కష్టసమయంలో వున్న తనకు మొహం తిప్పేసుకున్న వూరికీ, క్రూరుడైన దొరకి, దూరంగా వుండి ఈ కొత్త పని చేసుకోడం ఆనందంగా వుంది నర్సయ్యకి. చిన్నతనంలోనే భార్యను కోల్పోయిన నర్సయ్యకు మరో మనువు చూస్తున్నారు మేనమామలు.

◆◆◆

నర్సయ్య కొడుకు రామస్వామికి పదేళ్ళొచ్చాయి. తండ్రికి మళ్ళీ పెళ్లయిన కొత్తలో అతను సంతోషంగానే వుండేవాడు. సవతితల్లి రామక్క అతన్ని బాగానే చూసేది. కానీ అట్లా ఎంతోకాలం సాగలేదు. ఇప్పుడు అతను రామక్క పనిచేసుకుంటూ వుంటే తన అయిదేళ్ల తమ్ముడు ఎల్లయ్యను, మూడేళ్ళ చెల్లెలు పెంటమ్మను చూసుకోవాలి. ఆమె పని చేసుకుంటూ వుండకపోయినా ఒక్కొక్కసారి వాళ్లని చూడాలి. ఇంట్లో ఎన్నో పనులు చెయ్యాలి. తండ్రి ఇంటికొచ్చినప్పుడే అతనికి కాస్త విశ్రాంతి. రామక్క రామస్వామికన్న తన పిల్లలని బాగా చూసుకునేది. తమ్ముడూ చెల్లెలూ అన్నం తినేదాకా రామస్వామి నిరీక్షించాలి. అప్పుడు తినాలి. తండ్రి ఇంట్లో లేనప్పుడయితే వాళ్ల తినగా మిగిలపోయినవే రామస్వామికి పెట్టేది ఆవిడ. రామస్వామి రంగూ రూపం రామక్కకు అసూయాజనకంగా వుండేవి. ఆమె ఆ పిల్లవాణ్ని తరచూ కొడుతూ వుండేది. అతను ఆ దెబ్బలు మౌనంగా భరించేవాడు.

ఆ దరిదాపుల్లో ఒక స్కూల్ వుండేది. రామస్వామి ఆ స్కూల్లోకి చాలా ఆసక్తిగా తొంగి చూస్తూవుండేవాడు. ఉపాధ్యాయుడు కుర్చీలో కూచుని వుండడం, పిల్లలంతా తరగతి గదిలో కూచుని పాఠాలు గట్టిగా వల్లె వేయడం అతనికి చాలా ఇష్టంగా అనిపించేది. తను కూడా అట్లా చదువుకోడం వ్రాయడం నేర్చుకోవాలనిపించేది. అతని చిన్నారి మనసుకు. కానీ అతను అస్పృశ్యుడవడం చేత కనీసం స్కూలు ప్రాంగణంలో అడుగుకూడా పెట్టలేడు.

ఒకరోజు అతను తండ్రితో 'అయ్య! నేన్ గూడ బడికి పోత' అన్నాడు.

నర్సయ్య కొడుకు అమాయకపు మొహాన్ని చూసి, అతన్ని దగ్గరకు తీసుకుంటూ, అన్నాడు.

'మనం ముట్టుకోని వాళ్లం బిడ్డా, ఆళ్ళు మనకు చదువు చెప్పరు'.

'ఎందుకు ?'

'మనలను ఆళ్ళు ముట్టుకోరు బిడ్డా! అందుకే'.

'అయితేంది? నేను ఆళ్లకు దూరంగ కూసుంట, అక్కడ గూడ ఎవర్నీ ముట్టుకోను'

'కని నీకు పంతులు పాఠం చెప్పడు'.

'నేను పంతుల్ని గూడ ముట్టుకోను'.

కొడుకు తర్కానికి నర్సయ్య దగ్గర జవాబు లేదు. మనుస్మృతి గురించి అతను తన కొడుక్కి చెప్పి అర్థం చేయించలేడు. హిందూ జీవనవిధానానికి సంబంధించిన నియమాలను ఎన్నో శతాబ్దాలకిందట మనువు ఏర్పరచాడు. అప్పటినుంచీ తమను హిందువులు విడిగానే వుంచారు. శూద్రుల విషయంలోనూ అస్పృశ్యుల విషయంలోనూ పాపమూ, దండనా ఎప్పటికీ మారని విధంగానే వుంటూ వస్తున్నాయి. ఈ నియమాన్ని అతిక్రమించడం తప్పు అనే విధంగా అంటరానివారి మనసులు కూడా నియంత్రిత మైనాయి. మనువు సూత్రాల ప్రకారం హిందువులను ముట్టుకోవడం పాపం. అట్లాగే వారిముందు కూచున్నా నుంచున్నా చెప్పులు వేసుకున్నా, తలపాగా పెట్టుకున్నా కూడా పాపమే.

అందుకని నర్సయ్య 'లేదు బిడ్డా! మనం సదువుకోవద్దు సదువుకుంటే పాపందలుగుతది' అని మాత్రం అనగలిగాడు.

తండ్రి మాటలు రామస్వామిని సమాధాన పరచలేదు. ఇంట్లో పనంతా చేసిన తరువాత స్కూల్లో జరిగేవన్నీ దూరంనించీ చూస్తూ వుండేవాడు. అతన్ని కొద్ది రోజులుగా గమనిస్తున్న ఒక ముల్లా (మహమ్మదీయ అధ్యాపకుడు), అతని దగ్గరకొచ్చి, ప్రేమగా 'నీకు చదువుకోవాలనుందా బిడ్డా!' అనడిగాడు.

'కానీ నన్ను ముట్టుకోరు గదా?' అన్నాడు ఆ పిల్లవాడు.

'ఏంగాదు, నేన్ నీకు నేర్పిస్త'.

'మరి సదువుకుంటే పాపం గద. '

'నీకెందుకు, నేన్ జూసుకుంట గద'.

'మీదగ్గరికి ఎప్పుడు రమ్మంటరు? నేనింట్ల పనంత జేసుకున్నంక రావాలి' అన్నాడు రామస్వామి.

'నువ్వెప్పుడు రావాలనుకుంటె అప్పుడు రా బిడ్డా!నేను మసీదులనే వుంట' అన దగ్గర్లోని మసీదును వేలితో చూపించాడాయన.

ఆనందంతో పొంగిపోతూ ఆ విషయం తండ్రికి చెప్పాడు రామస్వామి. ఆ విషయాన్ని తల్లికి చెప్పవద్దని ఇద్దరూ అనుకున్నారు. ఆమెకు తెలిస్తే అతన్ని చదువుకోనివ్వదేమోననే భయం చేత.

మరునాడు ఇంట్లో పని అయినాక తనకున్న వాటిలో శుభ్రమైన బట్టలు వేసుకుని మసీదుకు వెళ్ళాడు. అతని చురుకుతనానికీ చదువుపట్ల వున్న ఆసక్తికీ ఆశ్చర్యపడ్డాడు

ముల్లా. అతన్ని పిలిచి పక్కన కూర్చోపెట్టుకున్నాడు. కానీ అలవాటుచొప్పున రామస్వామి నెమ్మదిగా పక్కకు జరిగాడు. ఆయన ఒక పలక మీద మొదటి తెలుగు అక్షరాలు వ్రాసిచ్చి వాటిని దిద్దమన్నాడు. అట్లా తరాల తరబడి హిందువులు తమకు నిషేధించిన విద్యను సమాజ నియమాలకు వ్యతిరేకంగా, యెలుకటి కుటుంబానికి ఒక ముస్లిమ్ అధ్యాపకుడు పరిచయం చేశాడు. కుటుంబానికి తొలి గురువైన ఈయనకి తరువాతి తరాలన్ని ఋణపడి వున్నాయి.

అయితే ఆ తరువాత చదువు అంత సులువుగా సాగలేదు, అతనికి అనుకున్నంత ప్రోత్సాహం లభించలేదు. అయినా నర్సయ్యకు మరొక వూరుకు బదిలీ అయినదాకా ఒక రెండు, మూడేళ్ళ పాటు అతను చదువు నేర్చుకోగలిగాడు. అప్పటికి అతనికి చదవడం వ్రాయడం కొద్దిగా వచ్చినా, వచ్చిన దానిని అభ్యాసం చేసి చూసుకోడానికి పుస్తకాలకోసం ఎప్పుడూ వెతుక్కోవలసి వచ్చేది.

తన భార్య రామస్వామిని సరిగ్గా చూడడం లేదని నర్సయ్యకు తెలుసు. కానీ అతను నిస్సహాయుడు. కొడుకు కూడా ఎప్పుడూ తల్లి మీద ఫిర్యాదులు చేసేవాడుకాదు. తన తోబుట్టువులను చాలా ఓర్పుతో చూసుకునేవాడు. అంతా కలిసిమెలిసి ఆపేక్షగా వుండేవాళ్ళు. ఇప్పుడు నర్సయ్యకి కొత్త బాధ వచ్చిపడింది. అతని భార్య రామస్వామిని పనిలో పెట్టమని పోరుతోంది. పిల్లవాడు అన్నంతినేటప్పుడు అతన్ని సతాయిస్తూ వుండేది. అతనికి అవి వినపడుతూనే వుండేవి. ఈ ఆలోచనలు అతని మనసుకు బాధ కలుగ చేసేవి.

◆◆◆

ఇప్పుడు నర్సయ్య శిక్షణ పొందిన పూర్తిస్థాయి పాయింట్స్ మన్ అయినాడు. కిరోసిన్ సిగ్నల్ దీపాలు సరిగ్గా వున్నాయో లేదో చూసే బాధ్యత అతనిదే. అయితే అతని రోజువారి విధులలో పెద్ద తేడా ఏమీలేదు. ఒక సాయంత్రం నర్సయ్య కిరోసిన్ సీసా తీసుకుని దీపాల దగ్గరకు పోబోతున్నాడు. ప్రతి స్టేషన్ ప్రారంభంలోనూ, చివరా రెండు సిగ్నల్స్ వుంటాయి. ఒక దానిని హోమ్ సిగ్నల్ అనీ రెండో దానిని ఔటర్ సిగ్నల్ అనీ అంటారు. పాయింట్స్ మన్ ముందు ఔటర్ సిగ్నల్ దగ్గరకు వెళ్ళి తరువాత హోమ్ సిగ్నల్ దగ్గరికి రావాలి. ఆ రోజుల్లో యంత్రాలు లేవు కనుక చాలా పన్లు మనుష్యుల ద్వారానే జరిగేవి. అందుచేత పాయంట్స్ మన్ సిగ్నల్ దీపాలలో కిరోసిన్ పొయ్యడానికి అటూ ఇటూ చాలాదూరం నడవవలసి వచ్చేది. ఇందుకు చాలా సమయం పట్టేది. ఆ రోజు నర్సయ్యను స్టేషన్ మాస్టర్ పిలవడంతో దీపాన్నీ కిరోసిన్ సీసానీ అక్కడే వదిలేసి స్టేషన్ మాస్టర్ గదికి వెళ్ళి, ఆయన ఏం చెబుతాడా అని నిరీక్షిస్తూ నిలబడ్డాడు. తెల్లని యూనిఫామ్ వేసుకుని ఎన్ఎస్ఆర్ (నిజామ్ గారంటీడ్ స్టేట్ రైల్వే) అనే ఎంబ్లెం వున్న నీలం టోపీ పట్టుకుని వున్న స్టేషన్ మాస్టర్ అప్పుడు వేరే స్టేషన్ కు ఏదో టెలిగ్రామ్

పంపే హడావుడిలో వున్నాడు నర్సయ్య రాక ని ఆయన గమనించలేదు. నర్సయ్య మౌనంగా నిలబడి ఆయన చేసే 'కట్ట–గడ–గడ' (మోర్స్ కోడ్) ధ్వనుల్ని వింటున్నాడు. ఆరోజుల్లో త్వరగా సమాచారం అందచెయ్యడానికి రైల్వేలు టెలిగ్రాఫ్ భాషను వాడేవి. అప్పటికింకా టెలిఫోన్ అందుబాటులోకి రాలేదు.

కొంచెంసేపటి తరువాత ఆ ఆంగ్లో ఇండియన్ స్టేషన్ మాస్టర్ నర్సయ్యను చూసి 'ఏమిటయ్యా. ఇప్పుడొచ్చావు? ఎంతసేపైంది నిన్ను పిలిచి?' అని అరిచాడు.

'నేను అప్పుడె వచ్చిన సార్! నువ్వు మెస్సెజ్ పంపుతున్నవు. నీ ఎన్కనే నిలవడ్డ' అన్నాడు నర్సయ్య.

'చూడు మల్లయ్యేమో టైంకు రాలేదు. ఇంకో పాయింట్స్ మన్ లేడు. నువ్వే ఆ పని చెయ్యాలి'.

'గట్నే సార్. '

'సిగ్నల్స్ దగ్గిరికి పోయినవా? మొత్తం పనంత నువ్వే చెయ్యాలి. ఇప్పుడు డ్యూటీకి రావల్సిన ఇంకొకతను కూడా రాలేదు. 22 డౌన్ ప్యాసెంజర్ టైంకు వస్తుంది. సిగ్నల్స్ ముట్టించి తొందరగా వచ్చెయ్'.

'గట్నే సార్' అని స్టేషన్ మాస్టర్ కి సలామ్ చేసి వెళ్ళాడు నర్సయ్య.

ఇట్లా రెండు షిఫ్టులు పనిచేయవలసిన సందర్భాలు తరచూ వస్తూవుండేవి నర్సయ్యకు. చీకటి ముసిరేవేళ ఔటర్ సిగ్నల్ దగ్గరకు వెళ్ళడం ప్రమాదకరమైన పని. పులులు, అడవిపందుల నుంచీ కాపాడుకోడానికి ఒక కాగడా వెలిగించుకుని పోవాలి. ఒక్కొక్కసారి విషసర్పాలుకూడా కాటేసే ప్రమాదం వుండేది. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా ప్రాణాపాయం తప్పదు. అరోజు త్వరగా చీకటి పడుతోంది. నర్సయ్య ఒక కాగడా పట్టుకుని జాగ్రత్తగా సిగ్నల్ని సమీపించాడు. ఒక పొడవాటి స్థంభం పైన దీర్ఘ చతురస్రాకారపు చెక్క ఒకటి బిగించి వుంటుంది. ఇది అడ్డంగా వున్నప్పుడు ఎర్రరంగు వృత్తాన్ని చూపుతూ వుంటుంది. అంటే ఆగమని అర్థం. కోసుగా వున్నప్పుడు ఆకుపచ్చ వృత్తాన్ని చూపుతుంది. అంటే సాగిపొమ్మని అర్థం. రాత్రిపూట సిగ్నల్ స్పష్టంగా కనపడడం కోసం ఈ చెక్క వెనుక కిరోసిన్ దీపంవెలుగుతూ వుంటుంది. ఈ చెక్కను సరైన పద్ధతిలో పెట్టడానికి రైల్వేస్టేషన్ లోని ఒక క్యాబిన్ నుంచీ సిగ్నల్ వరకూ పెద్ద తీగె వుంటుంది. కొన్ని కప్పీల (pulleys) ద్వారా అంతదూరం లాగడానికి వీలుగా వుంటుంది. క్యాబిన్ లో వుండే వ్యక్తి లీవర్ ను ఉపయోగించి ఈ చెక్కను కదిలిస్తాడు. చిన్న స్టేషల్నకు రెండు లీవర్లు సరిపోయినా పెద్ద స్టేషన్లకూ జంక్షన్లకూ పెద్ద క్యాబినూ వరుసగా ఎక్కువ లీవర్లు అవసరమయ్యేవి. ఇప్పుడు ఈ సిగ్నల్స్ బదులు విద్యుద్దీపాలొచ్చాయి.

నర్సయ్య సిగ్నల్ దీపాలు వెలిగించి, రాబోయే ప్యాసింజర్ రైలుకి గంటకొట్టడానికి పరిగత్తుకుంటూ వచ్చాడు. ఒక చిన్న రైలు పట్టా ముక్క ని తీగెతో ఒక స్థంభానికి

వేలాడదీసి సుత్తితో గంట కొట్టేవాళ్ళు. అప్పుడు రైలు రాబోతోందని సూచిస్తూ. ఆ పని కాగానే అక్కడ ఒక బెంచ్ మీద కూర్చున్న నర్సయ్య ఆలోచనలు కొడుకు మీదకు పోయాయి. రామస్వామికిప్పుడు పధ్నాలుగేళ్ళు. వాడికి పెళ్ళి చెయ్యాలి. కానీ కొడుక్కి ఏ ఉద్యోగమూ లేకుండా పెళ్ళి చెయ్యడానికి అతని భార్య ఒప్పకోదని తెలుసు. ముందు అతనికేదైనా ఒక పని చూడాలి. అతని ఆలోచనలను భగ్నం చేస్తూ,.

'నర్సయ్యా! ఎక్కడున్నావ్? ట్రైన్ వచ్చేస్తుంది, లైన్ క్లియర్ ఇవ్వాలి' అని కేకలు పెట్టాడు స్టేషన్ మాస్టర్.

'ఒత్తున్న సార్' అని పరిగెత్తాడు నర్సయ్య.

స్టేషన్‌లోనుంచీ వెళ్లబోయే ఏ రైలుకైనా ముందు 'లైన్ క్లియర్' ఇవ్వాలి. ముందు స్టేషన్ నుంచి వచ్చిన సందేశాన్ని అందుకుని ఒక లోహపు పలకలాంటిది ఈ స్టేషన్ నుంచీ విడుదల చెయ్యాలి. దానిమీద కొన్ని అక్షరాలుంటాయి. ఈ పలకను తీసుకువెళ్ళి ట్రెయిన్ అక్కడనుంచీ కదిలేలోగా ఇంజన్ లోవుండే ఫైర్‌మెన్‌కి ఇవ్వాలి పాయింట్స్‌మన్. అదే అక్కడ ఆగకుండా వెళ్ళే రైలయతే దానికొక ప్రత్యేకమైన పరికరం వుంటుంది. పొడవాటి హాండిల్ వున్న టెన్నిస్ రాకెట్ వంటి ఒక పరికరానికి చివర ఒక సంచిలాంటి దాంట్లో ఈ పలకను పెట్టి తీగెకి వేలాడదీస్తారు. పాయంట్స్ మన్ ప్లాట్ ఫామ్ చివర ఒక ఎత్తులో నిలబడి దీన్ని పట్టుకోవాలి. వేగంగా పరిగెత్తుతున్న రైలు ఇంజన్ నుంచీ ఫైర్ మన్ దీన్ని లాక్కుంటాడు. అంతకు ముందు స్టేషన్‌లో ఇచ్చిన లైన్ క్లియర్ పలకను ప్లాట్ ఫామ్ మీదకు విసురుతాడు. ఇట్లా అందుకోడానికి చాలా నైపుణ్యం కావాలి. ఏ లోపం జరిగినా రైలు ఆగిపోవడమే కాక ఇచ్చే వాడికీ తీసుకునేవాడికీ కూడా సరైన సంజాయిషీ ఇవ్వకపోతే పెనాల్టిలు పడతాయి. కనుక ఇంజన్లో వుండే ఫైర్ మనూ నేలమీద వుండే పాయింట్స్ మనూ ఇద్దరూ చాలా అప్రమత్తంగా వుండాలి. రాత్రి వేళల్లో పాయింట్స్‌మన్ మరో చేతిలో కాగడా పట్టుకు నిలబడతాడు సరిగ్గా కనపడడం కోసం. ఈ దృశ్యం రైల్వే ఉద్యోగుల పిల్లలకు చూడ వేడుకగా వుండేది.

◆◆◆

సాయంత్రం అయింది. నర్సయ్యకూ అతని తోటి ఉద్యోగి మల్లయ్యకూ అప్పుడు డ్యూటీ లేదు. అందుకని కల్లు దుకాణానికి పోయారు.

'అసలు నువ్వు కనిపిస్తలెవ్, ఏంది సంగతి? ఏమైంది?' అన్నాడు మల్లయ్య కల్లు తాగుతూ,

'నా కొడుకు రామసామిదే ఫికరైతాంది. ఆనికిప్పుడు 14ఏండ్లు. పెండ్లి జెయ్యాల్నా నౌకరి జూడాల్నా అన్న పరేషాన్లున్న' అన్నాడు నర్సయ్య.

'పెండ్లి దేముంది, మస్తు పిల్లలున్నరు. నువు గావాల్నంటె జెప్పు'.

'మా ఇంటిది వాన్ని పన్లెపెట్టుమంటుంది. ఆన్కి ఇంక 14 ఏండ్లే'.

'అయితె వాన్ని రైల్వేల వెట్టొచ్చుగద?'.

'కని వాడింక చిన్నోడేనే'.

'అదేంగాద్, ఆడు బందోబస్తుగనే ఉన్నడు, ఈడు గన్పిచ్చది, ఆడు పెద్దోని లెక్క కన్పిస్తడు. అచ్చె నెల ఫ్రాంక్లిన్ సార్ ఒత్తాండు, ఆయనను బతింలాడు' అన్నాడు మల్లయ్య.

'గట్లనా? మాట్లాడ్దాం'.

ఫ్రాంక్లిన్ సార్ అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్. ఉద్యోగస్తులను నియమించడానికీ, సరిగ్గా పనిచెయ్యని వారిని, తొలగించడానికీ కూడా విశేషాధికారంవుంది ఆయనకి. ఎన్నో స్టేషన్లను పర్యవేక్షించే బ్రిటిష్ అధికారి ఆయన.

నర్సయ్యా మల్లయ్యా తాగడం అయిపోయి ఇళ్లకు వెళ్ళడానికి లేచారు.

రామస్వామికి పెళ్ళికన్న ముందు ఉద్యోగం చూడాలని నిర్ణయించుకున్నాడు నర్సయ్య.

◆◆◆

తండ్రి కోసం చూస్తూ రాత్రి భోజనం చెయ్యకుండా మేలుకుని వున్నాడు. రామస్వామి.

'గింతసేపెందుకున్నవ్ బిడ్డా! తినొద్దా?' అన్నాడు నర్సయ్య కాళ్ళు కడుక్కుంటూ

'గీ ఒక్కసారైన నీతోని తింటయ్య'.

'నువ్విట్ల మాట్లాడితే మీ అమ్మ గుర్తొస్తది బిడ్డా! నువ్వింక నౌకరి జెయ్యాలె' ఉద్వేగంతో నర్సయ్య కళ్లల్లో నీళ్ళొచ్చాయి.

తండ్రికి జొన్న రొట్టె పైన కూర వేస్తూ చిరునవ్వు నవ్వాడు రామస్వామి.

'నువ్వేం ఫికర్ జెయ్యకయ్య, నేన్ పెద్దగైన గదా, బరాబర్ నౌకరి జేస్త'.

తండ్రీ కొడుకులిద్దరూ మౌనం వహించారు. ఇద్దరికీ చెప్పగలిగినదానికన్న ఎక్కువేవుంది మనసులో.

నర్సయ్యే మౌనాన్ని ఛేదిస్తూ 'ఒచ్చేనెల ఫ్రాంక్లిన్ సార్ ఒత్తాండు, ఆయనను నీకు నౌకరియ్యమని బతింలాడ్త' అన్నాడు.

'మంచిదయ్యా, నేనేపనైన జేస్త. అమ్మగూడ కుషి అయితది' అన్నాడు రామస్వామి

'మీ అమ్మతోనే బాధున్నది బిడ్డా, అది నిన్ను సతాయిస్తాంది'.

'అట్లేం లేదయ్య నేను బాగనె వున్న'.

తండ్రీ కొడుకులిద్దరూ అన్నం తిన్నారు. భార్య నిద్రపోతూ వుండడాన కొడుకుతో మనసు విప్పి మాట్లాడగలిగినందుకు సంతోషించాడు నర్సయ్య. అతని విచారమల్లా ఇంత చిన్న వయస్సులో కొడుకుని పనికి పంపవలసి రావడమే! అయితే వాడికి ఒక పనిదొరికితే ఇల్లు ప్రశాంతంగా వుంటుంది. అన్న ప్రోత్సాహంతో నర్సయ్య రెండో కొడుకు ఎల్లయ్యకి కూడా చదువుమీద ఆసక్తి కలుగుతోంది. స్టేషన్ మాస్టర్ అతనికి

సాయంత్రంపూట తన ఇంటి దగ్గర ఇంగ్లీష్ నేర్పుతున్నాడు. స్టేషన్ మాస్టర్ భార్యకు ఇది నచ్చక అతన్ని ఇంటి బయట కూచోబెట్టేది. ఈ అవమానం అతన్ని పెద్దగా బాధించలేదు. ఎందుకంటే ఈ వేర్పాటుకు అదివరకే అలవాటు పడి వున్న వాడు కనుక.

ఆరోజుల్లో పెద్ద పెద్ద నగరాలకూ వాణిజ్య కూడళ్ళకూ మాత్రమే విద్యుచ్ఛక్తి సదుపాయం వచ్చింది. రైల్వే స్టేషన్లన్నీ చీకటిగా వుండేవి అక్కడక్కడా మిణుక్కుమనే కిరోసిన్ దీపాలు తప్ప. చిన్న స్టేషన్లలో స్టేషన్ మాస్టర్ గదిలో మాత్రమే పెద్ద కిరోసిన్ దీపం వుండేది. అదికూడా పరిమితమైన వెలుగే ఇచ్చేది.

శీతాకాలం వచ్చింది. చలి గాలి వీస్తోంది. రాత్రి తొమ్మిదో పదో అయివుంటుంది. స్టేషన్ మాస్టర్ గదిలో చిన్న వెలుగు తప్ప స్టేషనంతా చిమ్మ చీకటిగా వుంది. కళ్లకేమీ కనిపించడం లేదు. నర్సయ్య, అతని తోటి పనివాళ్లిద్దరూ కంబళ్లు కప్పుకుని చలిమంట ముందు చుట్ట కాలుస్తూ కూచున్నారు. ఈ కంబళ్లు రైల్వే వారిచ్చినవే.

'ఫ్రాంక్లిన్ సార్ ఎప్పుడొత్తాండు? ఇనిస్పెక్సన్ కి?' అన్నాడు నర్సయ్య అరిచేతులు రుద్దుకుంటూ.

'జల్దే ఒత్తాండు' అన్నాడు పక్కనున్న మనిషి.

'మొన్న స్టేషన్ మాస్టర్ చెబుతుండె, సున్నమెయ్యాలె, పన్క పెట్టించాలని'.

పంకా అనేది మనుషులు లాగే విసన కర్ర లాంటిది. గది కప్పు కు ఒక పెద్ద కడ్డీ వంటిదానిని అమర్చి మూడు నాలుగు అడుగుల వెడల్పున్న ఒక మందమైన బట్ట ను దానికి తెరలాగా వేలాడదీసి మధ్యలో తాడు కడతారు. ఒక మనిషి కూచుని ఆ తాడు లాగుతూ బట్టను అటూ ఇటూ ఊపుతూ వుంటే గాలి వచ్చి గది కాస్త చల్లబడుతుంది. చిన్న స్టేషన్లల్లో ఈ పంకా లాగే పనికూడా పాయింట్స్ మన్ దే.

'గట్లనా!' అన్నాడు నర్సయ్య సంభ్రమంగా.

'ఔ, మాస్టర్ జెప్తుంటే ఇన్న'.

ఇంతలో స్టేషన్ మాస్టర్ పిలవడంతో ఆ మనిషి పరిగెత్తుకుంటూ వెళ్ళాడు.

◆◆◆

'నీ కొడ్కు తింటాండు, పంటాండు, ఆనికి పనిలేదు ఏదన్న పనివెట్టియ్యి. పెద్దోడైండు గద!' రామక్క అరిచింది.

రామస్వామి గురించి రామక్క నిరంతర ఫిర్యాదు ఇది. మిగిలిన అస్పృశ్యుల కుటుంబాల కన్న నర్సయ్య కుటుంబం కాస్త సౌకర్యంగానే బ్రతుకుతున్నది. మరీ సౌఖ్యంగా లేకపోయినా. రైల్వే వారిచ్చే జీతం తినడానికి ఉండడానికి బట్టకట్టడానికి బాగానే సరిపోతోంది. రైల్వేలో పనిచేసే వారి కుటుంబాలన్నీ ఇట్లాగే వున్నాయి. వాళ్ళు తమ పిల్లలను చదివించుకోవాలని కూడా అనుకుంటున్నారు. ఈ కారణంగా గ్రామాలలోని తమ బంధువులనుంచీ కాస్త ఎడమైపోయారు.

'ఆన్కి రైల్వేలో పని దొర్కుతది. నీకేం పరేషాన్ లేదులే' అన్నాడు నర్సయ్య, ఓర్పు తెచ్చుకుంటూ.

'ఈ మాట యాడాదినుంచి జెప్తున్నవ్' అంది రామక్క.

'ఆన్కింక పని జేసే ఈడు రాలేదు'.

'ఔ! నీగ్గట్లనే కనవడ్తది. పక్కింటి పోరడు పొలంపనికి పోతున్నడు. వాల్లమ్మకు ఆసరౌతాండు తెలుసా?'

'ఐతేంది? నాకొడుకుని పొలం పనికి పంపియ్య'.

'ఆడేమన్న లాడ్ సాబా?' రామక్క రంకెలు పెట్టింది.

'నాకొడుకు సదువుకున్నడే!, పొలంపని జెయ్యడు ఆన్ని రైల్వేల వెడత'.

'ఏదన్న జెయ్యి, జల్ది జెయ్యి ఆడెన్రోజులు ఇంటగూసుంటడు?'

'మంచిది, ఇగ సతాయించకు, జల్దేకొలువుకెక్తడు'.

ఈ సంభాషణంతా రామస్వామి వింటూనే వున్నాడు. ఇక పనిలోకి పోవాలని తీర్మానించుకున్నాడు. తండ్రి తనని ఇలా నిస్సహాయంగా వెనకేసుకురావడం అతనికేమీ బాగాలేదు. సవతితల్లి తనను ఎంత కష్టపెట్టనా అతనేమీ బాధ పడలేదు. కానీ ఆమె తండ్రితో అంత కఠినంగా మాట్లాడ్డం అతనికి బాధ కలిగించింది. తండ్రి స్టేషన్‌కు బయలుదేరుతుండగా నెమ్మదిగా రహస్యం చెబుతున్నట్లు ఆయనతో' అయ్యా నేన్ పొలం పన్కి బోత' అన్నాడు.

'ఒద్దు బిడ్డా! నువ్వు నాకు బరువు కాదు. ఫ్రాంక్లిన్ సార్ జెల్దే అస్తడు. నిన్ను పల్నె వెట్టుమని బతిమిలాడుత' అన్నాడు నర్సయ్య. కొడుకుని దగ్గరకు తీసుకుని ప్రేమగా బుగ్గ నిమురుతూ. రామస్వామి తోబుట్టువులు నవ్వుతూ నిలబడి చూస్తూ వున్నారు. ఆ పిల్లలకి కూడా తమ తల్లి అన్నతోనూ తండ్రితోనూ మాట్లాడే విధం నచ్చదు. నిజానికి నర్సయ్య కొడుకులిద్దరూ ఒకరిపై ఒకరు ప్రేమగా వుంటారు. ఇద్దరూ తమ చెల్లి పెంటమ్మను బాగా గారం చేస్తారు. ఎనిమిదేళ్ళ పెంటమ్మ తెల్లగా చక్కగా వుంటుంది. తిన్నని ముక్కు, పెద్ద పెద్ద కళ్ళు నిడుపైన నల్లని జుట్టు. ఆ పిల్ల వెలమల (అగ్రకులం) పిల్లలాగా వుంటుందని కొందరు అంటారు.

ఆ మరునాడు స్టేషన్ కొత్తగా కళకళలాడింది. బాగా హడావుడిగా కూడా వుంది. ఉద్యోగులంతా హాజరైనారు. వాళ్ల మొహాల్లో ఒత్తిడి కనపడుతోంది. స్టేషన్ మాస్టర్, అసిస్టంట్ స్టేషన్ మాస్టర్, పాయింట్స్ మెన్, గ్యాంగ్ మెన్, అంతాశుభ్రంగా ఉతికిన యూనిఫామ్స్ వేసుకున్నారు. ప్రతి ఉద్యోగస్తుడికీ స్టేషన్ మాస్టర్ సూచనలిస్తున్నాడు. తనిఖీ బృందం మెయన్ లైన్ మీద రైలులో రాబోతున్నది కనుక స్టేషన్కి వస్తున్న గుడ్స్ రైలుకు లూప్ లైను మీదకు సిగ్నల్ ఇవ్వమని పాయింట్స్ మన్‌కి చెప్పాడు. స్టేషన్ మాస్టర్, ఉద్యోగులంతా గుసగుస లాడుకుంటున్నారు. ఫ్రాంక్లిన్ సార్ ఎప్పుడొస్తాడని.

ఇంత సేపు ఎదురు చూసిన రైలు తనిఖీ బృందాన్ని తీసుకుని ఆవిర్లు కక్కుతూ ప్లాట్ఫామ్ మీదకు వచ్చింది. తెల్లని యూనిఫామ్ వేసుకుని నీలం టోపీ పెట్టుకున్న స్టేషన్ మాస్టర్ ఫ్రాంక్లిన్ సార్‌ని స్వాగతించడానికి ఆయన బోగీ దగ్గరకు పరిగెత్తాడు. ఫ్రాంక్లన్ సార్ ఇరవైయిల్లో అప్పుడప్పుడే ప్రవేశించిన యువకుడు. ఉద్యోగులంతా తమ తమ స్థానాలలో నిలబడ్డారు. ఎవరెవరు ఎక్కడెక్కడ నిలబడాలి ఏం చెయ్యాలన్నదంతా ముందే రిహార్సల్ చేసి చూసుకున్నారు. స్టేషన్‌నూ అక్కడి ఉద్యోగులనూ చూసి సంతోషించాడు ఫ్రాంక్లిన్ సార్. ఆయన స్టేషన్ మాస్టరూ ఆయన కిందుద్యోగులూ పనిచేస్తున్న తీరును ప్రశంసించాడు కూడా. భోజనం చేసి ఆయన ఒక పెద్ద పడక కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఒక పాయింట్స్ మన్ పంకా లాగుతున్నాడు. ఇంక ఆయన రైలు ఎప్పుడు వెళ్ళిపోతుందా అని స్టేషన్ మాస్టర్ దగ్గర్నుంచీ అంతా ఎదురచూస్తున్నారు.

నర్సయ్య తన కొడుకు పని గురించి ఫ్రాంక్లిన్ సార్తో చెప్పాడు. ఆయన తను సికిందరాబాద్ చేరగానే అ విషయం గుర్తు చెయ్యమని స్టేషన్‌మాస్టర్‌ని ఆదేశించాడు. నర్సయ్యకు సంతోషమయింది అతని పక్కనే నిలబడ్డ రామస్వామి కూడా సంతోషించాడు. ఈ మంచి వార్త భార్యకు చెప్పాలని తొందరగా వుంది నర్సయ్యకి.

సాయంత్రం ఇంటికి వెళ్ళేసరికి తన మేనమామ ఎల్లయ్య రామక్కతో ముచ్చట్లాడడం చూసి ఆశ్చర్యమూ సంతోషమూ ఒక్కసారే కలిగాయి.

'ఎప్పుడొచ్చినవ్ మామా! అందరూ బాగున్నారా?' అంటూండగానే రామస్వామి పరిగెత్తుతూ వెళ్ళి ఎల్లయ్యని కౌగిలించుకున్నాడు.

'ఇప్పుడె అచ్చిన. అందరు బాగనె ఉన్నరు' అన్నాడు ఎల్లయ్య మనుమని వంక చూసి నవ్వుతూ.

'మంచి టైంకచ్చినవ్! నీకో కైపత్ జెప్త' నర్సయ్య.

'ఏమిటా కైపత్?'

'నీ మన్మన్కి రైల్వేలో పనిత్తనని ఆఫీసర్ మాటిచ్చిండు'.

'గట్లనా? నిజంగిది మంచి కైపతే 'అన్నాడు ఎల్లయ్య ఆనందంగా,

తన చెల్లెలి మరణానంతరం ఆమె భర్త తమ దగ్గరకు రావడం మంచిదే అయిందను కున్నాడు.

మామకు కల్లు తేవడానికి నర్సయ్య దుకాణానికి వెళ్ళాడు. అతని భార్య మేనమామ కోసం ప్రత్యేకమైన వంటలు చేసింది. అన్నంతిని నర్సయ్యా ఎల్లయ్యా చుట్టలు తాగుతూ బయట కూచున్నారు.

'రామసామి పన్లె జేరకముందె ఆన్కి పెండ్లి జేద్దామనుకుంటున్నమామా, మంచిపిల్లని జూడాలె' అన్నాడు నర్సయ్య.

'నేనందుకె అచ్చిన ఇయ్యాల' అన్నాడు ఎల్లయ్య.

'గట్లనా? మరి ఇప్పటిదాకా జెప్పకపోతివి'.

'ముందు నీకు జెప్పాలనుకున్న'.

'అయితె పిల్లను జూసినవా?'

'చూసిన, కార్పాటి మల్లయ్య పెద్ద బిడ్డ. పిల్లకు పదేండ్లుంటై. ఆల్లది బీబీనగర్. మల్లయ్య గ్యాంగ్ మన్. పిల్లను జూనికి ఒచ్చేవారం ఒత్తమని కైఫత్ పంపిన'.

'గట్లనె'.

'రేప్పగలు ఎల్లిపోత, పొద్దున మీ ఇంటామతో మాట్లాడతా'.

ఆ యిద్దరు అలసిపోయి నిద్రపోయారు.

◆◆◆

కార్పాటి మల్లయ్య, సికిందరాబాద్‌కు దాదాపు నలభై కిలోమీటర్లు దూరం వున్న బీబీనగర్ రైల్వే స్టేషన్లో పనిచేస్తాడు. అతను అక్కడికి సమీపంలోవున్న తుర్కపల్లి నుంచీ బీబీనగర్ వచ్చాడు. అతనికి ముగ్గురు కూతుళ్ళు. నర్సమ్మ, సాయమ్మ, లక్ష్మమ్మ. పెంపుడుకొడుకు రామయ్య. పెద్దామెకు పదేండ్లు. తన కుటుంబం గురించి తప్ప మరెవరికీ సాయం చెయ్యడని అందరూ మల్లయ్యను పీనాసి అంటారు. అతను తనకిచ్చిన రైల్వే క్వార్టర్స్ వెనక పెద్ద పాక ఒకటి వేసి అందులో ఒక డజను మేకల్ని పెంచుతాడు. అతని కొడుకు వాటిని దగ్గరున్న గుట్టల్లోకి తీసుకుపోయి రోజంతా అకూ అలమూ మేపుకొస్తాడు. మల్లయ్య మేకపాలనూ, వయసైపోయిన మేకలనూ అమ్మి కొంత ఆదాయం సంపాదిస్తాడు. అందుచేత అతని కులం వాళ్ళందర్లోనూ అతను కొంచెం స్థితిమంతుడు. స్వయంకృషితో పైకొచ్చిన వాడూ అందరిలోకీ కలిగినవాడూ కనుక కులంవాళ్లంతా మల్లయ్యను గౌరవిస్తారు. అతని భార్య మూడవ కాన్పులో (లక్ష్మమ్మ పుట్టినప్పుడు) చనిపోయింది. బంధువులు ఎంత ఒత్తిడి చేసినా తన పిల్లలను సవతి తల్లి సరిగా చూడకపోవచ్చునే భయం చేత మల్లయ్య మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఈ కులాలలో ఆడపిల్లలు ఎనిమిది తొమ్మిదళ్ళొచ్చేసరకే ఇంటిపనితో పాటు తల్లులతో పొలం పనులు కూడా చేస్తారు. కానీ మల్లయ్య ఎప్పుడూ తన కూతుళ్లను పొలంపనికి పంపించలేదు. ఇప్పుడతను తన పెద్దకూతురు నర్సమ్మకు రైల్వేలో పనిచేసే పిల్లవాడికోసం చూస్తున్నాడు.

నర్సమ్మ చక్కనిపిల్ల. ఆరోగ్యవంతురాలు. ఆమె నలుపూ కాదు తెలపూ కాదు. పొడుగూ కాదు పొట్టీకాదు. పెద్ద కళ్ళు. కాస్త చప్పిడి ముక్కు. కానీ మంచి కళగల మొహం. చాలా ఓర్పుగల పిల్ల. తన చెల్లెళ్లను బాగా చూసుకుంటుంది. ఇంటి పనీ వంటపనీ చక్కగాచేస్తుంది. మల్లయ్యకెంతో సాయితాగ వుంటుంది, ఆ పిల్లలో తన భార్యను చూసుకుంటాడు మల్లయ్య. పిల్లను ఆపేక్షగా చూసుకుంటాడు. పిల్లకు ప్రత్యేకం కాళ్లకు వెండి కడియాలు, దండకడియాలు ముక్కుపుడక కూడా చేయించాడు. పెండ్లికోసం

చిన్న పుస్తె కూడా చేయించాడు. చిన్న పుస్తె పెండ్లిలో ఆడపిల్లకు తల్లితండ్రులు పెట్టాలి. పెద్దపుస్తె పెళ్ళికొడుకు తల్లితండ్రులు తెస్తారు. ఈ రెండు పుస్తెలూ పసుపుతాడుకు కట్టి పెళ్ళికొడుకు చేత పెళ్లికూతురు మెడలో కట్టిస్తారు. చిన్నెపుస్తె చేయించడంతో పిల్లలూ పెద్దలూ అంతా నర్సమ్మను తొందర్లోనే మొగుడు రాబోతున్నాడని ఆటపట్టిస్తున్నారు.

నర్సయ్యా అతని భార్యా పిల్లను చూసుకోడానికి వస్తున్నారని ఎల్లయ్య కబురు పంపగానే మల్లయ్య ఏర్పాట్లు మొదలుపెట్టాడు. దగ్గర ఊళ్ళొ వున్న అతని అక్క అతనికి సాయం వచ్చింది. ఆడపిల్లలచేత ఇల్లు సర్దించింది. నర్సమ్మను పెళ్ళిచూపులకు అలంకరించింది. మల్లయ్య అతిథులను ఆహ్వానంచడానికి స్టేషన్‌కు వెళ్ళాడు. రైలు గంట లేటవడం వలన అక్కడ నిరీక్షించాడు. నర్సయ్యనూ అతని భార్యనూ, వారిని తీసుకొచ్చిన ఎల్లయ్యను మర్యాదగా ఆహ్వానించాడు. అందరూ మల్లయ్య క్వార్టర్స్‌కి వచ్చారు.

కొత్త వాళ్ళు తనని చూస్తూవుంటే నర్సమ్మకి బెరుకుగా వుంది. పమిట కొంగు వేలికి చుట్టుకుంటూ కూచుంది. నర్సయ్య భార్య ఆమోదంగా తల ఊపింది. నర్సయ్యా ఎల్లయ్యా సంతోషంగా వున్నారు. పెండ్లి కుదరక ముందే మల్లయ్య ఇంట్లో తినవచ్చో తినకూడదో తెలియక కల్లు మాత్రం తీసుకుని ఇంటికొచ్చారు.

ఇంటికి రాగానే తనకీ సంబంధం ఇష్టమేననీ తన ఇంటికి వచ్చితన కొడుకుని చూసుకోమనీ మల్లయ్యకు కబరుపంపేడు నర్సయ్య. తన కొడుకు, (తనకు ఎంతో ప్రియమైన అబ్బమ్మ కొడుకు) పెండ్లి త్వరలో కాబోతున్నందుకు నర్సయ్యకి చాలా సంతోషం కలిగింది. తన మొదటి భార్యతో గడిపిన కాలం చాలా కొంచెమే అయినప్పటికీ తన జీవితంలో అవే మంచిరోజులనీ మధురమైన జ్ఞాపకాలనీ అనుకున్నాడు నర్సయ్య.

స్టేషన్ మాస్టర్ రాకతో ఆలోచనలనుంచీ ఉలిక్కిపడ్డాడు.

'నర్సయ్యా! నీకో సుద్ది చెప్త' అన్నాడాయన.

'ఏం సుద్ది సార్! మాపిలగాన్కి నౌకరొచ్చిందా?' ఉత్సాహంగా అడిగాడు నర్సయ్య.

'కాదయ్యా, నీ టాన్స్ ఫర్ గురించి'.

'యాడికి సార్?' ఉన్నట్టుండి స్థలం మార్పు గురించి కొంచెం విచార పడుతూ అడిగాడు.

'దిగులు పడకు. సికిందరాబాద్ కే'.

సికిందరాబాద్ పెద్దస్టేషన్. మంచిదే కానీ.

'సార్ మరి మా పిలగాని నౌకరి సంగతి' గొణిగాడు నర్సయ్య.

' అయ్యో! చెప్పడం మర్చిపోయాను. ఫ్రాంక్లిన్ సార్ మెసేజ్ పంపాడు. వాడికి త్వరలోనే ఆర్డర్స్ వస్తాయి'.

ఇప్పుడు నర్సయ్య ఆనందం రెట్టింపైంది. అంత పెద్ద స్టేషన్ లో పని చెయ్యడంకూడా ఒక లాభమే! ఇదొక మంచి శకునం అనిపించింది అతనికి. తాము

చూసొచ్చిన పిల్ల ఇంటికి రాకముందే తమకి అదృష్టం తెచ్చింది. ఆ పిల్ల తన కొడుక్కి మంచిగా దొరికింది. ఇంక రెండు మూడు రోజుల్లో తనని రిలీవ్ చేస్తానని మాస్టర్ చెప్పాడు. అప్పుడు తనింక లష్కర్ (సికిందరాబాదుని అట్లా పిలిచేవాళ్ళు) వెడతాడు. ఆ రోజుల్లో జంటనగరాలైన సికిందరాబాద్ హైదరాబాద్‌లను 'లష్కర్' అనీ 'పట్నం' అనీ అనేవాళ్ళు. తను కోరినవన్నీ లభించినట్లే అని ఉప్పొంగిపోయాడు నర్సయ్య. బదిలీ ఉత్తర్వు అందుకోగానే ఇంటికి వెళ్ళి, ఇంక రెండు రోజుల్లో సామాను సర్దకుని సికిందరాబాద్ పోవాలని భార్యా పిల్లలకు చెప్పాడు. అంత పెద్ద నగరానికి పోతున్నందుకు పిల్లలకన్న ఎక్కువగా ఉత్సాహపడింది రామక్క.

◆◆◆

సికిందరాబాద్ నగరం 1804లో సికందర్ ఝా, అసఫ్ ఝా 111 పేరుమీద నిర్మింపబడింది. ఈ నగరం ముఖ్యంగా వేలాదిమంది మిలిటరీవారి నివాసం కోసమని నిర్మించారు. 1798 లో నిజామ్ తో ఒప్పందం చేసుకున్న కల్నల్ లాంగ్ బ్రిటిష్ సబ్సిడరీ హెడ్ క్వార్టర్స్ కోసం ఈ నగరాన్ని నిర్మించాడు. 1806 నాటికి సికిందరాబాదు ఇండియాలోకెల్లా పెద్ద కంటోన్మెంట్‌గా వుంది. అప్పుడు వీధులకు పెట్టిన రెజిమెంటల్ బజార్, రైఫిల్ రేంజ్, బొలారం, బొలారం బజార్, కేవల్రి బ్యారక్స్ ఇప్పటికీ వుండి దీన్ని కంటోన్మెంట్ ఏరియాగా పిలుస్తున్నారు. సికిందరాబాద్‌లోనూ హైదరాబాద్‌లోనూ నివసించే ప్రజలమధ్య సాంస్కృతికపరమైన తేడా వుంది. హైదరాబాద్‌లో హిందు, ముస్లిం మిశ్రమ సంస్కృతి కనిపిస్తే, సికిందరాబాద్‌లో హిందూ క్రైస్తవ సంస్కృతి కనిపిస్తుంది. ఈ నగరం యొక్క ప్రత్యేకమైన సంస్కృతి సికిందరాబాద్‌లో నివసించే మనుష్యులలోనూ, ముఖ్యంగా రైల్వే క్వార్టర్స్‌లో నివసించే వారిలోనూ కనిపిస్తుంది. సికిందరాబాద్ లో మతపరమైన ఆందోళనలు ఉండవు. రైల్వే క్వార్టర్స్ లో చాలామంది ఆంగ్లో ఇండియన్లు వుండేవారు. ఇప్పుడు వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది.

సికిందరాబాద్ రైల్వే స్టేషన్ అప్పటికీ ఇప్పటికీ మనదేశంలోని అతిపెద్ద రైల్వే స్టేషన్లలో ఒకటి. నిజామ్ గ్యారంటీడ్ స్టేట్ రైల్వే పేరు మీద 1874 లో ఈ స్టేషన్ ను ఆసిఫ్ జాహి నిర్మాణ శిల్పం పద్ధతిలో నిర్మించారు. కోటవంటి అప్పటి ఆకృతి ఇప్పటికింకా వున్నా, దీనికి రెండు వైపులా అనుబంధ నిర్మాణాలతో మరింత పెద్ద స్టేషన్ గా రూపొందింది. ఈ స్టేషన్‌లో వున్న అనేక ప్లాట్‌ఫామ్స్‌ను రోజూ 30,000 మంది ప్రయాణీకులు వాడుకుంటారు. దేశంలోని అనేక ప్రధానమైన నగరాలను కలిపే సికిందరాబాద్ స్టేషన్, ఉత్తర దక్షిణ భారత దేశాలకు ముఖ్యమైన పెద్ద లంకె. కాలక్రమాన, కొత్త రైల్వే యార్డులు, కొత్త ప్లాట్‌ఫామ్స్, వినూత్నమైన క్యాబిన్లు. ఎలెక్ట్రిక్ ట్రాక్స్ వంటి ఎన్ని మార్పులు చేర్పులు పొందినా, తన నిజమైన వాస్తు శిల్పాన్నీ అస్తిత్వాన్నీ కోల్పోకుండా నిలపుకున్నది సికిందరాబాద్ స్టేషన్.

నర్సయ్య తనకుటుంబంతో సికిందరాబాద్ వెళ్ళింది 1930ల మలి దశలో. ఈ స్థాన చలనం నర్సయ్య జీవితంలోనే కాక అతని కుటుంబంలో కూడా పెద్ద మార్పు తెచ్చింది. నర్సయ్య ఇంత పెద్ద నగరానికి రావడం ఇదే మొదటిసారి. రోజుకి ఎనిమిది పనిగంటల్లోనూ నర్సయ్యకు ఊపిరాడని పని వుండేది. అతని కుటుంబానికీ అంతే పని వుండేది. యెలుకటి కుటుంబీకులకు లష్కర్ నివాసం ప్రాముఖ్యంతో కూడినది. ఇక్కడ ఆకుటుంబీకుల తాలూకు మూడు తరాలు రైల్వేలో పనిచేశాయి. రెండు తరాలకు చెందిన వారి పిల్లల బాల్యం ఇక్కడ గడచింది. ఈ స్టేషన్ కు జరిగిన మార్పు చేర్పులకూ అభివృద్ధికీ వారు ప్రత్యక్ష సాక్షులు. మనుషులతో ఇప్పించే సిగ్నల్స్ నుంచీ ఎలెక్ట్రిక్, ఎలక్ట్రానిక్ సిగ్నల్స్ వరకూ, టెలిగ్రాఫ్ ద్వారా సందేశాలు పంపే సమాచార వ్యవస్థ నుంచీ కంప్యూటర్ల వరకూ, గర్జించే ఆవిరి ఇంజన్లనుంచీ నిశ్శబ్దంగా అధికవేగంతో కూడిన ఎలెక్ట్రిక్ ఇంజన్లవరకూ, స్టేషన్లోనూ రైల్వేల్లోనూ జరిగిన మార్పులతో సమానంగా యెలుకటి కుటుంబంలో కూడా పరిణామాలొచ్చాయి.

◆◆◆

మల్లయ్య సికిందరాబాద్ వెళ్ళి నర్సయ్యను కలిశాడు. త్వరలోనే తన కొడుకు రామస్వామి బెల్లంపల్లి స్టేషన్‌లో బాక్స్‌మ్యాన్ గా నౌకరీలో చేరబోతున్నందుకు నర్సయ్య పరమానందంగా వున్నాడు, పదిహేనేళ్ళొస్తున్న రామస్వామి ధృఢంగా ఆరోగ్యంగా వున్నాడు. రైల్వేలో ఉద్యోగానికి అర్హత పొందడానికి అవసరమైన ఆరోగ్యపరీక్షలో నెగ్గి అర్హత పత్రం సంపాదించుకున్నాడు. తక్కిన అవసరాలన్నింటినీ తండ్రి సమకూర్చాడు. ఇంట్లో పని చేసిపెట్టడానికి ఎప్పుడూ సిద్ధంగా వుండే రామస్వామి వెళ్ళిపోతున్నందుకు రామక్కకు కాస్త బాధగా వున్నా, అతను వెడుతున్నందుకు ఎక్కువ బాధ పడింది అతని తోబుట్టువులే. తమతో ఆడుకుంటూ తమ పనులు చేసిపెడుతూ ఎంతో ప్రేమగా వుండే అన్న వెడతున్నందుకు వాళ్ళు చాలా బాధపడ్డారు. కొడుకు వెడుతున్నందుకు కాస్త బాధ అనిపించినా అతను తనకొక జీవితాన్ని ఏర్పరుచుకుంటున్నందుకు, మరీ ముఖ్యంగా సవతి తల్లినుంచీ దూరం వెడుతున్నందుకు సంతోషించాడు నర్సయ్య. రామస్వామి నౌకరీలో చేరడానికి ఉత్సాహంగా వున్నాడు. ఏమీ మర్చిపోకుండా వుండేందుకు తడవకీ తన పెట్టె తీసి చూసుకుంటున్నాడు.

'పైలం బిడ్డా! పోగానే నా దోస్తుని కలుసుకో ఉండనీకె క్వార్టర్ దొరికేదాకా ఆందగ్గరే వుండు' అన్నాడు నర్సయ్య. అతని కళ్ళల్లో నీళ్ళొచ్చినయ్. గొంతు బొంగురుపోయింది.

'నువ్వేం ఫికర్ జెయ్యక అయ్యా! గట్నే జేస్త' రామస్వామికి కూడా కళ్లనిండా నీళ్ళొచ్చాయి. తండ్రీ కొడుకులు ఒకర్ని విడిచి ఒకరు ఎప్పుడూ ఎక్కువ వుండలేదు. అతని తమ్ముడూ చెల్లి కూడా కళ్లనీళ్ళు పెట్టారు. వాళ్లని విడిచి వెళ్ళడం అతనికి కష్టంగానే

వుంది. కానీ తన కాళ్లమీద తను నిలబడవలసిన సమయం వచ్చింది. పెట్టె తీసుకుని తండ్రి వెంట స్టేషన్‌కి నడిచాడు రామస్వామి.

రైలు కదిలింది. బోగీ తలుపు దగ్గర నిలబడి ప్లాట్‌ఫామ్ మీద నిలబడ్డ తండ్రికి చెయ్యి ఊపి వీడ్కోలు చెప్పాడు రామస్వామి. రైలు వెళ్ళిపోయాక ప్లాట్ ఫామ్ మీద కొంతసేపు అట్లాగే కూచుని వుండిపోయాడు నర్సయ్య. ఒక జీవితాన్ని ఏర్పరచుకోడానికి వెడుతున్న కొడుకు గురించి తనింక బెంగ పెట్టుకోకూడదని తనని తనే సముదాయించుకోడానికి ప్రయత్నించాడు.

◆◆◆

ఒక మోస్తరు పెద్ద స్టేషన్ అయిన బెల్లంపల్లిలో రైల్వే నౌకరీలో చేరాడు రామస్వామి. బెల్లంపల్లి స్టేషన్ గుడ్స్ రైళ్లకి రవాణా కేంద్రం. ఇక్కడనుంచీ రైలు ఇంజన్లకి బొగ్గు, నీరు సరఫరా చేస్తారు. బాక్స్ మ్యాన్‌గా రామస్వామి రైల్వే గార్డులకు, రైల్వే వారిచ్చే పెద్ద చెక్కపెట్టెలను మోసుకుపోవాలి. గార్డుల ప్రయాణాలు సాధారణంగా రెండు మూడు రోజులు పట్టవచ్చు గనుక వాళ్ళ తమ బటలు ఇతర అవసరాలేకాక రేషన్లు కూడా తీసుకుపోవాలి. రామస్వామి గార్డ్ క్వార్టర్‌కి వెళ్ళి ఈ పెట్టెలు సేకరించి తెచ్చి రైలు చివరనుండే గార్డ్ వ్యాన్‌లో పెట్టాలి.

బెల్లంపల్లిలో రామస్వామికి స్వతంత్ర జీవనం సంతోషంగానే వుంది. కానీ తండ్రి దగ్గరలేని లోటు బాగా తెలిసేది. తీరిక దొరకినప్పుడల్లా అతను ప్లాట్‌ఫామ్ చివర కూచుని ఏదో ఒక పుస్తకం చదువుకుంటూ వుండేవాడు. ఒక అంటరానివాడు అట్లా చదువుకుంటూ వుండడం చాలామందికి ఆశ్చర్యం కలిగించేది. అతను తండ్రికి ఉత్తరాలు కూడా వ్రాసేవాడు. 1930లలో ఒక అంటరానివాడికి ఇట్లా చదువు అబ్బడం చాలా ఆశ్చర్యకరమైన విషయం. అదికూడా తనంతటతనే చదువు నేర్చుకోడం! అతని కులంవారే అతన్ని నిరుత్సాహపరిచేవారు. ఒక అస్పృశ్యుడు చదవడం పాపం అని గర్హించేవారు. కానీ అతను వారిని లక్ష్యపెట్టలేదు. ఒక్కొక్కసారి ఎవరికీ కనపడని చోట కూచుని చదువుకునేవాడు ఈ పట్టుదలే తరువాత తనపిల్లలకు చదువు చెప్పించేలా చేసింది. అతని ప్రవర్తనా, పనిలో సమయపాలనా చూసి హిందువులు కూడా అతన్ని ఇష్టపడేవారు. కొంత కాలానికి గార్డుల భార్యలకు కూడా అతను ఇష్టుడైనాడు. వాళ్లకి అతను అవసరమైనప్పుడు బయట పన్లు చేసి పెట్టేవాడు.

బెల్లంపల్లి ముఖ్యమైన వాణిజ్య కేంద్రాలలో ఒకటి. దాపునే వున్న గోదావరి నదీ లోయలో దాదాపు 500 కిలోమీటర్ల పరిధిలో తెలంగాణాలోని ఖమ్మం, కరీంనగర్ ఆదిలాబాద్ జిల్లాలలో విస్తృతమైన బొగ్గు గనులున్నాయి. ఇక్కడనుంచీ దేశంలోని వివిధ ప్రాంతాల లోని పరిశ్రమల వినియోగం కోసం బొగ్గు రవాణా అవుతుంది. ఈ బొగ్గు చేరవేసే గుడ్స్ రైళ్ళు, బొగ్గు వ్యాన్లూ నిలపడానికి బెల్లంపల్లి స్టేషనుకు పెద్ద రైల్వే యార్డు వుంది.

ఒక నెల పాటు రామస్వామి ఒక్కడే వున్నాడు. తన మొదటి కష్టార్జితాన్ని తండ్రి చేతిలో ఎప్పుడు పెడదామా అని ఆత్రపడుతున్నాడు. తన తండ్రికి సహాయపడుతున్నందుకు అతను చాలా సంతోషంగా వున్నాడు. తన సవతి తల్లి ఇక తనను సతాయించదనికూడా సంతోషపడుతున్నాడు. తన తమ్ముడికీ, చెల్లెలికీ కూడా ఆర్థిక సాయం చేయగలనని మరింత ఆనందిస్తున్నాడు. ఒక రెండు రోజులు సెలవుపెట్టి సికిందరాబాద్ వెళ్ళాలనుకుంటున్నాడు. ఈ లోగా అతన్ని ఒకసారి ఇంటికి వచ్చిపొమ్మని తండ్రే ఉత్తరం వ్రాసాడు.

◆◆◆

తమ కులంలో చదవడం, వ్రాయడం వచ్చిన వ్యక్తి తన కొడుకొక్కడే అయినందుకు నర్సయ్యకు గర్వంగా వుంది. కొడుకు దగ్గర్నుంచీ ఉత్తరం వచ్చినప్పుడల్లా అతను తన సహోద్యోగులందరికీ దాన్ని చూపించేవాడు. వాళ్లంతా కూడా నర్సయ్యలాగే నిరక్ష్యరాస్యులు. కొడుకు వ్రాసిన ఉత్తరాలను సికిందరాబాద్ స్టేషన్‌లోని ఒక యార్డ్ మాస్టర్ నర్సయ్యకు చదివి పెట్టేవాడు. ఒక రోజు ఉన్నట్టుండి గుమ్మంలో ప్రత్యక్షమైన రామస్వామిని చూసి ఆశ్చర్యానంద భరితుడైనాడు నర్సయ్య.

కొడుకును కౌగలించుకుని 'ఎట్లున్నవ్ బిడ్డా! ముందు జెప్తే స్టేషన్ కస్తుంటి గద!' అన్నాడు.

'మంచిగున్నయ్యా!' అని అంటూండగానే తమ్ముడూ చెల్లీ నవ్వుకుంటూ వచ్చారు

'అమ్మేదీ? కనపడ్తలేదు?'.

'ఇప్పుడే ఒస్తది. కూరగాయల్ దేనికి మండికి వోయింది ఇప్పుడు ఈ పన్ లన్ని ఆమెనే జెయ్యాలిగద' అన్నాడు నర్సయ్య నవ్వుకుంటూ.

ఎల్లయ్యా పెంటమ్మా రామస్వామి సంచీ వెతికి అతను తమకోసం తెచ్చిన కొత్తబట్టలు చూసి ఉత్సాహంతో గంతులుపెట్టారు. కొడుకు కాస్త చిక్కి నల్లబడ్డట్టు గమనించాడు నర్సయ్య. అయినా కొడుకుని చూసి సంతోష పడ్డాడు.

మాటల్లోనే రామక్క వచ్చింది. రామస్వామి ఇంతకాలం ఎప్పుడూ ఇంటిమనుష్యుల్ని వదలి వుండలేదు. తల్లిని చూడగానే గబగబా తన జీతంలో మిగిల్చిన డబ్బంతా ఆమె చేతిలో పెట్టాడు.

'మీ అయ్యకియ్యి బిడ్డా!' అందామె అతన్ని చూసి నవ్వుతూ.

'లేదమ్మా! నువ్వే తీస్కోవాలె' అన్నాడు రామస్వామి.

అతని సమయస్ఫూర్తిని మనసులోనే మెచ్చుకున్నాడు నర్సయ్య. తనకొడుక్కి పుస్తకాల చదువే కాక, నిజమైన చదువుకూడా వచ్చినందుకు గర్వపడ్డాడు. కొడుకు తరచు పుస్తకాలు చదివినప్పుడల్లా అతనికి తను కలగంటున్నాడేమో అనిపించేది. కళ్ళార్పకుండా ఆ పిల్లవాణ్ణే చూస్తూ వుండేవాడు.

ఆ రాత్రి వాళ్ళంతా వాళ్ళ క్వార్టర్ (ఒక గదీ ఒక వంటిల్లూ చిన్న వరండా వుండే క్వార్టర్) లోని చిన్ని వరండాలో కూర్చున్నారు. రామస్వామి పెళ్ళిగురించి మాట్లాడడానకి అదే మంచి సమయం అనుకున్నాడు నర్సయ్య.

'నీకు పెండ్లీడొచ్చింది బిడ్డా! మంచి పిల్లను జూసిన' అన్నాడు.

'నన్నో ఏడాదైనా పని చేస్కోనియ్ అయ్యా!' అన్నాడు రామస్వామి.

'లేదు బిడ్డా, నువ్వు పెద్దోనివైనావ్. పదారేళ్ళు పడ్డె'.

'నాకు ఇంట్ల పనికి ఆసర గానీకె కోడలు గావాలె' అంది రామక్క .

'మీ యమ్మ జెప్పింది నిజం బిడ్డా!' అన్నాడు నర్సయ్య.

రామస్వామి మరి మాట్లాడకుండా వాళ్ళు చెప్పినదానికి తల ఊపాడు. తండ్రీ కొడుకులు పొద్దుపోయేదాకా కబుర్లు చెప్పుకున్నారు. కొడుకు తన నౌకరీ అనుభవాలు చెబుతూ వుంటే వింటూ అప్పుడప్పుడూ తన అనుభవాలుకూడా జత చేర్చాడు నర్సయ్య.

◆◆◆

కూతరికి వీలైనంత త్వరగా పెండ్లి చెయ్యాలని వుంది మల్లయ్యకి. అతనికింకా ఇద్దరు ఆడపిల్లలున్నారు. వాళ్లకి కూడా పెళ్ళీడు రాబోతోంది. త్వరలో లగ్నం పెట్టించమనీ వివరాలు మాట్లాడుకుందామనీ నర్సయ్యకు కబురు పంపాడు. నర్సయ్యకూడా అదే అనుకుంటున్నాడు కనుక ఒక సెలవు రోజున భార్యను తీసుకుని మల్లయ్యను కలవడానికి వెళ్ళాడు.

'మీ పిలగాడెట్లున్నడు' అన్నాడు మల్లయ్య వాళ్లకు మంచి నీళ్ళిచ్చి.

'మంచిగున్నడు, మీ పిల్లేది?'

'లోపలుంది'.

'పెండ్లిల పిలగానికి ఏంబెద్తరు?' అంది రామక్క కాస్త సందేహిస్తూ నెమ్మదిగా.

'కులంలో అందరిచ్చినట్టె ఇస్త' అన్నాడు మల్లయ్య.

'గట్లనె కానియ్యండ్రి' అని మధ్యలో అందుకుని సంభాషణ ముగించాడు నర్సయ్య

మల్లయ్య వాళ్లకు దావత్ ఇచ్చాడు. కల్లు తాగించాడు. పెళ్ళి కూతురు నర్సమ్మ అద్భుతంగా వంటచేసింది. మల్లయ్య పెట్టించిన మేకమాంసం వరి అన్నం ఆరోజుల్లో ఆ కులానికి నిజంగా అపురూపమే. పెండ్లికి లగ్నం పెట్టుకున్నారు.

◆◆◆

రామస్వామి తిరిగి బెల్లంపల్లి వచ్చాడు. అతనికి పెళ్ళి కుదిరిందన్న విషయం తెలిసి అందరూ సంతోషించారు. అతను అప్పుడప్పుడూ స్నేహితులతో కల్లు దుకాణానికి వెడతాడు, కానీ ఎక్కువ సమయం చదువుకోడానికే ఉపయోగిస్తాడు. ఇట్లా అంటరానికులానికి చెందిన వాళ్ళు ఏ చదువూలేకుండా ప్రభుత్వోద్యోగాల్లోకి ప్రవేశించడం అదే మొదలు. ఈ పరిణామం శూద్రులనూ అస్పృశ్యులనూ ఒక దగ్గరకు తెచ్చింది.

అయినప్పటికీ ఇంకా అస్పృశ్యత పాటింపబడుతూనే వుంది. ముఖ్యంగా స్త్రీలు ఎక్కువ పట్టించుకునేవాళ్ళు. ఇతర శూద్ర సహోద్యోగులవలె రామస్వామిని గార్డుల భార్యలు వాళ్ల ఇళ్ళల్లోకి రానిచ్చేవాళ్ళు కాదు. పెట్టెలు తెచ్చి వాళ్ళే బయట పెట్టేవాళ్ళు. అప్పటిదాకా అతను వాకిట్లో నిలబడేవాడు. వీళ్ళలో చాలామంది అంటరాని బాక్స్ బాయ్స్ ని తిట్టుకుంటూ వుండేవాళ్లు. రైల్వే వ్యాన్లో ఈ పెట్టెలు రామస్వామి లాంటి వాళ్లు పెట్టాక వాటిమీద నీళ్ళు చిలకరించమనే వాళ్ళు. అట్లాగే గార్డు వద్దనుంచీ ఇంటికొచ్చిన పెట్టెలమీద వాళ్లు నీళ్ళు చిలకరించేవాళ్ళు. ఈ ఆచారం రామస్వామికి కొత్తదేమీ కాదు. అతనికిది అలవాటే. పక్క పక్క క్వార్టర్స్‌లో వుండే శూద్ర స్త్రీలకీ అంటరాని స్త్రీలకి ఎప్పుడూ తగాదాలయేవి. వాళ్ల తాలూకు ఏ వస్తువునైనా తెలియకో చూడకో ముట్టుకున్నా శూద్రస్త్రీలు వీళ్ళమీద కయ్యానికి వచ్చేవాళ్ళు. ఇట్లా తరచూ జరుగుతూండడం వల్ల పురుషులు ఈ జగడాలలో తలదూర్చేవారుకాదు. ఆ విధంగా మనువు నిర్మించిన వర్ణాశ్రమ ధర్మ భవనానికి బీట్లు పడడం మొదలైంది.

◆◆◆

'నర్సమ్మా! వొస్తున్నావ, లేదా? ఇంజన్ అచ్చేసింది'.

'ఆ, వొస్తున్నా' అరుచుకుంటూ ఒక ఇత్తడిబిందె తీసుకుని ఇంట్లోనుంచీ వచ్చింది నర్సమ్మ.

బీబీనగర్‌లో లాగానె ఇండియాలో చాలా చోట్ల నీళ్ళలో ఫ్లోరీన్ ఎక్కువవుండి తాగడానికి వీల్లేకుండా వుంటుంది. ఆ రోజుల్లోని ఆవిరి ఇంజన్లు భారీ ఎత్తున నీళ్ళు తీసుకుని తిరిగేవి. చిన్న చిన్న స్టేషన్లలో రైల్వే క్వార్టర్స్ లో వుండే స్త్రీలు, ఆ ఇంజన్లు ఆగినప్పుడల్లా బిందెలు తీసుకుని పరిగెత్తుకొచ్చేవాళ్ళు. ఇంజన్ డ్రయివర్లు సన్నని ట్యూబులతో వాటర్ ట్యాంక్‌లో నుంచీ నీళ్ళు వదలేవారు. స్త్రీలు తొక్కుకుంటూ తోసుకుంటూ వచ్చేవాళ్ళు నీళ్ళకోసం. ఈ తోపులాటలో అస్పృశ్యులు హిందువులను ముట్టుకుంటే వీలున్నంత పరుషంగా తిట్టి పట్టుకున్న నీళ్ళు పారబోసుకుని మళ్ళీ పట్టుకునేవాళ్లు.

నర్సమ్మా ఆమె స్నేహితురాలూ, బిందెలు నెత్తిన పెట్టుకుని, మొహాన తొణికిన నీళ్ళు తుడుచుకుంటూ క్వార్టర్స్ కి వెడుతున్నారు. స్నేహితురాలు అడిగింది 'నీకు లగ్గమంట గదా!' అని.

'ఔను నేన్ లష్కర్ బోతాన్నా' అంది నర్సమ్మ.

'గట్లనా! లష్కర్ పెద్దూరంట గద! ఎప్పుడన్న జూసినవా?'

'లే! సూడ్లే'.

'నువు జేస్కునెటాయన లష్కర్ లుంటడా?'

'లేదు. మా అత్తమామలుంటరు. ఆయన బెల్లంపల్లిలో పనిజేస్తడు' సిగ్గుపడుతూ చెప్పింది.

వాళ్ల క్వార్టర్లు సమీపించడంతో మాటలు మాని ఇద్దరూ ఇండ్లకు పోయారు.

కూతురు పెళ్ళిపనులతో మల్లయ్య హడావుడిగా వున్నాడు. అతని అక్క అతనికి సాయం వచ్చింది. ఆ సాయంత్రం నర్సయ్యా అతని భార్యా వచ్చేదుంది. వాళ్లకు మంచి దావత్ ఇవ్వాలనుకున్నాడు మల్లయ్య. ఈడిగ వాళ్ల దగ్గర్నుంచీ అప్పటికప్పుడు తీసిన తాజా కల్లు తెమ్మని కొడుకు రామయ్యకి పురమాయించాడు. మేకపిల్ల మాంసమూ వరి అన్నమూ వండడంలో మేనత్తకు సాయం చేసింది నర్సమ్మ.

అతిథులని చూడడంతోనే సిగ్గుపడి దాక్కోవాలనుకుంది ఆపిల్ల. వాళ్ళు కాళ్ళుకడుక్కుని లోపలికి వస్తూండగానే గోడకు ఆనుకుంటూ మెల్లిగా అవతలి గదిలోకి వెళ్ళిపోయింది. మల్లయ్యా నర్సయ్యా మర్యాద మాటలు మాట్లాడుకుంటుండగానే రామయ్య నురగలు వస్తూన్న తాజా కల్లు ముంత తెచ్చి వాళ్లముందు పెట్టాడు రామయ్య. కల్లు తాగుతూ పెండ్లి ఏర్పాట్లగురించి మాట్లాడుకున్నారు ఇద్దరు.

'పిల్ల లగ్గం మా ఇంట్లనే చేయాలని మా ఇంటామె అన్కున్నది బావా!' అన్నాడు. మల్లయ్య చివరికి, ఎంతో సేపు సందేహించిన మీదట.

'మా ఇంట్ల చేద్దామనుకున్న! కానీ, మా చెల్లె అనుకున్నది గందుకె ఈన్నే జేద్దాం' అన్నాడు నర్సయ్య నవ్వుతూ.

మల్లయ్య ఊపిరి పీల్చుకున్నాడు. 'ఈ లగ్గం నేను జబర్ దస్త్ జేస్త. కర్సులకు ఫికర్ లేదు బావా' అన్నాడు.

కల్లు ప్రభావంతో గొప్పలు పోతున్నాడని నర్సయ్యకి అర్థం అయింది. ఆ సాయంత్రమే తిరుగు ప్రయాణం కనుక నర్సయ్య ఎక్కువ తాగలేదు.

నర్సమ్మ చిన్న చెల్లెలు లక్ష్మమ్మ భోజనం వడ్డించింది. తినేసి ఇంటికి బయల్దేరారు.

◆◆◆

తను ఎంపిక చేసిన పిల్ల కొడుకును సుఖపెడుతుందని అతని మనసుకు అనిపించి ఆనందం కలిగింది. పిల్ల బాగుంది ఆకర్షించే కళ్ళు. అంతేకాక పిల్లకు వంటచేయడం ఇల్లుదిద్దుకోడం బాగా చేతనవునుకూడా. అతనికి అబ్బమ్మ గుర్తొచ్చింది. రామస్వామికి అంతా తల్లిపోలికే. ఆమె తనకిచ్చిన ఒక అపురూపమైన కానుక రామస్వామి. ఆ పిల్లవాడు ఒక జీతగాడిగా బ్రతుకు వెళ్లదీయకుండా కాపాడుకోడానికే తన ఊరువిడిచి, వాడవిడిచి వచ్చాడు. బానిసత్వం నుంచీ కాపాడుకున్నాడు బిడ్డని. ఈ వలస అతని జీవితాన్నే కాక అతని కుటుంబం తాలూకు భవష్యత్తు తరాల జీవితాలను కూడా మార్చింది. నగరానికి వచ్చి కొత్త పరిసరాలకు, కొత్త జీవన విధానానికీ అలవాటు పడినతరువాత అతనికీ విషయం బాగా స్ఫురణ కొచ్చింది. కొడుక్కు చదువు వచ్చినందుకు అతనికి మరింత ఆనందంగా వుంది. ఇట్లా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పుడతనికి తెలుసు. రాబోయే తరాలకు తప్పకుండా చదువు వస్తుందని. రామస్వామిని సెలవు మీద రమ్మని

అడగాలి. మే నెలలో లగ్నం నిశ్చయమైంది. రైలు సికిందరాబాద్ చేరడంతో నర్సయ్య పగటికల చెదిరింది.

◆◆◆

పెండ్లి ఇంకా ఎంతో దూరం లేదు. మల్లయ్య ఏర్పాట్లల్లో హడావుడిగా వున్నాడు. వీరి కులంలో బైండ్లాయన పెళ్ళి కార్యక్రమం జరిపిస్తాడు. మల్లయ్య ఒక మంచి బైండ్లాయనను పెళ్ళి జరపడానికి కుదిర్చాడు. పెండ్లి, విందుకు నాలుగు లేత మేకపిల్లలను జాగ్రత్తగా ఏరి తెచ్చాడు. వచ్చే అతిథులందరికీ సరిపోయే కల్లు తెమ్మని ఈడిగ వాళ్ళకు పురమాయించాడు. తన క్వార్టర్ కు సున్నం వేయించాడు, కప్పు పైన తాటాకు వేయించాడు, ఆవరణలో గుడ్డ పందిరి వేయించి మామిడాకు తోరణాలు కట్టించాడు. తెలుపు, ఎరుపు రంగులు వేసిన చిన్న ముంతకు పసుపు, కుంకం బొట్లు పెట్టి దాని నిండా బియ్యం నింపి ఇంటిముందుండే ఒక స్థంభానికి కట్టారు. దానిపైన ఒక నూనె దీపం పెట్టారు. పెళ్లయేవరకూ ప్రతిరాత్రీ ఈ దీపం వెలిగించాలి. పెళ్ళికి ముందు వారంరోజులు పెళ్ళికూతురు ఇల్లు కదలకూడదు. ఈ వారంరోజులూ ఆమెకి రోజూ తలంటిపోస్తారు. తలంటికి ముందు అయిదుగురు ముత్తయిదువులు పాటలు పాడుతూ ఆమె వొంటికి పసుపు రాస్తారు. తలంటి తరువాత రోజుకొక్క కొత్త చీరె కట్టబెడతారు. దీన్ని పెళ్ళిపిల్లను చెయ్యడం అంటారు. పెళ్ళికి సిద్ధం చెయ్యడం అన్నమాట. ప్రతిరోజూ పెళ్ళికూతురు సమీప బంధువు ఒకరు ఆమెను పెళ్ళిపిల్లను చేస్తారు. ఈ వారం రోజుల్లో నర్సమ్మ కాస్త ఒళ్ళు చేసింది. చర్మంకాంతులీనింది. ఎప్పటికన్న అందంగా తయారైంది.

పెళ్ళికి ఒకరోజు ముందుగా పెళ్ళికొడుకు తరఫున ఒక బంధువు పెళ్ళికూతురు ఇంటికి రావడం ఆచారం. మల్లయ్య ఆయనకోసం ఎదురు చూస్తున్నాడు. అంతలోనే నర్సయ్య మేనమామ ఎల్లయ్య ఒక తెల్లని బట్టలో ఏమో మూటకట్టుకుని గబగబ నడుస్తూ రావడం కనిపించింది. కాళ్ళు కడుక్కుంటూ మల్లయ్యను చూసి చిరనవ్వునవ్వాడు ఎల్లయ్య.

'బండి లేటయింది. పొద్దుగూకక ముందే ఒస్తనో రానో అనుకున్న' అన్నాడు కూర్చుంటూ.

'నేన్ గూడా అదే అనుకుంటున్న' అన్నాడు మల్లయ్య.

నీళ్ళు కలిపి ముద్ద చేసిన పసుపును పొట్లాం కట్టితెచ్చి మల్లయ్యకిచ్చాడు ఎల్లయ్య. ఆచారం ప్రకారం పెళ్ళికొడుక్కు రాసిన పసుపు ముద్దలో కొంచెం పెళ్లికూతురుకు రాయాలి. మల్లయ్య దాన్ని లోపలికి పంపించాడు. తరువాత ఇంకో పొట్లాం ఇచ్చాడు ఎల్లయ్య. ఇందులో రెండు హాలీ (నిజాం ప్రభుత్వానివి) రూపాయలు ఒక తెల్లని గుడ్డలో మూటకట్టి వున్నాయి.

'మా మేనల్లుడు ఈ హాలి పైసలు పంపిండు' అని మల్లయ్యకిచ్చాడు.

అంటరానివారిలోనూ శూద్రులలోనూ, ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో, పెళ్ళికి ముందు పెళ్ళికొడుకు తల్లితండ్రులు కొంత డబ్బు పెళ్లికూతురుకు పంపడం ఆనవాయితీ.

'మంచిది, మంచిది' అని తీసుకున్నాడు మల్లయ్య.

ఎల్లయ్యకు మంచి కల్లు తాగించి భోజనం పెట్టి పంపాడు.

మరునాడు. అతి ముఖ్యమైన రోజు. యెలుకటి కుటుంబం, కార్పాటి కుటుంబం ఏకమయ్యే చారిత్రాత్మకమైన రోజు. రాబోయే చరిత్రకు బాటలు వేసిన రోజు.

◆◆◆

ఉదయం పది గంటలు కావచ్చింది పెళ్ళివారిని ఆహ్వానించి తోలుకొనిపోవడానికి వచ్చిన మనుషులతో. బీబీనగర్ రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోయింది. అనుకున్న రైలు రానే వచ్చింది. రామస్వామితోనూ మరికొందరితోనూ నర్సయ్య రైలు దిగాడు. రామస్వామి తెల్లని ధోవతీ కట్టుకుని పైన షర్ట్ వేసుకున్నాడు కానీ అవి అతని మీద చల్లిన పసుపుకుంకాల రంగు వచ్చాయి. నుదిటికి రంగు కాగితాలతోనూ పూసలతోనూ అలంకరించిన బాసిగం కట్టుకున్నాడు. ఒక కొత్త బట్టలో కట్టిన బియ్యం మూటను భుజానికి వేలాడతీసుకున్నాడు. పెళ్ళివారిని మల్లయ్యా అతని పరివారం హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ఒకరెవరో రామస్వామి బాసిగాన్ని సరిచేసారు. మల్లయ్య గర్వంగా ముందునడుస్తుండగా ఊరేగింపుగా అందరూ అతని క్వార్టర్స్‌కి తరలి వెళ్ళారు. అంటరాని వారు ఇట్లా తమవలె భారీగా ఊరేగింపు చెయ్యడం చూడ్డం బహుశా అగ్రకులస్థులకిది మొదటిసారి కావచ్చు.

ఊరేగింపు ఇంటిముంగిట వేసిన పందిరి ముందు ఆగింది. కొంత మంది ముత్తయిదువులు పెద్ద ఇత్తడి పళ్ళాలలో పెళ్ళికూతురికిచ్చే బహుమతులు పట్టుకుని ముందుకు వచ్చారు. వారి కాళ్ళు పసుపు, కుంకుమ కలిపిన నీళ్ళతో కడిగిన తరువాత పెళ్ళికూతురు తరఫున ఇద్దరు పెద్ద ముత్తయిదువులు వాటిని అందుకున్నారు. అందుకునే ముందు బహుమతులు తెచ్చిన వారిమీద పసుపు, కుంకం కలిపిన అన్నం చల్లారు. ఆ బహుమతులను ఏ దుష్టశక్తులూ ఆవహించకుండా. తరువాత అందరూ పందిట్లో ప్రవేశించారు.

బైండ్లాయన నేలమీద పెద్ద చదరంలో బియ్యం పోయించాడు. దీని నాలుగు మూలల్లో వృత్తాలు గీసి. ప్రతి వృత్తంలో ఒక కుండల దొంతర పేర్చాడు కుండలన్నిటిపైన అన్నింటికన్న చిన్న కుండపెట్టాడు . ఈ కుండలన్నంటికీ తెల్లరంగు వేసి దానపైన పసుపు కుంకం బొట్లు పెట్టారు. కుండలన్నింటినీ కలుపుతూ దారాలు చుట్టారు. ఈ బియ్యపు చదరం పైన ఒక కాడి వుంచారు. పెళ్ళి సమయంలో ఈ కాడిమీదే పెళ్లికూతురూ పెళ్లికొడుకూ కూర్చోవాలి, అదే పెళ్ళి వేదిక. లయబద్ధంగా డప్పులు మోగుతున్నాయి. రామస్వామిని అతని బావమరిది రామయ్య దాదాపు ఎత్తుకొచ్చి కాడిపైన కూచోపెట్టాడు.

నర్సమ్మ మేనత్త ఆమెను అలంకరించింది. చీరెకట్టి కాళ్లకి వెండి కడియాలు, దండకడియాలు, వడ్రాణం (కమర్ బంద్) పెట్టింది. చెవులకు బంగారం కమ్మలు. వేలికొక బంగారపు ఉంగరం కూడా పెట్టింది. అందంగా మెరిసిపోతున్న పెళ్ళికూతుర్ని మేనత్తా మరికొందరు బంధువులూ పందిట్లోకి తీసుకొచ్చారు. ఈ అలంకారం అలవాటులేని నర్సమ్మ తడబడుతూ మెల్లిగా నడిచొచ్చింది. బైండ్లాయన ఆమెను కాడిమీద కూచోమన్నాడు. డప్పులు మోగుతూనే వున్నాయి. ఈలోగా మల్లయ్యా నర్సయ్యా తమతమ బంధువుల్ని ఆహ్వానించడంలో మునిగిపోయారు. బ్రాహ్మణ పురోహితుని మాదిరిగా కాక బైండ్లాయన ఒకే ఒక్క సంస్కృత శ్లోకం. 'శుక్లాం బరధరం' చదివి పెళ్ళి జరిపించాడు. డప్పుల మోత తార స్థాయికి రాగా బైండ్లాయన చెప్పినవిధంగా రామస్వామి నర్సమ్మ మెడలో పుస్తె కట్టాడు. పెళ్లి కాగానే మేకమాంసమూ వరి అన్నమూతో అతిథులకు విందు చేశాడు మల్లయ్య. కావల్సినంత కల్లు కూడా సరఫరా చేశాడు. మల్లయ్య చేసిన అద్భుతమైన పెళ్ళి ఏర్పాట్లను అందరూ అభినందించారు. అప్పటి వారి కులం స్థాయిలో ఆ పెళ్ళి వైభవంగా జరిగిందని చెప్పాలి. ఇంత బాగా జరగడానికి కారణం ఈ పెళ్ళి తమ ఊళ్ళో కాక రైల్వే క్వార్టర్స్‌లో జరగడమేనని కూడా చెప్పాలి. ఊళ్ళో భూస్వాములు అస్పృశ్యుల పెళ్ళి ఇంత వైభవంగా జరపనివ్వరు.

ఇప్పుడిక నర్సమ్మ తను పుట్టి పెరిగిన తన ఇంటినుంచీ వీడ్కోలు తీసుకుని అత్తగారింటికి వేళ్ళే సమయం వచ్చింది. కూతురు తనను విడిచి వెడుతున్నదన్న ఆలోచనే భరించలేక పోతున్నాడు మల్లయ్య. కళ్లనిండా నీళ్ళొస్తున్నాయి.

మల్లయ్య కూతురికిచ్చిన ఇత్తడి గిన్నెలు, బిందెలు, పళ్ళాలు లెక్కపెట్టి గోతాలలో వేసింది నర్సయ్య భార్య. నర్సమ్మ మేనత్త ఆ పిల్ల బట్టల్ని ఒక పెట్టెలో సర్దింది. వాళ్ళెక్కవలసిన రైలు అప్పటికే భోన్‌గిరి వదిలిందని ఎవరో వచ్చి చెప్పారు ఆ మాట విని అంతా స్టేషన్‌కి బయల్దేరారు.

ఆడపిల్లలు పుట్టింటికి వీడ్కోలిచ్చేటప్పుడు పాటించవలసిన ఆచారం ప్రకారం నర్సమ్మ పుట్టింటి వాకిలి గడప కడిగి పసుపు, కుంకం బొట్లు పెట్టింది. ఏడ్చిన నర్సమ్మ కళ్ళు ఎర్రబడ్డాయి. మల్లయ్య ఆమె చేతిని నర్సయ్య చేతిలో పెట్టి, 'తల్లిలేని బిడ్డ, మంచిగ సూస్కోవాలె బావా!' అన్నాడు రుద్ధమైన కంఠంతో.

'అదిప్పుడు నా బిడ్డ. నువ్వేం ఫికర్ జెయ్యకు బావా!' అంటుంటే నర్సయ్య కళ్ళు కూడా చెమర్చాయి.

మామగారితో మాట్లాడే వయసు లేదు రామస్వామికి. కానీ ఆ తండ్రీ కూతుళ్ల బాధ అతనికి అర్థం అయింది.

రైలెక్కి కూర్చున్నాక నర్సమ్మకి కాస్త విచారం తగ్గినట్లే వుంది. జీవితంలో మొట్టమొదటిసారి ఇదే తను రైలెక్కడం. చెట్లూ చేమలూ స్థంబాలూ వెనక్కి పోతున్నట్లు

కనిపించి ఆశ్చర్యపోయింది. అట్లా ఆ పిల్ల మనసు తిప్పుకున్నందుకు ఆమెతో వెడుతున్న ఆమె మేనత్త కాస్త స్థిమిత పడింది. పెద్దగా మాట్లాడుతూ ఆ పిల్ల దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నిస్తున్నాడు రామస్వామి. ఆమె అతని వైపు క్రీగంటితో చూసి చిరునవ్వు నవ్వినప్పుడల్లా పులకించిపోతున్నాడు. రైలు సికిందరాబాదు సమీపిస్తున్నప్పుడు కనిపించిన పెద్ద భవనాలను చూసి ఆశ్చర్యపోయింది. నర్సమ్మ అదివరకెప్పుడూ అంతంత పెద్ద భవనాలను చూసివుండలేదు. అంతేకాదు ఆమె ప్లాట్ ఫామ్ మీద ఒకసారి ఇన్ని రైళ్ళు వెడుతూండడం కూడా చూడలేదు. అంత పెద్ద ప్లాట్ ఫామ్ మీద నడవడమూ అంత పెద్ద రైల్వే యార్డ్ దాటడమూ కూడా ఆమెకు కొత్త అనుభవమే. పదే పదే పక్కలకుచూస్తూ అత్త చేతిని గట్టిగా పట్టుకుని, గుండె వేగంగా కొట్టుకుంటుంటే భయం భయంగా, తనకి బొత్తిగా కొత్త ప్రదేశంలో అడుగుపెట్టింది నర్సమ్మ.

వాళ్ళు బోయిగూడాలోని చిన్న క్వార్టరుకి వచ్చారు. నర్సమ్మనూ ఆమె అత్తనూ గుమ్మం దగ్గర నిలబెట్టి ఒక పెద్దామె పసుపూ, కుంకం కలిపిన నీళ్ళ కుండతో వచ్చి, ఆ కుండని నరసమ్మ తలచుట్టూ మూడు సార్లు తిప్పి దిష్టి తీసి వాటిని రెండు వైపులకూ పారబోసింది. కొత్త జంటకు దుష్టశక్తుల నుంచీ రక్షణకోసం ఇట్లాచేస్తారు. అప్పుడు కొంచెంనీళ్లతో నర్సమ్మ మొహం కడిగి కుడికాలు ముందుపెట్టించి ఆమెను అత్తవారింట్లో ప్రవేశపెట్టారు.

ఇదంతా చూస్తూ వుంటే నర్సయ్యకు తన మొదటిభార్యతో గడిపిన దినాలు గుర్తొచ్చాయి. మధ్యాహ్నాలప్పుడు ఆమె తనకు తెచ్చి పెట్టే బువ్వ కోసం ఎంత ఆత్రంగా ఎదురుచూసేవాడు! ఆ బువ్వ మూట నెత్తిన పెట్టుకుని తనవంక నవ్వుతూ చూస్తూ వచ్చే అబ్బమ్మ జ్ఞాపకం వస్తోంది. తనకి కొసరి కొసరి ఒక్క పిసరైనా మిగల్చకుండా తినిపించే అబ్బమ్మ! అప్పుడప్పుడు వేయించిన పల్లీలు తెచ్చేది. నర్సయ్య నవ్వుకుంటూ తన జ్ఞాపకలోకంనుంచీ బయటికి వచ్చాడు.

సాయంత్రం అవుతూనే వచ్చిన బంధువులంతా వెళ్ళిపోవడానికి సిద్ధమైనారు. కొత్త పెళ్ళికూతుర్ని చూడాలనే కుతూహలంతో ఇరుగుపొరుగులొచ్చారు. వాళ్లల్లో వాళ్ళే గుసగుస లాడుకున్నారు 'పిల్ల పిల్లగానంత తెల్లగాలేదు అయినా మంచిగుంది' అనుకున్నారు.

నర్సమ్మను మేనత్త తల వంచుకునే కూచోమని చెప్పింది. అత్తమామల ఎదుట భర్తతో మాట్లాడవద్దంది. అత్తింట్లో ఎట్లా వుండాలో తెలియచెప్పింది. అంతా కొత్తగా వుంది నర్సమ్మకు. రామస్వామి తమ్ముడు ఎల్లయ్యా, చెల్లెలు పెంటమ్మా నర్సమ్మకు చేరువుగా రావడానికి ప్రయత్నిస్తున్నారు. కొన్ని గంటల వ్యవధిలోనే ఆమె జీవితం పూర్తిగా మారిపోయింది. తనవారందర్నీ వదిలి బొత్తిగా కొత్తదైన కుటుంబంతో కలిసి బ్రతకడానికి వచ్చింది. కార్పాటి నర్సమ్మ యెలుకటి నర్సమ్మ అయిపోయింది. నిన్నటివరకూ చీకూచింతా అంటూ ఎరగని పదేండ్ల పిల్లకి ఇప్పుడు కొన్ని బాధ్యతలొచ్చాయి. మేనత్త ఇప్పుడు దగ్గర

వుండడం కొంత ఊరట నిచ్చింది. ఆమె తనకు అన్నీ నేర్పుతుంది అనుకుంది. అలసిపోయిన నర్సమ్మ ఆ రాత్రి అత్తపక్కన గదిలో ఒక మూలపడుకుని నిద్రపోయింది.

రామస్వామి జీవనవిధానంలో ఒక మార్పు వచ్చిందిప్పుడు. తన బట్టలు తనే ఉతుక్కోనక్కర్లేదు. తిన్న కంచం కడుక్కోనక్కర్లేదు. భార్య చేస్తుంది ఆ పన్లు. ఒక వారం గడిచాక అతను మళ్ళీ బెల్లంపల్లి వెళ్ళి డ్యూటీలో చేరవలసిన రోజు వచ్చింది. ఈ లోగా నర్సమ్మతో మాట్లాడాలని చాలా ప్రయత్నించాడు. నేరుగా కాకపోయినా తన తమ్ముడు చెల్లెలి ద్వారా అయినా మాట్లాడాలనుకున్నాడు. కానీ ఆపిల్ల పడనిచ్చింది కాదు నవ్వుకుంటూ పారిపోయేది. ఆ చిన్న ఇంట్లో వాళ్లిద్దరూ కూచుని మాట్లాడుకోడానికి ఆవకాశమే లేదు. పైగా ఆపిల్లకు అలవిమాలిన సిగ్గు. ఇప్పుడంక ఏంలాభం? అతను వెళ్ళే రోజు రానే వచ్చింది. ఆ సాయంత్రం రైలుకే అతని ప్రయాణం. నర్సమ్మ అతని బట్టలు సంచిలోసర్దడం చూశాడు.

'బిడ్డా! నువ్ క్వార్టర్ కోసం దరఖాస్తు పెట్టుకో!. నీభార్యని తెచ్చుకోవాలని స్టేషన్ మాస్టర్ కి చెప్పు' అని చెప్పాడు నర్సయ్య కొడుక్కి.

'గట్లనె అడుగుతయ్యా.'

తన భార్యని కలుసుకోడం కోసం ఎదురచూస్తున్నాడు రామస్వామి. ఆమె చేతిలోనుంచీ సంచీ తీసుకుంటున్నప్పుడు కూడా ఆమె అతని వంక చూసింది కాదు. తలవంచుకుంది. కానీ ఆమె మొహంలో చిన్న దిగులు కనిపించింది అతనికి. అతను వేళ్ళిపోయేటప్పుడు మాత్రం తలుపువెనకనుంచీ చూసి చిన్న నవ్వు నవ్వింది.

◆◆◆

కొంతకాలం నర్సమ్మ కొత్త పెళ్ళికూతురు కనుక ఆమె అత్త ఆమెని ఇంటిపనేమీ ముట్టుకోనివ్వలేదు. తరువాత పని మొదలైంది. నర్సమ్మ పొద్దున్నే తొందరగా నిద్రలేచి ఇల్లుచిమ్మాలి. బాసన్లు తోమాలి. బట్టలు ఉతకాలి. ఇట్లా రోజంతా ఏవో పనులు చేస్తూనే వుండాలి. మల్లయ్య ఆ పిల్లను ఎంతో గారంగా పెంచాడు. నీళ్ళు తేవడం తప్ప మిగతా ఇంటిపనులేవీ చెయ్యనిచ్చేవాడుకాదు. ఇప్పుడాపిల్ల ఒక బరువైన ఇత్తడి కడవ నెత్తిన పెట్టుకుని బావినుంచీ నీళ్ళు మోసుకురావాలి. వారానికి రెండు సార్లు విసుర్రాయితో జొన్నపిండి విసరాలి.

ఒక్కొక్కసారి రోట్లో మిరపకాయలకారం నూరాల్సి వచ్చేది. అరచేతులు మంటపుట్టేవి. ఆ పిల్ల ఈడుకి మించిన పన్లు అవి. అరిచేతులు బొబ్బలెక్కి ఒక్కొక్కసారి ఏడ్చేది. ఆమె అత్తకు అమె పైన ఇసుమంత జాలిలేదు. చిన్నపిల్ల చేత ఇట్లా పనిచేయిస్తున్నందుకు నర్సయ్య అప్పుడప్పుడూ భార్యను కోప్పడుతూ వుండేవాడు. అప్పుడప్పుడూ కూతుర్ని చూడడానికొచ్చే మల్లయ్య కూడా ఏమీ అనలేకపోయేవాడు. ఇప్పుడు కూతురు ఆ యింటి మనిషి కదా! నిస్సహాయంగా వూరుకునేవాడు. నర్సయ్య

ఇంట్లో వున్నప్పుడే ఆ పిల్లకు కాస్త విశ్రాంతి. ఆమెను కొడుకు దగ్గరకు పంపించాలని నర్సయ్య నిశ్చయించుకున్నాడు. అప్పటికి ఆ పిల్ల వయస్సు పన్నెండు సంవత్సరాలు.

భార్యనీ, చెల్లెల్నీ వెంటబెట్టుకొచ్చిన తండ్రిని చూసి ఆశ్చర్యపడ్డాడు రామస్వామి.

'ఏందయ్యా?అనుకోకుంటొచ్చిన్రు ?' అన్నాడు భార్య చేతిలో పెట్టె అందుకుని

'ఏంలేదు బిడ్డా! ఎన్రోజులు ఒంటరిగుంటవు?' అన్నాడు నర్సయ్య నవ్వుతూ–కానీ రామస్వామికి ఆ నవ్వులో కొంత వెలితీ, గాంభీర్యం అర్థమయింది.

'అదిగాదయ్యా! ఈమెనెందుకు తీసుకొచ్చినవ్? మీకింట్ల ఎవరు అండిపెడతరు?' అన్నాడు భార్యవంక చూస్తూ రామస్వామి మళ్ళీ.

'మీ అమ్మకోసం పెండ్లి చేసుకున్నవా, బిడ్డా? అని గంభీరంగా 'ఈ పిల్లన్ జూడు దినమంతా ఇరాం లేకుంట పనిజేస్తది. మీ అమ్మ సంగద్దెలుసు గద! ఆమె బాగా సతాయిస్తది' అన్నాడు.

రామస్వామి మాట్లాడలేదు. అతనికి తన సవతితల్లి సంగతి తెలుసు. భార్యను చూస్తే జాలేసింది. ఆమె వంక చూశాడు. ఆ పిల్ల గదిలో ఒకమూల నిలబడి ఆడబిడ్డతో ముచ్చట్లాడుతోంది. తండ్రితో అట్లా అన్నాడే కానీ భార్య తనదగ్గర వుండడానికి రావడం అతనికి సంతోషం కలిగించింది. ఆడపిల్లలిద్దరూ ఇల్లు పరిశీలించారు. వంటగదిలో ఏం వున్నాయో చూశారు. కొత్త దంపతులకు అవసరమైనవన్నీ అమర్చడానికి రెండు మూడు రోజులున్నాడు నర్సయ్య. తరువాత కూతురు పెంటమ్మను అక్కడే వదిలి వెళ్ళిపోయాడు.

రామస్వామీ, నర్సమ్మా కొత్త జీవితం ప్రారంభించారు. రామస్వామి చెల్లెలికీ భార్యకీ ఊరు తిప్పి చూపించాడు. అంత వరకూ సిగ్గు పడిన నర్సమ్మ మొదట్లో భర్తా తనూ ఏకాంతంగా వున్నప్పుడు మాత్రమే అతనితో మాట్లాడేది. తరువాత పెంటమ్మ వున్నప్పుడుకూడా మాట్లాడడం మొదలుపెట్టింది. అత్తగారి నియంతృత్వం నుంచీ, అక్కడవుండే గొడ్డుచాకిరీ నుంచీ విముక్తి చెందిన నర్సమ్మకి ఇప్పుడు ఊరట లభించింది. ఇప్పుడు తమ ముగ్గురికీ వండుకుంటూ ఇల్లు చూసుకుంటూ హాయిగా వుంది.

ఒక సాయంత్రం పని నుంచీ వచ్చిన భర్త బాగా అలసిపోయివుండడం చూసి అతనికి లోటాతో మంచినీళ్ళిచ్చింది. రామస్వామి లోటా అందుకోకుండా ఆమె చెయ్యి అందుకుని ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. ఆమెకది తొలి కౌగలింత. విడిపించుకోడానికి ప్రయత్నించింది కాని అతను మరింత గట్టిగా అదుముకున్నాడు. అతని స్పర్శకి ఆమె శరీరం పులకరించింది.

ఆమెను గట్టిగా అదుముకుంటూ 'చెల్లెక్కడవోయింది?' అనడిగాడు.

అతన్నుంచీ విడిపించుకోడానికి పెనుగులాడుతూ 'పక్కింటికి వోయింది' అంది నర్సమ్మ.

అంతలోనే పెంటమ్మ వస్తున్న అలికిడి విని అతన్ని తోసేసి గదిలోనుంచీ అవతలికి పరిగెత్తిపోయింది.

అయినా అతని స్పర్శ ఆమెను వెన్నాడుతూనే వుంది. ఎలా మర్చిపోతుంది ఆ పులకరింత? లోపలగదిలోనుంచీ తన పెద్దపెద్ద కళ్ల కొసలనుంచీ అతన్ని చూసింది. అతని తెల్లటి మేని ఛాయని, నల్లటి జుట్టుని మొదటిసారి చూస్తున్నట్టు చూసింది. ఆతని కళ్ళు ఎంత ఆకర్షణీయంగా వున్నాయో అనుకుంది. చక్కని ఆకారంతో ధృఢంగా వున్న అతని శరీరాన్ని చూసింది. అతనికి బట్టలు వేసుకోడం మీదకూడా మంచి శ్రద్ధ వుంది. పని నుంచీ ఇంటికి రాగానే తెల్లని ధోవతి, దాని మీద మంచి చొక్కా వేసుకుంటాడు.

రాత్రి అన్నం తిన్నాక నర్సమ్మ గిన్నెలు తోముకుంటోంది. పెంటమ్మను త్వరగా నిద్రబుచ్చడానికి రామస్వామి చేసే ప్రయత్నాలన్నీ ఎప్పటికప్పుడు గమనిస్తూనే వుంది. చెల్లెలు నిద్రపోయిందని రూఢి చేసుకుని కిరోసిన్ దీపాన్ని నెమ్మదిగా ఊదేసి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు రామస్వామి.

మరునాడు పొద్దున ఎప్పటిలా నిద్రలేవలేకపోయింది నర్సమ్మ. తనలో ఏదో మార్పు వచ్చినట్లనిపించింది. రాత్రి అనుభవం ఆమెను పెరటిలోకి వెళ్లడానికి కూడా సందేహించేలా చేసింది. ఇంకా నిద్రపోతున్న మగని వంక ఒకసారి చూసి చీరె సర్దుకుని వాకిలి చిమ్మడానికి పోయింది. తనిప్పుడు అదివరకటి నర్సమ్మ కాదు. పొద్దున్నే పనికి వెళ్ళవలసిన రామస్వామి వంక వుండీ వుండీ చూస్తోంది. అతను సమయానికి నిద్రలేవక హడావిడిగా పరిగెత్తాడు. అతను పనికి వెళ్లబోయేముందు వాళ్ళిద్దరూ ఒకర్నొకరు విశ్వాసంతో చూసుకుని చిరునవ్వు నవ్వుకున్నారు.

రెండు నెలల తరువాత రామస్వామికి ప్రొమోషన్‌తో పాటు బదిలీ ఉత్తర్వులు కూడా వచ్చాయి. అతన్ని పాయింట్స్‌మన్‌గా ప్రమోట్ చేసి, సికిందరాబాద్ – వాడి సెక్షన్‌లోని ధారూర్ అనే స్టేషన్ కి మార్చారు. భార్య వస్తూనే తనకి అదృష్టం తెచ్చిందని మురిసిపోయాడు రామస్వామి. వారం రోజుల్లో వాళ్ళు ధారూర్ వెళ్ళిపోయారు.

◆◆◆

ధారూర్ చాలా చిన్న స్టేషన్. ఒకటే రైల్వే లైనూ, ఒక లూపు లైనూ వున్నాయి. స్టేషన్ దగ్గర్లోనే కొన్ని రైల్వే క్వార్టర్స్ వున్నాయి. రామస్వామి క్వార్టర్‌కి ఒక పక్కన శూద్రుడైన ఒక పాయింట్స్ మన్ కుటుంబం, మరొక పక్కన ఒక అస్పృశ్య కుటుంబం వున్నాయి. నర్సమ్మ అప్పుడప్పుడూ అస్పృశ్య కుటుంబంలోని పెద్దామె సలహా సంప్రతింపులు తీసుకునేది. రామస్వామికిప్పుడు చాలా బాధ్యతలు వచ్చాయి. బరువైన పెట్టెలు నెత్తిమీద పెట్టుకుని గార్డుల ఇళ్లచుట్టూ తిరిగే పని తప్పిపోయింది. వచ్చే పోయే రైళ్లకు సిగ్నల్ ఇవ్వడం, ఔటర్, హోమ్ సిగ్నళ్ల దీపాలు వెలిగించడం, స్టేషన్ మాస్టర్ ఇంట్లో చిల్లర పనులు చేసిపెట్టడం అతని పన్లు. ఈ పన్లు అతనికి తేలిగ్గా అనిపిస్తున్నాయి. పూర్వంలాగే

తీరిక చిక్కినప్పుడల్లా చదువుకుంటున్నాడు కూడా. అగ్రకుల యువకుడైన స్టేషన్ మాస్టర్‌కు రామస్వామి పుస్తకాలు చదవడం ఆశ్చర్యంగా వుండేది. నిరక్షరాస్యులైన తన క్రింది ఇతర ఉద్యోగులకన్న రామస్వామిని ప్రత్యేకంగా చూసేవాడు.

ఒకరోజు ఉదయం రామస్వామి పనిలోకి వెళ్లాడు. నర్సమ్మకి ఉన్నట్లుండి వాంతులు మొదలయ్యాయి. కడపునెప్పి వచ్చింది. నేలపైన ముడుచుకుని పడుకుని వుండిపోయింది. పెంటమ్మకు భయంవేసి పొరుగున వున్న పెద్దామెను పిలచుకొచ్చింది. ఆమె నర్సమ్మను పరిశీలనగా చూసి చిరునవ్వు నవ్వుతూ, 'భయపడొద్దు బిడ్డా! గట్నేఉంటది' అన్నది.

'నీళ్ళుగూడ ఇముడుతలేవు, అంత గక్కుంటున్న' అంది నర్సమ్మ. నిస్త్రాణగా

'బయపడకు బిడ్డా! గంజిపంపిస్త, తాగు. కక్కున్నా రంధిలేదు. నువ్వు నెలతప్పినవ్ బిడ్డా!' అంది ఆమె.

రామస్వామి ఇంటికి రాగానే పెంటమ్మ పరిగెత్తుకుంటూ పోయి 'అన్నా! ఒదినె గక్కుంటున్నది. పొట్టతోనున్నదంట' అని చెప్పింది.

మెరిసేకళ్లతో భార్యవంక చూశాడు రామస్వామి. అతన్ని చూసి ఆమె సిగ్గుతో చిరునవ్వు నవ్వింది. ఇప్పుడతను ఎక్కువ సమయం ఆమెతోనే గడుపుతున్నాడు. ఆమెకు తాజా కల్లు తెచ్చి ఇస్తున్నాడు. ఆమెకు వాంతికాకుండా ఇముడుతున్న కొన్నింటితో పాటు అదికూడా ఒకటి.

వార్త విన్నవెంటనే మల్లయ్య కూతురికోసం పిండివంటలతోపాటు తాజా వేరు శెనక్కాయలు, జొన్నలు, మరికొన్ని ధాన్యాలు మూటగట్టుకొచ్చాడు. తాత అవబోతున్నందుకు అతనికి చాలా సంతోషంగావుంది. నరసమ్మ అతన్ని చూసి తబ్బిబ్బయిపోయి అతని గుండెమీద వాలిపోయింది. ఆనందంతో ఆ తండ్రి కళ్ళు చెమ్మగిల్లాయి. అయితే తండ్రి ఎన్ని తిను బండారాలు తెచ్చినా ఆమెకు గంజీ, తాజాకల్లూ తప్ప ఏదీ కడుపులోకి పోవడం లేదు. నూనె వాసన చూస్తేనే కడుపులో తెమలుతోంది. అందుకని ఇప్పుడు రామస్వామే వంట చేస్తున్నాడు.

◆◆◆

నర్సమ్మకి అయిదోనెల రాగానే రామస్వామినీ పెంటమ్మనీ విడిచి పుట్టింటికి వెళ్ళింది. కూతుర్ని వీలైనంత జాగ్రత్తగా చూసుకోవాలనుకున్న మల్లయ్య, ఆ పిల్లను చూసుకోడానికి తన అక్కను పిలిపించాడు. నర్సమ్మను క్రమం తప్పకుండా చూసి పోతూ వుండడానికి తమ కులపు మంత్రసానిని కూడా ఏర్పాటు చేశాడు. నర్సమ్మ చెల్లెళ్లు కూడా ఆమెను జాగ్రత్తగా చూసుకుంటున్నారు.

ఇప్పుడు వంటరిగా వుంటున్న రామస్వామి తరుచూ దోస్తులతో కలిసి కల్లు దుకాణానికి పోతున్నాడు. మొదట్లో సెలవొచ్చినప్పుడల్లా భార్యను చూడ్డానికి పోయేవాడు. తరువాత కొంత తగ్గించాడు.

నరసమ్మకు నెలలు నిండుతున్నకొద్దీ కాళ్ల వాపులు వస్తున్నాయి. ప్రసవ సమయం దగ్గరపడ్డకొద్దీ మల్లయ్యకి ఆందోళన ఎక్కువైంది. ఒక సాయంత్రం ఆమెకు నొప్పులు మొదలయ్యాయి. నరసమ్మ బాధతో అరుస్తోంది. మంత్రసానిని పిలిచారు. ఆమె నర్సమ్మను పరీక్షచేసింది. నర్సమ్మకు కాన్పు కాబోతోందని చెప్పింది. వేడినీళ్ళు సిద్ధంచెయ్యమని చెప్పి తన కొడవలికి పదును పెట్టుకుంది. ఈ కొడవలి తోనే ఆమె అనేకమంది శిశువుల బొడ్డు కోసింది. నర్సమ్మ మేనత్త పెద్ద కుండతో నీళ్ళు కాచింది. నర్సమ్మను బలంగా బిడ్డను బయటకు నెట్టమని చెప్పింది మంత్రసాని. కానీ నర్సమ్మ బాధతో లుంగలు చుట్టుకుపోతోంది. బిడ్డ బయటపడుతున్న కొద్దీ నర్సమ్మ కేకలు ఎక్కువయ్యాయి. మంత్రసాని బిడ్డని బయటకు లాగి, బొడ్డుకోసింది. బిడ్డ ఏడుపు అందరికీ వినపడింది. మాయను ఒక చిన్నకుండలో పెట్టి ఇంటిబయట ఒకమూల పాతిపెట్టారు. బిడ్డను ఒక బట్టలో చుట్టి తీసుకొస్తూ 'మల్లన్నా! నీబిడ్డెకు మొగపిలగాడు పుట్టిండు – బాగున్నడు' అన్నది మంత్రసాని.

సంతోషంతో ఉప్పొంగిపోయిన మల్లయ్య తన జేబులోనుంచీ కొంత చిల్లర తీసి ఆమె చేతిలో పెట్టాడు. తనమొదటి మనుమడు వాడు.

బిడ్డ పుట్టి పదకొండు రోజులైంది. ఆచారం ప్రకారం ఇప్పటిదాకా తల్లీ బిడ్డల్ని అందరికీ దూరంగా వుంచారు. ఇంక ఆరోజు బాలింతకు స్నానం చేయించి కొత్త బట్టలు కట్టిస్తారు. ఆమె చేత నీళ్లబావికి పూజ చేయిస్తారు. ఆ తరువాత ఆమె ఇంట్లో తిరగవచ్చు. వంటింట్లో గిన్నెలవీ ముట్టుకోవచ్చు. పసిబిడ్డకు కూడా స్నానం చేయించి కొత్తబట్టలు తొడుగుతారు. దానితరువాత దిష్టి తగలకుండా మరో వేడుక వుంటుంది. ఆపైన అతిథులకు కల్లూ విందూ వుంటాయి. ఈ వేడుకలకు నర్సయ్యా రామక్కా, రామస్వామీ వచ్చారు. మనుమడ్ని ఎత్తుకుని మురిసిపోయాడు నర్సయ్య. అతనికి కూడా వాడు మొదటి మనుమడే. తండ్రిలాగే తెల్లగా వున్నాడు పిల్లవాడు. పిల్లవాడి నుదుటిమీద పెద్ద కాటుక బొట్టు, రెండు అరచేతుల్లోనూ అరికాళ్లల్లోనూ చిన్న చిన్న కాటుకబొట్లు, బుగ్గన చుక్కా అతని వంటిరంగుమీద కొట్టొచ్చినట్లు కనపడుతున్నాయి.

'నర్సమ్మను మూన్నెల్లయినంక పంపుత బావా! పెయి పచ్చిగున్నదికద!' అన్నాడు మల్లయ్య.

'మంచిది బావ! నువ్వు చెప్పింది నిజమే!' అన్నాడు నర్సయ్య మనవడిని చూసుకుంటూ.

◆◆◆

తరువాత మూడు నెలలవరకూ రామస్వామి ఒంటరిగానే వున్నాడు. ఇప్పుడతను ఎక్కువగా తాగుతున్నాడు. ఒక్కక్కసారి దోస్తులతో కలిసి ఎక్కువగా కూడా తాగుతున్నాడు. అతను తరచూ రిలీవర్‌గా వేరే స్టేషన్లకు పోవలసి వస్తూవుంటుంది. ఒక్కొక్క నెలలో

పదిహేను రోజులపాటు కూడా అట్లా పోవలసి వస్తుంది. అప్పుడతనికి అదనంగా డబ్బు ముట్టేది. ఆ డబ్బంతా దోస్తుల కోసం ఖర్చుచేసేవాడు. ఇప్పుడు చదవడం కూడా మానేశాడు. రామస్వామిని తరుచూ మర్పల్లి అనే స్టేషనుకు రిలీవర్‌గా పంపేవారు. అక్కడతనికి రైల్వే షెడ్‌లో కూలీగా పనిచేసే మొగులప్పతో స్నేహం అయింది. మొగులప్ప రామస్వామితో కలిసి తాగినాక తనయింటికి భోజనానికి పిలిచేవాడు. త్వరలోనే ఇట్లా పిలవడం మామూలైపోయింది. మొగులప్పకి ఇద్దరు సోదరులు, ఒక చెల్లి. ఆమె పేరు లక్ష్మమ్మ. లక్ష్మమ్మకు భర్తతో విడాకులై పోయినయ్. ఆమెవి పెద్ద కళ్ళు. తీరైన ముక్కు. తెల్లగా నాజూగ్గా వుంటుంది. అన్న ఇంట్లో వున్నా, పొలం పనులకి పోతూవుంటుంది. లక్ష్మమ్మ భర్త పెళ్ళి అయిన కొద్దిరోజులకే ఆమెని విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. రెండేళ్ళపాటు అతనికోసం వెతికి వేసారి మొగులప్ప కులపోళ్ళతో మాట్లాడాడు. వాళ్ళు ఆమెకు విడాకులైనట్లు ప్రకటించారు. అప్పటినుంచీ ఆమెకు మళ్ళీ పెళ్ళిచేయడానికి ఒక మంచి పిల్లవాడికోసం చూస్తున్నాడు మొగులప్ప. లక్ష్మమ్మ అందంగా ఆకర్షణీయంగా వుండడం వల్ల ఆమెను పెళ్ళిచేసుకోడానికి చాలామందే ముందుకొచ్చారు. అయితే లక్ష్మమ్మకు రామస్వామిమీద మనసు కలుగసాగింది. అతను తినడానికి వచ్చినప్పుడు ప్రత్యేకమైన వంటలు చెయ్యడం, అతని దృష్టిలో పడడానికి ప్రయత్నించడం మొదలుపెట్టింది. అన్నం పెట్టేటప్పుడు మాట కలిపేది. రామస్వామి రూపం వ్యక్తిత్వం ఆమెను బాగా ఆకర్షించాయి. అన్నను చూసే మిషతో అప్పుడప్పుడూ స్టేషన్‌కి పోతూవుండేది. రామస్వామికి కూడా ఆమెపై ఆసక్తి కలుగసాగింది. వాళ్ళిద్దరూ రహస్యంగా కలుసుకోడం మొదలుపెట్టారు. ఇంట్లో ఎవరూ లేనప్పుడు అతన్ని మధ్యాహ్న భోజనానికి పిల్చేది లక్ష్మమ్మ. వాళ్లమధ్య స్నేహం పెరిగింది. నెలలో పదిహేను రోజులు ఎక్కువ సమయాన్ని కలిసి గడిపేవాళ్ళు వాళ్ళిద్దరూ. మిగతా పదిహేను రోజులు గడవడం కష్టంగా వుండేది లక్ష్మమ్మకు.

వీళ్ళ సంగతి కొందరు యువకులు కనిపెట్టారు. ముఖ్యంగా లక్ష్మమ్మను చేసుకోవాలని ఆశపడ్డ యువకులు. రామస్వామి లక్ష్మమ్మల వ్యవహారాన్ని ఆపమని, లేకపోతే అతని కుటుంబానికి చెడ్డపేరొస్తుందనీ మొగులప్పను హెచ్చరించారువాళ్ళు. మొగులప్పకిది విద్యుద్ఘాతమే అయింది. అందుకని అతను రామస్వామిని తప్పించుకు తిరగడం మొదలుపెట్టాడు.

'రామస్వామిని గల్వడం బంజెయ్యి కులపాళ్ళు గుసగుసలాడుకుంటున్నరు' అని చెల్లెల్ని గట్టిగా కేకలేశాడు మొగులప్ప.

అతని కంఠంలో కాఠిన్యానికీ, నిశ్చయానికీ భయపడింది లక్ష్మమ్మ. అన్న కళ్ళల్లోకి సూటిగా చూసే ధైర్యంలేక తల వంచుకునే 'ఆయన లేకుండ బతకలేనన్నా' అని కంట నీరు పెట్టింది.

'ఆయినకు లగ్గమైందిగద! నువ్వెట్లతిరుగుతవు ఆయాన్తోని'? అని ఆమెకు నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. కానీ ఆమె ఆపశక్యంగానంతగా ఏడవడం

మొదలుపెట్టింది. ఇంక ఆమెను సముదాయించడం అతని వల్ల కాలేదు. త్వరగా ఆమెకు పెండ్లి చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

రామస్వామి ధారూర్ స్టేషన్లో డ్యూటిలో వున్నాడు. అప్పుడే ప్లాట్ ఫామ్ మీదకు రైలు వచ్చింది. ఒకమ్మాయి రైలు దిగడం అతని కంట పడింది. ఆమె ఎవరో కాదు లక్ష్మమ్మే! అతను ఉలిక్కిపడ్డాడు. ఆమె అట్లా వస్తుందని అతనెప్పుడూ అనుకోలేదు. పమిటకొంగుతో మొహం కప్పుకుని ఆమె స్టేషన్ నలుదిక్కులా రామస్వామి కోసం చూసింది. అతను తన వైపే పరిగెత్తుకొస్తున్నాడు. తమని ఎవరూ గమనించలేదని ఖాయపరుచుకుని ఆమెను స్టేషన్ బయట ఎవరికీ కనపడని మూలకు దాదాపు లాక్కుపోతున్నట్టే తీసుకుపోయాడు.

'ఎందుకొచ్చినవ్ ఇక్కడికి? మాస్టర్ జూస్తే నా నౌకరి పోతది' అన్నాడు కంగారుపడుతూ లక్ష్మమ్మ మొహం కన్నీళ్ళతో తడిసిపోయింది.

'మా అన్న నాకు లగ్గం జేస్తనంటుండు, నువ్వులేకుండ బతకలేను, రామప్పా!' అన్నది.

రామప్ప ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాడు.

'చూడు లచ్చమ్మా! మనిద్దరిని గిట్లజూస్తే మాస్టర్ నానౌకరి తీసేస్తడు. ఇంకెప్పుడు ఇక్కడ రాకు. వచ్చె నెలలొ నేను మర్పల్లి వచ్చినప్పుడు మీయన్నతో మాట్లాడత, ఫికర్ జెయ్యకు' అని ఆమెను చెట్ల గుబురు మధ్య కూచోబెట్టి సముదాయించి పంపించాడు.

లక్ష్మమ్మ కళ్ళు తుడుచుకుని చిరునవ్వు నవ్వుతూ 'నిన్నుదప్ప ఇంకెవరిని పెండ్లి చేసుకోను. లేకుంటే ప్రాణం దీసుకుంట' అన్నది.

మరుసటి రైలుకు ఆమెను తిరిగి ఇంటికి పంపించాడు రామస్వామి.

◆◆◆

నర్సమ్మ ఆరునెలల తరువాత బిడ్డను తీసుకుని తన ఇంటికి వచ్చింది. అట్లా వచ్చిన నర్సమ్మకు రామస్వామిలో చాలా మార్పులు కనిపించాయి. తీరిక సమయాల్లో పుస్తకాలు చదవడానికి బదులు ఇప్పుడు అతను దోస్తులతో కలిసి తరుచూ కల్లుదుకాణానికి పోతున్నాడు. పూర్వంలాగా కాక ఇప్పుడు ఎక్కువ చిరాకు పడుతున్నాడు. దీనికంతకూ కారణం తను చాన్నాళ్ళు ఇంట్లో లేకపోవడమే అనుకుంది నర్సమ్మ. ఆమె ఇక్కడికి వచ్చేటప్పుడు తనకు తోడుగా రామస్వామి తమ్ముడు ఎల్లయ్యను తెచ్చుకుంది. నెలలో సగం రోజులు రామస్వామి ఊళ్ళో వుండడు కదా! ఎల్లయ్య తన అన్న దగ్గర అదివరకే చదవనూ వ్రాయనూ నేర్చుకుని వున్నాడు. ఇప్పుడు రామస్వామి చదవకుండా మూల పడేసిన పుస్తకాలు తీసి చదువుతున్నాడు. రైల్వేలో బాక్స్‌మ్యాన్‌గా చేరినప్పుడే రామస్వామికి చదువు ప్రాముఖ్యత అర్థమైంది. రైల్వేలో ఉన్నతాధికారులూ, అగ్రకులస్థులైన ఉద్యోగుల

జీవనశైలి చూశాక తన తమ్ముడికి ఇంగ్లీష్ రావాలని కోరుకున్నాడు. ఇంగ్లీష్ వస్తే తమ్ముడికి మంచి ఉద్యోగం వస్తుందనుకున్నాడు. ఎల్లయ్యను స్టేషన్ మాస్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాడు. స్టేషన్ మాస్టర్‌కు రామస్వామి అంటే ఇష్టం. ఎల్లయ్య మాస్టర్ గారి వరండాలో కూర్చుని పలకమీద ఇంగ్లీష్ అక్షరాలు వ్రాయడం నేర్చుకున్నాడు. అతని ఆసక్తి ఉత్సాహం చూసి స్టేషన్ మాస్టర్‌కి కూడా అతనికి ఇంగ్లీష్ నేర్పాలని ఉత్సాహంగా వుండేది. ఎల్లయ్య సులవుగానే నేర్చుకునేవాడు. కొద్ది నెలలకే అతనికి చిన్న చిన్న మాటలూ వాక్యాలూ వ్రాయడం వచ్చేసింది. ఆ కుటుంబంలో ఇంగ్లీష్ నేర్చుకునే మొదటి ప్రయత్నం అది. మరింత మెరుగైన జీవితంకోసం చేసిన మరో ప్రయత్నం.

నర్సమ్మ త్వరలోనే రెండవసారి గర్భవతైంది. కానీ అప్పుడు పుట్టిన పిల్లవాడు వెంటనే చనిపోయాడు.

రామస్వామి తనను వేరే స్టేషన్లకు పంపమని అడుగుతూ మర్పల్లి పోవడం తప్పించుకుంటున్నాడు. కానీ అతని అభ్యర్థన ప్రతిసారీ అంగీకరించడం లేదు రైల్వేవాళ్ళు. అతను మర్పల్లికి పోక తప్పడం లేదు. లక్ష్మమ్మ తనను పెళ్ళిచేసుకోమని అతడిని ఒత్తిడి చేస్తోంది.

నర్సమ్మ మూడో సారి గర్భవతైంది. ఈ సారి మరింత జాగ్రత్త తీసుకోమని మల్లయ్య ఆమెను హెచ్చరించాడు. అందుకే మొదటిసారి ఆమెకు గర్భం వచ్చినప్పుడు ఎంత జాగ్రతగా చూసుకున్నాడో అంత జాగ్రత్తగానూ చూసుకోడం కోసం ఆమెకు అయిదవనెల రాగానే పుట్టింటికి తీసుకొచ్చాడు. రామస్వామి తమ్ముడిని తండ్రి దగ్గరకు పంపేసి మళ్ళీ ఒంటరిగా వున్నాడు.

◆◆◆

'నువ్వు చాలా అదృష్టవంతుడివి నీకు సికిందరాబాద్‌లో రిలీవింగ్ డ్యూటీ వచ్చింది, తాత్కాలిక బదిలీ లాంటిది' అని గట్టిగా అరిచి చెప్పాడు స్టేషన్‌మాస్టర్ రామస్వామిని చూస్తూనే.

'అంతపెద్ద స్టేషన్ల నేను పనిచేస్తనా సార్? రామస్వామి ఆశ్చర్యంగా చూశాడు ఆయనవైపు.

'నువ్వు చెయ్యగలవని నాకుతెలుసు. ఏంఫికర్ చెయ్యకు. చదువుకున్నోనివికదా!' అన్నాడాయన సంతోషంగా.

తండ్రితో వుండి పని నేర్చుకోవచ్చని సంతోషపడ్డాడు రామస్వామి కూడా. ఇంక లక్ష్మమ్మని చూడ్డం పడదని అతనికి దిగులేసింది. సికిందరాబాద్ వెళ్ళేలోగా ఆమెనొక సారి కలవాలని నిశ్చయించుకున్నాడు. తన వారాంతపు సెలవులో ఆ పని చెయ్యాలనుకున్నాడు.

తెల్లని ధోవతి, అంతే తెల్లని చొక్కా వేసుకుని దానిపైన నీలంరంగు బ్లేజర్ వేసుకుని చక్కగా తయారై మర్పల్లి స్టేషన్ లో రైలు దిగాడు. అతన్ని చూసి మొగులప్ప ఆశ్చర్య పోయాడు.

'సోగ్గ తయారై వచ్చినవ్! పెండ్లికేమైన వచ్చినవా?' అన్నాడు.

'లేదు మిమ్మలని జూద్దామని వచ్చిన'.

వాళ్లిద్దరూ కల్లుదుకాణంలో కూర్చున్నారు. అంతలో మొగులప్ప గంభీరంగా 'మాచెల్లెను ఇట్ల కలవడం బాగాలేదు బావా! లోకానికి మీసంగతి తెలిసిపోయింది' అన్నాడు.

'నువ్వేం ఫికర్ చెయ్యకు బావా!' అన్నాడు రామస్వామి విషయాన్ని తేలిగ్గా తీసుకుంటూ.

'మీ సంగతి జూసిన పెద్దమనుషులు మమ్ములను కులంల ఉండనియ్యద్దంటున్నరు మా చెల్లె నిన్నుదప్ప ఎవరిని పెండ్లి జేసుకోనంటుంది. నాకు చాలా ఫికరైతాంది. మరి నువ్వే ఆలోశన జెయ్యి' అన్నాడు. మొగులప్ప రామస్వామి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

'నువ్వేం ఫికర్ చెయ్యకు. డ్యూటీ మీద సికిందరాబాద్ పోతాన్న. ఒచ్చినంక మీచెల్లె చెప్పినట్టే జేస్త'.

ఈ మాటలకు మొగలప్ప కాస్త స్థిమితపడ్డాడు.

వాళ్ళు తాగడం పూర్తి అయిందో లేదో లక్ష్మమ్మ రొప్పుకుంటూ వచ్చింది. అక్కడికి. రామస్వామిని చూసి చకితురాలైంది.

'ఎప్పుడొచ్చినవ్?' రామస్వామి వంక ఆశ్చర్యంగా చూసింది లక్ష్మమ్మ. విరబోసిన ఆమె నల్లని జుట్టు చెమటకు అతుక్కుని మొహానికి మరింత వన్నె తెచ్చింది.

వాళ్లిద్దర్నీ ఒంటరిగా వదిలిపెట్టి మొగులప్ప స్టేషన్ వైపు వెళ్ళిపోయాడు.

'వచ్చె వారం రావాలెగదా?ఇప్పుడేందుకచ్చినవ్?' అన్నది.

'ఇయ్యాల నాకు డ్యూటీలేదు. ఇంక మర్పల్లి ఇప్పుడప్పుడే రాను. అందుకె అచ్చిన'

'ఎందుకు',

'సికిందరాబాద్ పోవాలె డ్యూటీ మీద',

'గట్లనా? తప్పదంటవా?'

'ఫికర్ జెయ్యకు వచ్చేనెల మల్లొస్త'.

మధ్యాహ్నం. బాగా ఎండ కాస్తోంది. వాళ్ళిద్దరూ మొగులప్ప ఇంట్లో బాగా దగ్గరగా కూచున్నారు. లక్ష్మమ్మ అందమైన కళ్లనిండా దిగులు.

'అప్పా! మన సుద్ది అందర్కి తెలిసింది. జల్ది ఏదన్నోటి చెయ్యి' అన్నది.

'నువ్వేం ఫికర్ చెయ్యకు. గిప్పుడే మీ అన్నతో మాట్లాడిన' అన్నాడు రామస్వామి ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

ఒకరిపై ఒకరికున్న ఇష్టంతో, మోహంతో వాళ్లు తమను తాము నిగ్రహించుకో లేకపోయారు.

అలసి సొలసి చలన రహితంగా కూర్చుండిపోయారు. ఉన్నట్లుండి వినపడిన అలికిడికి తనని తాను కూడదీసుకుంది లక్ష్మమ్మ. 'ఏదైన జరక్కముందే జల్ది నన్ను పెండ్లి జేస్కో. మనం ఇట్ల కలుసుడు బంజెయ్యాలి' అంది చీరె సరిచేసుకుంటూ.

◆◆◆

సికిందరాబాద్‌లో రైల్వేయార్డ్ చాల పెద్దది. చాలా మార్గాలున్నాయి దానికి. రామస్వామికిది చాలా కొత్తగావుంది. మొదటిరోజు అతకవలసిన బోగీలమధ్య నిలబడడానికే భయం వేసింది. మొదటి రోజు తండ్రి అతనికి ఆ నైపుణ్యం దగ్గరుండి నేర్పించాడు. పాయింట్స్ మన్‌ల పై పర్యవేక్షణ చేసే ముఖద్దమ్ ను తన కొడుక్కి సాయం చేయమని అభ్యర్థించాడు కూడా. మూడు నాలుగు రోజులలోనే ఆపనిలో ఆరితేరాడు రామస్వామి. మంచి నైపుణ్యం సంపాదించాడు. అతనికి కొత్త స్నేహితులు దొరికారు. అందరూ సాయంత్రం తాగడానికి కలిసేవారు. అతను బాగా ఘాటైన మద్యం రుచి మరిగాడు.

రామస్వామి జీవితంలో ఒక దురదృష్టపు ఘడియ వచ్చి అతన్ని ఒక దొంగతనం కేసులో ఇరికించింది. ఒక వ్యాగన్‌లో వచ్చిన మద్యం పెట్టెలలోనుంచీ అతని స్నేహితుడొకరు ఒక సీసా దొంగిలించాడు. రామస్వామి అప్పుడు అతని పక్కనే నిలబడి వున్నాడు. దొంగని పట్టుకున్నారు. అతని తప్పేం లేకపోయినా రామస్వామిని కూడా విచారణ కోసం తీసుకుపోయారు. ఆ సంగతి తెలిసిన నర్సయ్య పోలీస్ స్టేషన్‌కి పరుగెత్తుకుంటూ పోయాడు. తన కొడుకుని విడిచిపెట్టమని ఇన్స్‌పెక్టర్ కాళ్లమీద పడి బ్రతిమిలాడాడు. నర్సయ్య మీద సదభిప్రాయం వున్న కొందరు రైల్వే అధికారులు కూడా అతని కొడుకుని విడిచిపెట్టమని అడిగారు. కానీ దొంగతనం అనేది చాలా తీవ్రమైన నేరం కనుక రామస్వామిని ఉద్యోగం నుంచీ బర్తరఫ్ చేశారు. కొడుకు ఉద్యోగం పోయినందుకు విచారపడ్డా, అతన్ని జైలుకి పంపనందుకు సంతోషించాడు నర్సయ్య.

'ఫికర్ జెయ్యకు బిడ్డా! రేపు మనం ఫ్రాంక్లిన్ సార్‌ను కలుద్దాం. ఆయన మనకు సాయంజేస్తడు' అన్నాడు. ఇంటికొచ్చేటప్పుడు కొడుకుతో నర్సయ్య.

రామస్వామి మౌనంగా వుండిపోయాడు. అతనికి నౌకరీ పోయింది. అంతకన్నా విచారకరమైన విషయం తను తండ్రికి బాధ కలిగించడం. చెడ్డస్నేహాలు చేసినందుకు తనను తనే తిట్టుకున్నాడు. చాలా ఆవేదన చెందాడు. తన మామగారికి మొహం చూపించడం ఎట్లా? త్వరలో మరొక బిడ్డను కనబోయే తన భార్యని కలవడం ఎట్లా ? ఉద్యోగం లేకుండా బ్రతకడం ఎట్లా ?నర్సయ్య అతన్ని ఊరడించడానికి ప్రయత్నించాడు.

వాళ్లు ఇంటికి చేరేసరికే ఈ వార్త అతని సవతి తల్లికి తెలిసిపోయింది.

'రా బిడ్డా! మంచిపని జేసినవ్! నిన్నూ నీపెండ్లాన్ని మీ అయ్య సాత్తడు' రామస్వామి గుమ్మంలో అడుగుపెడుతూండగానే విరుచుకుపడింది రామక్క.

'నోర్మూయ్ ! అవును నాబిడ్డెను నేన్ సాత్త' అని నరసయ్య కూడా కోపంతో గట్టిగా అరిచాడు.

అతను అంతకోపంగా వుండడంతో రామక్క నోరుమూసుకుంది. జరిగింది మర్చి పొమ్మనీ. మళ్ళీ అతనికి నౌకరీ వచ్చేలా చేస్తాననీ కొడుక్కి అనేక విధాల నచ్చచెప్పాడు నర్సయ్య.

ఆ మరునాడు నర్సయ్య రామస్వామిని ఫ్రాంక్లిన్ సార్ దగ్గరకు తీసుకు వెళ్ళాడు. ఉన్నతాధికారులను చూడబోయేటప్పుడు విధిగా ధరించవలసిన యూనిఫామ్ వేసుకుని తలపాగా చుట్టుకున్నాడు. ఆఫీస్ వరండా మెట్లెక్కుతుంటే అతని మనసునిండా అలజడి. మిస్టర్ ఫ్రాక్లిన్ యువ బ్రిటిష్ ఆఫీసర్. అతను నాలుగవ తరగతి ఉద్యోగులను బాగా చూసుకునేవాడు. అవసరం వచ్చినప్పుడు అడిగిన సాయం చేసేవాడు. ఇతర స్థాయి ఉద్యోగుల కంటే నాలుగవ తరగతి ఉద్యోగులే అతని ఆఫీస్‌లో ఎక్కువ కనపడేవారు. రామస్వామి ఒక మూల తలవంచుకుని నిలబడ్డాడు. వార్త వినంగానే బయల్దేరి వచ్చిన అతని మామ మల్లయ్య అతని పక్కనే నిలబడ్డాడు. ఆఫీసర్ దగ్గర నుంచీ వాళ్లకు పిలుపు రాగానే పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆయన కాళ్లమీద పడ్డాడు నర్సయ్య.

'ఏయ్, ఏంజేస్తున్నవ్? ఏంసంగతి?' అని కేకలేశాడు ఫ్రాంక్లిన్.

'నాబిడ్డకేం తెలువది. ఆన్ని మాఫ్ జెయ్యి సార్ 'నర్సయ్య దుఃఖించాడు.

'అసల్ సంగతేంది చెప్పు' అన్నాడు ఆయన అసహనంగా

'ఇయ్యాల నాబిడ్డను నౌకర్లనుంచి తీసేసింగ్రు దొరా'

'ఓ! ఆయనా! ఆయన పేరేంది?'

'రామస్వామి సార్! వాడు నా కొడుకు'

'ఔను గుర్తొచ్చింది. కని ఆడు మాఫ్ జెయ్యనసొంటి తప్పు జేసిండు. ఇంక నయం వాడు జేలుకు వోలేదు'.

' దొర! నీ బాంచెన్! ఆన్కి పెండ్లం పిల్లలున్నరు. నౌకరి వోతె ఆగమైతడు. ఆన్కి మీరే నౌకరి ఇచ్చిగ్రు'

'వాడిని లోపలికి రమ్మన్' అని రామస్వామి వైపు తిరిగి 'ఏమైందిరానీకు ? మీ నాయిన ఎంత మంచోడు ! ఎందుకు కష్టపెడుతున్నవు? నీకిక్కడ నౌకరి లేదు పో !' అని అరిచాడు.

నర్సయ్య కొడుకుని బయటకుపొమ్మని సౌంజ్ఞ చేశాడు. మళ్ళీ ఏడుస్తూ ఫ్రాంక్లిన్ కాళ్ల మీద పడ్డాడు.

'నువ్వే మా దేవునివి సార్ ! ఆనిమీద కనికరం జూపియ్యి వాడు దొంగతనంజెయ్యలేదు. దొంగతనం జర్గెటప్పుడు పక్కకున్నడు అన్నాడు'.

'లే నర్సయ్యా! నువ్వు చెప్పింది నిజంకావచ్చు కాని ఇది సీరియస్ కేసు' అన్నాడు ఫ్రాంక్లిన్.

నర్సయ్య బ్రతుమిలాడుతున్నట్లు మళ్ళీ ఫ్రాక్లిన్ వంక చూశాడు.

'అయితే నెలరోజులదాకా వాడిక్కడ ఎక్కడ కనపడొద్దు. తర్వాత వాన్ని తీస్కరా! నేనెట్ల సాయం జేయాల్నో జూస్త' అన్నాడు.

నర్సయ్య ఆఫీస్‌లో నుంచీ బయటికొచ్చే సరికి అతనేంచెబుతాడో అని ఆత్రంగా ఎదురుచూస్తున్నారు రామస్వామీ అతని మామ మల్లయ్య,

'ఫికర్ జెయ్యకు బావా! ఒకనెలైనంక కలువమన్నడు అప్పటిదాక రామస్వామి ఇక్కడెక్కడ కండ్లపడొద్దని చెప్పిండు' అన్నాడు నర్సయ్య.

వాళ్ళు భారం తీరినట్లు నిట్టూర్చి బయటపడ్డారు. నర్సయ్య రామస్వామిని తన మేనమామల దగ్గరకు జనగాం పంపించాడు. రైల్వేవారి కంటపడొద్దని హెచ్చరించాడు.

◆◆◆

నర్సమ్మకు మూడో కాన్పులో మళ్ళీ కొడుకు పుట్టాడు. పిల్లవాడు ఆరోగ్యంగా వున్నాడు. అయితే ఈ సారి ఆ కుటుంబంలో అంతగా సంతోషంలేదు. రామస్వామి వచ్చి కొడుకుని చూసి వెళ్ళాడు కానీ అతను అమితమైన ఒత్తిడిలో వున్నాడు. అతనంత విచారంగానూ నిరాసక్తం గానూ వుండడం చూసి నర్సమ్మ బాధ పడింది. రామస్వామికి అది కష్టకాలం. నౌకరీ పోవడమే కాక ఎవరికీ కనపడకుండా అజ్ఞాతంలో వుండవలసిరావడం మిక్కిలి వేదన కలిగిస్తోంది అతనికి. ఎక్కడికీ వెళ్ళకుండా ఇంటికి అతుక్కుని వుండడం దయనీయంగా వుంది. పుస్తకాలు చదువుకుంటూ కాలం గడుపుతున్నాడు.

ఒక నెల తరువాత ఫ్రాంక్లిన్ సార్ ఆఫీస్ బయట నిలబడి ఆత్రుతగా నిరీక్షిస్తున్నాడు రామస్వామి. అతని తండ్రి నర్సయ్య ఆఫీస్ లోపలికి వెళ్ళి వున్నాడు.

'నీ మొకం చూసి మీ వోన్కి నౌకరియ్యాలని ధైర్యం జేస్తున్న నర్సయ్యా!' అన్నాడు ఫ్రాంక్లిన్ సార్.

'నీ గులాపోన్ని దొరా !' అన్నాడు నర్సయ్య అతని కాళ్లమీద పడుతూ,

'కని. పేరు మార్వాలె. పాత పేరుమీద నౌకరిలో పెట్టొద్దు'.

'అయితే పేరు మార్వాల్నా సార్!'

'అయితె జెప్పు ఏంపేరు రాయమంటవ్?'

'బాలయ్య అంకుస్ అని రాయండ్రి సార్'

'అయితే ఆన్ని పిలువ్' !

రామస్వామి వచ్చి తలవంచుకుని నిలబడ్డాడు. నర్సయ్య అతన్ని ఫ్రాంక్లిన్ సార్ కాళ్ళు మొక్కమని సౌంజ్ఞ చేశాడు.

'నిన్ను మల్ల నౌకరిల తీసుకుంటున్న జాగర్తగ పనిజేసుకోవాలె ఈసారి మల్లేమన్న తప్పుజేస్తే నౌకరుండదు' అన్నాడు ఫ్రాంక్లిన్.

'తప్పుజెయ్యనని ఒట్టేసుకుంటున్న సార్!' అన్నాడు రామస్వామి.

ఆనాటి నుంచీ అతను బాలయ్యగా మారిపోయాడు. కొత్త జీవితం ప్రారంబించినట్లే అయింది. కొత్త పేరు బాలయ్య అంకుస్. అంకుస్ అనే తండ్రిపేరు కల్పించి పెట్టారు. ఇంక తన నుంచీ తండ్రికి ఎటువంటి కష్టమూ దుఃఖమూ కలుగనీయకూడదని గట్టిగా నిశ్చయించు కున్నాడు బాలయ్య. నౌకరీ పోయినదానికన్న తండ్రిని బాధపెట్టినందుకు ఎక్కువ చింతించాడతను.

బాలయ్యగా అతను మళ్ళీ నౌకరీలో చేరినందుకు నర్సయ్య అందరికీ మంచి విందు చేశాడు.

◆◆◆

బాలయ్యను సికిందరాబాద్ - వాడి లైనులో ఒక మారుమూల స్టేషన్ కి పంపించారు. అతని గురించి ఎవరికీ తెలియకుండా వుండేందుకు అట్లా చేసారు. పాత పరిచయస్థులు కొందరు తప్ప ఇప్పుడందరూ అతన్ని బాలయ్య అనే పిలుస్తున్నారు. బాలయ్యగా అతను మళ్ళీ కొత్త జీవితమూ కొత్త ఉద్యోగమూ ప్రారంభించాడు. తన తీరక సమయాన్ని ఇప్పడు ఎక్కువగా పుస్తకాలు చదువుతూ గడుపుతున్నాడు. ఘాటైన మద్యం తాగడం మానుకున్నాడు. ఎక్కువగా దోస్తులను కలవడం మానుకున్నాడు. అయితే లక్ష్మమ్మను మాత్రం మర్చిపోలేక పోయాడు. వాళ్ల కులాచారం ప్రకారం 'చీరె రెయిక' పద్ధతిలో ఆమెను పెండ్లి చేసుకున్నాడు. అస్పృశ్యులలోనూ కొన్ని శూద్ర కులాలలోనూ విడాకులు పొందిన స్త్రీలు, వివాహితుడైన పురుషుడిని పెండ్లి చేసుకోడానికి ఆమోదం వుంది. బాలయ్యను చిన్న చిన్న స్టేషన్లలోనూ తక్కువమంది ఉద్యోగులు వున్న స్టేషన్లలోనూ వేసినప్పుడు లక్ష్మమ్మ అతనితో కలిసి వుండేది.

మళ్ళీ బాలయ్యను సికిందరాబాద్‌కు వేసినదాకా కొన్నాళ్లు మాత్రమే ఇట్లా కొనసాగింది. తనకు చెడ్డపేరు వచ్చిన ఆ స్టేషన్‌లో పనిచెయ్యడం ఇష్టం లేదు బాలయ్యకి. కానీ తప్పదు కదా! అందుకని కావాలని పాత స్నేహితులను తప్పించుకుని తిరిగేవాడు. డ్యూటీ లేనప్పుడు ఇంట్లోనే వుండి చదువుకుంటూ వుండేవాడు. సెలవు వచ్చినప్పుడు భార్యా బిడ్డలని చూడబోయే వాడు. పెద్దకొడుకు బాలరాజు ఇప్పుడు బుడిబుడి నడకలు నడుస్తున్నాడు. చిన్న వాడికి మూడు నెలలు. వాడిపేరు అబ్బసాయిలు. కాస్త చిత్రమైన పేరు. నర్సయ్య మొదటి బార్య అబ్బమ్మపేరూ, నర్సమ్మ నాయనమ్మ సాయమ్మపేరూ కలిపి అబ్బసాయిలు అని పెట్టారు.

అప్పటికి నర్సమ్మ పుట్టింటికొచ్చి ఆరునెలలయింది. ఇంక బాలయ్య దగ్గరకు వెళ్లాలనుకుంటోంది. ఆమె తన దగ్గరకు వస్తోంది కనుక ఇంక ఇట్లా తనదగ్గర వుండడానికి

కుదరదని లక్ష్మమ్మకు చెప్పాడు బాలయ్య. అయితే తనే అప్పుడప్పుడూ మర్పల్లి వచ్చిపోతూ వుంటానన్నాడు. వాళ్లకిప్పుడు అధికారికంగా పెళ్ళి అయింది కనుక మర్పల్లిలో వాళ్ల కులస్థులు అభ్యంతరం చెప్పలేదు.

◆◆◆

ఒకరోజు ఒకతను నర్సయ్య దగ్గరకు రొప్పుకుంటూ పరిగెత్తుకుని వచ్చాడు. అతని మొహం విచారంతో పాలిపోయివుంది. వేగంగా పరిగెత్తిరావడం వల్ల అతనిమొహం చెమటలు కారుతోంది. ఏం జరిగిందో చెప్పమన్నట్లు ఆదుర్దాగా చూశాడు నర్సయ్య.

'నీకొడుకు బాలయ్యకు యాక్సిడెంట్ జరిగింది. దవాఖానకు తీసుకుపోయింద్రు. కదులుతున్న బండి పయ్యల కింద పడిపోయిండు' అని ఏడుస్తూ చెప్పాడతను.

నర్సయ్య హడావుడిగా లాలాగూడా దవాఖానకు వెళ్ళాడు. అక్కడంతా బాలయ్యకు జరిగిన ప్రమాదాన్ని గురించే మాట్లాడుకుంటున్నారు, కానీ బాలయ్యకెట్లా వుందో ఎవరూ చెప్పడంలేదు. నర్సులంతా ఆపరేషన్ థియేటర్ లోపలికీ బయటికీ హడావిడిగా తిరుగుతున్నారు. నరసయ్య తలుపు దగ్గర చలనరహితంగా నిలబడిపోయాడు. అంతలో ఒక డాక్టర్ అతన్ని పిలిచి దగ్గర్లో వున్న క్యాజువాలటీ గదికి పొమ్మన్నాడు, బాలయ్యకి రక్తం ఇచ్చేటందుకు. బాలయ్య కుడి తొడకు లోతైన గాయమై చాలా రక్తం పోయింది. రెండు బోగీలను జతచేసిన వెంటనే పట్టాలమీద జారిపడిపోయాడు బాలయ్య. అతని కాలు కదలే చక్రం కింద ఇరుక్కుపోయింది. ఇంజన్ డ్రయివర్ వెనువెంటనే బ్రేక్ వేసినప్పటికీ రైలు చక్రం అతని తొడను బాగా కోసేసింది. తొడనుంచి కొంత కండ ఊడి వచ్చి, లోతైన గాయం అయింది.

ఆపరేషన్ పూర్తికావడానికి నాలుగుగంటలు పట్టింది. బాలయ్యది ధృఢమైన శరీరం కనుక త్వరలో కోలుకుంటాడని చెప్పారు డాక్టర్లు. ఇంటెన్సివ్ కేర్‌లో వున్న బాలయ్యను గాజు తలుపులోనుంచీ చూడనిచ్చారు. బాలయ్య మొహానికి ఆక్సిజన్ మాస్క్ తగిలించారు. పక్కనే అతనికి ఎక్కిస్తున్న రక్తం సీసా వేలాడుతూంది. బాలయ్య ఇంకా అపస్మారకంలోనే వున్నాడు. అంత భయంకరమైన పరిస్థితిలో వున్నకొడుకుని చూడలేక పోయాడు నర్సయ్య. బాగా దుఃఖం వచ్చింది. ఒక్క క్షణం తమ బిడ్డ బాగవుతాడని అబ్బమ్మ తనకు హామీ ఇస్తున్న భావన కలిగిందతనికి.

నర్సమ్మ తన తండ్రినీ పిల్లలనూ వెంటబెట్టుకుని వచ్చేసరికి భార్యతోనూ, చిన్నకొడుకు ఎల్లయ్యతోనూ ఆస్పత్రి వరండాలో కూర్చుని వున్నాడు నర్సయ్య. నర్సమ్మ కళ్ళు ఎర్రగా వాచిపోయి వున్నాయి. మామను చూడగానే ఆమె దుఃఖం కట్టలు తెంచుకున్నది. గాజు తలుపుకు అవతల స్పృహ లేకుండ పడివున్న భర్తను చూడగానే ఆమెకి ఏమీ తోచలేదు తలుపు తోసుకుని లోపలికి పోవడానికి ప్రయత్నించింది. ఆస్పత్రి ఉద్యోగులు ఆమెను పోనివ్వలేదు.

'ఏడ్వకు బిడ్డా! ఆడు మంచిగానే వున్నాడు' అని ఆమెను సముదాయించాడు నర్సయ్య.

నర్సమ్మ అత్తమామల దగ్గర సికిందరాబాద్‌లోనే వుండిపోయి రోజూ భర్తను చూసి వస్తోంది. మల్లయ్య రోజూ అల్లుడికి భోజనం తెస్తూ, బీబీనగర్ లాలాగూడాల మధ్య తిరుగుతున్నాడు. ఆస్పత్రి ఉద్యోగులకు తెలయకుండా అల్లుడు అడిగిన తాజా కల్లు కూడా తెచ్చి పెడుతున్నాడు. అతని గాయం బాగానే మానుపట్టింది. మల్లయ్య దానికి రావి చెట్టు బెరడు నూరి పట్టిస్తున్నాడు. అదికూడా బాగా పనిచేస్తోంది. తన భార్యా మామా తీసుకుంటున్న శ్రద్ధకి బాలయ్య మనసులో కృతజ్ఞత పొంగింది. బాలయ్య కుటుంబం దృష్టిలో పడకుండా మొగులప్పా, లక్ష్మమ్మా కూడా కొన్నిసార్లు వచ్చి అతన్ని చూసిపోయారు. ఒకనెల తరువాత గాయం పూర్తిగా నయమై అతని కుడి పిర్ర కింద ఒక లోతైన పెద్ద మచ్చ మిగిలిపోయింది. రోజూ సాయంత్రం నర్సమ్మ అతన్ని చక్రాలకుర్చీలో వరండాలో తిప్పేది. క్రమంగా అతను కర్రపుచ్చుకుని నడవడం మొదలుపెట్టాడు. రెండు నెలల తరువాత ఆస్పత్రినుంచీ బయట పడ్డాడు, కానీ మరొకనెల విశ్రాంతి కావాలన్నారు. ఆ సమయంలోనే అతని చెల్లెలు పెంటమ్మకు కనకయ్య అనే పాయింట్స్ మన్‌తో పెండ్లి అయింది.

బాలయ్యకు ప్రమాదం జరగడానికి అనేక కారణాలూ సిద్ధాంతాలూ సృష్టించారు. అతని బంధువులూ, సాటి కులస్థులూ. అస్పృశ్యులు చదవకూడని రామాయణ, మహాభారతాలు చదివినందువల్ల ఆ పాపం తగిలిందని బంధువులు అన్నారు. అసలు చదవడం వ్రాయడం నేర్చకోడమే పాపం అన్నారు కొందరు. అవ్వన్నీ విని నవ్వి ఊరుకున్నాడు బాలయ్య.

◆◆◆

ప్రమాదం జరిగాక ఒక సంవత్సరం గడిచింది. బాలయ్య ఒక చిన్న స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. కుటుంబం కూడా అతనితోనే వున్నది. ఇప్పుడతను స్టేషన్‌లో పనిలేనప్పుడంతా ఇంట్లోనే వుండి పిల్లలతో గడుపుతున్నాడు. పెద్దవాడు బాలరాజు తన ముద్దుమాటలతో తండ్రిని అలరిస్తున్నాడు. చిన్నవాడు అబ్బసాయిలు పాకుతూ వచ్చి తండ్రి చేతుల్లో దూరుతున్నాడు, తండ్రి కోసం ఇద్దరూ పోటీలు పడుతున్నారు. ప్రమాదం తరువాత తనభర్తలో వచ్చిన మార్పుకి నర్సమ్మ సంతోషించింది.

మూడునెలలు గడిచాయి. నర్సమ్మ మళ్ళీ గర్భవతైంది. ఈ సారి పుట్టింటికి వెళ్ళకుండా ఇక్కడే వుండాలని నిశ్చయించుకుంది. ప్రమాదం జరిగిన తరువాత భర్త క్షేమం గురించిన ఆదుర్దా ఎక్కువైంది నర్సమ్మకు. నెలలు గడిచినకొద్దీ పిల్లలతో ఇంటిపని చేసుకోడం భారం కాగా, బాలయ్య ఆమెను పుట్టింటికి పంపాలనుకున్నాడు. అక్కడ షంటింగ్ ప్రమాదాలతో కూడినది కనుక పెద్ద స్టేషన్లకు రిలీవర్‌గా వెళ్ళొద్దనీ ఆ సంగతి

స్టేషన్ మాస్టర్‌ని అడుగమనీ అతని చేత వాగ్దానం చేయించుకుని అయిష్టంగానే పుట్టింటికి వెళ్ళింది నర్సమ్మ.

కానీ మళ్ళీ బాలయ్యను తాండూర్ అనే పెద్ద స్టేషన్‌కి బదిలీ చేశారు. తాండూర్ చుట్టూ రాతిగనులున్నాయి. షాహబాద్ రాళ్లను ఇక్కడినించే రైల్వే వ్యాగన్లలోకి ఎక్కిస్తారు. తాండూర్ పెద్ద స్టేషన్ కావడం వల్ల అక్కడ చాలామంది ఉద్యోగులు వున్నారు. రైల్వే క్వార్టర్లు కూడా ఎక్కువ వున్నాయి. బాలయ్యను ఒక పెద్ద స్టేషన్‌లో ఫుల్ టైం వెయ్యడం ఇదే మొదలు. అతనుండే క్వార్టర్స్ సముదాయంలో వివిధ స్థాయిలకు చెందిన ఉద్యోగులుంటారు. ఉద్యోగుల స్థాయిని బట్టి వారి క్వార్టర్ వైశాల్యం వుంటుంది.

తాండూర్ స్టేషన్‌లోకి ఆరోజు వాడి – పర్లి వైజనాథ్ ప్యాసెంజర్ వచ్చినప్పుడు ప్లాట్‌ఫామ్ మీద ఒక్కడే వున్నాడు బాలయ్య. రైలు కదలడానికి సిగ్నల్ ఇస్తూండగా, మొహానికి పమిట కొంగు చాటుచేసుకుని వున్న ఒక స్త్రీ తనవైపు నడిచి వస్తూ కనపడింది. ఆమె దగ్గరగా వచ్చినప్పుడే బాలయ్య ఆమెను గుర్తించగలిగాడు. సంతోషమైంది. తను చేసే పని పూర్తయేవరకూ అమెను కూర్చోమని తరువాత తన క్వార్టర్‌కు తీసుకువెళ్ళాడు.

'మనం ఇట్ల ఎన్రోజులుందాం బాలప్పా?' అంది లక్ష్మమ్మ రొట్టెలు చేస్తూ అతని మొహం వంక చూడకుండానే.

బాలయ్య ఆమె వంక చూశాడు. చెమటపట్టిన నుదుటిమీద అతుక్కున్న జుట్టుని ఒక చేత్తో వెనక్కి తోసుకుంటోంది.

'జర ఆగాలె! నర్సమ్మ ఒచ్చినంక ఆమెతోని మాట్లాడి పిలిపిచ్చుకుంట' అన్నాడు.

'అక్కంటె నాకిష్టం. నేనెప్పుడు కొట్లాడ. మరి నన్ను ఉండనిస్తదా. ఆమె?' అన్నది లక్ష్మమ్మ సందేహంగా.

'ఆమె మంచిది ఒప్పుకుంటదిలే',

'అక్కెప్పుడొస్తది?'

'ఇంకొ నెలలొస్తది. గీసారి జల్ది వస్తనన్నది' అన్నాడు బాలయ్య, రొట్టె తింటూ.

'అయితె నేను జల్ది మర్పల్లి పోవాల్సున్నమాట, అంది లక్ష్మమ్మ కొంత దిగులుగా

అప్పట్లో ఒక పురుషుడికి ఇద్దరు భార్యలుండడం విచిత్రమేమీ కాదు. అందువలన క్వార్టర్స్‌లోని అతని సహోద్యోగులు లక్ష్మమ్మ గురించి పెద్దగా పట్టించుకోలేదు. అంతేకాక అతను అక్కడికి కొత్తగా వచ్చి వున్నాడు. ఎక్కువమంది దోస్తులు కూడా లేరు. అయితే కొంతమంది ఆడవాళ్లు మాత్రం బాలయ్య క్వార్టర్‌లో వున్న కొత్త స్త్రీని గురించి గుసగుస లాడుకున్నారు. లక్ష్మమ్మ బావిలో నీళ్ళకి వెళ్ళినప్పుడు ఒక పెద్దావిడ అడగనే అడిగింది బాలయ్య నీకేమవుతాడని.

'నేను బాలప్ప చిన్న పెండ్లాం లక్ష్మమ్మను' అంది కడవ నెత్తికెత్తుకుని.

తక్కిన ఆడవాళ్ళు కూడా ఆమె వంక కుతూహలంగా చూశారు 'చాలాచక్కగుంది' అన్నారు ఎవరో.

◆◆◆

బాలయ్య తో మరొక స్త్రీ వుంటోందన్న వార్త ఆనోటా ఈ నోటా మల్లయ్య దాకా చేరింది. మొదట్లో అతను నమ్మలేదు. కానీ, తాండూర్ స్టేషన్లోనే గాంగ్ మ్యాన్‌గా వున్న మల్లయ్య స్నేహితుడొకరు ఆ విషయం ధృవపరిస్తే నిర్ఘాంతపోయాడు. ఈలోగా నర్సమ్మకు ఆడపిల్ల పుట్టింది. నర్సమ్మ ఆరోగ్యం దృష్ట్యా, మల్లయ్య ఈ విషయం ఆమెకి చెప్పవద్దను కున్నాడు.

తనకి కూతురు పుట్టిందని తెలిసి మురిసిపోయాడు బాలయ్య. వెంటనే చూడ్డానికి వెళ్ళాడు. మల్లయ్య అతన్ని మామూలుగానే మర్యాద చేశాడు. పెళ్ళయిన అతని మరదళ్ళు భర్తలతో సహా అక్కడే వున్నారు. నర్సమ్మ చెల్లెలు లక్ష్మమ్మ భర్త ఎల్లయ్య ఇల్లరికపుటల్లుడు. అతను అత్తవారింట్లోనే వుంటాడు బాలయ్య వాళ్లతో మూడురోజులు సంతోషంగా గడిపి బయలుదేరబోతూ వుండగా 'నేనూ నీతో వస్తానయ్యా' అంది నర్సమ్మ.

'ఇరవై యొక్క రోజైనంక నేనే వచ్చి తీసుకపోతా' అన్నాడు బాలయ్య.

◆◆◆

1950 ల చివరి వరకూ రైల్వేశాఖ తన ఉద్యోగులకు తగ్గింపు ధరలకు ఇంటి సరుకులు సరఫరా చేసేది. ఆరోజుల్లో రైల్వేశాఖ తన ఉద్యోగుల సంక్షేమాన్ని బాగా పట్టించుకునేది. ప్రతినెలా అన్ని రకాల సరకులూ తీసుకుని ఒక రైల్వేవ్యాగన్ స్టేషన్ లన్నింటికీ వచ్చేది. ఉద్యోగులకు నాణ్యమైన ఆహార దినుసులు తక్కువ ధరకు అందించేది. అప్పుడప్పుడూ స్థానిక దుకాణదారులు కొందరు రైల్వే క్వార్టర్స్‌కు సైకిళ్ళమీద వచ్చి ఈ సరుకులను చౌకగా కొనుక్కు పోతూ వుండేవారు. నెలాఖర్లో కల్లు తాగడానికి డబ్బు లేని మగవాళ్ళు కొందరు ఇంట్లో ఆడవాళ్ళు వద్దంటున్నా వినక ఈ సరుకుల్ని వాళ్ళకు చవకగా అమ్ముకునేవాళ్ళు.

ఒకనాడు బాలయ్య వ్యాగన్లోనుంచీ కొనుక్కున్న సరుకులు గోతంలో వేసుకుంటూండగా, ఎవరో వచ్చి 'బాలయ్యా! నీ పెండ్లాం పిల్లలు, నీమామ వచ్చి క్వార్టర్ దగ్గరున్నరు' అని చెప్పారు.

భార్యా పిల్లలు ఎప్పుడైనా రావచ్చని ఊహించి అతను లక్ష్మమ్మను ఇంతకముందే పంపించి వున్నాడు. అయితే నర్సమ్మ ఇంత త్వరగా వస్తుందనీ అందులోనూ తండ్రిని వెంటబెట్టుకొస్తుందనీ ఊహించలేదు. ఒకవేళ తన మామకు గానీ లక్ష్మమ్మ సంగతి తెలియలేదు కదా? అనుకున్నాడు అతనింటికొచ్చేసరికి అతని మామగారూ భార్యా ఏదో తీవ్రంగా చర్చిస్తున్నారు. పలకరింపులయినాక నర్సమ్మ పిల్లకు పాలు ఇస్తోంది. మామా

అల్లుడూ మౌనంగా వున్నారు. పిల్లల మాటలు తప్ప ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. అల్లుడితో తగాదా పడ్డం ఇష్టంలేని మల్లయ్య అతని రెండో భార్య సంగతి ఎత్తలేదు.

◆◆◆

బాలయ్యకి పిల్లలతో గడపడం సంతోషంగా వుంది. ఎక్కువ సమయం వాళ్లతోనే గడుపుతున్నాడు. నర్సమ్మ వాళ్ళని శ్రద్ధగా చూసుకుంటుంది. వాళ్ళనెప్పుడూ శుభ్రంగా వుంచుతుంది. ఆ పిల్లల్ని అగ్రకులస్థుల పిల్లల్లాగా అలంకరిస్తుంది. వెండికడియాలూ బంగారపు చెవిపోగులూ పెడుతుంది. ఆమె తన బాల్యంలో చేతులపై పొడిపించుకున్న పచ్చబొట్లు మినహాయిస్తే తనుకూడా ఒక హిందూ స్త్రీలాగా కనపడుతుంది.

ఆరోజుల్లో పిల్లలకు బంగారపు వస్తువులు పెట్టడం అగ్రకులస్థులకే వీలయ్యేది. రైల్వే క్వార్టర్స్‌లో వుండే అస్పృశ్యుల పిల్లలకు కూడా ఆ నగలు పెట్టుకునే స్వతంత్రం వచ్చింది ఇప్పుడు. ఊళ్ళలో మాదిరి ఇక్కడ ఎటువంటి ఆంక్షలూ లేవు. బ్రిటిష్ వారి కాలంలో కంటోన్మెంట్ ప్రాంతాలూ, రైల్వే కాలనీలూ అస్పృశ్యులకు సామాజికపరమైన ఆంక్షలు లేని ప్రదేశాలు. వాళ్ళు హిందువుల లాగానే తమ జీవికను సంపాదించుకోవచ్చు. ఒక స్వతంత్రమైన సామాజిక జీవనాన్ని ఆశించవచ్చు. పని ప్రదేశాలలో హిందువులెవరైనా అస్పృశ్యత పాటించాలంటే కుదరదు. వ్యక్తిగత జీవనంలో తప్ప. ఉమ్మడి బావులలో నీళ్ళు తోడుకోవచ్చు. వూళ్ళలో వలె ఇక్కడ నిషేధాలు లేవు. అయితే ఇంకా కొంత అంటరానితనాన్ని హిందువులు పైకి కనపడకుండా పాటిస్తూనే వున్నారు. బావుల దగ్గర నీళ్ళు తోడుకునేటప్పుడు విడివిడిగా తోడుకుంటారు. కలిసి తోడుకోరు. అంటే బక్కెట్‌లు ఒకదాన్ని ఒకటి తాకుతాయేమోనని భయం అన్నమాట! అస్పృశ్యస్త్రీల జీవన శైలిలో కూడా కొంత పరిణామం వచ్చింది. రోజూ స్నానం చెయ్యడం పిల్లల్ని శుభ్రంగా వుంచడం లాంటివి నెమ్మదిగా నేర్చుకుంటున్నారు.

పూర్వం అస్పృశ్య స్త్రీ పురుషులు ప్రత్యేకమైన దుస్తులు ధరించవలసి వుండేది. వాళ్ల దుస్తుల ద్వారా వాళ్లని గుర్తించడానికి వీలుగా. ఆడవాళ్ళు మోకాళ్ల పైకి చీరె కట్టుకోవాలి. వాళ్ల గడ్డం మీదా చేతులమీదా పచ్చబొట్లుండేవి. పురుషులు తొడలు కనపడకుండా మాత్రమే ధోవతి కట్టుకోవాలి. అంతే కాదు హిందువుల ఎదుటికి చెప్పులు వేసుకుని పోకూడదు. చెప్పులతో వాళ్ళకి కనిపించరాదు. రైల్వే కాలనీల్లోని అస్పృశ్యులు ఈ ఆచారాలను బహిరంగంగానే ధిక్కరించారు. హిందువులవలె వస్త్రధారణ చెయ్యడం మొదలుపెట్టారు. స్త్రీలు మడమలు కూడా కనపడకుండా చీరెలు కడుతున్నారు. బంగారునగలు కూడా కొనుక్కోగలుగుతున్నారు.

ఈ సారి నర్సమ్మ బాలయ్యతో కొంత ఎక్కువకాలం గడిపిన తరువాతే మళ్ళీ గర్భవతై, తొమ్మిదోనెలలో పుట్టింటికి వెళ్ళింది.

అది 1940 దశకం మధ్య కాలం! భారతదేశం స్వతంత్రం కాబోతోంది. దేశమంతటా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ చురుకుగా పనిచేస్తోంది. కొన్ని ప్రదేశాలలో

తప్పు. హైదరాబాద్ సంస్థానంలో కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్ట్ పార్టీ కూడా వుంది. ఇక్కడ ఒకేసారి రెండు పోరాటాలు నడుస్తున్నాయి. ఒకటి స్వాతంత్ర్యం కోసం చేసే శాంతియుతమైన పోరాటమైతే, మరొకటి కమ్యూనిష్టుల ప్రోద్బలంతో జరుగుతున్న భూస్వామ్య వ్యతిరేక సాయుధ పోరాటం. నిజాం సంస్థానం ఇండియాలో కెల్ల పెద్ద సంస్థానం. ఇప్పటి కర్నాటక, మహారాష్ట్రలలోని కొన్ని ప్రాంతాలు కూడా అందులో వుండేవి. ఆఖరి నిజాం అయిన మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ భారత దేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత తన సంస్థానాన్ని బారత ప్రభుత్వానికి అప్పగించడానికి సుముఖంగా లేడు. ఆయన సైన్యమైన మజ్లిస్ ఎ ఇత్తహదుల్ ముస్లిమీన్ కి (రజాకార్లు అనికూడా అంటారు) నాయకుడు కాశిం రజ్వి. అతను స్వాతంత్ర్య పోరాటం చెయ్యకుండా ఆపడానికి ప్రజలపై హింసను ప్రదర్శించేవాడు. హిందువుల ఇళ్ళను తగలపెట్టడం, హిందూస్త్రీల పై అత్యాచారాలు, వారి ఇళ్ళలో లూటీలూ జరిపించేవాడు. ఆత్మగౌరవం కాపాడుకోడానికి చాలామంది అస్పృశ్యులు ఇస్లాం మతం పుచ్చుకున్నారు. అస్పృశ్యులు కాని హిందువులను కూడా మతం మార్చుకోమని రజాకార్లు బలవంత పెట్టేవారు. ఈ మతమార్పిడులు ప్రోత్సహించడానికి పోలీసులు కొత్త బట్టలు, చెప్పులు ఆహారపదార్థాలు, ఆఖరికి కొంత భూమి కూడా ఇస్తామని ప్రలోభపెట్టేవారు. మూక ఉమ్మడిగా చాలామంది అస్పృశ్యులు మతం మారారు. ఒకే ముల్లా ఒకేసారి అందరికీ మతమార్పిడీ చేసేవాడు. హిందూ స్త్రీలకి తెల్లచీరెలు కట్టుకోడం అశుభం. అవి వితంతువులు ధరించేవని. మతం మార్చుకున్న స్త్రీలకి తెల్ల చీరెలు కట్టుకోమంటే వాళ్ళు తిరస్కరించేవాళ్ళు. అట్లాగే మెడలోనుంచీ పుస్తెలు తియ్యడానికి కూడా ఒప్పుకునేవారుకాదు. దీన్ని పెద్దగా పట్టించుకోకుండా తాము చాలమందిని ఇస్లామ్ లోకి మార్చగలిగామని నిజాం కు చెప్పేవాళ్ళు అధికారులు.

సాయుధ పోరాటం భూస్వాములను బాగా భయపెట్టింది. లూటీలూ గృహదహనాలూ మామూలైపోయాయి. ముఖ్యంగా 1946-47 సంవత్సరాలలో రజాకార్లకు భయపడి ఊళ్ళకి ఊళ్ళే ఖాళీ చేసి పోయారు. రజాకార్లు హిందువుల ఇళ్ళల్లో చొరబడి స్త్రీలను నగ్నంగా నృత్యం చెయ్యమనడం, తమకి వినోదం కలిగించమనడం అత్యాచారాలకు పాల్పడడం మామూలైంది. రజాకార్లను ఎదుర్కోడానికి స్త్రీలు రక్షకదళాలుగా ఏర్పడ్డారు. కత్తులూ, కారంపొడీ సిద్ధంగా పెట్టుకునే వారు. రజాకార్లు ఇంట్లో జొరబడిన వెంటనే వాళ్ళ మొహాలమీద చల్లడానికి. కొంతమంది హిందూ పురుషులు ముస్లిములవలె గడ్డాలు పెంచుకుని కుర్తాలు వేసుకుని మారువేషాలలో తిరిగేవారు. అయితే వీళ్ళకు సుంతీ జరిగిందో లేదోనని బట్టలు విప్పించి పరీక్షచేసేవాళ్ళు రజాకార్లు. ముస్లిమ్ మతం ప్రకారం సుంతీ తప్పనిసరి ముస్లిమ్ పురుషులకు. వాళ్లది మారువేషమని కనిపెడితే మాత్రం పొడిచి చంపేసేవాళ్లు. తెలంగాణాలో అంతర్యుద్ధం కొనసాగింది.

నర్సమ్మకి తొమ్మిదో నెలవచ్చింది, ఈసారి కాన్పుకి ఆమె తన చెల్లెలు ఇంటికి అనంతారం బయల్దేరింది. ఆమెతో పాటు ఆమె తోబుట్టువులు లక్ష్మమ్మ, రామయ్య

కూడా వెంట బయల్దేరారు. వాళ్ళు ఉదయానే బీబీనగర్ నుంచీ కాలినడకన బయల్దేరారు. పసిపిల్ల బచ్చుమ్మ సాయమ్మ భుజాలమీద కూర్చుంది. అబ్బసాయిలు రామయ్య భుజానికెక్కాడు. బాలరాజు నడుస్తున్నాడు కానీ అప్పుడప్పుడూ ఎత్తుకోమని ఏడుస్తున్నాడు. వాళ్ళు గూడూర్ అనే గ్రామం దాటి అనంతారానికి సరిగ్గా మైలు దూరంలోకి వచ్చారు. అప్పుడే రజాకార్లు గూడూర్‌లో వున్నారని అరుచుకుంటూ కొంతమంది మనుషులు వాళ్ల ముందునుంచీ పరిగెత్తుకుంటూ పోయారు. నరసమ్మ వేగంగా నడవలేదు కనుక వాళ్ళు ఎక్కడైనా దాక్కోవాలి. బాట పక్కన ఒత్తుగా పెరిగిన మొక్కజొన్న చేను వుంది. నర్సమ్మా వాళ్ళు రోడ్డు విడిచి త్వరగా చేలోకి పోయారు. పొడుగైన మొక్కల్లో దాక్కుంటే త్వరగా బయటివాళ్ళకు కనపడరు, మధ్యాహ్నం అవడాన బాగా ఎండ కాస్తూ వాతావరణం వేడిగా వుంది. రామయ్య కొన్ని మొక్కజొన్న మొక్కలు పీకి నరసమ్మకు ఒక పందిరిలాగా తయారుచేశాడు. సాయమ్మ దానికింద ఒక చీరె పరిచి నర్సమ్మను పడుకోబెట్టింది. నర్సమ్మకు పాదాలు బాగా వాచి వున్నాయి. రొప్పుతోందికూడా. ఆమెకు నొప్పులు కూడా వస్తున్నట్లన్నాయి. రామయ్య గ్రామంలోకి వెళ్ళి ఒక మంత్రసానిని పిలుచుకొచ్చాడు. ఆమె నర్సమ్మను పరీక్షచేసి కాన్పుకు ఇంకా రెండు మూడు రోజులు గడువుందని చెప్పింది. అవి పురిటినొప్పులు కావనీ ఎక్కువగా నడవడం వల్ల వచ్చిన నొప్పులనీ చెప్పింది. వాళ్ళ నర్సమ్మను పడుకోబెట్టి అక్కడే వుండిపోయారు.

సాయంత్రం అయింది. బూట్ల చప్పుడు నిరవధికంగా వినపడుతోంది. రోడ్డమీద రాజాకార్ సైనికులు. తిరుగుతున్నారు. నర్సమ్మకి బాగా భయం వేసింది. అందరూ ఊపిరి బిగబట్టుకుని కూర్చున్నారు. ఒక్కొక్క పటాలమే అనంతారం వైపు వెడుతోంది. ఇంక ఆరాత్రికి చేలోనే వుండిపోవాలనుకున్నారు. రామయ్య ఒక లావుపాటికర్ర పట్టుకుని కాపలా కూచున్నాడు.

◆◆◆

బాలయ్యకు మళ్ళీ రిలీవింగ్ డ్యూటీ పడింది. తాండూర్ ఇంట్లో లక్ష్మమ్మ వుంది. ఇప్పుడు నర్సమ్మతో సహా అందరికీ బాలయ్య రెండవ భార్య సంగతి తెలిసిపోయింది. తను లేనప్పుడు ఆవిడ తన భర్తతో వుంటుందని కూడా నర్సమ్మకు తెలుసు. మల్లయ్యకూ నర్సయ్యకూ కూడా తెలుసు. కానీ ఏమీ అనకుండా వూరుకున్నారు. లక్ష్మమ్మ అన్న బాలయ్యతో తరుచూ తాగడానికి వస్తూ వుంటాడు. బాలయ్యకి కల్లు తాగడం ఇష్టమైనా తన జీతంలో అంత ఖర్చు పెట్టడం సాధ్యం కావడంలేదు. తన ఉద్యోగమే కాక తీరిక సమయంలో హమాలీ పని చేసేవాడు. అంటే వ్యాగల్ననుంచీ ట్రక్కుల్లోకి సరుకులు చేరవేసే కూలీ పని. తను తల్లి కాబోతున్నదని తెలుసుకుని లక్ష్మమ్మ పరమానంద భరితురాలైంది. బాలయ్య కూడా ఆనందించాడు, కానీ తనకొచ్చే కొద్దిపాటి జీతంతో ఇద్దరు భార్యల్ని వారి బిడ్డల్న ఎట్లా పోషించాలని విచారం కూడా కలిగింది.

నర్సమ్మకి పిల్లవాడు పుట్టాడు. వాడికి నర్సిములు అని పేరు పెట్టారు. చెల్లెలింట్లో ఎక్కువ కాలం వుండకుండా నెలలోపునే తన ఇంటికి వచ్చేసింది నర్సమ్మ. ఆమె రాకముందే మొగులప్ప వచ్చి లక్ష్మమ్మను తీసుకుపోయాడు. తల్లి వంటపనిలో వుంటే ఆరేళ్ళ బాలరాజు పసి వాడిని చూసుకుంటూ వుండేవాడు.

బాలయ్యని వికారాబాద్ బదిలీ చేశారు. అతనికి ఇద్దరి భార్యలకు సమన్యాయం చెయ్యడం ఎలాగో తెలియడం లేదు. లక్ష్మమ్మకు కూడా కొడుకు పుట్టాడు. అంజయ్య అని పేరు పెట్టారు. ఆమెకూడా పిల్లవాడిని తీసుకుని బాలయ్య దగ్గరకి వచ్చింది. నర్సమ్మా లక్ష్మమ్మా తరుచు తగాదాలాడుకునే వారు. నర్సమ్మ సహజంగా నెమ్మదస్తురాలు. అనవసరమైన వివాదాలకు దూరంగా వుండాలని చూసేది. అటువంటి సందర్భాలలో బాలయ్య నర్సమ్మ తరఫున నిలబడేవాడు. నర్సమ్మ ఇంట్లో వుండడానికి లక్ష్మమ్మ వచ్చింది. కానీ, లక్ష్మమ్మ ఇంట్లో వుండడానికి నర్సమ్మ రాలేదు కదా! నష్టపోయింది నర్సమ్మే అనిపించేది బాలయ్యకి. ఈ విషయం అర్థం చేసుకున్న లక్ష్మమ్మ సర్దుకుపోవడం నేర్చుకుని పరిస్థితులని చక్కబరిచింది. తరువాత ఆ ఇద్దరూ కలిసి మెలిసి వుండబట్టారు. ఇద్దరూ కలిసి ఇంటిపని చేసుకునే వారు. సాయంత్రాలప్పుడు బాలయ్యతో కలిసి కల్లు తాగేవారు. లక్ష్మమ్మ పిల్లల పనిలో సహాయం చేసేది. బాలరాజు లక్ష్మమ్మకు బాగా మాలిమి అయినాడు. ఆమెను చిన్నమ్మా అనిపిలిచేవాడు. పిల్లలకి ఇద్దరు తల్లులు వున్నట్లు అనిపించేది.

అయితే బాలయ్యకు మాత్రం తనకొచ్చే జీతంతో కుటుంబపోషణ కష్టమనిపిస్తోంది. ఆడవాళ్ళిద్దరికీ ఆ విషయం అర్థమైంది. వాళ్ళు పసి పిల్లల్ని తీసుకుని పొలం పనులకు పోవడం మొదలుపెట్టారు. తక్కిన పిల్లల్ని బాలరాజు దగ్గర వదిలేవాళ్ళు. లక్ష్మమ్మకు పొలంపనిలో పూర్వానుభవం వుండడంతో పెద్ద కష్టం అనపించలేదు కానీ నర్సమ్మకు మాత్రం మొదట్లో చాలా కష్టమనిపించేది. తరువాత లక్ష్మమ్మ దగ్గర పనులన్నీ నేర్చుకుని అలవాటు పడింది.

పెద్దపిల్లవాడు బాలరాజు చదువు గురించి విచారించినా అతన్ని బడికి పంపలేక పోయాడు బాలయ్య. అతనికి తరచూ బదిలీలు కావడం ఒకటీ, తక్కిన పిల్లల్ని చూసుకోడానికి నర్సమ్మకి బాలరాజు సాయం కావల్సి రావడం ఒకటి అందుకు కారణాలు. ఇంట్లోనే కొడుక్కి తెలుగు అక్షరాలు నేర్పాడు బాలయ్య.

వికారాబాద్ స్టేషన్‌లోనూ గుడ్స్ షెడ్‌లోనూ చాలామంది అస్పృశ్యులు పనిచేసేవారు. వాళ్ళంతా పండగలలోనూ ఇతర సామాజిక వేడుకల్లోనూ తరచు కలుసుకునేవారు. వాళ్లందరికీ బాలయ్యంటే గౌరవం. అతని చుట్టూ కూర్చుని వార్తాపత్రిక చదివించుకుని వినేవాళ్లు. తమకులంలో చదవనేర్చిన బాలయ్యని చూసి గర్వపడేవాళ్ళు. అయినా తనకు పాఠశాల చదువు లేనందుకు విచారించేవాడు బాలయ్య. తన పిల్లలకు పాఠశాల విద్య సమకూర్చాలనుకునేవాడు.

◆◆◆

అది 1945 జూన్ నెల. బాలరాజుకి తొమ్మిదేళ్ళొస్తున్నాయి. అబ్బసాయిలు ఏడేళ్ళ వాడైనాడు. ఇంట్లో తల్లికి బాలరాజు సహాయం అవసరం. కానీ కనీసం అబ్బసాయిలు నైనా పాఠశాలకు పంపాలి కదా? ఆ ఉద్దేశం తోనే అబ్బసాయిలును లాలాగూడాలో రైల్వే పాఠశాలలో చేర్చడానికి సికింద్రాబాద్ తీసుకొచ్చాడు బాలయ్య. సన్నగా, తన ఈడు పిల్లలకన్న పొడవుగా వున్న అబ్బసాయిలు చేతులకు వెండి కడియాలూ చెవులకు బంగారపు పోగులూ పెట్టుకుని అచ్చం పల్లెటూరి పిల్లవాడిలా వున్నాడు. తండ్రి చెయ్యి గట్టిగా పట్టుకుని చెప్పులు లేని కాళ్లతో పాఠశాలలో అడుగుపెట్టాడు. హెడ్ మాస్టర్ గదిలోకి వెడుతూ భయంభయంగా చుట్టూ చూశాడు. ఒక కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లనిపించింది ఆ పిల్లవాడికి. . కొంతమంది పిల్లలు ఆవరణలో ఆడుకుంటున్నారు. చాలామంది పిల్లలు క్లాసుల్లో కూర్చున్నారు. వాళ్ళంతా ఒకేవిధంగా నీలం, తెలుపు దుస్తులు వేసుకుని వున్నారు. ఆ పిల్లలు అతని వంక వింతగా చూసి నవ్వారు. అబ్బసాయిలు వాళ్లకి తమాషాగా కనపడ్డాడు.

ఆ పాఠశాల హెడ్మాస్టర్ పేరు ఎం. కె. నర్సిమయ్య. ఆయనది ఆకర్షించే రూపం. మడత నలగని జోధ్‌పూరి దుస్తులూ, మెరిసే బూట్లూ వేసుకుని రోజూ మారిస్ మైనర్ కారులో పాఠశాలకు వస్తాడు. క్రమశిక్షణ పాటించే వ్యక్తి. రోజూ పాఠశాల ఆరంభించే ముందు జరిగే విద్యార్థుల ప్రార్థన సమావేశం అయిపోయినాక,విశాలమైన పాఠశాల ఆవరణ లో నిలబడి తరగతుల్లోకి వెళ్ళే పిల్లల్ని పరిశీలనగా చూస్తాడు. శుభ్రంగా లేని పిల్లల్ని అక్కడే నిలబెడతాడు. ఆ పాఠశాలలో చదివే పిల్లలంతా వివిధ స్థాయిలకు చెందిన రైల్వే ఉద్యోగుల సంతానమే. చాలామంది శూద్రకులాలకు చెందినవారు కాగా చాలా తక్కువమంది అస్పృశ్యులు. రైల్వే యూనిఫామ్‌లో వున్న బాలయ్య హెడ్‌మాస్టర్‌కు అభివాదం చేసాడు. అబ్బసాయిలు వణికి పోతూ తండ్రి వెనక దాక్కున్నాడు.

'నా పేరు బాలయ్య సార్! నా కొడుకును బడిల షెరీక్ చేస్తనని వచ్చిన' అన్నాడు బాలయ్య వినయంగా.

పిల్లవాడి అవతారం చూస్తే హెడ్ మాస్టర్ కి కూడా నవ్వొచ్చి గట్టిగా నవ్వాడు. అయితే బాలయ్య కొంచెం చిరాకు పడడం గమనించి, తన నవ్వుని నిగ్రహించుకుంటూ 'ఏవూరి నుంచి వస్తున్నవ్ బాలయ్యా?' అని అడిగాడు.

'వికారాబాద్ నుంచి సార్! ఆడ పాయింట్స్ మ్యాన్ గ పనిచేస్తున్నా' అన్నాడు.

'వికారాబాద్ నుంచి రోజూ నీకొడుకుని స్కూల్ కు ఎట్ల తోలిస్తవ్? అక్కడ నుంచి రావాలంటే ఒక పూట పడతది' అన్నాడు హెడ్మాస్టర్.

'పిల్లవాడిని ఈడ్నె వుంచుత. మా తమ్ముని దగ్గర'.

'మంచిది. మరి వీని పేరేంది?'

'అబ్బసాయిలు సార్!'

'పేరు గమ్మతుంది! మంచిది బాలయ్యా! వాన్ని బడిల పేరెక్కిస్త. కని కాళ్లకి వున్న కడాలు, చెవిపోగులు తీసెయ్ రోజూ యూనిఫాం వేసుకు రావాలి' అన్నాడు హెడ్ మాస్టర్.

బాలయ్య సంతోషంగా నవ్వి పదే పదే హెడ్ మాస్టర్‌కి వందనం చేశాడు.

గదిలోనుంచి బయటికి రాగానే, ఇంతవరకూ జరిగిందంతా గమనించిన అబ్బసాయిలు తండ్రి చెయ్యి గట్టిగా పట్టుకుని 'అయ్య, ఇంటికి పోదాం! నాకు ఈ స్కూలొద్దు' అన్నాడు.

కొడుకు మొహంలో భయం చూసిన బాలయ్య, వాడి తలమీద చెయ్యి వేసి 'కాదు నాన్నా! నువ్వు బడికి వెళ్ళి బగ్గ చదువుకుని పెద్ద ఆఫీసర్‌వి కావాలె' అని బుజ్జగించాడు.

తన పిల్లలు బాగా చదువుకుని రైల్వేలో గౌరవప్రదమైన ఉన్నతోద్యోగులు కావాలని బాలయ్య ఆకాంక్ష. అందుకోసమని ఎంతకష్టపడి పనిచెయ్యడానికైనా అతను సిద్ధంగా వున్నాడు. ఎప్పుడెక్కడ ఏ ఆఫీసర్ కనపడినా తన కొడుకులని ఆ స్థానంలో ఊహించు కుంటాడు. బాలయ్య. అతని తండ్రి నర్సయ్య అబ్బసాయిలుని తనదగ్గర వుంచుకునే వాడే కానీ నర్సయ్యకి ఇటీవలే సికిందరాబాద్ నుంచీ బదిలీ అయింది. అందుకని నర్సింహ దగ్గర వుంచాలని నిర్ణయించుకున్నాడు. నర్సింహ రైల్వేలో పోర్టర్‌గా పని చేస్తూ సమీపంలోని చిలకలగూడాలో వుంటాడు.

తల్లితండ్రులని వదిలి వుండడం ఇదే మొదలు అబ్బసాయిలుకి. అతన్ని విడిచి వెడుతూ 'తమ్మీ! పోరడు పైలం వాడెప్పుడు ఇల్లిడిసి వుండలె' అన్నాడు బాలయ్య గద్గద స్వరంతో.

'నువ్వేం దిగులు పడకు! అన్ని నేన్ జూసుకుంట' అన్నాడు నర్సింహ.

అబ్బసాయిలు తండ్రి చెయ్యి గట్టిగా పట్టుకుని పెద్దగా ఏడవడం మొదలుపెట్టాడు. వాడి ఏడుపు చూసి బాలయ్యకి జాలేసిందికానీ, నిగ్రహించుకున్నాడు. తనకొడుకు చదువుకుని తీరాలని బాలయ్య గట్టిగా నిర్ణయించుకుని వున్నాడు. అందుకే తన భావోద్రేకాలని అదుపు చేసుకుంటూ, 'ఏడ్వకు బిడ్డా! నేను సెలవు వచ్చినప్పుడల్లా నిన్ను చూస్తందుకు వస్త. నువ్వు మంచిగ చదువుకో' అని కొడుకుని సముదాయించాడు. తన చెంపలమీదుగా కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ మొహం తిప్పుకుని వెళ్ళిపోయాడు బాలయ్య. అబ్బసాయిలు పుస్తకాలకూ యూనిఫామ్‌కూ నర్సింహకు డబ్బిచ్చాడు. ఒక నెలకు అబ్బసాయిలుకు అవసరమైన వెచ్చాలు కూడా కొనిచ్చాడు. నర్సింహ బార్య అబ్బసాయిలును ఇంట్లోకి తీసుకుపోయింది.

బాలయ్య తిరిగి వచ్చేటప్పటికి నర్సమ్మ చాలా విచారంగా వుంది. కొడుకోసం దుఃఖించింది. ఆమెను ఓదారుస్తున్న బాలయ్యకు కూడా కన్నీళ్ళొచ్చాయి. బాలరాజూ, బచ్చమ్మా కూడా ఏడ్చారు. లక్ష్మమ్మ వాళ్ళను ఊరుకోబెట్టింది.

నర్సింహ రైల్వేలో లైసెన్స్ కూలీగా పని చేస్తాడు. అతని సంపాదన అతని కుటుంబం లోని నలుగురి పోషణకే చాలదు. అబ్బసాయిలుకు తిండికి అవసరమైన వెచ్చాలు నర్సింహకు నెలనెలా బాలయ్య పంపేవాడు. బాలరాజు వాటిని చేరవేసేవాడు. ఆ వెచ్చాలు ఆ కుటుంబం మొత్తానికి కొద్దిరోజులే వచ్చేవి. అర్థాకలితో స్కూలుకు పోవడం కష్టంగా వుంది అబ్బసాయిలుకు. అయినా అతను బాగా చదువుకోవాలని నిర్ణయించుకుని త్వరలోనే ఉత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. ఇంగ్లీష్ మీడియంలో చదవడం ముందు కష్టంగా అనిపించినా, చదువు పట్ల వున్న ఆసక్తితో కొద్ది కాలంలోనే ఆ భాష నేర్చుకోగలిగాడు. సెలవులకి ఇంటికొచ్చినప్పుడు పెద్దగా పాఠాలు ఇంగ్లీష్లో చదివేవాడు. అవి విని బాలయ్య గర్వపడి కావాలని పైకి పెద్దగా చదవమనేవాడు. బాలయ్యకి ఇంగ్లీష్ చదవడం వ్రాయడం రాదు. అబ్బసాయిలు అట్లా పాఠాలు చదువుతుంటే వాడు స్టేషన్ మాస్టర్ అయినట్లే ఊహించుకునేవాడు. పిల్లలని చదివించుకోవాలనే అతని చిరకాల స్వప్నం నెమ్మదిగా సాకారమౌతోంది. యెలుకటి కుటుంబంలో మొట్టమొదట పాఠశాలలో చేరిన పిల్లవాడు అబ్బసాయిలు.

◆◆◆

ఆ రోజుల్లో తరుచూ ఆవులూ గేదెలూ ఇతర పశువులూ రైలు కింద పడుతూ వుండేవి. అటువంటప్పుడు ఆ కళేబరాలను పట్టాల మీదనుంచీ తొలిగించడానికి స్టేషన్ మాస్టర్ కు అస్పృశ్యులైన కింది ఉద్యోగులే ఆధారం. పశు కళేబరాలను హిందువులు ముట్టుకోరు. కళేబరాలను తొలిగించినప్పుడు అస్పృశ్యులకు కొంత మాంసం దొరికే అవకాశం వుండేది.

ఆరోజు ఒక పాయింట్స్ మ్యాన్ స్టేషన్ మాస్టర్ గదికి రొప్పుకుంటూ వచ్చి 'సార్! రైలింజన్ ఓ ఆవును గుద్ది ఔటర్ సిగ్నల్ దగ్గర ఆగింది' అన్నాడు.

'బాలయ్యెక్కడ?' అని అరిచాడు స్టేషన్ మాస్టర్.

రైలు ఇంజిన్ అదేపనిగా కూత పెడతోంది. కొంత మంది అస్పృశ్యులు ఆవు కళేబరాన్ని తొలించడానికి పట్టాల దగ్గరకు పోయారు. వెంటనే కళేబరాన్ని తొలిగించారు. రైలు బయల్దేరింది. కళేబరాన్ని రైల్వే క్వార్టర్స్‌లోకి మోసుకు పోయారు. దాని చుట్టూ పిల్లా పెద్దా అంతా చేరారు. బాలయ్య మరికొందరు పాయింట్స్ మెన్ కూడా అక్కడే వున్నారు. ఒక మాదిగ పాయింట్స్ మన్ పెద్ద కత్తి తీసుకు వచ్చాడు. అతను చనిపోయిన పశువుల చర్మాలు వొలవడంలో నిపుణుడు. ఆపని పూర్తయినాక మాంసాన్ని వేరు వేరు ప్రమాణాల్లో కుప్పలు పెట్టారు. దాన్ని బాలయ్య పర్యవేక్షణలో అందరికీ పంచారు. చిన్న కుటుంబాలకి చిన్నవీ పెద్దకుటుంబాలకి పెద్దవీ ఇచ్చారు. ఆ మరునాడు ప్రతిఇంటి ముందరా పసుపుతో బాగా రుద్ది కడిగిన మాంసం ముక్కలు తీగెలమీద ఆరేసి వున్నాయి.

◆◆◆

మొగులప్ప తరుచూ రావడం అతన్ని తాగించడానికి కల్లు దుకాణానికి తీసుకుపోవడం మామూలైంది. బాలయ్య ఇట్లా డబ్బు ఖర్చుపెడుతున్నందుకు నర్సమ్మకు విచారంగా వుంది. పిల్లలు పెరుగుతున్నారు. వాళ్లకు అన్నీ సమకూర్చాలి. నిజానికి కల్లు తాగడానికి అంత ఖర్చుపెట్టే శక్తి లేదు వాళ్లకి. ఇంటి ఖర్చు తట్టుకోడానికని నర్సమ్మా లక్ష్మమ్మా పొలంపనికి పోతున్నారు. డబ్బు విషయంలోనే బాలయ్యకూ అతని ఇద్దరు భార్యలకూ మధ్య తగాదాలొచ్చేవి. బాలయ్య సహనం కోల్పోయి ఇద్దర్లో ఎవరో ఒకర్ని కొట్టేవాడు. ఒకసారి బాలయ్య లక్ష్మమ్మ మొహం మీద నెత్తురు కారేలాగా బాగా కొట్టాడు. నర్సమ్మ అడ్డంపోతే 'కొట్టనియ్యక్కా! బాలప్పకు పిచ్చిలేసింది. నన్ను సంపెయ్ బాలప్పా!' అని ఏడుస్తూ గట్టిగా అరిచింది.

బాలయ్యకి మరింత కోపం వచ్చింది. ఆవేశంతో 'పో!లంజె నా ఇంట్ల ఉండకు' అని అరిచాడు. లక్ష్మమ్మ తన ఆరునెలల పసివాడిని ఎత్తుకుని బయటికి నడిచింది. బాలయ్య ఆమె చేతుల్లో పిల్లవాడిని లాక్కున్నాడు.

'నీ పిలగాన్ని నువ్వుంచుకో, నేను వోతున్నా' అని వెనక్కి చూడకుండా గబగబ బయటికి పోయింది లక్ష్మమ్మ.

నరసమ్మ దిగులు పడిపోయింది. లక్ష్మమ్మ తిరిగి వస్తుందని ఆత్రుతగా ఎదురుచూసింది. పాల కోసం ఏడుస్తున్న పసివాడిని చూసుకుంటూ ఆ రాత్రంతా గడిపింది. కానీ లక్ష్మమ్మ రాలేదు. తనకూ పాలుతాగే పిల్లవాడున్నాడు. లక్ష్మమ్మ కొడుక్కి పాలిచ్చి, తన కొడుకుని అర్థాకలితో వుంచింది. లక్ష్మమ్మని తీసుకరమ్మనీ, లేకపోతే పిల్లవాడిని ఆమెకు ఇచ్చిరమ్మనీ బాలయ్యను బ్రతిమిలాడింది. బాలయ్య మొండికేసాడు. ఒక నెల గడిచినా లక్ష్మమ్మ రాలేదు. పాలు తాగే పిల్లలిద్దరితో చాలా కష్టమౌతోంది నర్సమ్మకు. లక్ష్మమ్మ కొడుక్కి తన పాలు తాగించి వాడికన్న కాస్త పెద్దవాడైన తన కొడుక్కి అప్పుడప్పుడూ కల్లు తాగించేది.

లక్ష్మమ్మ ఎప్పటికీ తిరిగిరాలేదు. బాలయ్య కూడా ఆమెని తీసుకురాలేదు.

నర్సమ్మది సహజంగానే జాలిపడేమనసు. ఆమె ఎప్పుడూ లక్ష్మమ్మతో సర్దుకుపోతూ వుండేది. తన స్వంత చెల్లెలు లాగా చూసుకునేది. లక్ష్మమ్మ ప్రవర్తనను నర్సమ్మ తండ్రి మల్లయ్య విమర్శించినా పట్టించుకునేది కాదు. మల్లయ్య ఎప్పుడొచ్చినా లక్ష్మమ్మ కొడుకుని పంపించి వెయ్యమని అంటాడు. కానీ నర్సమ్మ లక్ష్మమ్మ కొడుకు అంజయ్యని తన స్వంత కొడుకు లాగే చూసుకుంటోంది. అంజయ్యకూడా ఆమెకు బాగా మాలిమి అయ్యాడు. ఇద్దరు పిల్లల్నీ కవల పిల్లల్లాగా పెంచుతోండి నర్సమ్మ.

ఈ కష్ట సమయంలో తొమ్మిదేళ్ళ పెద్దకొడుకు బాలరాజు ఆమెకెంతో సాయంగా వున్నాడు. ఇంట్లో తల్లికి పనులు చేసిపెట్టడమే కాక చిన్న చిన్న పనులు చేసి ఆర్థికంగా కూడా కుటుంబానికి చెయ్యందిస్తున్నాడు. నర్సమ్మ పనిలో వున్నప్పుడు చిన్నపిల్లల్ని

చూసుకుంటున్నాడు. తల్లితో పాటు తెల్లవారు ఝామనే లేచి ఆమెకి పిండి విసిరి పెట్టేవాడు ఆమె పాడే పాటలు అతనికెంతో బాగుండేవి. తమ్ముడికి వెచ్చాలు తీసుకుని సికింద్రాబాద్ వెళ్ళినప్పుడల్లా తను సంపాదించి దాచిన అణాలు కొన్ని అబ్బసాయిలుకు ఇచ్చేవాడు.

లక్ష్మమ్మ కొడుకుని నర్సమ్మ అంత బాగా చూసుకుంటున్నందుకు బాలయ్యకి సంతోషమైంది. ఇప్పుడు పిల్లలను గురించి మరింత శ్రద్ధ కనపరుస్తున్నాడు. వాళ్ల చదువు గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. పెద్ద కొడుకుని పాఠశాలలో చదివించలేక పోయినందుకు మాత్రం అతనికి బాధగానే వుంది.

◆◆◆

బాలయ్య ఇప్పుడు ఎంతో క్రమ శిక్షణ పాటిస్తున్నాడు. అతని డ్యూటీలో నిబద్ధత పైఅధికారుల పట్ల గౌరవం ఎన్నదగినవి. అయితే పై అధికారులు తమకింది ఉద్యోగులపట్ల నిరాదరణ ప్రదర్శించినా, వారిని తక్కువ చూపు చూసి అవమానించినా సహించలేక పోయేవాడు. గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని పై అధికారులకు చెబుతూ వుండేవాడు. అధికారులు కూడా అతన్ని 'బాలిగా' అని పిలవకుండా 'బాలయ్యా'అని పిలిచేవారు. బాలిగా అని పిలిస్తే అతడు సహించడని ఇప్పుడు చాలామందికి తెలిసింది. అంతే కాక అతను స్టేషన్ మాస్టర్ల పిల్లలను స్కూలుకు తీసుకుపోవడం, మార్కెట్ సరుకులు తెచ్చిపెట్టడం. బట్టలు ఉతికిపెట్టడం వంటి వ్యక్తిగతమైన పనులు చెయ్యడానికి నిరాకరించేవాడు. ఈ ధిక్కారం అతనికి తరచూ బదిలీలు తెచ్చిపెట్టేది. అయినా బాలయ్యేమీ చింతించలేదు. ఇటువంటి ఒక సంఘటన జరిగిన తరువాత అతను ఖాజీపేట సమీపంలోని ఘన్పూర్ అనే అతిచిన్న స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. కుటుంబాన్ని బీబీనగర్ పంపేసి అతను కొత్త స్టేషన్లో డ్యూటీకి చేరాడు. ఆ స్టేషన్‌లో మిస్టర్ జాన్ అనే అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ వుండేవాడు. అతను కండలు తిరిగిన యువకుడు. మల్లయుద్ధం కూడా వచ్చు. అందులో తన నైపుణ్యాన్ని ప్రదర్శించుకోడం కోసం ఎదురు చూస్తున్నాడు. కానీ అతనికి సమ ఉజ్జీగా ఎవరూ తగల్లేదు. అతను పాయింట్స్ మ్యాన్ బాలయ్యను చూసి అతను కూడా తనలాగ మల్లయుద్ధం వచ్చినవాడనుకున్నాడు. అతనితో తన నైపుణ్యాన్ని అభ్యాసం చేసుకోవచ్చనుకున్నాడు. ఒకరోజు బాలయ్యని పిలిచి,

'అరెయ్ బాలయ్య! బాగ బలవంతుని లెక్క ఉన్నవ్! నాతోని కొట్లాడుతవా?' అన్నాడు.

'నన్ను అరెయ్ అనొద్దు మిస్టర్ జాన్! అది నాకు అవమానం' అన్నాడు కోపంగా బాలయ్య.

'అయితేంది? నువ్వేమన్న పెద్ద ఆఫీసర్ వా ఏంది?'

'కాదు. కని నన్ను అరెయ్ అనే హక్కు నీకు లేదు. నేను గాయిదోన్నిగాదు. ఇద్దరం రైల్వే నౌకర్లమె'.

'నువ్వొక పాయింట్స్ మ్యాన్‌వి. నాకు నీతులు చెప్తవా? నువ్వు మొగోనివైతే నాతోని కొట్లాడు సూత్త' అంటూ అతను బాలయ్య మొహం మీద గట్టిగా కొట్టాడు. సహనం నశించిన బాలయ్య ఎడం చేత్తో అతని జుట్టు పట్టుకుని, కుడిచేత్తో ఈడ్చి మొహం మీద కొట్టాడు. ఆ గట్టి దెబ్బకు మిస్టర్ జాన్ స్పృహతప్పి ప్లాట్ ఫామ్ మీద పడిపోయాడు అప్పుడొక ప్యాసెంజర్ రైలు ఔటర్ సిగ్నల్ దగ్గర లైన్ క్లియర్ కోసం ఆగివుంది. లైన్ క్లియర్ ఒక స్టేషన్ మాస్టరో, అసిస్టెంట్ స్టేషన్ మాస్టరో మాత్రమే ఇవ్వాలి. ఇద్దరు పాయింట్స్ మెన్ మిస్టర్ జాన్‌ని గదిలోకి మోసుకుపోయి మొహం మీద నీళ్ళు చల్లారు. కొద్ది క్షణాలకి అతను లేచి మొహం తుడుచుకుని సిగ్నల్ ఇచ్చాడు. రైలు ఎందుకు లేటయిందని విచారణ జరిగి బాలయ్యను మళ్ళీ మరో స్టేషన్‌కి బదిలీ చేశారు. ఈ వార్త ఘన్పూర్‌లో సుడిగాలిలా వ్యాపించింది. అంతా మిస్టర్ జాన్‌నే తప్పుపట్టారు.

ఈసారి బాలయ్యని సికింద్రాబాద్ సమీపంలో వున్న చిన్న స్టేషన్ సనత్‌నగర్ వేశారు. నర్సమ్మ, పిల్లలూ కూడా అక్కడికి వచ్చారు. ఇప్పుడు నర్సమ్మ అయిదుగురు పిల్లలను చూసుకోవాలి. ఒక రోజు అమె మామ నర్సయ్య వచ్చాడు. ఆనందాశ్చర్యాలతో ఆయన చేతి సంచీ అందుకుని కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చింది. అట్లాగే తాగడానికి మంచినీళ్ళిచ్చింది. యోగక్షేమాల విచారణ తరువాత చిన్న కొడుకు ఎల్లయ్యకు పాయింట్స్ మన్‌గా నౌకరీ వచ్చిందని చెప్పాడు. అప్పుడు నర్సయ్య వాకిట్లో ఆడుకుంటున్న పిల్లలిద్దర్నీ చూస్తూ 'ఆ రెండో పిలగాడెవరు' అనడిగాడు.

'వాడూ నాకొడుకే మామా!' అంది నర్సమ్మ.

'అదెట్ల? నా దగ్గర నువ్వేదో దాస్తున్నావ్. నర్సిములు నా మనమడు. రెండో వాడెవరు' నర్సయ్య గట్టిగా అడిగాడు 'వాడూ నీ మనమడే, లక్ష్మమ్మ కొడుకు' నెమ్మదిగా అన్నది నర్సమ్మ.

నర్సయ్యకి ఆశ్చర్యమేసింది. ఆ పిల్లవాడిని పరిశీలనగా చూశాడు. తన కొడుకు పోలికలు కనపడ్డాయి. కానీ అతనికి కోపం వచ్చింది 'వాణ్ణి నీతాన ఎందుకుంచుకున్నవ్?' అన్నాడు.

'ఆమె ఇడిసిపెట్టి పోయింది. వీడు నీ కొడుకు కొడుకేకద మామా! గందుకె నా పిల్లగాని లెక్క పెంచుతున్న' అంది.

నర్సమ్మ ఆ పిల్లవాడిని కేవలం దయతో పెంచడం లేదు. ప్రేమగా స్వంత కొడుకన్న ఎక్కువగా పెంచుతున్నదని తెలిసి కోడల్ని చూసి గర్వపడ్డాడు నర్సయ్య. వాడిని ఎత్తుకుంటుంటే అతని కళ్ళు చెమ్మగిల్లాయి. 'వీడి పేరేంది' అనడిగాడు ఆర్ద్రంగా. అంజయ్య అని చెప్పి నవ్వుతూ వాడిని తన చేతుల్లోకి తీసుకుంది.

అపుడే బాలరాజు బయటినుంచీ వచ్చాడు. పెద్దమనుమడిని చూసి సంతోషపడ్డాడు తాత. వాడిని కౌగలించుకుని 'పెద్దోడివైనవ్! ఇప్పుడేంజేస్తున్నవ్?' అనడిగాడు.

'ఇంట్లనె వుండి అమ్మకు సాయమౌతున్న తాతా!' అన్నాడు బాలరాజు.

'మంచిది' అని నర్సమ్మవైపు తిరిగి 'నీ కొడుకు పెద్దోడైండు. నీచేతికచ్చిండు మంచిది నర్సవ్వ' అన్నాడు.

'ఇంట్లనె గాదు బయట పన్లకు గూడ పోతున్నడు. పెయింటింగ్ పనికి పోతున్నడిప్పుడు' ఈ మాట అంటున్నప్పుడు ఆ తల్లి గొంతులో విచారాన్ని కనిపెట్టాడు నర్సయ్య.

'ఏడికి పోతున్నడు పెయింటింగ్ కు',

'రైల్వె బ్రిడ్జిల మీద'అంది నర్సమ్మ గద్గదంగా.

'రైల్వే బ్రిడ్జిలమీదికి పోతున్నడా? అది చాల డేంజర్ పని' అన్నాడు నర్సయ్య ఉలిక్కి పడుతూ.

ఈ లోగా బాలయ్య వచ్చాడు. నర్సమ్మ మౌనంగా వుండిపోయింది.

అనుకోకుండా తండ్రి వచ్చినందుకు ఆశ్చర్యపడి,ఆయన మొహం గంభీరంగా వుండడం చూసి 'లేదయ్యా! నేనేం వాన్ని పనికి పొమ్మని ఇబ్బంది పెట్టలే. ఇంట్ల ఉత్తగుండుడెందు కనిపోతున్నడు' అన్నాడు సంజాయిషీ ఇస్తున్నట్లు.

'వాని సంపాదన కావాల్సొచ్చినాది నీకు ?' అన్నాడు నర్సయ్య కోపంగా.

'అది గాదే అయ్యా!' అన్నాడు బాలయ్య.

ఈ మాటతో కాస్త స్థిమిత పడ్డాడు తండ్రి. 'వాన్ని ఇసొంటి డేంజర్ పని చేయించకు. ఇట్లేజేస్తే వాన్ని తీస్కపోతా' అన్నాడు.

కొడుకు సంపాదన తనకు అవసరం లేదని తండ్రితో అన్నాడే కానీ బాలయ్యకి తెలుసు అవసరమేనని. కుటుంబం పెరుగుతోంది. అదీకాక అబ్బసాయిలు చదువుకు కూడా డబ్బు సమకూర్చాలి. బాలయ్య జీతం అన్నింటికీ సరిపోవడం లేదు. నర్సమ్మ కూడా పొలంలో నాట్లకు, కలుపులకు కోతలకు పోతోంది. బాలరాజు చాలా చిన్నప్పటినించే కుటుంబబాధ్యతలు తీసుకున్నాడు. తల్లికి ఇంటిపనుల్లో చేదోడుగా వుండేవాడు. తల్లి పనికి పోతే తోబుట్టువులను చూసుకునేవాడు. ఇప్పుడామె పనికి పోతే ఇంటి పనులు కూడా చేస్తున్నాడు. బచ్చమ్మా అబ్బసాయిలూ కాస్త పెద్దవాళ్ళైనాక అతనిప్పుడు బయట పనులకి పోతున్నాడు. బాలయ్య కానీ నర్సమ్మ కానీ అతన్ని పనికిపొమ్మని చెప్పలేదు. తనంతట తనే కుటుంబానికి సాయం చెయ్యాలనే ఉద్దేశంతో చిల్లర మల్లర పన్లు చేస్తున్నాడు. నర్సమ్మకి ఎదురైన సమస్యలన్నింటిలో ఆమెకు దన్నుగా నిలబడ్డాడు. బాలయ్య జీతంతో పాటు ఆమే, బాలరాజూ తెచ్చే కూలీతో ఇంటి ఖర్చులు, పిల్లల చదువులూ నడుస్తున్నాయి.

నర్సమ్మ మళ్ళీ తల్లి కాబోతోంది. ఇంక పొలం పనులకి పోవడం సాధ్యం కాదు. ఈ సారి పుట్టింటికి పోకుండా ఇక్కడే పురుడు పోసుకోవాలనుకుంటోంది.

◆◆◆

బాలయ్య పనిచేసేది నిజాం స్టేట్ రైల్వేలో. అప్పుడది అఖండ భారత దేశం కాదు. చిన్న,పెద్ద సంస్థానాల కూడలి. ఈ సంస్థానాలను వివిధ పాలకులు పాలించేవాళ్ళు. హైదరాబాద్ సంస్థానాన్ని నిజామ్ పాలించేవాడు. ఇందులో దక్షిణ దేశంలోని చాలాభూభాగం వుండేది. మీర్ ఆలీఖాన్ (నిజాం) తన డబ్బుతో నిజాం స్టేట్ రైల్వేని బెజవాడ దాకా నిర్మించాడు. అయితే బెజవాడ అతని సంస్థానంలోది కాదు. అది బ్రిటిష్ ఇండియా భూభాగం. బెజవాడ అప్పుడప్పుడే వృద్ధి పొందుతున్న వ్యాపార కేంద్రం. నిజాం సంస్థానానికి సరిహద్దు గ్రామమైన యెర్రుపాలెం దాటి రైల్వే ఉద్యోగులను వెళ్లనిచ్చేవారు కాదు. యెర్రుపాలెం తరువాత అంతా బ్రిటిష్ వారి పాలన. వారి నగదు వేరు. నిజాంలో వాడుకలో వుండే నగదు వేరు. యెర్రుపాలెం దాటితే బ్రిటిష్ ఇండియా రూపాయలు (లేదా కాల్దార్ రూపాయలు అనికూడా అంటారు) కొనుక్కోవాలి. నిజామ్ సంస్థానానికి చెందిన హాలీ రూపాయలకన్న వీటి విలువ ఎక్కువ. ఆ స్టేషన్‌లో వీటిని అటూ ఇటూ మార్చుకునే సదుపాయం కూడా వున్నది. అయితే నిజామ్ సంస్థానం నుంచీ బెజవాడకు యదేచ్ఛగా ప్రజల రాకపోకలుండేవి కావు. అంతే కాక ఈ రెండు ప్రదేశాలమధ్య సామాజిక సాంస్కృతక భిన్నత్వం వుండేది. ఒక ప్రదేశం నుంచీ మరొక ప్రదేశంలో అడుగుపెట్టేవారిని, వారి దుస్తులను బట్టి,భాషను బట్టి తేలిగ్గా గుర్తించవచ్చు, నిజామ్ సంస్థానం నుంచీ వచ్చిన వారితో మాట్లాడడానికి బెజవాడ వాసులు భయపడేవారు. ఇద్దరి భాషా తెలుగే అయినా అందులో కావలసినంత భిన్నత్వం వుండేది. హైదరాబాద్ తెలుగుకుండే ఉర్దూ సంపర్కం ఆ భాషకొక ప్రత్యేకత కల్పించింది.

బాలయ్యకు రైల్వే లోని 'రన్నింగ్ డిపార్ట్‌మెంట్' (డ్రయివర్లు, గార్డులు ఫైర్‌మెన్, కోల్‌మెన్ మొదలైన వారు పనిచేసే శాఖ) లో చాలామంది దోస్తులుండేవారు. వీళ్ళు రైలు గమ్యస్థానం అయిన బెజవాడ దాకా పోగలిగేవారు. అక్కడనుంచి వాళ్ళు వంటనూనెలు,మామిడి పళ్ళు మరికొన్ని నైజాంలో దొరకని నాజూకైన వస్తువులు స్నేహితులు కోరితే తెచ్చిపెట్టేవారు.

ఒక రోజు కల్లు దుకాణంలో కలిసిన స్నేహితుడు నర్సయ్యని బెజవాడ ఎప్పుడు వెడతావని అడిగాడు బాలయ్య. నర్సయ్య ఫైర్‌మన్. ఎందుకంటే 'నువ్వు ఆముదం నూనె తెచ్చియ్యి. నాకు బిడ్డ పుట్టబోతుంది' అని అడిగాడు బాలయ్య.

'నా డ్యూటీ ఎక్స్‌ప్రెస్‌ల. అది యెర్రుపాలెంల ఆగది' అన్నాడు నర్సయ్య.

బాలయ్య తన జేబులోనుంచీ ఒక బ్రిటిష్ ఇండియా నాణెం తీసిచ్చాడు. 'నా దగ్గరున్న రూపాయి దీస్కుని నూనె తెచ్చిపెట్టు. దబ్బున తీస్కురా' అన్నాడు. అతని దగ్గరున్నది ఆ ఒక్క ఇండియా రూపాయే. అదే సరిపోతుంది. నర్సయ్య బాలయ్య బిడ్డ పుట్టే వేళకు సరిగ్గా ఆముదం తెచ్చిపెట్టాడు. ఆముదంతో పసిబిడ్డల ఒంటికి మర్దన చేయడమే కాక

వాళ్లకది విరేచనకారిగా కూడా పనికొస్తుంది. తన ఇంట్లోనే నర్సమ్మ కి కాన్పు కావడం ఇది మొదటిసారి.

◆◆◆

ఇప్పుడు వాళ్ళు ఫతేనగర్ గేట్ దగ్గర ఒక చిన్న రైల్వే క్వార్టర్‌లో వుంటున్నారు. నర్సమ్మకు నొప్పులు రాగానే బాలయ్య పరగెత్తుకుంటూ వెళ్ళి ఒక మంత్రసానిని పిలుచుకొచ్చాడు. పిల్లలు పొరుగునున్న క్వార్టర్‌లో పడుకున్నారు ఒక పొరుగింటామె వేడినీళ్ళు పెట్టిచ్చింది. నొప్పులు పడుతూనే పొరుగింటామెకు పనులు చెప్పి చేయించుకుంటోంది నర్సమ్మ. ధృఢంగా వున్న మంత్రసాని తన కొడవలికి పదును పెట్టుకుంటున్నది. భార్య నొప్పులు పడేటప్పుడు పక్కనుండడం ఇదే మొదటిసారి బాలయ్యకు. నర్సమ్మ కేకలు వింటూ ఆందోళనగా గది బయట పచార్లు చేస్తున్నాడు. కొద్దిసేపటికి బిడ్డ ఏడుపు వినపడింది. మగబిడ్డ. బాలయ్య ఆరోసంతానం. (ఈ పుస్తకరచయిత). మంత్రసాని బిడ్డకు స్నానం చేయించి శుభ్రమైన గుడ్డలో చుట్టి బాలయ్యను పిలిచి చూపించింది. బాలయ్య తనబిడ్డను చూసుకున్నాడు. ఆనందంతో మైమరిచి తన జేబులోనుంచీ కొన్ని చిల్లర నాణాలు బిడ్డ తల చుట్టూ తిప్పి దిష్టితీసి ఆమెకిచ్చాడు. బంధువులందర్నీ పిలిచి బాగా వేడుక చేసుకోవాలనుకున్నాడు.

ఇరవై ఒకటో నాడు బంధువులతో బాలయ్య చిన్న ఇల్లు కిక్కిరిసిపోయింది. అతని తండ్రీ మామా ఆనందంగా ముచ్చట్లాడుకుంటున్నారు. ఆడవాళ్ళుకొందరు పెరట్లో పొయ్యిల మీద వంటలుచేస్తున్నారు. కొంతమంది నర్సమ్మకు స్నానంచేయించి వొంటికి పసుపు రాస్తున్నారు. మగవాళ్ళు కల్లుకోసం ఎదురుచూస్తూ ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. రామయ్య తెచ్చిన కల్లు అంతా తృప్తిగా తాగారు. తరువాత మంచి విందు. పుట్టిన బిడ్డకు సత్తయ్య అని పేరు పెట్టాడు బాలయ్య తండ్రి.

తరువాతి రెండు సంవత్సరాల్లో నర్సమ్మకు మరొక అమ్మాయీ, మరొక అబ్బాయీ పుట్టారు.

◆◆◆

ఇప్పుడు బాలయ్యది ఒక భారీ కుటుంబం. మొత్తం ఎనిమదిమంది పిల్లలు. బాలయ్య ఎంత కష్టపడి పనిచేసినా కటుంబపు కనీసావసరాలు తీరడంలేదు. తన ఉద్యోగమే కాక అదనంగా గుడ్స్ షెడ్‌లో కూడా పనిచేస్తున్నాడు. వ్యాగన్లలోనుంచీ ట్రక్కుల్లోకీ, ట్రక్కులలోనుంచీ వ్యాగన్లల్లోకీ బరువైన లోడ్ లు చేరవెయ్యడం అతనిపని. పాలుతాగే పసిపిల్లవాడిని బచ్చమ్మ దగ్గర విడచి నర్సమ్మకూడా పొలంపనికి పోతోంది. పొద్దటినుంచి సాయంత్రం దాకా పొలంపని చేస్తోంది. మధ్యాహ్నమప్పుడు పిల్లవాడిని పాలకోసం తల్లిదగ్గరకు తీసుకుపోతుంది బచ్చమ్మ. పదహారేళ్ళ బాలరాజు రకరకాల పనులు చేసి కుటుంబాన్ని ఆదుకుంటున్నాడు.

బాలయ్య రెండో కొడుకు అబ్బసాయిలు సికిందరాబాద్‌లో రైల్వే స్కూల్లో చదువు కుంటున్నాడు. తక్కిన పిల్లల్ని ఆస్కూల్లో చదివించే స్తోమత లేనందున, తను ఎక్కడ పనిచేస్తే అక్కడి స్కూళ్ళలోనే వాళ్లని చదివించాలని నిర్ణయించుకున్నాడు బాలయ్య. అందుకని బాలయ్య ఎక్కడ పనిచేస్తే అక్కడి పాఠశాలలకే వెళ్ళేవాళ్ళు. నర్సిములు, అంజయ్య, సత్తయ్య. అక్కడి ప్రాథమిక పాఠశాలలకి పోవడానికి ఒక్కొక్కసారి చాలాదూరం నడవవలసివచ్చేది. పాఠశాలలు రైల్వే స్టేషన్లకి దూరంగా వుండేవి.

పాఠశాలకు వచ్చే అస్పృశ్యుల పిల్లలు వీళ్ళొక్కరే కనుక వీళ్ళు అక్కడ చాలాసార్లు అవమానాల పాలయ్యేవారు. వాళ్లను క్లాసులో విడిగా కూర్చోబెట్టేవాళ్ళు. అక్కడ అందరూ తాగే కుండలోనీళ్ళు ముట్టుకోనిచ్చేవారుకాదు. వాళ్ళు మంచి నీళ్ళు తాగడానికి చాలదూరం హరిజనవాడకు పోవలసివచ్చేది. అప్పుడప్పుడే ఇండియాకు స్వతంత్రం వచ్చింది కానీ. గ్రామ ప్రజల దృక్పథాల్లో మార్పు రాలేదు.

తరువాత బాలయ్యకు బోనకళ్ళు అనే స్టేషన్‌కు బదిలీ అయింది. అది ఆంధ్ర ప్రాంతానికి చెందిన వూరు. అక్కడ సంస్కృతి తెలంగాణా కన్న భిన్నమైనది. అయితే మనుషులు తాము ఎక్కడ నివసిస్తారో అక్కడి వాతావరణానికి అలవాటుపడాల్సిందేకదా! ఇప్పటిదాకా బాలయ్య పిల్లలు అతన్ని 'అయ్యా' అని పిలిచేవాళ్ళు. అక్కడిపిల్లలు తండ్రిని 'నాయినా' అని పిలుస్తుంటే తనపిల్లల్ని కూడా తనని 'నాయినా' అని పిలవమన్నాడు బాలయ్య. అట్లా పిలవడం అలవాటు చేసుకోడానికి వాళ్లకి చాలా కాలం పట్టింది.

ఇక్కడ పిల్లలు చదివే స్కూలు రైల్వే స్టేషన్‌కు మైలు దూరముంది. ఆ ప్రాథమిక పాఠశాలలో బాలయ్య పిల్లలు మాత్రమే అస్పృశ్యులు. స్టేషన్ మాస్టర్‌ను బ్రతిమాలుకుంటే ఆయన సిఫార్సు మీద స్కూల్లో చేర్చుకున్నారు వాళ్లని. పిల్లలు ముగ్గురూ పొద్దున్నే లేచి చాలా దూరం నడిచి బడికి పోయేవాళ్ళు. వాళ్ళు క్లాసులో ఒక మూల కూర్చునేవాళ్లు. ఇంటినుంచీ గోతం పట్టాలు తీసుకుపోయి నేలమీద వేసుకుని కూర్చునేవాళ్ళు. వాళ్లని తక్కిన విద్యార్థులు ముట్టుకునే వారు కాదు. వాళ్ల పలకలమీద ఉపాధ్యాయుడు ఏమైనా వ్రాసి ఇవ్వాలంటే ముందుగా ఒక హిందూ విద్యార్థి ఆ పలకమీద నీళ్ళు చిలకరించాలి. వాళ్లతో పిల్లలెవరూ ఆడుకునే వాళ్ళు కాదు. ఆ ముగ్గురే ఆడుకునేవాళ్లు. బడిలో వున్న బ్రాహ్మణ ఉపాధ్యాయుడు ప్రతి చిన్న తప్పుకూ ఈ పిల్లల్ని నిర్దయగా కొట్టేవాడు. పైగా వాళ్లు చేరడం వలన తరగతి మైల పడిందని పదేపదే అనేవాడు. అక్కడి పటేల్ కల్పించుకోక పోతే బడినుంచీ ఆ పిల్లలకు ఎప్పుడో ఉద్వాసన చెప్పి వుండేవాడు. పటేళ్ళు అంటే గ్రామాధికారులు. అందులో ఒకరు పోలీస్ పటేల్. ఆయన గ్రామంలో న్యాయ పరిరక్షకుడు. మాలి పటేల్ గ్రామ పరిపాలన పన్నులు వగైరా లెక్కలు చూస్తాడు. రైల్వే నౌకరి చేస్తున్న బాలయ్యకు వీరిద్దరి మద్దతు వుంది.

పిల్లలపై అమలౌతున్న ఆంక్షలు, వారికి జరగే అవమానాలు, వర్ణవివక్ష, ఏదీకూడా పిల్లల్ని చదివించాలనే బాలయ్య నిర్ణయాన్ని సడలించలేకపోయాయ. ఈ అవమానాలను

లెక్కపెట్టవద్దని పిల్లలకు చెప్పేవాడు కూడా. తామున్న దయనీయమైన స్థితినుంచీ విముక్తి కలిగించేది చదువేననీ, రైల్వేలో అధికారులు కావాలంటే తప్పకుండా చదువుకోవాలనీ చెప్పేవాడు. తను నాలుగవ తరగతి ఉద్యోగి. తన పిల్లలు పైతరగతి అధికారులు కావాలని అతని ఆకాంక్ష. ప్రతి సాయంత్రం పిల్లలతో కూర్చుని వాళ్ళు బడిలో చదువుకొచ్చిన పాఠాలు మళ్ళీ చదివించేవాడు. అతను ఇంట్లో లేకపోతే బచ్చమ్మ చదివించేది. ఇప్పుడు బచ్చమ్మ బడి మానేసింది. ఆ పిల్ల ధారూర్‌లో వుండగా బడికి పోయేది. మూడో తరగతి దాకా చదివి మానేసింది. బాలయ్య ఆ పిల్లను వికారాబాద్‌లోని ఆడపిల్లల హాస్టల్‌కు పంపి చదివించాలను కున్నాడు. కానీ అతని చెల్లెలు పెంటమ్మ వద్దని గట్టిగా చెప్పింది. బచ్చమ్మ తన సోదరుల చదువు విషయంలో చాల శ్రద్ధ తీసుకునేది. బాలయ్యకు సాయంత్రపు డ్యూటీ వుంటే తనే కూర్చుని వాళ్ళను చదవించేది. అందరికన్న చిన్న వాడైన సత్తయ్యను మరింత శ్రద్ధగా చూసుకునేది. అతను బడినుంచీ వస్తూ బట్టలూ మొహమూ బాగా మురికి చేసుకుని వచ్చేవాడు. ఒక బఫూన్ లా వున్నావని నవ్వేది బచ్చమ్మ. ఆ పిల్లవాడు తను తీసుకు వెళ్ళిన గోతాన్ని కూడా నేలమీద సరిగ్గా వేసుకోలేనంత చిన్నవాడు. చేతులు మట్టి నేలమీద పెట్టకూడదనే విషయం అతనికి ఎప్పుడూ గుర్తుండేది కాదు. ఆ చేతుల్తో మొహం తుడుచుకోకూడదనికూడా మర్చిపోయేవాడు. అందుకని ఎప్పుడూ మొహం నిండా మట్టి పూసుకుని వచ్చేవాడు. బచ్చమ్మ అప్పుడప్పుడూ ఆ మొహాన్ని చూసి నవ్వేది. అప్పుడప్పుడూ కోపం వచ్చి కొట్టేది. కానీ ప్రతి సాయంత్రం అతనికి స్నానం చేయించేది. ఆ ముగ్గురు పిల్లల్ని బాలయ్యో బచ్చమ్మో ఎప్పుడూ కనిపెట్టి వుండేవాళ్ళు.

◆◆◆

బాలయ్య చాలా కాలం తరువాత కుటుంబంతో బీబీనగర్ వెళ్ళాడు. అల్లుడు లక్ష్మమ్మను మర్చిపోయినందుకూ, తన కూతురు కాపురం సుఖశాంతులతో వున్నందుకూ మల్లయ్య సంతోషంగా వున్నాడు. అంతేకాదు, తన రెండో మనుమడు పెద్ద స్కూల్లో చదువుతున్నాడు. తరువాతి ముగ్గురూ స్కూలుకు పోతున్నారు. ఇప్పుడు వాళ్ళంతా అతని పెంపుడుకొడుకు రామయ్య పెళ్ళికి వచ్చారు. మల్లయ్య ఇంట్లో ఇదే ఆఖరి పెళ్ళి. బాలయ్యకు మరదళ్లతో హాస్యాలాడడం, తినడం తాగడం తప్ప వేరే పనేమీ లేదు పెళ్ళిలో. మల్లయ్య కుటుంబంలో బాలయ్యది ఒక ప్రత్యేక స్థానం. అతనంటే అందరికీ గౌరవం కూడా. మల్లయ్య అతనికి ఒకే తాటిచెట్టు నుంచీ తీసిన తాజా కల్లు తెప్పించి ఇచ్చాడు. ఈ సౌకర్యం రెడ్డి మొదలైన అగ్రకులాల వారికి తప్ప లభించదు. కానీ మల్లయ్య డబ్బున్న వాడు కనుక అట్లా తెప్పించ గలిగాడు.

పెళ్ళి వైభవంగా జరిగింది. తరువాత మల్లయ్య కుటుంబం అంతా యాదగిరి నరసింహ స్వామి దర్శనానికి బయల్దేరారు. తన కొడుకు పెళ్ళి తరువాత యాదగిరిగుట్ట

కొస్తానని మొక్కుకుని వున్నాడు మల్లయ్య. యాదగిరి గుడి బీబీనగర్‌కి ఇరవై మైళ్లదూరంలో వుంది. నల్గొండ జిల్లాలోని రాయగిరిలో. ఆ రోజుల్లో కొండపైనున్న ఆ దేవాలయంలోకి మెట్లెక్కి వెళ్ళడానికి అస్పృశ్యులను అనుమతించేవారు కాదు. వారు హిందువులు ఎక్కి వెళ్ళే మెట్లదారిని కాక వేరే దారిలో వెళ్ళి కొండ క్రింద వున్న ఒక చోట పూజలు చేసుకోవాలి. మల్లయ్య ఈ యాత్రకోసం నాలుగు ఎడ్లబళ్లను ఏర్పాటు చేశాడు. ఒక బండిలో వంట సామాను, కట్టెలు, వంట దినుసులు పెట్టుకున్నారు. ఆ బండికి ఒక బలిష్టమైన మేకను కట్టారు. అది బలివ్వబోయే మేక. పెళ్ళి వారంతా తక్కిన బళ్లలో ఎక్కారు.

మల్లయ్య బళ్ళు యాదగిరిగుట్ట చేరడానికి నాలుగు గంటలు పట్టింది. అస్పృశ్యుల కోసం ప్రత్యేకించిన బావి దగ్గర వాళ్ళు స్నానం చేశారు. అక్కడే వారికోసం కట్టిన సత్రంలో పిల్లలని వుంచి, పెళ్ళికొడుకు, పెళ్ళికూతురుతో పెద్దవాళ్ళంతా కొండదగ్గరకు వెళ్ళారు. తమ కులస్థుడే అయిన ఒకతను ఎప్పుడూ అక్కడ మేకను బలి ఇవ్వడానికి సిద్ధంగా వుంటాడు. అతను మేక మొహానికి పసుపూ కుంకం పెట్టి దానిమీద ఒక బొక్కెననిండా నీళ్ళు తెచ్చి కుమ్మరించాడు. అప్పుడామేక నీళ్ళు విదిలించుకోడానికి తన శరీరాన్ని గట్టిగా ఊపింది.

'జడ్తిచ్చింది ఇగ కొయ్యి' అని అరిచాడు మల్లయ్య. ఒక్క వేటుతో మేక తల నరికేశాడతను.

వాళ్లంతా కొండ మొదట్లో మూడు రోజులున్నారు. తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి మల్లయ్య అక్క 'వొడి నింపడం' అనే వేడుకకు అన్ని ఏర్పాట్లు చేసి వుంచింది. ఈ వేడుకను 'బియ్యం పొయ్యడం' అనికూడా అంటారు. ఇది పెళ్ళయిన ఆడపిల్లల పట్ల తల్లితండ్రులు ప్రేమ ప్రకటించే వేడుక. కూతుళ్లను వారి భర్తలతో పాటు వరుసగా కూర్చోపెట్టి, వారికి అయిదుగురు గానీ ముగ్గురు గానీ దంపతుల చేత తాంబూలం ఇప్పిస్తారు. ఈ తాంబూలంలో బియ్యం, ఎండు కొబ్బరిచిప్పలు. ఆకులూ, వక్కలూ వుంటాయి. ఇట్లా చేస్తే కూతుళ్ళకు కలిసి వస్తుందని నమ్మకం. తరువాత కూతుళ్ళూ అల్లుళ్ళూ తమతమ ఇళ్ళకు వెళ్ళిపోతారు. మల్లయ్య కూతుళ్లకూ, అల్లుళ్లకూ కొత్త బట్టలు పెట్టి పంపించాడు.

ఏడు రోజుల తరువాత తిరిగి ఇంటికి వచ్చారు బాలయ్యా,అతని కుటుంబం. పిల్లలు తాత ఇంట్లో ఉత్సాహంగా, ఆటపాటలతో గడిపి వచ్చారు. నర్సమ్మ ఇన్నాళ్లకు తన చెల్లెళ్ళతో గడపగలిగింది. ముఖ్యంగా ఆమెకు చాన్నాళ్ల తరువాత ఇంటిపనినుంచీ విశ్రాంతి దొరికింది.

◆◆◆

బాలరాజుకు పద్ధెనిమిదేళ్ళొచ్చాయి. అతనికి నౌకరి చూడాలనుకుంటున్నాడు బాలయ్య. ఫ్రాంక్లన్‌ని కలసి అడిగాడు. ఆయన తప్పకుండా చూస్తానన్నాడు బాలయ్యకు మళ్ళీ నౌకరి ఇప్పించినందుకు అతను మంచి పనివాడిగా పేరు తెచ్చుకున్నాడు. ఆ విషయం తృప్తి నిచ్చింది ఫ్రాంక్లిన్‌కి.

అనుకున్నట్లుగానే బాలరాజుకు రైల్వే నుంచీ బాక్స్‌బాయ్ పోస్ట్‌కి ఇంటర్వ్యూ వచ్చింది. అది రైల్వేలో అతి తక్కువ స్థాయి నౌకరి. తండ్రి లాగానే ఆ వయసులో బాలరాజు కూడా దృఢంగా ఆరోగ్యంగా వుంటాడు. ఇంటర్వ్యూ బాగానే జరిగింది. త్వరలోనే ఉత్తర్వులు వస్తయ్యని ఎదురు చూస్తున్నాడు. బాలయ్యకి చాలా ఆనందంగా వుంది. నర్సమ్మకీ సంతోషంగానే వుంది కానీ, తనకన్నింట్లో వెన్ను దన్నుగా వున్న పెద్దకొడుకును వేరే చోటికి పంపిస్తారనే విచారంతో ఆమె హృదయం బరువెక్కింది.

కాకతాళీయంగా బాలరాజును తండ్రికి వలెనే మొట్టమొదట బెల్లంపల్లిలో వేశారు. లాలాగూడా దవాఖానాలో ఫిట్‌నెస్ పరీక్ష అనంతరం అతను బెల్లంపల్లి వెళ్ళి డ్యూటీలో చేరాలి. అతని ప్రయాణానికి తల్లి అన్నీ సిద్ధం చేస్తోంది. తండ్రి మొదట్లో తీసుకువెళ్ళిన ట్రంక్ పెట్టెలోనే అతను నెలకు సరిపడా వండుకు తినే సరుకులు సర్దుకున్నాడు. ఒక్కడే వుండేటప్పుడు ఎంత జాగ్రత్తగా వుండాలో రోజూ ఒక గంట సేపైనా చెబుతోంది కొడుక్కి నర్సమ్మ. చివరికి అన్నీ సర్దడం అయింది. అందరికీ ఉద్వేగంగా వుంది. ఏడ్చి ఏడ్చి నర్సమ్మ కళ్ళూ మొహం వాచిపోయాయి. బాలరాజు తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ బాగా దిగులు పడ్డారు. బాలయ్య వాళ్లను సముదాయించడానికి ప్రయత్నిస్తున్నాడు. బాలరాజుకు తల్లిదే అసలైన బెంగ. తను లేకుండా ఒక్కతే ఎట్లా ఇల్లు సమర్థించుకుంటుందో అని. ఆమెను విడిచి వెడుతుంటే అతనికి దుఃఖం కట్టలు తెంచుకుంది. కన్నీళ్ళు బుగ్గలమీద నుంచీ ధారాపాతంగా కారాయి. తల్లికీ తోబుట్టువులకీ వీడ్కోలు చెప్పి తండ్రితో బయలు దేరాడు బాలరాజు.

బాలయ్య పెద్ద కొడుకు బాలరాజుకు కూడా రైల్వేలో నౌకరి దొరికింది. యెలుకటి కుటుంబంలో రైల్వేలో పని చేయడానికి బయలుదేరిన మూడో తరం ఇది!.

◆◆◆

బాలరాజుకి బెల్లంపల్లి కొత్త ప్రదేశం. బాలయ్య మొదట్లో అక్కడే పనిచేసి వున్నా, పద్ధెనిమిదేళ్ళ తరువాత ఆ స్టేషన్‌లో చాలా మార్పులొచ్చినట్లు గమనించాడు. తను మొదట బాక్స్‌మ్యాన్‌గా చేరినప్పటి స్టేషన్‌ను గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. ఇప్పుడు మరొక ప్లాట్‌ఫామ్ వెలసింది. ప్రయాణికుల సౌకర్యాలు కూడా పెరిగాయి. రైల్వే యార్డ్ విస్తృతమైంది. కొత్త రైలు పట్టాలు కూడా వేశారు. కొన్ని ఆవిరి ఇంజన్ల స్థానంలో డీజిల్ ఇంజన్లొచ్చాయి. తనలాగే తన కొడుకు కూడా అదే నౌకరిలో అదే స్టేషన్లో చేరినందుకు, మరికొంత ఎక్కువ స్థాయి నౌకరిలో చేరలేకపోయినందుకు,

విచారించాడు. తండ్రీ కొడుకులిద్దరూ సామాన్లు పట్టుకుని స్టేషన్ మాస్టర్ గదికి పోయారు. బాలయ్య యూనిఫామ్‌లో వున్నాడు. కనుక తనను స్టేషన్‌మాస్టర్‌కూ ఇతర ఉద్యోగులకూ తేలిగ్గా పరిచయం చేసుకున్నాడు. బాలరాజు జేబులోనుంచీ తన నౌకరి ఉత్తర్వు తీసి వినయంగా స్టేషన్ మాస్టర్‌కి ఇచ్చాడు. అతనికి మరో ఇద్దరు కొత్తవాళ్లతో కలిసి తాత్కాలికంగా ఒక డార్మిటరీలో బస ఇచ్చారు. తరవాత స్టేషన్ మాస్టర్‌తో మాట్లాడి కొడుక్కి చిన్న క్వార్టర్ ఇప్పించగలిగాడు బాలయ్య. పూర్వం తనిక్కడ పనిచేసినప్పుడు ఈయన అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా వుండేవాడు.

మరునాడు బాలయ్య తిరిగి వెళ్ళే రైలు కోసం ఎదురు చూస్తూ కొడుకుతో ఫ్లాట్‌ఫామ్ చివర ఒక బెంచీమీద మౌనంగా కూర్చున్నాడు. కొడుకు ఇంటికి దూరంగా వచ్చాడని బాలయ్యకి కాస్తవిచారంగానూ, కొడుకు స్వతంత్రంగా బ్రతకబోతున్నాడని కొంత ఆనందం గానూ వుంది.

'పైలం బిడ్డా! టైంకి డ్యూటీకి పో' అన్నాడు.

'గట్లనే అయ్యా'

'చూడు బిడ్డా! చెడ్డ సోపతి పట్టకు. నీకెరికెనా? మీతాత లేకపోతే నేనేమై పోయేటోన్నో?' అని కాస్త ఆగి,

'అవును బిడ్డా! నేను దోస్తాన్ జేసి పచ్చి సారకు అలవాటై నా నౌకరి పోగొట్టుకున్న. మీ తాత దయతో ఇట్లున్న' అన్నాడు.

ఆ మాటలు నమ్మలేనట్లు ఆశ్చర్యంగా చూశాడు బాలరాజు.

'నువ్వేం ఫికర్ జెయ్యకు అయ్యా! నన్ను నమ్ము' అంటూ నీళ్ళు నిండిన తండ్రి కళ్ళల్లోకి చూశాడు బాలరాజు. రైలు రావడంతో ఇద్దరూ లేచారు. రైలు బయల్దేరుతుంటే చెయ్యివూపాడు బాలయ్య. కొడుకు కూడా తనకి చెయ్యి వూపడాన్ని తడికళ్లతో చూశాడు

బసకు రాగానే తనెంతో ఒంటరిగా వున్నట్లు అనిపించింది బాలరాజుకు. మొట్టమొదటి సారిగా ఇల్లు వదిలి పెట్టివచ్చాడు. తను లేకుండా తల్లి ఎట్లా పనిచేసుకుంటుందో అని దిగులేసింది. ఆమె తనకి రెండు రోజులకు సరిపడా తిండి తాయారు చేసిచ్చింది. ఆమె ఇచ్చిన మూట విప్పి ఒక జొన్న రొట్టె తీసుకున్నాడు తినడానికి. పాటలు పాడుకుంటూ జొన్న పిండి విసురుతున్న తల్లి గుర్తొచ్చింది. ఇంక రొట్టె నోటికి పోలేదు.

మరునాడు అతనికి నౌకరి మొదటి రోజు. ఒక ఆంగ్లో ఇండియన్ డ్రయివర్ ఇంటికి అతని పెట్టె తేవడానికి వెళ్ళాడుబాలరాజు. ఆయన క్వార్టర్‌కి వెళ్ళి మెల్లిగా తలుపు తట్టాడు.

'ఎవరది?లోపలికి రండ్రి' అంది ఒక బొంగురు గొంతు.

'నేను సార్ మీ బాక్స్‌మ్యాన్ ని' అన్నాడు బాలరాజు. చాలా నెమ్మదిగా, వినయంగా లోపలున్నాయనని చూశాడు బాలరాజు. అతను నడుముకి బెల్ట్ బిగించుకుంటున్నాడు. మనిషి లావుగా వున్నాడు. ఇంకా షర్ట్ వేసుకోలేదు. ఆయన రెండు చేతుల మీదా పచ్చబొట్లున్నాయి. ఎర్రటి మీసాలూ చెంప పట్టీలు వున్నాయి. బాలరాజు లోపలికి వెళ్లడానికి సందేహిస్తూ బయటే నిలబడితే,ఆయనే మళ్ళీ.

'లోపలికి రావయ్యా! కొత్తవాడివా ఏంది? నీపేరేంది?' అన్నాడు.

'నేను కొత్త బాక్స్ మ్యాన్ ని సార్! నాపేరు బాలరాజు'.

'మంచిది. నా బాక్స్ తీసుకొని ఇంజన్లో పెట్టు' అని అతన్ని ఇంట్లోకి రానిచ్చి పెట్టె నెత్తిమీదకి అందించాడు. ఆయన ఆంగ్లో ఇండియన్ కనుక బాలరాజుని లోపలికి రానిచ్చాడు.

ఆ స్టేషన్‌లో నలుగురు బాక్స్‌మెన్ వున్నారు. అందులో ఇద్దరు శూద్రులు. ఇద్దరు అస్పృశ్యులు. బ్రాహ్మణ,ఇతర అగ్రకుల డ్రయివర్లూ, గార్డులూ శూద్ర బాక్స్ మెన్ మాత్రమే కావాలనేవారు. అయితే అస్పృశ్యులైన బాక్స్ మెన్ ఆంగ్లో ఇండియన్ల ఇళ్లల్లోకి చొరవగా వెళ్లగలిగేవారు. ఈ అంటరాని వారిని క్రైస్తవ మతం దగ్గరకు తీసి బ్రిటష్ ప్రభుత్వం రూపంలో వాళ్లకి ఉద్యోగాలూ,విద్యావకాశాలూ కల్పించింది.

బాలరాజుకు తండ్రి బాలయ్య కన్న చదవడం వ్రాయడం బాగా వచ్చు. స్వంతంగా ఇంగ్లీష్ అక్షరాలు కూడా నేర్చుకన్నాడు. స్టేషన్ల పేర్లు చదవగలడు. ఇంగ్లీష్ లో సంతకం కూడా చెయ్యగలడు. చూడముచ్చటగా వుంటాడు. త్వరలోనే డ్రయివర్లకి గార్డులకీ ఇష్టుడైనాడు.

◆◆◆

బాలరాజు వెళ్ళిన కొత్తలో ఇంటిల్లపాదీ దిగులుపడ్డారు. ముఖ్యంగా నర్సమ్మ అతను చేసే సహాయాన్ని మర్చిపోలేకపోయింది. ఇప్పుడు బచ్చమ్మ బాలరాజు చేసేపన్లు చేస్తోంది. కానీ దిగులు పడుతూ కూర్చోడానికి సమయం ఎక్కడుంటుంది? బాలయ్యను మళ్ళీ సిర్పూర్ కాగజ్ నగర్ బదిలీ చేశారు. ఆ పట్టణం కాగితం పరిశ్రమకు ప్రసిద్ధి. ఎప్పుడెక్కడికి బదిలీ అయినా పిల్లల చదువులే బాలయ్యకు ముఖ్య సమస్య. ఈ సారి ముగ్గురు మగపిల్లల్నీ ప్రభుత్వ ప్రాధమిక పాఠశాలలో చేర్చాడు. పిల్లలకి సెలవులొచ్చాయి, మళ్ళీ నర్సమ్మ గర్భవతైంది. మళ్ళీ అంతా సెలవుల్లో నర్సమ్మ చెల్లెలు లక్ష్మమ్మ దగ్గరకు బీబీ నగర్ వెళ్ళారు. చాన్నాళ్ల తరువాత అక్కనీ పిల్లల్నీ చూసి సంతోషపడింది లక్ష్మమ్మ. ఈ సారి కాన్పు దగ్గర పడ్డ కొద్దీ నర్సమ్మకు భారమనిపిస్తోంది, నడక నెమ్మదించింది. అసలు పనేమీ చెయ్యలేకపోతోంది. మంత్రసానిని పిలిచి చూపిస్తే నర్సమ్మకు కవల పిల్లలు పుట్టవచ్చని చెప్పింది. మల్లయ్య ఆమెని చాలా జాగ్రత్తగా చూసుకుంటూ ఏపనీ ముట్టుకోనివ్వడం లేదు. ఆమెకు బలమైన ఆహారం పెట్టిస్తున్నాడు. సాయంకాలాలు

తండ్రీ కూతుళ్ళు కల్లు తాగేవారు. కాన్పు అయ్యేవరకూ తరచూ కూతుర్ని చూసిపోతూ వుండమని మంత్రసానికి చెప్పాడు. అరోజుల్లో కవల పిల్లలకి జన్మనివ్వడం చాలా ప్రమాదభరితమైనది. అందరికీ నర్సమ్మదే ఆందోళన,మంత్రసానికి కూడా భయంగానే వుంది అనంతారం నుంచీ నర్సమ్మ మరో చెల్లెలు సాయమ్మ కూడా వచ్చింది.

ఒక సాయంత్రం నర్సమ్మకు సుఖప్రసవం అయి ఇద్దరు మగబిడ్డలు పుట్టారు. మల్లయ్య హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. నర్సమ్మ చెల్లెలు సాయమ్మకు పిల్లలు లేరు. ఆమె కవలల్లో ఒకడిని చేతుల్లోకి తీసుకుంటూ, 'అక్కా! ఈ బిడ్డను నా బిడ్డగా పెంచుకుంటాను' అన్నది.

'అట్లనె గానీ! దేవుడు నాకు ఇద్దరు కొడుకుల్నిచ్చిండు నీకొక్కన్నిస్త' అన్నది నర్సమ్మ నవ్వుతూ.

ఆ బిడ్డను పదే పదే ముద్దుపెట్టుకుంటూ తను తల్లినైనానని సంబరంగా అందరికీ చెప్పింది. సాయమ్మ ఆపిల్లలకు రాము, లక్ష్మణ్ అని పేర్లు పెట్టారు.

నౌకరిలో చేరినాక మొదటిసారి బీబీనగర్ వచ్చాడు బాలరాజు.

'ఎట్లున్నవ్ తాతా?' నవ్వుతూ అన్న బాలరాజును ఆశ్చర్యానందాలతో చూశాడు మల్లయ్య. ఆ పిల్లవాడికి మరింత శారీరక ధారుఢ్యమే కాక వినయమూ బాధ్యతా కూడా అబ్బినయ్. మల్లయ్య అతన్ని కౌగలించుకుని 'ఏమోయ్ ఎంత పెద్దోడివైనవ్?' అన్నాడు నర్సమ్మ కొడుకుని కౌగలించుకుని ముద్దులు పెట్టుకుంటూ 'ఎట్లున్నవ్ బిడ్డా ? టైంకు తింటలెవ్వా? బక్కగైనవ్' అని కన్నీళ్ళ పెట్టుకుంది.

'బాగున్ననమ్మా' అంటూ తన కవల తమ్ముళ్లని చూసి. 'ఎంత ముద్దుగున్నవ్ రా!' అని ఒక్కొక్కరినే ఎత్తుకున్నాడు.

ఆ సాయంత్రం చిన్నప్పుడు తనను ఎత్తుకుని ఆడించిన రామయ్య బాలరాజుని తాటి చెట్ల కిందికి కల్లు తాగడానికి తీసుకు పోయాడు.

ఇంట్లో క్రమశిక్షణతో కూడిన దినచర్య వుండాలని బాలయ్య కు చాలా పట్టుదల. పిల్లలంతా రాత్రి తొమ్మిది గంటలయేసరికి పడుకోవాలి. మళ్లీ తెల్లవారుఝాము నాలుగింటికే నిద్రలేవాలి. వాళ్ళు మొహం కడుక్కున్నాక వాళ్లని కూచోబెట్టి చదివిస్తాడు. ఎవరికైనా నిద్రమత్తు వదలకపోతే మళ్ళీ మొహం కడక్కుని రావాలి. వాళ్ళు నిలబడి బయటికి వినపడేలా పెద్దగా చదవాలి. ఈ దినచర్య వాళ్లకి మంచి క్రమశిక్షణ అలవాటుచేసింది. తల్లి ఇంట్లోలేనపుడు అన్ని పనులూ బచ్చమ్మ చూసుకునేది. బడికి వెళ్ళే ముగ్గురు తమ్ముళ్ళనూ కనిపెడుతూ వుండేది. మరీ చిన్నవాళ్లైన లక్ష్మీబాయ్ యాదగిరులను కూడా చూసుకునేది. త్వరలోనే కవలపిల్లల్లో రాము ని సాయమ్మకిచ్చి లక్ష్మణ్ ని తీసుకుని సిర్పూర్ కాగజ్ నగర్ వచ్చింది నర్సమ్మ. బాలయ్యను ఒప్పించి రాముని సాయమ్మకు దత్తత ఇచ్చింది.

బాలయ్య సహోద్యోగి పోచయ్య బాలరాజు కోసం ఒక పిల్లను సూచించాడు. ఆ పిల్ల హుజూరాబాద్‌కి చెందిన రొంటాల గట్టయ్య కూతురు. బాలయ్యా పోచయ్యా నర్సయ్యా హుజూరాబాద్ వెళ్ళారు. గట్టయ్య హరిజన్ కాలనీలో వుంటాడు. అతనికి మూడెకరాల పొలం వుంది. అతనక్కడ మాదిగ కులంలో ఒక ప్రముఖవ్యక్తి. అతనికి ఇద్దరు కొడుకులు,ఒక కూతురు. కూతుర్ని బడికి పంపిస్తున్నాడు. కొడుకులు స్వంత పొలంలోనే కాక మరికొంత పొలంకూడా కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వారికులస్థులు చాలామంది లాగా వాళ్ళు వ్యవసాయ కూలీలుకారు. వాళ్ళు రైతులు. వాళ్ల పెరట్లోనే వాళ్లకొక బావి కూడా వున్నది. వాళ్లది పూరిల్లే అయినా మూడు గదులతో విశాలంగా వుంటుంది. వాళ్లది సంపన్నమైన మాదిగ కుటుంబం.

బాలయ్యా, పోచయ్యా బావిదగ్గర కాళ్ళు కడుక్కుని గట్టయ్య పక్కన చాప మీద కూర్చున్నారు. మామూలు కుశల ప్రశ్నలైనాక బాలయ్య దేవూరని అడిగాడు గట్టయ్య.

'మాది వంగపల్లి. కాని మేం రైల్వేల పనిచేస్తం' అన్నాడు నర్సయ్య.

'అయితె రైల్వేలో పనిచేస్తరన్నమాట' అన్నాడు గట్టయ్య.

'వాళ్లకు మంచి జీతాలొస్తయ్! ఈయన కొడుక్కి సదువొస్తది' అన్నాడు పోచయ్య.

'మేము రైల్వేలో పనిజేస్తం గనక మీ పిల్లనివ్వడానికి మేం పనికిరామా?' అన్నాడు నర్సయ్య అసహనంగా.

'అదేంగాదు గని ఉండలేక అడిగా' అన్నాడు గట్టయ్య నర్సయ్య ని శాంతపరుస్తూ

'మరి మీ పిల్లను జూడొచ్చా?' అనడిగాడు బాలయ్య. తమకి పెద్దగా ఆసక్తి లేనట్టు కనిపించాలనుకున్నారు కానీ, వాళ్ళు స్కూల్ దగ్గర ఆపిల్లను తెలియకుండా చూసే వచ్చారు.

'పిల్ల బడికి పోయింది. ఇంకరాలేదు. తోలుకురమ్మని మావోన్ని పంపిన' అన్నాడు గట్టయ్య.

గట్టయ్య కూతురు పోచమ్మ పన్నెండేళ్ళ పిల్ల. చూడ చక్కనిది. అంత పొడుగూ కాదు పొట్టీకాదు. వంకుల జుట్టు. తిన్నని ముక్కు, పెద్దపెద్ద కళ్ళు. బుగ్గలమీదా నుదుటిపైనా పచ్చబొట్లు. ఇంట్లో అంతా ఆ పిల్లని 'రాయ పోసు' అంటారు. అంటే వాళ్ల దైవం రాజా పోచమ్మ పేరన్నమాట. ఇంట్లో ఒకతే ఆడపిల్ల కనుక అన్నలకు బాగా గారాబం. ఇంటిపనేమీ చేతకాదు. బడిలో పాఠాలు బాగా చదువుతుంది. ఆమె చేత అవి చదివించుకుని వినడం తల్లితండ్రులకి గర్వకారణం. సంతోషంగా ఉండే కుటుంబం అది.

నర్సయ్యా బాలయ్యా ఈ సంబంధం తమకి సమ్మతమేనని చెప్పారు. తిరిగి వెళ్ళేముందు గట్టయ్య పెద్దకొడుకు మల్లయ్య, పెద్ద కుండతో కల్లు తెచ్చాడు. తాగేసి తృప్తిగా బయల్దేరారు బాలయ్యా నర్సయ్యా. కొన్నాళ్ల తరువాత నర్సమ్మా, బాలయ్య చెల్లెలు పెంటమ్మా హుజూరాబాద్ వెళ్ళి పెళ్లి మహూర్తం ఖాయం చేసుకొచ్చారు.

పెళ్ళికి బాలరాజుకి పద్ధెనిమిదేళ్ళు. పోచమ్మకి పన్నెండు. ఇంటికవసరమైన ఇత్తడి సామాన్లతో పాటు కట్నం కింద వెయ్యి న్నొక్క రూపాయి కూడా ఇచ్చాడు గట్టయ్య. ఆరోజుల్లో ఆ కుటుంబాలలో కట్నాలనేవి చాలా అరుదు. పోచమ్మ తన అత్తవారిట్లో కాగజ్ నగర్లో కొన్ని నెలలుండి బాలరాజు దగ్గరకు బెల్లంపల్లి వెళ్ళింది. ఒకప్పుడు బాలయ్య దగ్గరకు నర్సమ్మ వెళ్ళినట్లు. కొత్త జీవితం ప్రారంభించడానికి.

◆◆◆

నర్సయ్య నౌకరి నుంచి రిటైరయి తన మేనమామల ఊరు జనగాంలో స్థిరపడ్డాడు అతనికక్కడ హరిజనవాడలో ఒక చిన్న ఇల్లు వుంది. అతని చిన్నకొడుకు ఎల్లయ్య సికిందరాబాద్‌లోని బన్సీలాల్‌పేటలో వుంటున్నాడు. ఒకప్పుడు ఒక స్టేషన్ మాస్టర్ దగ్గర ఇంగ్లీష్ నేర్చుకున్న ఎల్లయ్యకి ఇప్పుడాభాష బాగా వచ్చు. అతనూ రైల్వేలోనే చేరాడు. కొద్దికాలంలోనే అధికార స్థాయికల షంటింగ్ మాస్టర్ అయ్యాడు. అతన్ని తోటి ఉద్యోగులు బాగా గౌరవించేవారు, క్లాస్ త్రీ ఆఫీసర్ స్థాయికి వచ్చిన తొలి అస్పృశ్యులలో అతనొకడు. యెలుకటి కుటుంబంలో ఈ స్థాయికి ఎదిగిన మొదటి వ్యక్తి. తమ్ముడి ఎదుగుదల చూసి బాలయ్య గర్వపడ్డాడు. తన పిల్లలని కూడా ఉన్నతాధకారులను చెయ్యాలనే తన కోరిక తీరడం అసాధ్యమేమీ కాదనిపించింది.

బాలయ్యకి ముఖద్దమ్‌గా ప్రమోషన్ యిచ్చి నిజామాబాద్‌లో వేశారు. అతనిప్పుడు పాయంట్స్ మెన్ మీద సూపర్ వైజర్. వూరు మారవలసి వచ్చినందుకు కొంచెం బాధ కలిగనా ప్రమోషన్ వచ్చినందుకు ఆనందించాడు. నిజామాబాద్ పెద్ద నగరం. నిజామ్ ఉల్ ముల్క్ పేరుమీద నిర్మంచబడిన నగరం. 1905లో కాచిగూడా నుంచీ మన్మాడ్‌కు ఒక మీటర్ గేజ్ రైలు మార్గం వేయించాడు నిజామ్. ఈ మార్గంలో హైదరాబాద్ నుంచీ 150 మైళ్ళ దూరంలో వుంది నిజామాబాద్ స్టేషన్.

బాలయ్య కుటుంబం అంతా రైల్లో నిజామాబాద్ వచ్చారు. విశాలమైన రైల్వే యార్డ్ కల పెద్ద స్టేషన్ అది. రైలు దిగగానే పిల్లల బాధ్యత తీసుకుంది బచ్చమ్మ. వాళ్ళందరికీ చాలా ఉత్సాహంగా వుంది. బాలయ్యకు అక్కడి పెద్ద రైల్వే కాలనీలో ఒక క్వార్టర్ ఇచ్చారు. ఆ కాలనీలో వివిధ స్థాయి ఉద్యోగులందరికీ కలిసి దాదాపు వంద క్వార్టర్లున్నాయి. బాలయ్య కిచ్చిన క్వార్టర్ ముందు ఎండనుంచీ కాపాడే పెద్ద వేప చెట్టు వుంది. కొద్ది దూరంలో ప్రహరీ కట్టిన ఆవరణలో స్టేషన్ మాస్టర్లకూ, పర్మనెంట్ వే ఇన్స్పెక్టర్లకూ కట్టిన బంగళాలున్నాయి. రైలు పట్టాలకవతల క్లాస్ టు అధికారుల ఇళ్ళున్నాయి.

డ్యూటీలో చేరగానే ముందు పిల్లలకు స్కూళ్ళు వెతకడం బాలయ్య ముఖ్యమైన పని. ముఖద్దమ్‌గా అతను నలుగురు పాయింట్స్‌మెన్ పనిని పర్యవేక్షించాలి. అయినా ఇంకా అతను నాలుగవ తరగతి ఉద్యోగే. అయితే బాలయ్య ఎప్పుడూ తను వేసుకునే బట్టల గురించి బాగా శ్రద్ధ తీసుకునే వాడు. ఎప్పుడూ తెల్లగా ఉతికి ఇస్త్రీ చేసిన ధోవతీ

చొక్కా వేసుకుని దానిపై నీలంరంగు బ్లేజర్ వేసుకునేవాడు. ఒత్తైన నల్లటి జుట్టుకు నూనె రాసుకుని చక్కగా దువ్వుకునే వాడు. మీసాలు కూడా చక్కగా కత్తిరించుకునేవాడు. పిల్లలని చేర్చడానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకి వెళ్ళినప్పుడు ఆ పాఠశాల హెడ్మాస్టర్ బాలయ్యని చూసి పోరుగూరి పటేల్ అనుకున్నాడు. నర్సిములు అంజయ్యా మూడూ రెండూ తరగతుల్లో చేరారు. సత్తయ్య దగ్గర్లోని రైల్వే ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరాడు. ఇక్కడ పాఠశాలల్లో విడిగా కూర్చో బెట్టే పద్ధతి లేనందుకు పిల్లలు సంతోషించారు. పిల్లలంతా కలిసి బెంచీలమీద కూర్చుంటారు. బాలయ్యకు రైల్వే వారిచ్చే యూనిఫామ్స్‌లోనుంచీ పిల్లలకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టించేవాడు అతని ట్రౌజర్లకోసం ఇచ్చిన బట్టతో పిల్లలకు నిక్కర్లు కుట్టించేవాడు. తలగుడ్డకోసం ఇచ్చిన బట్టతో చొక్కాలు కుట్టించేవాడు. నర్సిములు అంజయ్యా పట్నంలోనుంచీ రెండు మైళ్ళు నడిచి బడికి పోయేవాళ్ళు. పట్టాల కవతల పెద్దభవనంలో వున్న రైల్వే ప్రాథమిక పాఠశాలకు సత్తయ్యను బచ్చమ్మ తీసుకు వెళ్లి దిగబెట్టేది. ముగ్గుర్లోకీ అంజయ్య నెమ్మదైన వాడు. అతను ఎటువంటి సమస్యలనూ తెచ్చిపెట్టేవాడు కాదు. సత్తయ్య చిన్నపిల్లవాడు. కానీ నర్సిములే కాస్త చిలిపివాడు. అతనికి దోస్తులు ఎక్కువ. ఒక్కొక్కసారి వాళ్ళతో ఆడుతూ బడి ఎగ్గొట్టేవాడు. ఈ సంగతి కనిపెట్టిన బచ్చమ్మ అతన్ని ఒక్కొక్కసారి కొట్టేది. ఒక్కొక్క సారి ఎండలో నిలబెట్టేది తమ్ముళ్ళు శుభ్రమైన బట్టలు వేసుకుని రోజూ బడికి వెళ్ళి చక్కగా చదువుకునేలా చూసేది.

ఈ ముగ్గరు అన్నదమ్ములూ పెద్దైన తరువాత చెప్పుకునే బాల్యపు ముచ్చట్లలో ఎక్కువ నిజామాబాద్ జీవితం గురించే వుంటుంది.

వాళ్ల సామాజిక వర్గంలోని కొన్ని ఇళ్ళల్లో లాగా కాకుండా బాలయ్య ఇంటి వాతావరణం ఒక క్రమ పద్ధతిలో వుండేది. బాలయ్య వాళ్లని రోజూ తెల్లవారుఝాము నాలుగింటికే నిద్రలేపి చదివించేవాడు. సాయంత్రం వేళల్లో కూడా బాలయ్య ఇంటికొచ్చిన తరువాత వాళ్ళు ఆటలకి పోకూడదు. ఎక్కువగా ఆటలాడితే చదువు దెబ్బతింటుందని బాలయ్య నమ్మకం. నర్సమ్మ కూడా పిల్లలమీద చాలా ఆశలు పెట్టుకున్నది. ఆమెకూడా తెల్లవారు ఝామునే లేచి జొన్నపిండి విసిరి యాభై రొట్టెలు చేసేది. అందులోకి పప్పు వండి, చింతపండు కారం నూరేది. ఇంకోటేదైనా చేస్తే ఆరోజు పండగే. అవసరమైనప్పుడు పొలంపనికి కూడా పోయొచ్చేది.

పిల్లలపైన ఈ విధమైన పర్యవేక్షణ గొప్ప ఫలితం యిచ్చింది,వాళ్ళు చదువు అవసరాన్నీ, దాని విలువనీ అర్థం చేసుకుని మనసుపెట్టి చదువుతున్నారు. రోజూ చన్నీళ్ళలో స్నానం చెయ్యడం వంటి ఇంకొన్ని మంచి అలవాట్లు కూడా చేసుకున్నారు. ఆ అలవాటు పెద్దైనాక కూడా నిలిపి వుంచుకున్నారు. ఎవరిపని వాళ్ళు చేసుకోడం కూడా వాళ్లకి చాలా అవసరం. పెద్ద వాళ్లై ఉద్యోగాలొచ్చేవరకూ ఎవరి బట్టలు వాళ్ళు ఉతుక్కుని ఇస్త్రీ చేసుకోడం కూడా నేర్చుకున్నారు.

వీళ్ళ కన్న చిన్నపిల్లలయిన లక్ష్మీ బాయికీ యాదగిరికి కూడా బడికి పోయే వయసు వచ్చింది. ఇప్పుడు సికిందరాబాద్‌లో చదివే అబ్బసాయిలు కాక మరి అయిదుగురు పిల్లలను చదివించాలి బాలయ్య. అతని భార్యా కూతురూ చెయ్యందించకపోతే అది చాలా కష్ట సాధ్యమైన పని అతనికి. ఏడాదిలో బచ్చమ్మ కూడా పొలంపనికి పోబట్టింది. చాలామందిలాగే నర్సమ్మ కూడా పసివాడైన లక్ష్మణ్‌ని పొలం తీసుకుపోతోంది. దగ్గర్లో ఉన్న చెట్టుకి గుడ్డ ఉయ్యాల కట్టి వాడిని పడుకోబెట్టి నిద్రబుచ్చి, మధ్య మధ్యలో వాడికి పాలివ్వడానికి వచ్చేది.

అనేకమంది రైల్వే ఉద్యోగుల పిల్లల్లాగానే నర్సిములూ, అంజయ్యా, సత్తెయ్యాకూడా వాళ్ళకు చేతనైన పనిచేసేవాళ్ళు. వాళ్లకు తీరికైనప్పుడు ప్యాసెంజర్ రైళ్ళల్లో ప్రయాణీకులకి చెరుకు ముక్కలు అమ్మేవాళ్ళు. అవి భుజాన పెట్టుకుని 'అణా!అణా! గన్న గన్నా! ఏకాణ కొకటి' అని కేకలు పెట్టేవాళ్లు. అందర్లోకీ చురుకైన వాడు నర్సిములు. ఎక్కువ అమ్మేవాడు. అతను ప్రయాణికులదగ్గర్నుంచీ డబ్బులు వసూలు చెయ్యడానికి కదిలే రైళ్ళల్లో కూడా ఎక్కి దిగేవాడు. అవసరానికి పనికొస్తుందని ఈ చిల్లరంతా ఒక మట్టి ముంతలో దాచేది నర్సమ్మ.

◆◆◆

పెద్ద స్టేషనైన నిజామాబాద్‌లో అనేకమంది నాల్గవతరగతి ఉద్యోగులుండేవారు. వీరిలో చాలామంది శూద్రులూ, అస్పృశ్యులూ. వీళ్ళంతా కలిసి హోలీ పండుగ బాగా జరుపుకునేవాళ్ళు. ఈ పండుగ వేడుకల్లో మతంతో సంబంధం లేకుండా ముస్లిముల తో సహా అనేక మతాల వాళ్ళు పాల్గొనేవాళ్లు. ముఖద్దమ్ అయిన బాలయ్య ఎంతో ఉత్సాహంగా హోలీ ఉత్సవాలు జరిపించేవాడు. ఉత్సవాలు వైభవంగా జరపించడం కోసం తన బృందంతో కలిసి విరాళాల కోసం అధికారులదగ్గరకు వెళ్ళేవాడు. ఇంక కాలనీలో పిల్లలయితే పండక్కి వారం ముందుగానే సన్నాహాలు ప్రారంభించేవాళ్ళు. డప్పు కొట్టుకుంటూ హోలీ పాటలు పాడుతూ దుకాణాల దగ్గరకు పోయి యజమానులని విరాళాలు అడిగేవాళ్లు. ఒక్కొక్కసారి యజమానులు కసురుకున్నా లక్ష్యపెట్టేవాళ్లు కాదు. నర్సిములు కొంతమంది పిల్లలకు నాయకత్వం వహించేవాడు. వారం అంతా తిరిగి కట్టెలలాంటివి సేకరించేవాళ్లు. ఈ సేకరించిన కట్టే కంపా పాత చెక్కలూ పండగ ముందు రోజు సాయంత్రం ఒక చోట కుప్ప పెట్టి నిప్పు ముట్టించేవాళ్లు. ఇది కామ దహనం అన్నమాట. ఈ కుప్పను కాముడు అనేవాళ్లు. ఇది చెడును అంతమొందంచడానికి చిహ్నం. ఈ మంట చుట్టూ ఆడుతూ పాడుతూ తిరిగే పిల్లల్ని చూస్తూ పెద్ద వాళ్ళు కల్లు తాగేవాళ్లు. హోలీ పండగ రోజు ఒకరిమీద ఒకరు రంగులు చల్లుకునేవారు అట్లా వసంతఋతువును ఆహ్వానించేవారు.

◆◆◆

'కంగ్రాట్యులేషన్సయ్యా బాలరాజూ' అంటూ హుషారుగా తన గదిలోనుంచీ కేకేసాడు, స్టేషన్ మాస్టర్. బాలరాజుకి భయం వేసింది. ఎక్కడైనా తప్పుజరగలేదు కదా అనుకుంటూ ఆయన గదిలో కొచ్చాడు.

'నీ నసీబు బాగుంది బాలరాజూ! నీకు ప్రమోషనొచ్చింది. నిన్ను సికిందరాబాద్‌కు పంపుతుండ్రు' అన్నాడాయన చిరునవ్వుతో. బాలరాజుకు ఆనందంతో నోట మాటరాలేదు.

ఆయనకు కృతజ్ఞతలు చెప్పి ఆర్డర్ కాగితం పట్టుకుని నవ్వుమొహంతో ఇంటికొచ్చాడు. అతనిప్పుడు పాయింట్స్ మన్ అయ్యాడు. కలలో కూడా అనుకుని ఎరగని ప్రమోషన్ రావడమే కాక సికిందరాబాద్‌లో వెయ్యడం మరీ సంతోషంగా వుందతనికి. అతను రైల్వేలో చేరి రెండేళ్ళే అయింది. ఇప్పుడతనికి ఆరునెలల పాప. పేరు పద్మ. భార్యకీ విషయం త్వరగా చెప్పాలని ఇంటికి పరగెత్తుకు పోయాడు.

బాలరాజు కుటుంబాన్ని తీసుకుని సికిందరాబాద్ వెళ్ళాడు. అక్కడ చిల్కలగూడాలో ఇల్లుఅద్దెకు తీసుకున్నాడు. అప్పటిదాకా చుట్టాల ఇంట్లో వుంటున్న అబ్బసాయిలు వెంటనే అన్న దగ్గరకు వచ్చేశాడు. అతనిప్పుడు స్కూల్ ఫైనల్‌కు ఒక్క క్లాసు తక్కువలో వున్నాడు. బాలరాజు తమ్ముడి బాధ్యత తీసుకున్నాడు. అతని భార్య పోచమ్మకు నిండా పదిహేనేళ్ళు లేకపోయినా ఇంటిని ఎంతో బాధ్యతతో నిర్వహించేది. తరువాతి పదిహేనేళ్ళల్లో ఆమె పెద్ద ఉమ్మడి కుటుంబాన్ని నడుపుకొచ్చింది. ఏడుగురుబిడ్డల తల్లి అయింది.

అనంతారంలో వుండే నర్సమ్మ చెల్లెలు సాయమ్మ తన పెంపుడు కొడుకు రామును ఎంతో గారాబంగా పెంచుతున్నది, పిల్లవాడికోసం పొలంపనులకి వెళ్ళడం కూడా. మానుకున్నది. ఆ పిల్లవాడుకూడా తల్లిని గుర్తు పడుతున్నాడు. సాయమ్మ వాడికి మంచి బట్టలు కుట్టించింది. దగ్గరున్న భోన్గిరి పట్నం నుంచీ ఆటబొమ్మలు తెప్పించింది. ఆ బిడ్డకు ఏణ్ణర్థం రాగానే ఉన్నట్లుండి ఒక నాడు పెద్ద జ్వరం వచ్చింది. సాయమ్మ పిల్లవాడిని వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళినా తగ్గలేదు. పైగా వాడి పరిస్థితి మరింత దిగజారింది. భయపడి పోయిన సాయమ్మ, వాడిని మంత్రగాడి దగ్గరకు తీసుకుపోయింది. ఎవరెక్కడికి పొమ్మని సలహా ఇస్తే అక్కడికల్లాతీసుకెళ్ళింది. ఆ గారాబు బిడ్డ సాయమ్మ బ్రతుకులో చీకటి నింపి ఆమెకు నిరంతర వేదన కలిగిస్తూ అంతలోనే కన్నుమూశాడు.

'అక్కదగ్గరుంటే బతికెటోనివేమో బిడ్డా ! నిన్ను పోగొట్టుకున్న' అంటూ గుండె బాదుకుని ఆపశక్యంగాకుండా ఏడ్చింది సాయమ్మ. అక్క నర్సమ్మను చూస్తూనే కుప్పకూలిపోయింది.

'నా కొడుకు కాన్రాని లోకం పోయిండు. దేవునికి నా మీద దయలేదక్కా!' అని ఆమెను కౌగలించుకుంది.

నర్సమ్మకు కూడా చాలా విచారంగావుంది,ఆమెకు కూడా ఆ బిడ్డను చెల్లిలికివ్వకుండా తనదగ్గరే వుంచుకుంటే బ్రతికి వుండేవాడేమో అనిపించకపోలేదు.

కానీ తనను తను సంబాళించుకున్నది. తనది దుఃఖమే కాని తనచెల్లెలిది అంతకన్న ఎక్కువ దుఃఖం అనుకున్నది. పిల్లల కోసం కన్న కలలు ఇట్లా ముగిసిపోయాయి తన చెల్లెలికి. తనకంట కన్నీరు కారుతుండగానే చెల్లెలు కన్నీరు తుడవడానికి ప్రయత్నించింది నర్సమ్మ. చనిపోయిన పిల్లవాడిని చూసి బాలయ్య కూడా తట్టుకోలేకపోయాడు కానీ తమాయించుకుని ఆ ఇద్దరు ఆడవాళ్లనీ సముదాయించడానికి ప్రయత్నించాడు. కులపువాళ్లంతా కూడా సాయమ్మ దురదృష్టానికి చింతించారు. ఆ పిల్లవాడిపై ఎవరో చేతబడి చేసారని కొందరు గుసగుసలాడుకున్నారు.

'నా కొడుక్కి శాతవడి సేసింద్రక్కా. వాడు నాకు తెలుసు. దేవుడు వాన్ని కూడా తీసుకుపోతడు అది నా సాపం' అంటూ రోదించింది సాయమ్మ.

పిల్ల వాడిని పూడ్చిపెట్టేటప్పుడు స్పృహతప్పి పడిపోయిన సాయమ్మ తేరుకోడానికి గంటపైగా పట్టింది. రాము మరణం ఆమెకొక పిడుగుపాటు. తన బిడ్డను అట్లా లాక్కుపోయి నందుకు దేవుణ్ణి తిట్టింది. పిల్లవాడి ఆటబొమ్మలను తడుముతూ చాలా సేపు ఏడుస్తూ వుండిపోయింది సాయమ్మ. చాలా కాలం అలా.

నర్సమ్మా బాలయ్యా నిజామాబాద్ తిరిగొచ్చేసరికి వాళ్లని ఓదార్చడానికి కొడుకులిద్దరూ కోడలూ సికిందరాబాద్ నుంచీ వచ్చారు.

నర్సిములూ, అంజయ్యా, సత్తెయ్యా వరుసగా ఆరూ అయిదూ నాలుగో తరగతుల్లోకి వచ్చారు. తన పిల్లలకి మెరుగైన చదువుకోసమూ స్థిరమైన బడుల కోసమూ సికిందరాబాద్ మార్పించుకోవాలని ఆలోచిస్తున్నాడు బాలయ్య.

# సత్తయ్య కథ

నాలుగవ తరగతిలో కొచ్చేసరికి నా అంతట నేనే స్కూలుకు పోవడం మొదలుపెట్టాను అంతకు ముందు మా అక్క బచ్చమ్మ నన్ను రైలు పట్టాలు దాటించి అవతల పెద్ద మైదానంలో వున్న బడి దగ్గర వదిలిపెట్టేది. అది చాలా విశాలమైన పెద్ద స్థలం. అక్కడమేము మా నాయన కంటపడకుండా ఆయన సాయంత్రపు డ్యూటీలో వున్నప్పుడు ఫుట్‌బాల్ ఆడేవాళ్ళం. పిల్లలకి ఆటలమీద ఎక్కువ రంధి వుంటే బాగా చదవరని ఆయన ఉద్దేశం. అందుకని సాయంత్రం ఇంట్లోవుండి చదువుకోమనేవాడు. ఆయన ఆ చుట్టుపక్కలున్నాడంటే మా ఆటలన్నీ బంద్! ఎప్పుడైనా ఆడుతూ ఆయన కంట పడితే కొట్టేవాడు. మా అక్కని మామీద నిఘా పెట్టేవాడు.

ఆఫీసర్ల బంగళాలన్నీ ఆ మైదానానికి అవతలివైపు వుండేవి. నా స్నేహితుడు రామమూర్తి తన బంగళా గేటుముందు నిలబడి కనపడేవాడు అప్పుడప్పుడు. అతను ఒక పర్మనెంట్ వే ఇన్స్‌పెక్టర్ (PWI)కొడుకు. అంటే ఒకటో తరగతి అధికారి కొడుకన్నమాట. అతన్ని రోజూ ఒక గ్యాంగ్ మ్యాన్ స్కూల్లో దింపేవాడు. వాళ్ళు బ్రాహ్మణులు కనుక వాళ్ల నాయన మాలాంటి అస్పృశ్యులతో ఆడుకోనిచ్చేవాడు కాదు. కానీ రామమూర్తి నాకు మంచి స్నేహితుడు. క్లాసులో మేము పక్క పక్కనే కూర్చునేవాళ్లం. అతనప్పుడప్పుడూ తన వస్తువులు నన్నువాడుకోమని ఇచ్చేవాడు. మామధ్య ఎప్పుడూ ఈ అస్పృశ్యత అనే ప్రశ్నే రాలేదు. మా లేత మనస్సులో ఇటువంటి దుష్ట సంప్రదాయాలకు చోటులేదు. అయినా తనను స్కూలుకు తీసుకొచ్చే గ్యాంగ్ మ్యాన్ ఎదుట నన్ను తాకనట్టే నటించేవాడు.

ఒక మధ్యాహ్నం నేనెంత కాదన్నా వినకుండా రామమూర్తి నన్ను బలవంతంగా వాళ్ళ బంగళాకు తీసుకువెళ్ళాడు. అప్పుడు వాళ్ల నాయన డ్యూటీకి వెళ్ళివున్నాడు. వాళ్ళమ్మ ఇంట్లోలేదు. మేం ఇద్దరం సోఫాలో కూర్చున్నాం. నేనదివరకెప్పుడూ అటువంటి పరుపులున్న మెత్తటి సోఫాలో కూర్చోలేదు అతనితో ఆడుతూ దానిమీద ఎగురుతూ దూకుతూ వున్నాను.

అంతలోనే 'అంటరాని మురికి వెధవా! మా బాబు పక్కన కూర్చోడానికి ఎంత ధైర్యంరా నీకు?' అని కేకలుపెట్టుకుంటూ వచ్చాడు వాళ్ల బ్రాహ్మణ వంటాయన.

నేను భయంతో ఒక్కసారి సోఫాలోనుంచీ దూకి పరిగెత్తుకుంటూ ఇంటికొచ్చాను. రామమూర్తి ఎంత పిలిచినా వినిపించుకోకుండా. అతను 'నా స్నేహితుణ్ణి అలా ఎందుకు తిట్టావు' అని వంటాయన మీద కేకలువెయ్యడం నాకు వినపడింది.

'వాడు అంటరానివాడు... పోయి స్నానం చెయ్యి. లేకపోతే మీనాన్నతో చెబుతాను' అంటున్నాడు వంటాయన.

రామమూర్తి అతని వెంటపడ్డాడు. 'నన్ను ముట్టుకోకు నీ మైల పడ్డ చేతుల్తో' అని అక్కడనుంచీ పరిగెత్తుకుపోయాడు వంటాయన. వాళ్ళింటికి వెళ్ళినందుకు నన్ను నేను తిట్టుకుంటూ, నన్నెందుకు ముట్టుకోకూడదో అని ఆశ్చర్యపడుతూ ఇంటికొచ్చాను. ఆ వంటాయన మీద చాలా కోపం వచ్చింది. నన్ను ముట్టుకుంటే మైల పడ్డం ఏమిటి? కానీ ఇటువంటి అవమానాన్ని ఎదుర్కోడం నాకిది మొదటిసారి కాదు. మేమెప్పుడు హిందువుల వైపు వెళ్ళినా జరిగేదింతే! వాళ్ల దృష్టిలో మేము అంటరాని మనుషులం. అవమానించాల్సిన మనుషులం. వివక్షచూపవలసిన వ్యక్తులం. వింతేమిటంటే నా జీవితమంతా నాకు మంచి మిత్రులైన వాళ్ళు బ్రాహ్మణులే. మా అన్నలందుకే నన్ను 'పంతులూ' అని పిలిచి వెక్కిరించేవాళ్లు. బ్రాహ్మణులని అట్లా పిలుస్తారు.

మాకులమేమిటని ఎవరైనా అడిగితే మా నాయన 'హరిజనులం' అని చెప్పేవాడు. ఎవరికైనా అణిగివుండడం అంటే ఆయనకు చాలా కోపమే కానీ ఈ అస్పృశ్యత పాటించడం గురించి నిరసన వెలిబుచ్చేవాడు కాదు. అది సమాజ నిర్మాణంలో ఒక భాగం అనుకునేవాడు. ఆయనకి రైల్వే ప్రపంచం బయట వున్న పౌరసమాజం గురించి ఎక్కువ తెలియదు.

నేనింటికి రాగానే నా మొహంలో కనపడిన అలజడి చూసి అట్లా ఎందుకున్నానని మా అమ్మ అడుగుతుందనుకున్నాను కానీ అడగలేదు. మా అమ్మా, మా నాయనా ఏదో విషయం తీవ్రంగా చర్చించుకుంటున్నారు. మా నాయన చేతిలో ఏదో కాగితం వుంది.

'బాలరాజా! నాకు సికిందరాబాదుకు బదిలీ అయ్యింది' అంటున్నాడు నాయన.

ఆ రోజుల్లో భార్యాభర్తలు ఒకర్నొకరు పేరుపెట్టి పిలుచుకునే అలవాటులేదు. అందుకని మా అమ్మా నాయనా ఒకర్నొకరు. మా అన్నయ్య పేరుపెట్టి 'బాలరాజా' అని పిలుచుకునేవాళ్లు ఈ సారి సికిందరాబాద్ బదిలీ అయినందుకు నాయన చాలా సంతోషంగా వున్నట్లు కనపడ్డాడు.

కానీ అమ్మంత సంతోషంగా లేదు. అంత పెద్ద నగరంలో నాయనకొచ్చే జీతంతో సంసారం కష్టమనే చింత ఆవిడ మాటల్లో కనపడుతోంది. నాయన కాస్త చిరాకు పడ్డాడు. ఆయనకా విషయం తెలీకపోలేదు. ఎందుకంటే ఇప్పుడున్న చోట మా అమ్మా, అక్కా పొలం పనికి పోయి కాస్తో కూస్తో సంపాదిస్తున్నారు. నగరంలో ఆయన జీతం ఒక్కటే ఆధారం. కానీ ఆయన ఆశయం మమ్మల్ని పెద్ద స్కూల్లో చదివించడం. అందుకే అమ్మని ఒప్పించడానికి ప్రయత్నిస్తున్నాడు.

'ఎట్లైనా సదురుకుందాం, బాలరాజా, కావాలంటే ఒకపూట తిండి మానేద్దాం. కాని మనపిల్లలు మంచి స్కూలుకు పోవాలె. అక్కడ పెద్ద రైల్వే స్కూలుంది మనమేం ఫీజు కట్టేది లేదు' అంటున్నాడు.

'ఒకపూట తినకపోతే నీజీతం సాల్తదనుకుంటున్నవ' అంది అమ్మ

"అక్కడ బాలరాజు ఉన్నడు గదా?మనకింత ఆసరైతడు."

కానీ మేము బాలరాజుకి భారం కావడం అమ్మకిష్టం లేదు. అతనికి కూడా సంసారమూ పిల్లలూ వున్నారుకదా! కానీ నాయన అక్కడికి వెళ్ళడానికే పట్టుదలగా వున్నాడు. అమ్మ అయిష్టంగానే ఒప్పుకోవలసి వచ్చింది.

మాకు బాగా ఉత్సాహంగా వుంది. మానాయనకు బదిలీ అయినప్పుడల్లా మేము హుషారుగా సామాన్లు సర్దుకుని వెళ్ళేవాళ్లం. రైలుప్రయాణం సరదా కూడా తీరేది. పూర్వంకన్న ఇప్పుడొచ్చిన బదిలీ మానాయనకు మరింత సంతోషమిచ్చింది. తన పిల్లలు నగరంలో చదువుకోగలుగుతున్నారన్న ఆనందం ఆయనకి. నర్సిములు తప్ప మిగతా పిల్లలం సికిందరాబాద్ చూడలేదు. నర్సిములు అప్పుడప్పుడూ వంట సరుకులు ఇచ్చిరావడానికి వెళ్ళేవాడు. వాడు వెళ్ళొచ్చినప్పుడల్లా మేము వాడి చుట్టూ చేరి అక్కడి విశేషాలు చెప్పించుకునేవాళ్లం. వాడు తడవ కొక్క విచిత్రాన్ని గురించి చెప్పేవాడు. తను చూసిన బస్సు మీద బస్సు (డబల్ డెక్కర్) గురించీ, మేడపైన వుండే సినిమాహాల్ గురించీ చెబుతుంటే మేము చెవులు రిక్కించి వినేవాళ్ళం. వాడక్కడ చూసిన వింతలు చెప్పినప్పుడల్లా ఆ నగరాన్ని ఎప్పుడు చూస్తామా అనుకునేవాళ్లం.

మేము సామాన్లన్నీ సర్దుకున్నాం. నాయన మా స్కూళ్ళనుంచీ ట్రాన్స్‌ఫర్ సర్టిపికెట్లు తెచ్చాడు. మేం వెళ్ళే రోజు రామమూర్తి పరిగెత్తుకుంటూ వచ్చాడు. నేను వెడుతున్నందుకు చాలా బాధపడ్డాడు.

'వెళ్ళిపోతున్నవ, సత్తీ!' అన్నాడు.

'అవును మానాయనకు సికిందరాబాద్ బదిలీ అయింది. అక్కడికే పోతున్నం' అన్నాను.

తనతో వుండే గ్యాంగ్ మ్యాన్ చుట్టుపక్కల వున్నాడేమో పరికించి చూసి, లేదని ఖాయం చేసుకుని, తన జేబులో దాచి తెచ్చిన కలం తీసి గబగబా నాచేతిలో పెట్టి పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. అతను వెనక్కి తిరిగి మళ్ళీ నా వైపు చూడనేలేదు.

మా అందరికి నిజామాబాద్ తో మంచి అనుబంధం వుంది. ఆ వూరు విడిచి పోతున్నందుకు బాధ కలిగినా పెద్ద నగరానికి పోతున్నామన్న ఉత్సాహం దాన్ని కాస్త మరిపించింది. మానాయనకు అదే చివరి బదిలీ. ఈ బదిలీ మాజీవితాలకొక మలుపు.

◆◆◆

మేమెక్కిన ప్యాసెంజర్ రైలు సికిందరాబాద్ స్టేషన్ సమీపిస్తున్నది. అక్కడున్న చాలా రైలు పట్టాలు, ఎన్నెన్నో రైళ్ళు. సిగ్నళ్ళూ చూసి చాలా ఆశ్చర్యపోయాం. నర్సిములికి తప్ప పిల్లలందరికీ అదొక అద్భుతలోకంలాగా అనిపించింది. అక్కడ రెండు పెద్ద ప్లాట్ ఫామ్స్ వున్నాయి. ఒకటి బ్రాడ్ గేజికి, ఒకటి మీటర్ గేజికి వీటిమధ్య చాలా రైలు

పట్టాలున్నాయి. రైలు దిగగానే అమ్మ అందర్నీ ఒకచోటే వుండమని మమ్మలనందరినీ లెక్కపెట్టింది ఏడుగురు పిల్లల్లో ఎవరూ తప్పిపోకుండా. బాలరాజు గుంపులోనుంచీ మమ్మల్ని వెతుక్కుంటూ వస్తున్నాడు. అంతమంది మనుష్యుల్ని నేనెప్పుడూ చూడలేదు. చాలా మంది సామాన్లు మోసుకుంటూ ఫుట్ బ్రిడ్జ్ దగ్గరకు పోతున్నారు. నేనుకూడా ఆ బ్రిడ్జ్ ఎక్కాలనుకున్నాను. కానీ మా అన్న నన్ను వేరే దిశగా ప్లాట్ ఫామ్ క్రిందకి లాక్కు పోయాడు.. అతనూ నాయనా నెత్తిమీద పెట్టెలు పెట్టుకున్నారు. మా అమ్మ పసివాడైన లక్ష్మణ్‌ని ఎత్తుకుని నడుస్తోంది. మేము చాలా పట్టాలు దాటుకుంటూ వాటిపైనుండే సిగ్నళ్ళను చూసుకుంటూ నడిచాం. స్టేషన్ ప్రవేశ ద్వారం దగ్గర కాస్త ఎత్తుగా A, B అని రెండు క్యాబిన్లున్నాయి. అక్కడ నుంచే క్యాబిన్ మెన్ వచ్చే పోయే రైళ్లకు సిగ్నల్స్ ఇస్తారు.

స్టేషన్ సమీపంలో మూడు రైల్వే కాలనీలున్నాయి. స్టేషన్‌కు బాగా దగ్గరలో వున్న కాలనీని' సిమెంట్ ఫైల్' అంటారు. పట్టాలకు అటూ ఇటూ వున్న తక్కిన రెండింటిలో ఒకదాన్ని 'పిల్చర్ ఫైల్' అనీ మరొకదాన్ని 'రేతి ఫైల్' అనీ అంటారు. సిమెంట్ ఫైల్‌కీ పిల్చర్ ఫైల్ కీ మధ్య జనసమ్మర్ధమైన రోడ్డు వుంది.. ఈ రెండు కాలనీల్లో పాయింట్స్ మెన్, గ్యాంగ్ మెన్ వుంటారు. ఈ కాలనీలో ఇళ్ళు ఒకదాన్ని ఒకటి అంటుకుని వరుసగా పెద్ద గొలుసు లాగా వుంటాయికనుక వీటి పేరుకు ఫైల్ అనే మాట తగిలించింది బ్రిటిష్ ప్రభుత్వం. ఇటువంటి వరుసలు ఒకదానివెంట ఒకటిగా చాలావున్నాయి.

మేము మా పెద్దన్నయ్య బాలరాజు క్వార్టరున్న పిల్చర్ ఫైల్ వైపు నడిచాము. కొంత మంది ఆడవాళ్ళు తలుపుల్లోంచీ తొంగి చూస్తున్నారు. మరికొంతమంది కుతూహలంగా చూస్తున్నారు. రెండు బాతుల వెనక నడిచే బాతుపిల్లల్లా మేము ఏడుగురం మా అమ్మా నాయనల వెనక నడుస్తున్నాం. నిజంగానే ఆ దృశ్యం అందర్నీ ఆకర్షించి వుండాలి.

బాలరాజు క్వార్టర్ చాలా చిన్నది. ఒక పెద్ద గది, వండుకునేందుకు కాస్త చోటూ, చిన్న వరండా, అంతే. మేం అందరం ఒక చోట కూర్చోడానికి కూడా చాలదు. మేం చిన్న చిన్న బృందాలుగా భోజనం చేసాం.

నాయన బాలరాజు వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

'నువ్వేం ఫికర్ జెయ్యకు ఈడ ఎక్కువ మంది ఉన్నోళ్ళంత ఇంటిముందట షెడ్డు ఏస్కుంటరు' అంటూ అక్కడ అట్లా వేసుకున్న వాటిని చూపించాడు. నాయన మరునాడు వాటిని చూసి వచ్చి అందుకవసరమైన సామగ్రి తెమ్మని బాలరాజుకి చెప్పాడు.

అది 1956వ సంవత్సరం. వేసవికాలపు సాయంత్రం. ఆరాత్రి మేమంతా ఆరుబయట పడుకున్నాం. పొద్దున లేచి చూస్తే ఖాళీ జాగాల్లో అక్కడక్కడా మంటలు కనపడుతున్నాయి. నేను నర్సిములును లేపి అవేమిటని అడిగాను. వాడు చిరాకు పడతూ

'నానిద్ర ఖరాబుజేస్తున్నవేందిరా? అవి బొగ్గు పొయిలు' అంటూ మళ్ళీ దుప్పటి ముసుగుపెట్టాడు. నేను వాటి దగ్గరకు పోయి చూశాను. అవి నిజంగా పొయ్యిలే. మూడు కాళ్లమీద నిలబెట్టిన ఒక గుండ్రని ఇనప రేకు, అడుగున బొగ్గు వెయ్యడానికి మరొక రేకు, గిన్నె పెట్టుకునేందుకు పైనున్న రేకుకు మూడు కొక్కాలవంటివి వున్నాయి. బొగ్గు అంటించి పొగంతా పోయి ఎర్రమంట వచ్చేదాకా బయట పెట్టి, తరవాత ఆపొయ్యిని పట్కారు సాయంతో లోపలికి తీసుకుపోయి వంటచేస్తారు.

మానాయనా అన్నా ఆ రోజంతా వాకిలిముందు షెడ్ వేసారు. చాలా ఏళ్లవరకూ అదే మాఇల్లు.

◆◆◆

క్వార్టర్ల వరసకి చివరగా ఒక మంచినీటి నల్లా వుంది. దాన్ని చూస్తూ, పూర్వం తనతో కలిసి పనిచేసిన కొందరు స్నేహితులను నీళ్ళు ఎప్పుడొస్తయ్యని మానాయన అడుగుతున్నాడు. ప్రతి వరస చివరా ఒక నల్లా వుంది. అయితే నీళ్ళు ఎప్పుడంటే అప్పుడు రావు కనుక వచ్చినప్పుడు వాటిదగ్గర జనం బారులు తీరి వుంటారు.

'తెల్లారి ఆరుగంట్లకు ఒస్తయ్, కని ఈ లైన్ల ఒక రూల్లున్నది. టీ ఎక్స్ ఆర్ ల పనిచేసే తుల్సీరాం ముందు నీళ్ళు పట్టుకోవాలె. ఆయన పట్టుకున్నంక తక్కినోళ్ళు పట్టుకోవాలె' అన్నాడు ఒకాయన.

'గిదేంది? వాని జాగీరా?' అన్నాడు మానాయన కుతూహలంగా.

'ఆయన పైల్ వన్. ఇంక బాపనోడు, అందుకే అట్లా ఖానూల్ పెట్టిండు'.

'గిదేంది? రేపాని సంగతి జూద్దాం' అన్నాడు నాయన.

పొద్దునే లేచి నీళ్ళు పట్టడానికి సిద్ధంగా వుండమని ఆరాత్రి మాకందరికీ చెప్పాడు. తెల్లవారే సరికి మా అన్నలు బిందెలు పట్టుకుని నల్లా దగ్గర నిలబడ్డారు. మానాయన ఒక పక్కన కూర్చున్నాడు. కొద్ది సేపటికి భుజానికి జంధ్యం వేసుకున్న ఒక స్థూలకాయుడు నల్లా దగ్గరకు వచ్చాడు. నల్లా కింద వున్న బిందెని కాలితో తన్ని,

'ఎవడ్రా నల్లకింద బిందెవెట్టింది? నేను వెట్టిన ఖానూల్ మర్చిపొయినార్రా?' అని రంకెలు పెట్టాడు.

మానాయనకి చాలా కోపమొచ్చింది. కళ్ళు ఎర్రబడ్డాయి. అతను తన్నేసిన బిందె తీసుకుని అతని మీదకు దూకినంత పని చేశాడు.

'నా బిందెందుకు తన్నినవ్? ఈ నల్ల నీ అయ్య జాగీరా?' అన్నాడు.

'కొత్తోనివారా? నీకిక్కడ ఖానూల్ తెల్వదా?' అన్నాడు తుల్సీరాం.

'ఏం ఖానూల్ రా? ఇది రైల్వే నల్ల. ఎవడు ముందొస్తె వాడు పట్టుకోవాలె' అన్నాడు మానాయన కాస్త గట్టిగానే.

అతను మానాయన వంక చూసాడు, వస్తాదులు ఒకర్ని ఒకరు సవాలు చేసుకునే పద్ధతిలో తొడకొట్టాడు మా నాయన. చుట్టూ చేరిన జనాన్ని పరకాయించి చూశాడు. తుల్సీరాం ఎవరూ అతని తరఫు మాట్లాడ్డం లేదు. మానాయనని ఎదుర్కునే ధైర్యం చాలక అక్కడనుంచీ వెళ్ళిపోయాడు. అది నిజంగా ఆ క్వార్టర్ల వరసలో వున్న వాళ్లందరి విజయం. అందకుముందున్న 'రూల్' పోయినందుకు అందరూ ఆనందించారు. అప్పటినుంచీ ముందొచ్చిన వాళ్లు హాయిగా ముందు నీళ్ళు పట్టుకుంటున్నారు.

మరునాడు నాయన మమ్మల్ని ఉత్తర లాలాగూడాలోని రైల్వే స్కూల్‌కి తీసుకుపోయాడు. అందులో హైస్కూల్ తరగతులు పెద్ద భవనంలో వున్నాయి. ప్రాథమిక తరగతులు దాన్ని అనుకుని వేసిన పెద్ద రేకుల షెడ్‌లలో వున్నాయి. స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ వుంది ఆవరణలో చాలా చెట్లున్నాయి. మా నాయన చక్కగా ఉతికి ఇస్త్రీ చేసిన యూనిఫామ్ వేసుకుని మమ్మల్ని తీసుకుని హెడ్ మాస్టర్ గదికి వెళ్ళి ఆయనకి అభివాదం చేసాడు. హెడ్ మాస్టర్ మమ్మల్ని చూసి చిరునవ్వు నవ్వాడు. బదిలీ మీద సికిందరాబాద్ వచ్చిన ఉద్యోగుల పిల్లల్ని తప్పనిసరిగా అక్కడ చేర్చుకోవాలి కనుక మాకక్కడ తేలిగ్గా ప్రవేశం దొరికింది. నర్సిములు, అంజయ్య ఆరోతరగతిలో చేరారు. నన్ను అయిదోతరగతిలో చేర్చుకున్నారు. ఆ స్కూల్లో తెలుగూ ఇంగ్లీష్ మీడియమ్‌లు రెండూ వున్నాయి. కానీ, మేము తెలుగు మీడియంలో చదివి వచ్చాం కనుక తెలుగు మీడియంలోనే చేరాము.

మొదటిరోజు స్కూల్ ఆవరణలో అంత మంది విద్యార్థులు ప్రార్థన సమావేశానికి హాజరవడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. అంత మంది విద్యార్థులను నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. ఒకటో తరగతినుంచీ పదో తరగతి దాకా విద్యార్థులంతా తరగతుల వారీగా నిలబడ్డారు. దాదాపు వెయ్యిమంది పిల్లలుంటారు. నేను అయిదో తరగతి పిల్లల వరుసలో చివర నిలబడ్డాను. జరిగేదంతా ఎంతో కుతూహలంతో గమనిస్తున్నాను. ప్రార్థన బృందగానమూ దానితో పాటు వాయించే బ్యాండ్ ఆవరణంతా ప్రతిధ్వనించింది. అబ్బసాయిలును చేర్చినప్పుడున్న మిస్టర్ ఎం. కె నర్సిమయ్యే ఇప్పుడు కూడా హెడ్మాస్టర్‌గా వున్నాడు. ఆయన ఒక ఎత్తైన వేదిక మీద నిలబడి విద్యార్థులందర్నీ గమనిస్తున్నాడు. సూట్ వేసుకుని బాగా మెరిసే బూట్లు వేసుకుని చేతిలో ఒక బెత్తం పట్టుకుని నిఠారుగా నిలబడి వున్నాడు. సమావేశం తరువాత ఆయన ముందునుంచీ తమ తమ తరగతుల్లోకి వెళ్ళే పిల్లల్ని పరిశీలనగా చూస్తున్నాడు. ఎవరు మాసిన బట్టలు వేసుకొచ్చారు? ఎవరు తల దువ్వుకోలేదు? ఎవరి గోళ్ళు పెరిగివున్నాయి? అని నిశితంగా చూస్తూ వున్నాడు. ఆయన ముందునుంచీ తరగతిలోకి వెడుతుంటే వణుకు వచ్చింది. కానీ ఆరోజుకు ఆపరీక్షలో నెగ్గినట్లే! ఆయన నన్నేమీ అనలేదు. నేను శుభ్రంగా రాగలిగినందుకు దేవుడికి మనసులో కృతజ్ఞతలు చెప్పుకున్నాను. నేను చక్కగా తయారై రావడానికి కారణం మా

అక్క బచ్చమ్మే. మేము స్కూలుకు వచ్చేముందు మేము సరిగ్గా తయారయామో లేదో చూసేది. ఈ హెడ్మాస్టర్‌ని నేను చాలా అభిమానించేవాడిని. ఆయన మూర్తిమత్వమే కాక ఆయన ప్రతి విద్యార్థి పట్ల తీసుకునే శ్రద్ధ కూడా నాకు బాగా నచ్చింది. ఆయన నాకు ఆదర్శప్రాయుడైనాడు. సరైన దుస్తులు వేసుకోడం ఎంత ముఖ్యమో ఆయన్ని చూసి నేర్చుకున్నాను. ఆ ప్రాముఖ్యాన్ని జీవితమంతా పాటిస్తున్నాను కూడా.

◆◆◆

మా స్కూల్లో వివిధ వర్గాలకు, వర్ణాలకు చెందిన రైల్వే ఉద్యోగుల పిల్లలుండేవారు. ఒకటో స్థాయి ఆఫీసర్ల పిల్లలు తప్ప. తెలుగు మీడియంలో చాలామంది కళాసీల పిల్లలున్నారు. కళాసీలంటే ఏనైపుణ్యమూ లేకుండా కేవలం రైల్వే వర్క్ షాపుల్లో పనిచేసే కూలీలు. ఇంగ్లీష్ మీడియంలో ఉన్నత స్థాయి అధికారుల పిల్లలుండేవాళ్ళు. అయితే తరగతుల్లో కూర్చున్నప్పుడు అందరూ కలిసిమెలిసి వుండేవాళ్ళు.

అవి స్కూలు తెరిచిన కొత్తరోజులు కనుక నాకు పాఠాలేమీ పోలేదు. కాకపోతే అందరికీ నేను కొత్తవాణ్ణి. మొదటిరోజు నేను నా సంచీ గట్టిగా పట్టుకుని. ఆఖరి బెంచీలో కూర్చున్నాను అందులో మానాయన కొనిచ్చిన కొత్తపుస్తకాలన్నీ వున్నయ్ కదామరి! టీచర్ అట్టెండెన్స్ పిలిస్తే మెల్లగా నీరసంగా పలికాను.

'కొత్తగొచ్చినవా? గట్టిగ పలుకు' అని గద్దించాడాయన.

నేను వణుకుతూ లేచి నిలబడి 'ఎస్ సార్' అన్నాను. టీచర్ నా వంక చూసి, 'అరేయ్, ప్రేమ్ కుమార్ వీన్ని నీ పక్కన కూర్చోబెట్టుకో' అన్నాడు. నేను భయం భయంగా లేచివెళ్ళి ప్రేమ్‌కుమార్ పక్కన కూర్చున్నాను. ఆ తరువాత మేం ఇద్దరం మంచి స్నేహితులమై పోయాం. నిజానికి నేను స్కూల్లో చదివినన్ని రోజులూ అతనే నాకు అందరికన్న మంచి స్నేహితుడు, మా అన్నయ్యల్లాగా నా అంతట నేనెవర్నీ స్నేహం చేసుకోలేను. నా దగ్గరకొచ్చిన వాళ్లతో స్నేహంచేస్తాను.

స్కూల్ వదిలిపెట్టాక అబ్బసాయిలు మమ్మల్ని పక్కనున్న చిన్న రైల్వే స్టేషన్‌కు తీసుకుపోయాడు. దానిపేరు తుకారామ్ గేట్. అక్కడ రైలెక్కి మేము సికిందరాబాద్ పోయాం.

నా కన్న చిన్నవాళ్ళైన లక్ష్మీబాయ్, యాదగిరీ దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరారు. ఇప్పుడు మేము ఆరుగురం స్కూలుకు పోతున్నాం. ఆ సాయంత్రం మా నాయన మా చదువుకు అవసరమైన వస్తువులన్నింటినీ కొత్తగా వేసిన షెడ్‌లో సర్దాడు. మేము చదువుకునేటప్పుడు మాకెటువంటి ఇబ్బందీ కలగకూడదని ఆయన ఉద్దేశం. షెడ్‌లో రెండు నులకమంచాలు వేసాడు. రెండు మూలల్లో రెండు పెద్ద లాంతర్లు అమర్చాడు. కొంతమందిమి మంచాలమీదా కొంతమందిమి క్రిందా పడుకోడానికి ఏర్పాటుచేశాడు. మేము ఖచ్చితంగా పది గంటలకి నిద్రపోయి నాలుగింటికల్లా లేవాలి.

పొద్దున పూట మేము గట్టిగా పైకి చదువుతుంటే మా నాయన అక్కడే కూర్చుని వింటూ వుండేవాడు. మధ్యలో ఎవరికైనా నిద్రొస్తే వెళ్ళి చన్నీళ్ళతో మొహంకడుక్కొచ్చి మళ్ళీ చదవాలి. తల్లవారుఝామునే లేవడం మాకు అప్పటినుంచే అలవాటై కొన్ని దశాబ్దాల తరువాత ఇప్పటికీ కొనసాగుతోంది. ఎప్పుడైనా ఆరింటికి నిద్రలేస్తే ఏదో కూడనిపని చేసినట్లుంటుంది.

◆◆◆

మేము సికిందరాబాద్ వచ్చి ఆరునెలల పైన అయింది. బాగానే కుదురుకున్నాము. మా అమ్మా, మా వదినా పొద్దున ఫలహారానికి డజన్లకొద్దీ జొన్న రొట్టెలూ. మేము స్కూలుకు తీసుకుపోవడానికి అన్నమూ పప్పూ చేస్తూ చాలా హడావుడి గా వుంటారు. మా నాయన మమ్మల్ని మధ్యాహ్నం స్కూల్లో అందరం కలిసి కూచుని అన్నం తినమంటాడు. విడివిడిగా డబ్బాలు తీసుకు పోవద్దంటాడు. మా నలుగురికీ కలిసి పెద్ద క్యారియర్ తీసుకుపోతాం. దాన్ని నేనూ అంజయ్యా వంతులవారీగా మోస్తాం. మేము ఈ క్యారియర్ ఒక చెత్తోనూ పుస్తకాల సంచీ ఒకచేత్తోనూ పట్టుకుని లోకల్ రైలుకోసం పరిగెత్తుతూ వుండడం చూసి కొందరు నవ్వుతూవుంటారు, నేనూ అంజయ్యా అప్పుడప్పుడూ ఇట్లా క్యారియర్ మొయ్యడానికి నసుగుతూ వుంటాం కానీ అబ్బసాయిలూ నర్సిములూ బాగా సంతోషిస్తూ వుంటారు.

మా చదువును గురించి మానాయన బాగా పట్టించుకుంటాడు. ఆయనకు చాలా శ్రద్ధ. మేము స్కూల్లో ఎట్లా చదువుతున్నామో అప్పుడప్పుడూ టీచర్లనికూడా అడిగి తెలుసుకుంటూ వుంటాడు. మేము స్నేహితులతో తిరిగినా ఊర్కోడు. బాలరాజు కూడా మామీద క్రమశిక్షణ అమలు జరిపేవాడు మా నాయనలాగా. ఇంట్లో మా నాయనగానీ మా అన్న గానీ వుంటే మాస్నేహితులెవరూ వచ్చేవారు కాదు.

నాకు నచ్చని విషయం మరొకటుంది. అదేమిటంటే ఒక జొన్నల బస్తానెత్తిన పెట్టుకుని రెజిమెంటల్ బజార్లో మిల్లుకి పోయి పిండి ఆడించుకు రావడం. పూర్వం మా అమ్మే పిండి విసిరేది. కానీ ఇక్కడ మేము రెజిమెంటల్ బజార్లోని పిండిమరకు పోయి జొన్నలు పిండి పట్టించుకొస్తాము. మా కుటుంబం పెద్దది కావడాన పిండికూడా ఎక్కువే పట్టించుకురావాలి. అది చూసి దారినపోయేవాళ్ళు 'హోటల్ కి తీసుకుపోతున్నావా అంత పిండి'అని వేళాకోళం చేసేవాళ్ళు. ఆదివారం వస్తే నేనూ నర్సిములూ, అంజయ్యా మా బట్టలు ఉతుక్కుని ఇస్త్రీ చేసుకునేవాళ్ళం. ఆ పని అంజయ్యకూ నాకూ అప్పగించి నర్సిములు మమ్మల్ని పర్యవేక్షించే వాడు. నేను ట్రౌజర్లు ఇస్త్రీ చేస్తే, అంజయ్య షర్టులు ఇస్త్రీ చేసేవాడు.

స్కూల్ నుంచీ వచ్చేదారిలో అబ్బసాయిలు తన స్నేహితులతో ఇంగ్లీష్లో మాట్లాడుతూ కనపడేవాడు. నేను వాడిపక్కన కూచుని ఆ మాటలు పట్టుకోడానికి ప్రయత్నించేవాడిని.

వాళ్ల మాటలు నాకు అర్థం కాకపోయినా బాగా నచ్చేవి. మా అన్నయ్య లాగా నేను కూడా ఇంగ్లీష్ నేర్చుకుని బాగా మాట్లాడాలని గట్టికోరిక నాకు. రైల్వే కోచ్‌ల మీదా వ్యాపారప్రకటనల బోర్డులలోనూ ఎక్కడ ఇంగ్లీష్ అక్షరాలు కనపడినా అవి చదవడానికి ప్రయత్నించేవాడిని. మా అన్న నేను చదివేదాన్ని సరిచేసేవాడు. గుడ్స్ వ్యాగన్ల మీద వ్రాసి వుండే 'నాట్ టు బి లూజ్ షంటెడ్' అనే వాక్యం నాకింకాగుర్తే. నాస్నేహితుడు కులకర్ణితో ఇంగ్లీష్ పదాల స్పెల్లింగుల విషయంలో పందాలు కాసేవాడిని. త్వరలోనే నాకు స్పెల్లింగులు వచ్చేస్తున్నాయి. కులకర్ణి ఒక మరాఠీ బ్రాహ్మణ గుమాస్తా కొడుకు. అతను కూడా నాకు మంచి మిత్రుడు,, జీవితకాలమిత్రుడు. ఇతనూ ప్రేమ కుమార్ కాక నాకు మదన్ కుమార్, చలపతి, సింహం అని మరి కొందరు స్నేహితులున్నారు.

◆◆◆

అది 1957. విద్యా సంవత్సరం అయిపోయి మాకు సంవత్సరాంత పరీక్షలు మొదలయ్యాయి. అబ్బసాయిలుకు బోర్డ్ పరీక్షలు. అత్యంత శ్రధగా చదువుకుంటున్నాడు. అదంతా నేను గమనిస్తూ వుండేవాడిని. వాడు రాత్రి ఒంటిగంట దాకా చదువుకునేవాడు మానాయనకి రాత్రి డ్యూటీ లేని రోజుల్లో వాడితోనే కూర్చునేవాడు. అబ్బసాయిలు కష్టపడి చదవడం అవసరమని నమ్మేవాడు. వాడు పరీక్షలో ఉత్తమ శ్రేణిలో ప్యాసై రైల్వే లో మంచి ఉద్యోగం సంపాదించాలని మానాయన ఆకాంక్షా, సంపాదిస్తాడని నమ్మకం కూడా. అతన్ని స్టేషన్ మాస్టర్ గా చూడాలనేది ఆయన చిరకాలస్వప్నం. అబ్బసాయిలు పరీక్షలు బాగా వ్రాసాడు. మా కుటుంబంలో మెట్రిక్యులేషన్ చదివిన మొదటవ్యక్తి మా అబ్బసాయిలు. మానాయన సంతోషానికి అవధులు లేవు. ఆ ఆనందంపంచుకోడానికి తన స్నేహితులందర్నీ పిలిచాడు.

'బాలయ్యా! ఇగ నీ కొడుకు టేషన్ మాస్టరైతడు' అన్నాడు ఒకాయన నాయన ఇచ్చిన కల్లు తాగుతూ

'మన పిల్లగాళ్ళకు సదువు జెప్పించాలె. సదువుకుంటె మాస్టర్లైతరు 'అన్నాడు నాయన చిరునవ్వుతో.

'అది నాతోని గానిపని బాలయ్యా !మావోన్ని కలాసి పనిలో పెట్టుమని ఫోర్మన్ని అడిగిన' అన్నాడు ఇంకొకాయన.

'నేన్ నా పిల్లగాండ్లను కడుపు గట్టుకొనైనా సదివిపించాలనుకుంటున్న ఏం కష్టమొచ్చినా వాళ్ల సదువాప' అన్నాడు మానాయన ఆయనతో.

ఈ సంభాషణ నా మనసుపై గాఢమైన ముద్ర వేసింది. ఆయన మాటలు ఆరోక్లాసులోకి వచ్చాక నేనింకా బాగా చదవాలనే దీక్షకి పునాది వేసాయి. మరింత చురుకుగా, మరింత బాధ్యతగా చదవడం మొదలుపెట్టాను.

అబ్బసాయిలుకిప్పుడు పదిహేడేళ్ళు. ఉద్యోగంలో చేరడానికి ఇంకో సంవత్సరం ఆగాలి. ఈలోగా మానాయనకు ఆర్థికంగా సహాయపడ్డం కోసం ఆయనతో కలిసి ఏవేవో

చిన్న చిన్న పనులు చేస్తున్నాడు. ఎట్లా అంటే వర్షాకాలంలో రైల్వే బిడ్జ్‌ల కింద నీటి మట్టాన్ని చూసిరావడం, లాంటివి. రాత్రి వేళకూడా పలు ప్రాంతాలకి వెళ్లవలసి వచ్చేది. ఇది మా అమ్మకు అంతగా ఇష్టం వుండేది కాదు. కానీ మానాయనకి సంతోషంగానే వుండేది. ప్రతివారికీ స్వంత సంపాదన ఎంత సంతోషమిస్తుందో చెప్పేవాడు మాకు.

ఒకనాటి మధ్యాహ్నం నేను స్కూల్ నుంచీ వచ్చేసరికి, బహుశా ఆనెల ఏడో తారీకు అనుకుంటా, జీతం అందుకున్న బాలరాజు మాకందరికీ చందమామ బిస్కెట్లు తెచ్చాడు. మానాయన మహా ఆనందంగా వున్నాడు. మా అమ్మ మాత్రం విచారంగా వుంది. అబ్బసాయిలుకు రైల్వే టెలికమ్యూనికేషన్స్ శాఖలో సిగ్నలర్ ఉద్యోగం వచ్చింది. స్టేషన్ మాస్టర్ అవడానికి ముందు ప్రతి వాళ్ళూ ఈ ఉద్యోగం చేయ్యాలి. తన కొడుకుని స్టేషన్ మాస్టర్‌గా చూసుకోవాలన్న కల నిజం కాబోతున్నందుకు మానాయనసంతోషానికి ఎల్లలు లేవు. అబ్బసాయిలు శిక్షణ కోసం భుసావల్ వెడుతున్నందుకు అమ్మకి దిగులుగావుంది.

ఇప్పుడు అబ్బసాయిలు మూడవ తరగతి అధికారి అవుతున్నాడు కనక ఇంకొంచెం మంచి బట్టలు, బూట్లు కావాలి. అందుకోసం మానాయన ఒక సహకార ఋణసంస్థనుంచీ కొంత అప్పుతీసుకుని మాఅన్నకు నాలుగుజతల బట్టలు కుట్టించాడు. మంచి బూట్లు కూడా కొన్నాడు. మామూల రేకుపెట్టె ఇచ్చి పంపకుండా ఒక తోలుపెట్టె (leather suitcase)కూడా కొన్నాడు మాఇంట్లో అటువంటి పెట్టె అదే మొదటిది.

అబ్బసాయిలు బయలు దేరబోయే సమయానికి, చాలాకాలం తరువాత మా తాత మమ్మల్ని చూడ్డానికి వచ్చాడు. ఆయన బాగా పెద్దవాడైనాడు. కాస్త వొంగిపోయి వున్నాడు. కర్రపట్టుకుని నడుస్తున్నాడు. ఆయనెప్పుడొచ్చినా మేం ఆయన చుట్టూ మూగి కథలు చెప్పమని వేధించేవాళ్ళం. ఆయన మాకు దెయ్యాల కథలు చెప్పేవాడు. మాతాత అంటే మాకు చాలా ఇష్టం. ఆయన చుట్టలోకి పొగాకు నింపిపెట్టడం నాకు సరదాగా వుండేది. అప్పటికి ఆయనింకా చుట్ట ముట్టించుకోడానికి చెకుముకి రాయే ఉపయోగిస్తున్నాడు. ఒక ఇనపముక్కా కాసిని గులకరాళ్ళు కాస్త నారపీచూ సాయంతో నిప్పు రగిలించి, నారపీచు అంటించి దానితో చుట్టముట్టించేవాడు కొన్ని దమ్ములు లాగిన తరువాత ఆ చుట్టని ఆర్పి తన తలపాగాలో దాచుకునేవాడు మళ్ళీ కాల్చుకోడానికి. కొత్త బట్టలు కట్టుకుని బయలుదేరబోతున్న అబ్బసాయిలు వంక ఆయన తృప్తిగా చూశాడు. మానాయన వైపు తిరిగి,

'నా మనుమడు జూడు రామస్వామి లాడ్ సాబ్ లెక్క నడుత్తాండు' అన్నాడు

'అవునయ్యా, నా కొడుకు మాస్టర్ లెక్క వున్నడు' అన్నాడు నాయన చిరునవ్వుతో

ఆ ఇద్దరూ అతని వంక కన్నార్పకుండా చూస్తూ వుండగానే అబ్బసాయిలు వెళ్ళిపోయాడు.

సిగ్నలర్‌గా చేరిన అబ్బసాయిలు త్వరలోనే స్టేషన్ మాస్టర్ అయ్యాడు. తరువాత విద్యా విషయకమైన ఆసక్తితో ఆ ఉద్యోగాన్ని వదిలిపెట్టి పైకి చదువుకుని అధ్యాపక వృత్తిలోకి వెళ్ళాడు. మానాయనకి అది నచ్చలేదు ఎందుకంటే ఆయన దృష్టిలో స్టేషన్ మాస్టర్ పదవి ఎక్కువ. గౌరవనీయమైనది.

◆◆◆

1957 వ సంవత్సరంలోనే రైల్వే శాఖ తన ఉద్యోగులకు రేషన్లనూ, ఇంటి సరుకులనూ తక్కువ ఖరీదుకు అందచేసే పద్ధతి రద్దు చేసింది. రైలు మార్గాల బహుముఖ విస్తరణ వల్ల. రైల్వే ఉద్యోగుల సంఖ్య విపరీతంగా పెరగడం ఇందుకు కారణం కావచ్చు. ఇది ఉద్యోగులకు హఠాత్తుగా తగిలిన ఊహించని దెబ్బ. దీని ప్రభావం మా కుటుంబంమీద కూడా బాగానే పడింది. పెద్ద కుటుంబాలు స్థానికంగా వున్న పచారికొట్లలో సరుకులు అప్పు తెచ్చుకోవలసి వచ్చింది. అట్లా వాళ్ళు శాశ్వతంగా ఋణగ్రస్తులై పోయారు.

ఆ విద్యా సంవత్సరం కష్టాలతో ప్రారంభం అయింది. ప్రతి సంవత్సరం మొదట్లో మానాయన మా పుస్తకాలకోసం తన ప్రావిడెంట్ ఫండ్ నుంచీ అప్పుతీసుకుంటున్నానని అమ్మతో చెబుతూ వుండేవాడు. షెడ్యూల్డ్ కులాల విద్యార్థులగా మాకు కొంత స్కాలర్ షిప్ వచ్చేది. కానీ అది చాలా స్వల్ప మొత్తం. వాటితో మా ఒక్కొక్కరికీ ఒక జత యూనిఫామ్ కూడా వచ్చేదికాదు. ఆ తెచ్చిన అప్పు మా చదువుకుతప్పమరి ఏఅవసరానికీ వాడనని చెప్పేవాడు. ఈ సంవత్సరం మా చదువుకోసం బాలరాజుకూడా అప్పుతీసుకోవాల్సి వచ్చింది.

నేను ఎంత పెద్ద పాఠాన్నైనా తేలగ్గా కంఠస్థం చేసి జ్ఞాపకం వుంచుకునేవాణ్ణి. అందువల్ల ఎప్పుడూ క్లాసులో ప్రథమ స్థానంలోనే వుండేవాడిని. కానీ నాకూ ప్రత్యర్థులు వుండేవాళ్ళు. అందులో ఎక్కవ పోటీకి వచ్చేది మదన్‌కుమార్. ఇతనితోనే నాకు బాగా పోటీ వుండేది. అతనికి లెక్కల్లో నూటికి నూరు మార్కులొచ్చేవి. నాకు తక్కిన సబ్జెక్టుల్లో బాగా వచ్చేవి. అందుకే అతనికన్న ముందుండేవాణ్ణి. అతనికి అసూయ జాస్తి. దానికితోడు కులాధిక్యత. అతనూ అతని స్నేహితులూ. నా కులం ప్రసక్తి తెచ్చి నన్నెప్పుడూ ఏడిపిస్తూ వుండేవాళ్లు. నేను క్లాసులోకి అడుగుపెట్టగానే అతను తన స్నేహితులకి అక్కడున్న గోడ చూపించి 'ఇది ఎవరిది?' అని అడిగేవాడు. వాళ్ళు 'మాది' అనేవాళ్ళు. అప్పుడు మళ్ళీ 'ఇదేమిటి?' అని అడిగేవాడు. వాళ్ళు 'గోడ' అనేవాళ్లు అప్పుడతను ఆరెండు సమాధానాలనీ కలిపి చెప్పమనేవాడు. వాళ్ళు వెంటనే 'మాదిగోడా' అని అరిచేవాళ్లు. అంటే మాదిగ కులానికి చెందిన వాడు అని అర్థం. నేను చాలా అవమాన పడేవాడిని. బాధపడేవాడిని. కానీ ఎప్పుడూ వాళ్లకి ఎదురు సమాధానం చెప్పలేదు. అ బృందానికి వ్యతిరేకంగా నా తరఫున ఎవరూ మాట్లాడరని నాకుతెలుసు. అప్పుడే నాకు నా క్లాస్‌లో వుండే పండరి, కృష్ణ, బాలయ్య అనే వాళ్లతో స్నేహం అయింది. పండరి మంచి ఫుట్ బాల్ ఆటగాడు.

మా స్కూల్లో ఆటలాడుకోడానికి మంచి అవకాశాలున్నాయి. హాకీకీ ఫుట్ బాల్‌కీ మంచి మైదానాలున్నాయి. అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో మాస్కూలుకు ఈ ఆటల్లో ఎప్పుడూ విజయమే. మాకు ఇష్టమైన మరొక ఆట కబడ్డి. నర్సిములు కబడ్డి బాగా ఆడతాడు. ఎప్పుడూ స్కూల్ టీమ్‌లో వుండేవాడు. మా పి.టి. (ఫిజికల్ ట్రైనింగ్ టీచర్) చాలా నిబద్ధత కలవాడు. మాతో చాలా కఠినంగా వ్యవహరించేవాడు. క్రీడా స్ఫూర్తిలోపించినా, ప్రవర్తన బాగుండకపోయినా ఎవర్నీ క్షమించేవాడు కాదు. నేను చదువులో ముందున్నా, ఆటల పట్ల అంత ఆసక్తి చూపించేవాడిని కాదు. అందువలన పి.టి. టీచర్ కి నేనంటే అసంతృప్తిగా వుండేది. ఆయన తన క్లాసులో ఎవరినీ సోమరిగా కూర్చోనిచ్చేవాడు కాదు. బహుశా అందుకే నాపట్ల అసంతృప్తి. ఆయన అప్పుడప్పుడూ పిచ్చి తిట్లు తిట్టేవాడు పిల్లలతో మాట్లాడేటప్పుడు 'ఏంబే' 'ఏమిట్రా' అనేవాడు. అయినా ఆయన మనసు మంచిదని పిల్లలు ఆయన్ని ఇష్టపడేవాళ్ళు. హెడ్ మాస్టర్ తరువాత ఆయనే అందరికీ ఇష్టుడు.

పిల్లలంతా తన క్లాసుకు ఖచ్చితంగా నీలంరంగు నిక్కర్లూ చేతులులేని బనియనూ వేసుకురావాలని చెప్పేవాడు. అట్లా వేసుకురానివాడు క్లాసు అయిపోయేవరకూ ఆట మైదానంలో ఆగకుండా పరిగెత్తాలి. ఆశిక్ష నాక్కూడా పడింది ఒకసారి. అట్లా పరిగెత్తి ఇంటికి రాగానే నొప్పితో నేలమీద పడిపోయాను. మాటీచర్ ను తిడుతూ మా అమ్మ నావొంటికేదో నొప్పులుతగ్గే మందు పూసింది, మా నాయన పాత ట్రౌజర్లు చించి కుట్టించిన నిక్కర్లున్నయ్ గానీ మాకు బనియన్లు లేవు. ఈ సంఘటన తరువాత మానాయన మాకు కొన్ని బనియన్లు కొనుక్కొచ్చాడు.

ఆ మరునాడు మాజాగ్రఫీ టీచర్ రాలేదు. ఎప్పుడు ఏటీచర్ రాకపోయినా ఆక్లాసు తీసుకునే బాధ్యత పి.టి. టీచర్ ది. ఆయన తన క్లాసులో తప్ప ఇతర క్లాసులు తీసుకునేటప్పుడు పిల్లల్ని మైదానంలోకి తీసుకుపోడు. అప్పుడు మాకు సాంఘిక మర్యాదల గురించి, సభ్యత గురించీ చెప్పేవాడు. ఆ క్లాసు మాకు ఆసక్తికరంగానూ ఇష్టంగానూ వుండేది. తెలుగు మీడియంలో పిల్లలు చాలామంది క్రింది తరగతి ఉద్యోగులపిల్లలు. మాకు సభ్యత గురించి తెలుసుకోవాలని బాగా ఆసక్తిగా వుండేది.

'ఎక్కడైన పార్టికి పోయినప్పుడు కప్పుల టీ ఇస్తే ఎట్ల తాగుతర్రా?' అన్నాడు మా పి.టి. టీచర్.

'సాసర్ల వోసుకుని తాగుతం సార్' అన్నాం అందరం ఒక్కసారిగా.

ఆయన గట్టిగా నవ్వి 'అట్ల గాదురా! సాసర్ మర్యాదకు ఇస్తర్రా! అండ్లవోస్కోని కుక్కలెక్క లపలప తాగేది మర్యాద కాదురా! సాసర్ చేతిల పట్టుకుని కప్పులకెల్లి చాయ్ మెల్లెగ తాగాలె. అది మర్యాదరా!' అన్నాడు అది నిజంగా ఆశ్చర్యకరమైన సంగతే మాకు. ఆయన మాకు ఎక్కడికి వెళ్ళేటప్పుడు ఎటువంటి దుస్తులు ధరించాలో, టై ఎట్లా కట్టుకోవాలో

అందులో ఒకేముడి ఎట్లా వేసుకోవాలో రెండు ముళ్ళు ఎట్లా వేసుకోవాలో అన్నీ చెప్పేవాడు. ఆయన క్రిష్టియన్ అయినందున భోజన మర్యాదలగురించీ, బఫే భోజనాల గురించీ అన్నీ తెలుసు ఆయనకు. అవన్నీ మాకు చెప్పేవాడు.

'డైనింగ్ టేబిల్ మీద ఎట్ల తింటరో తెలుసారా?' అన్నాడు.

'తెల్వదు సార్' అన్నాం అందరం ఒక్కసారి మళ్ళీ. అప్పుడాయన మాకు టేబిల్ మీద వుంచిన నాప్కిన్‌ను ఎట్లా మడవాలో, కత్తులనూ ఫోర్కులనూ, చెంచాలనూ ఎప్పుడెప్పుడు ఏవిధంగా వాడాలో చెప్పాడు. పార్టీల్లో ఏ ఏ భోజన పదార్థాలుంటాయోకూడా చెప్పాడు సూప్ అనేది ఒకటుంటుందని చెప్పాడు. కత్తితో ఒక మాంసం ముక్కని గానీ బ్రెడ్ ముక్కనుగానీ చప్పుడు కాకుండాఎట్లా కొయ్యాలో చెప్పాడు. ఇవ్వన్నీ చెప్పి 'తిన్నంక సాలని ఎట్ల జెప్తర్రా?' అని అడిగాడు.

'మకు సాలంటం సార్' అన్నాం.

ఆయన నవ్వి, 'అట్ల గాదురా ! మీ స్పూన్‌ను ఫోర్క్‌ను బోర్ల వెట్టాల. అప్పుడు మాకొద్దని అన్నట్టు' అన్నాడు. ఎవరైనా టీచర్ రానపుడు ఆయన మాక్లాసు తీసుకుంటే ఇట్లా నడుస్తుంది. ఆ క్లాసు మాకెప్పుడూ విసుగనిపించదు. నాకు ఆయన మైదానంలో వున్నప్పటికంటే క్లాస్‌లో వున్నప్పుడే బాగా నచ్చేవాడు. ఆరోజు ఆయన క్లాసయన తరువాత నన్ను పిలిచి 'అరెయ్ సత్తి! నువ్ బాగ సదువుతవ్ బాగనె వుంది. కని బలంగ గూడ వుండాలె గద' అన్నాడు. నాకేం చెప్పాలో తెలియక మాట్లాడకుండా వుండిపోయాను. నాకు తెలుసు నేను బలహీనంగా వుంటాననీ అట్లా కనపడతాననీ ఎంత సన్నం అంటే మా ఇంట్లో నన్ను 'బక్కోడు' అంటారు.

'రోజొక అద్దగంట రన్నింగ్ జెయ్ ఒచ్చే యేడాది నిన్నుఫుట్ బాల్ టీం ల పెడుత' అన్నాడు మళ్ళీ ఆయనే.

'అట్లనే సార్! ప్రాక్టీస్ జేస్త 'అన్నాను.

◆◆◆

మాతాత ఇప్పుడు మాతోనే వుంటున్నాడు. మాదగ్గర ఒక మేకల మంద వుంది. దాన్ని ఆయన రోజూ మేతకు తోలుకుపోయేవాడు. ఆదివారాల్లోనూ ఎప్పుడైనా సెలవు వచ్చినప్పుడూ నేనూ ఆయనతో పోయేవాణ్ణి. ఆయన వాటిని రైల్వే రిక్రియేషన్ గ్రౌండ్స్ లోని ఖాళీ జాగాలో వదిలేవాడు. ఆరోజుల్లో, ఆమాటకొస్తే 1970 లదాకా కూడా, ఆ జాగాలో ప్రవేశం మీద నిషేధమేమీ లేదు. ఒక చిన్న స్టేడియం చుట్టూ రెండు మూడు మైళ్ల పొడుగున్న ప్రహరీ గోడ వుండేది. లోపల చాలా పెద్ద ఖాళీ జాగా వుండేది. దానిపక్క నివాసాలు లేని గుట్టలాంటిప్రదేశం వుండేది. దాన్ని' అడ్డగుట్ట' అనేవాళ్ళు. మేకలు అక్కడ మేస్తుంటె మేము ఆ గుట్టల మీదనుంచీ ఎక్కి దూకుతూ ఆడుకునే వాళ్లం మమ్మల్ని కనపడకుండా పోవద్దంటూ తాత కేకలుపెట్టేవాడు. అయితే ఒక ముప్పై ఏళ్లల్లో

అడ్డగుట్టలో చాలా భౌగోళిక పరిణామాలొచ్చాయి. అక్కడ తీరైన రోడ్లూ వందలాది ఇళ్ళూ వెలిసినయ్.

సాయంత్రంపూట మేకల్ని షెడ్‌లో ఒక మూల కట్టేసేవాళ్ళం. లాంతర్లల్లో కిరోసిన్ పోసి వెలిగించి పెట్టేవాళ్ళం. మేం పడుకునే మంచాల నులక వదులైతే మాతాత వాటిని బిగించేవాడు. ఆయనా లక్ష్మణ్ ఒక మంచం మీదా, నర్సిములూ అంజయ్యా మరొక మంచంమీదా పడుకునేవాళ్ళు. నేనూ యాదగిరీ మంచాలకింద దూరి పడుకునేవాళ్లం. వర్షాకాలం వస్తే చాలా ఇబ్బంది పడేవాళ్ళం. వర్షం బాగా వస్తే తెల్లవార్లూ నిద్ర ఉండేదు కాదు. మేకలు తడిసిపోయి అటు ఇటూ తిరుగుతూ బాగా అరుస్తూ వుండేవి కప్పులోనుంచీ పడే వర్షపు చినుకులు నేలమీద పడకుండా వుండడానికని వాటి కింద గిన్నెలు పెట్టేవాళ్ళం. ఆ గిన్నెల్లో పడే నీటి చుక్కల చప్పుడుకు కూడా బాగా మెలకువ వచ్చేసేది మాకు. మేం అప్పుడప్పుడు లేచి ఆ గిన్నెల్లో నీళ్ళు పారబోసి మళ్ళీ పెట్టాల్సొచ్చేది. ఒక్కొక్క సారి నేలంతా బాగా తడిసిపోయి మేం మంచాలెక్కి కూర్చోవాల్సి వచ్చేది.

ఆ రోజుల్లో మేమందరం ఒకేసారి బారుగా కూచుని రాత్రి భోజనం చేసేవాళ్ళం. మా తాతతో కలసి మేం పదముగ్గురం. అంతమందికీ మా అమ్మా మా వదినా పెద్ద గిన్నెలలోనుంచీ అన్నం తీసి పెట్టేవాళ్ళు. మేం మౌనంగా తినేవాళ్ళం. తినేటప్పుడు మాట్లాడితే మా నాయన ఒప్పుకోడు. ఎక్కువగా భోజనంలోకి జొన్న రొట్టె, పప్పు, ఇంకేదైనా ఒక కూర వుండేది. శుక్రవారాలు మాత్రం మేకమాంసం వండేవాళ్ళు. మా అమ్మ అందరికీ కొన్ని ముక్కలు వచ్చేటట్టు జాగ్రత్తగా చూసి పెట్టేది. మా తాతా మా నాన్నా ఇత్తడి గిన్నెలు చేతిలో పెట్టుకుని తినేవాళ్లు. మేము సత్తుపళ్ళాలలో తినేవాళ్లం. మేమంతా ఒక ఉమ్మడి కుటుంబంగా వున్నన్ని రోజులూ ఇట్లా రాత్రి పూట అందరం కలిసి భోజనం చేసేవాళ్ళం. ఎవరి కుటుంబం వాళ్లకి ఏర్పడ్డాక ఆకుటుంబాలలో వ్యక్తులం కూడా ఈ పద్ధతినే పాటిస్తున్నాం. అయితే ఇప్పుడు అన్ని కుటుంబాలూ కోరుకున్న వంటలు చేసుకుని డైనింగ్ టేబిల్ మీద తింటున్నారనుకోండి. అయినప్పటికీ ఆరోజుల్ని తలచుకోడం బాగుంటుంది. ఉన్నదేదో అందరం పంచుకు తినడంలోని ఆనందమే వేరు!

◆◆◆

మానాయనకి యాత్రలంటే చాలా యిష్టం. 1958 వేసవిలో మేము ఉత్తర హిందుస్థానం లోని ఋషీకేశ్ వెళ్ళాం. ఆ యాత్రాస్థలంలో గంగానది ప్రవహిస్తూ వుంటుందని ఆయనకు ఒక స్నేహితుడు చెప్పాడు. అప్పటినుంచీ అక్కడికి వెళ్ళిరావాలని ఆయన కోరిక. మా అమ్మా, మావదినా మా అక్క బచ్చమ్మా ప్రయాణ సన్నాహాలు మొదలుపెట్టారు. మాకు వారం పదిరోజులకు సరిపడే చిరుతిళ్ళు తయారుచేసారు. మూడు నాలుగు రోజులకు పనికొచ్చేటట్టు పూరీలూ పచ్చళ్ళూ చేశారు. మాకు ప్రయాణానికి

ఖర్చులేదు. ఫ్రీ పాస్‌లున్నాయి అయితేవాటికి రిజర్వేషన్లుండవు. మానాయన ఎప్పుడూ రిజర్వేషన్ చెయ్యలేదు.

ప్రయాణానికి సిద్ధంగా మేమంతా దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ కోసం నిరీక్షిస్తూ సికిందరాబాద్ స్టేషన్‌లో నిలబడ్డాం. మాకు చాలా సామానుంది. అందరం తలా ఒకటీ అప్పచెప్పుకున్నాం. బియ్యమూ పప్పులూ, ఉప్పులూ నూనే వగైరా వంటదినుసులున్న పెద్ద ట్రంకుపెట్టె బాలరాజు నెత్తిన పెట్టుకున్నాడు. అక్కడక్కడా ఆగినప్పుడు వండుకు తినడానికన్నమాట అవ్వి వండిన అన్నమూ పప్పూకూరలూ వున్న ఒక చిన్న పెట్టె మా వదిన పట్టుకుంది. అవి రైల్లో తినడానికి.. మానాయన మా పదమూడు మంది బట్టలు పెట్టిన పెద్ద పెట్టె నెత్తిన పెట్టుకున్నాడు. కొన్ని కట్టెపుల్లల్ని కూడా గుడ్డలో చుట్టి పట్టుకుపోతున్నాము. దీన్ని నర్సిములూ అంజయ్యా వంతులవారీగా మోస్తున్నారు. మేము సామాన్ల చుట్టూ నిలబడి రైలు వచ్చే దిక్కుకేసి చూస్తూ నిలుచున్నాము. మేము ఎక్క వలసిన జనరల్ బోగీలోకి సామాన్లు చేరవేయడంలో సహాయ పడడానికి బాలరాజు స్నేహితులొచ్చారు. వాళ్లతోమాట్లాడుతున్నాడు బాలరాజు. రైలు వచ్చి ఆగగానే బాలరాజు స్నేహితుల సాయంతో మాకందరికీ సీట్లు దొరికాయి. నేనూ లక్ష్మి బాయీ కిటికీ దగ్గర సీటుకోసం పోట్లాడుకుని వంతులప్రకారం కూచోవాలని అంగీకారాని కొచ్చినట్లు గుర్తు. ఆరోజుల్లో థర్డ్ క్లాస్ బోగీలు సన్నటి పొడుగాటి గదుల్లాగా వుండేవి. కూచునే చెక్క బెంచీలు ఒక దానికొకటి ఎదురుగా వుండేవి. నెత్తిమీద చిన్న చిన్న ఫ్యాన్లుండేవి కిక్కిరిసి వుండే బోగీల్లోకి ఆ ఫ్యాన్లు చాలినంత గాలి సరఫరా చేసేవి కావు. చాలా స్టేషన్లలో ఒకే జత రైలు పట్టాలుండేవి. అంటే ఎదుటి వైపు నుంచీ మరో రైలు వచ్చేదుంటే మన రైలు ఏదో ఒక స్టేషన్లో చాలా సేపు ఆగాలి. ఆవిరి ఇంజన్లు రైలు వేగంగా నడిచేటప్పుడు కావల్సినంత పొగ వదిలేవి. నేను కిటికీదగ్గర మా నాయన ఒళ్ళో కూచుని రైలు పరిగెత్తేటప్పుడు చెట్లూ చేమలూ ఎదురు వైపు వెడుతూవుండడం చూస్తూ వుండేవాడిని. ఎన్నో సార్లు నాకళ్లల్లోకి పొగా దుమ్మూ పోయేవి. సాయంత్రానికి మేము నాగపూర్ చేరాము. అక్కడ మా నాయిన ఒక బుట్టెడు కమలాపళ్ళు కొన్నాడు. మా అమ్మ రెండు మూడు గంటలకొకసారి మాకు ఏదో ఒక చిరుతిండి పెట్టేది. రాత్రి అన్నంతిన్నాక మా నాయన బాలరాజూ పెట్టేల్లోనుంచీ దుప్పట్లు తీసి బెంచీల మధ్య కిందపరిచారు. మేం వాటిమీద పడుకుని నిద్రపోయాం.

ఒక పగలూ ఒక రాత్రీ రైల్లో గడపడం ఒక కొత్త అనుభవం మాకు. ఉయ్యాల ఊగుతున్నట్టు రైలు ఊపు బాగుంది. వేగంగా పోతూ అది చేసే శబ్దమూ బాగుంది. తెల్లవారగానే మిగతా ప్రయాణీకుల కన్న ముందు మమ్మల్ని నిద్రలేపారు. మేము మొహాలు కడుక్కుని తయారైపోయాం. అప్పుడు మా అమ్మా, వదినా మాకు పులిహోర పలహారం పెట్టారు. ఇప్పుడు నేను రైళ్లల్లో ఫస్ట్ క్లాస్ బోగీలో ప్రయాణిస్తున్నా తోటిప్రయాణికులు ఇంకా నిద్రలో వుండగానే ముందు లేచి నా టాయిలెట్ పన్లు ముగించుకుంటాను.

ఆరోజుల్ని తల్చుకంటే నవ్వొస్తూ వుంటుంది. మధ్యాహ్నం అయ్యేసరికి రైలు కొండలమధ్యగా వెడుతున్నది. కొండలమధ్య రైలు ఒక పాములా పాక్కుంటూ పోవడం చూస్తుంటే అద్భుతంగా వుంది. ఉండి ఉండీ హఠాత్తుగా అంతా చీకటిమయం. అట్లా మొదటిసారి అయినప్పుడు పిలల్లందరం భయంతో కేకలు పెట్టాం. నేను మానాయనని గట్టిగా పట్టుకున్నాను. ఇంతలోనే వెలుతురొచ్చేసింది.

'దబుక్కున చీకటెందుకైందే నాయనా, నాకు భయమైతాంది' అన్నాను

'ట్రెయిన్ సొరంగంలకు పోయింది' అన్నాడు ఆయన నవ్వుతూ. సొరంగం అంటే ఏమిటని అడిగితే మానాయన ఒక టీచర్ లాగా దాన్ని గురించి చెప్పాడు. ఒక కమలా పండుతీసుకుని దాని మధ్యలోనుంచీ ఒక కన్నం పెట్టాడు.

'చూడు! ఇది ఒక కొండ అనుకో ! దీని నడుమ కన్నంపెట్టిన. గట్లనే కొండ నడుమిట్ల ఒక రంధ్రం బెడితే అది సొరంగం అయితది.. అండ్లకెల్లి రైలు వోతుందన్నమాట. సొరంగంల ఎండ రాదు గనక చీకటైతది' అంటూ ఆయన వివరిస్తూండగానే మరో సొరంగం వచ్చి మళ్ళీ చీకటైంది. కానీ ఈ సారి భయం వెయ్యలేదు.

ఆ సాయంత్రానికి మేము ఢిల్లీ చేరాం. ఢిల్లీ ప్లాట్‌ఫామ్ చాలా పెద్దది. మా అమ్మ మేమెవరం తప్పిపోకుండా కనిపెట్టుకుని వుంది. అక్కడ మేమొక సత్రానికి వెళ్ళాం. అది సామాన్య ప్రజలకోసం కట్టినది. అక్కడ ఉమ్మడి స్నానాల గదులూ పడుకోడానికి వరుసగా మంచాలూ వున్నాయి. ఇక్కడ కూడా మేం అందరికన్నముందు లేచి స్నానాలు చేసాం. ఎక్కువ సేపు కిటికీ పక్క కూచోడం వల్ల తలలో పేరుకుపోయిన దుమ్మంతా స్నానంతో వదిలిపోయి హాయిగా అనిపించింది. మేం తెచ్చుకున్న పచ్చడీ పూరీలూ ఫలహారం చేశాం. తరువాత ఢిల్లీ నగరం చూడ్డానికి కాలినడకన బయల్దేరాం. ఢీల్లీలోని వెడల్పైన రోడ్లని చూస్తే ఆశ్చర్యమేసింది. టాంగాలతో సహా రకరకాల వాహనాలు తిరుగుతున్నాయి ఆ రోడ్లమీద మేం కన్నాట్ ప్లేస్ అనే చోటికి వెళ్ళాం అక్కడ ఆరోజుల్లోనే పెద్ద పెద్ద భవనాల్లో దుకాణాలున్నాయి. మమ్మల్ని ఊరు తిప్పి చూపించడానికి మా నాయన రెండు టాంగాలు మాట్లాడాడు. మేం లాల్‌ఖిలా, జంతర్ మంతర్, ఇండియాగేట్ రాష్ట్రపతి భవన్, వంటి ముఖ్యమైన వన్నీ చూశాం. మేము ఆ పూటకి కొద్ది వస్తువులే పట్టుకెళ్ళాం. మళ్ళీ సాయంత్రానికి ఋషీకేశ్ రైలెక్కాలి కదా!

ఋషీకేశ్ రైల్లో కూడా మాది జనరల్ బోగీనే. పెద్ద పెద్ద నదులమీద కట్టిన వంతెనలమీదనుంచీ రైలు వెడుతూ వుంటే ఒళ్ళు పులకిరిస్తుంది. ఎంత అద్భుతంగా వుంటుందో! మానాయన గంగా నదిలో వెయ్యమని నాకొక పైసానాణెం కూడా ఇచ్చాడు. అది గంగా దేవతకి అర్పణం అన్నమాట. గంగా నదిలో స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయని ఒక నమ్మకం. మరునాడు ఋషీకేశ్ చేరాం. చుట్టూ పెద్ద పెద్ద వృక్షాలతో వుండే కొండప్రాంతం అది. పక్కనే గలగలా పారే గంగా నది. మేం వెంటనే స్నానాల ఘాట్ కు

వెళ్ళి నదిలో స్నానం చేశాం. నీళ్ళు చల్లగా మంచు ముట్టుకున్నట్టువున్నాయి. ఒణుకొచ్చింది మా నాయనా, బాలరాజూ నదిలోకి బాగాలోతుగా వెళ్లారు. తరువాత పొడిబట్టలు వేసుకుని దేవాలయానికి వెళ్ళాం. హిందువుల పొరుగున వుండడం వలన వాళ్ల అలవాట్లు తెలుసుకుని దేవాలయాల్లోకి వెళ్లడం మాకు సులువుగానే వుంది. తరువాత సత్రానికి వెళ్ళి పలహారం చేశాం. అక్కడనుంచీ నదిమీద కట్టిన అద్భుతమైన 'లక్ష్మణ్ ఝూలా' అనే వంతెన చూడ్డానికి పోయాం. అది కాలినడక వంతెన. మనం నడుస్తుంటే అది కంపిస్తుండడం, గాలికి ఊగడం కూడా తెలుస్తూ వుంటుంది. అదట్లా ఊగుతుంది కనుకే దానికి ఝూలా (హిందీలో ఉయ్యాలఅని అర్థం) అని పేరుపెట్టారని మానాయన చెప్పాడు. దాన్ని రాముడి తమ్ముడు లక్ష్మణుడు నిర్మించాడు కనుక లక్ష్మణ్ ఝూలా అంటారని కూడా చెప్పాడు.

మళ్ళీ మేం మా ఇంటికి తిరిగి ప్రయాణం! తెచ్చిన వంటదినుసులూ, తిండీ చాలా వరకు అయిపోయాయి కనుక ఇప్పుడంత సామాను లేదు. అసలు ఇందుకోసమే త్వరగా తిరుగు ప్రయాణం అయ్యాం. ఇల్లు విడిచిన పది పన్నెండు రోజులకు మళ్ళీ సికిందరాబాద్ చేరాం. ఎంత ఆనందమిచ్చిందో అంత అలసట కూడా కలుగచేసింది ఈ యాత్ర. ఇంత సుదీర్ఘ ప్రయాణం ఇంతమందితో సమర్థించుకు రావడం, రైళ్ళు మారేటప్పుడో మేము కాలకృత్యాలకు పోయినప్పుడో మాలో ఎవరూ ఎక్కడా తప్పిపోకుండా చూసుకోడం మా అమ్మకి పెద్ద పనే అయింది. ఇంటికొచ్చి ఊపిరిపీల్చుకుంది. ఇంతమందితో ఇట్లాంటి పెద్ద ప్రయాణం పెట్టినందుకు నాయనను సతాయించేది. ఇంకెప్పుడూ ఇట్లాంటివి పెట్టొద్దని చెప్పింది. కానీ, అదొక అద్భుతమైన యాత్ర! బెర్తులూ రిజర్వేషన్లూ లేకుండా ఇంతమందితో అంత దూరప్రయాణాన్ని మానాయన ఎట్లా నిర్వహించగలిగాడో అని ఇప్పుడు ఆశ్చర్యపోతూ వుంటాను.

◆◆◆

వేసవి సెలవుల అనంతరం మళ్ళీ స్కూళ్ళు తెరిచారు. నర్సిములూ, అంజయ్యా నేనూ పై తరగతుల్లోకి వచ్చాం. స్కూల్ తెరిచిన తరువాత చాలా రోజులు నా స్నేహితులకి మా యాత్ర గురించీ ఢిల్లీ నగరం గురించీ చెప్పేవాణ్ణి. యాదగిరి లక్ష్మీబాయ్ రైల్వే ప్రాథమిక పాఠశాలలో చేరారు. లక్ష్మణ్ ఇంటిదగ్గరున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పోతున్నాడు. యాథాప్రకారం మానాయన మా స్కూల్ ఖర్చులకోసం ప్రావిడెంట్ ఫండ్ లోనుంచీ అప్పుకోసం దరఖాస్తు చేసాడు. ఈ సంవత్సరం ఆయన మాకు ఎవరి అన్నం వాళ్ల డబ్బాల్లో తీసుకుపోవడానికి అనుమతించాడు.

నర్సిములు, అంజయ్యా సగటు విద్యార్థులు. ఒక్కొక్కసారి అంతకన్న తక్కువగా కూడా వుండేవాళ్ళు. నాకెప్పుడూ తరగతిలో ప్రథమ స్థానమే. కాకపోతే లెక్కల విషయంలో బాగా కష్టపడవలసి వచ్చేది. ఇంట్లో లెక్కలు చెప్పించుకోడానికి ఎవరూ లేరు. నాకు

అన్నీ బట్టీ పట్టడం అలవాటు కనుక లెక్కలు కూడా బట్టి పట్టడానికి చూసేవాడిని, కానీ అవి అర్థంచేసుకుని చెయ్యాలి కదా? నేను ఇంగ్లీష్లో బాగా రాణించేవాణ్ణి. ఒక్కొక్కప్పుడు నా సహాధ్యాయులు నా చేత ఇంగ్లీష్ లో సెలవు చీటీలు వ్రాయించుకునేవాళ్ళు. మాకున్న మంచి టీచర్లలో మా ఇంగ్లీష్ టీచర్ సీతారామశాస్త్రి ఒకరు. ఆయన ఇంగ్లీష్ పాఠం చెప్పేటప్పుడు ఒక్క తెలుగు పదం కూడా ఉచ్ఛరించేవాడు కాదు. ఆయన క్లాసంటే నాకు చాలా ఇష్టంగా వుండేది. ఇంట్లో పాఠం పెద్దగా చదవేటప్పుడు ఆయనలాగా చదివేవాణ్ణి. మానాయన నాపక్కన కూచుని అప్పుడప్పుడూ నేను చదివేదాన్ని చాలా ఆసక్తిగా వినేవాడు. నా మీద శాస్త్రిగారి ప్రభావం చాలా వుంది. ఆయనవల్ల నేను స్ఫూర్తి పొందానని చెప్పవచ్చు. ఆయన వేషధారణ కూడా బాగుండేది. చాలా సార్లు సూట్ వేసుకుని టై కట్టుకుని వచ్చేవాడు. కానీ మా క్లాసులో చాలామందికి ఆయన క్లాసు నచ్చేది కాదు. ఎందుకంటే ఆయన చెప్పేదాన్ని పట్టుకోలేకపోయేవాళ్ళు.

నేను అదివరకే చెప్పినట్టు, ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం పిల్లల విద్యా ప్రమాణాల్లో చాలా వ్యత్యాసం వుంది. వర్గ వర్ణ వేర్పాటు కూడా అందుకు కొంత కారణం కావచ్చు. తెలుగు మీడియంలో చదివిన పిల్లలు చాలామంది మెట్రిక్యులేషన్ పరీక్ష వ్రాసే అర్హత కూడా సాధించలేకపోయేవాళ్లు. ఈ విషయం టీచర్లకు కూడా తెలుసు. ఈ పిల్లల్లో చాలామంది రైల్వే వర్క్ షాపుల్లో వృత్తి నైపుణ్యం లేని పనివాళ్ళుగా చేరేవాళ్ళు. రైల్వే ఉద్యోగుల సంతానం అవడం వలన వారికి ఈ ఉద్యోగాలు సులువుగా దొరికేవి. ఒక కళాసి కొడుకు మరో కళాసీ అయేవాడు. కొంతమంది తల్లితండ్రులు కూడా అదే కోరుకునే వాళ్లు. కొడుకులు ఆర్థికంగా తమని ఆదుకుంటారు కనుక. ఒక్కొక్కసారి పిల్లల్ని స్కూల్ మాన్పించి కూడా పనిలో చేర్పించేవాళ్ళు. వాళ్ల తండ్రుల లాగానే వీళ్ళూ త్వరగా పెళ్ళచేసుకుని త్వరగా పిల్లల్ని కనేవాళ్ళు. మానాయన ఇట్లాంటి పనులకి వ్యతిరేకి. పిల్లలని స్కూల్ మాన్పించి పనుల్లో పెట్టే తండ్రులను చివాట్లు పెట్టేవాడు. మా అబ్బసాయలు లాగా ఇంగ్లీష్ మీడియంలో చదివిన మా కులస్థులు చాలాతక్కువమంది అప్పుడు. అట్లా చదువకోగలిగిన కొద్దిమందికి మెట్రిక్యులేషన్ తరవాతే మంచి ఉద్యోగాలొచ్చేవి. ప్రభుత్వోద్యోగాలకు ఇంగ్లీష్ వచ్చి వుండాలి కనుక.

◆◆◆

ఆ సంవత్సరం మధ్య కల్లా అబ్బసాయిలు శిక్షణాకాలం పూర్తయి ప్రొబేషన్ మీద బొంబాయి స్టేషన్కి వేశారు. బొంబాయి వెళ్ళేముందు మాతో గడపడానికి ఒక వారం సెలవు పెట్టి ఇంటికి వచ్చాడు. వస్తూ మాకందరికీ తలా ఒక బహుమానం తెచ్చాడు. మా అన్నలోనూ, మా అన్న పట్ల మా ఇంట్లో అందరిలోనూ వచ్చిన మార్పు గమనించాను. మా ఇంట్లో ఒక ఆఫీసర్ అయిన మొదటి వ్యక్తి పట్ల అందరి శ్రద్ధాసక్తులను గమనించాను. ఆఫీసర్ల నిచ్చెన మెట్లలో అది అట్టడుగుదే కావచ్చు కానీ మాకు అది మొదటిదేకదా!

తరువాత మా బాబాయి ఎల్లయ్య కూడా ఆఫీసర్ అయ్యాడు. కానీ ఇప్పుడు ఈ చిన్న వయసులో ఆఫీసర్ అయింది అబ్బసాయిలే! తనకు తెచ్చిన కొత్త బట్టలు చూసుకుని మాతాత మురిసిపోయాడు. ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. తన ప్రియమైన తమ్ముడినైన నాకోసం ఒక అందమైన కలం తెచ్చాడు. దాన్ని నేను డిగ్రీ అయేవరకూ దాచుకున్నాను. శిక్షణ పొందేటప్పుడు తనకెదురైన అనుభవాలన్నీ మాకు చెప్పాడు. ఒకే డైనింగ్ టేబిల్ దగ్గర కూచుని సహ ట్రెయినీలతో భోజనం చెయ్యడం గురించి చెప్పాడు. భోజనంలో ఏం వుండేవో చెప్పాడు. ప్రతివాడికీ ఒక మంచం, దానిమీద మంచి పక్క వుండేవని చెప్పాడు. అందరూ పొద్దున ఆలస్యంగా నిద్రలేచి పలహారానికి పరిగెత్తగా తను మాత్రం ముందేలేచేవాణ్ణని చెప్పాడు. ఇంకా నేనడిగిన అనంతమైన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు, తన అనుభవాలు ఎన్నెన్నో చెప్పాడు. రెండు సాయంత్రాల తరువాత మా అన్న అబ్బసాయిలు నన్ను మినర్వా థియేటర్‌కి తీసుకుపోయి 'జిస్ దేశ్ మె గంగా బహతీ హై' సినిమా చూపించాడు. ఇంటర్వల్ లో తినడానికి కొనిపెట్టాడు, ఎంత సంతోషమో అప్పుడు!.

వారం సెలవు చకచకా గడిచిపోయింది. అబ్బసాయిలు బొంబాయి ప్రయాణం వచ్చేసింది. అతను వేళ్ళేటప్పుడు మేమందరమే కాక మానాయన స్నేహితులు బాలరాజు స్నేహితులు అంతా పెద్ద గుంపుగా స్టేషన్‌కి వచ్చేసారు. మా అమ్మ నిశ్శబ్దంగా దుఃఖిస్తోంది. ఆమె కళ్ళు ఉబ్బిపోయివున్నాయి మా అన్నయ్య ఆమెను సముదాయించడానికి ప్రయత్నించాడు. అబ్బసాయిలు అంతదూరం వెడుతున్నందుకు అందరికీ దిగులేసింది. రైలు కదులుతూంటే అబ్బసాయిలు చెయ్యివూపాడు. నాకూ ఏడుపు వచ్చింది కానీ పైకి ఏడవలేదు. మౌనంగా ఇంటికి నడిచాం అందరం.

◆◆◆

ఇప్పుడు మా అమ్మా మా వదినా ఒకేసారి కడుపుతో వున్నారు. ఆరోజుల్లో అది చాలా మామూలుగా వుండేది. అట్లా అత్తాకోడలూ ఒకేసారి బిడ్డల్నెత్తుకోవడం. మా వదినెకు కొడుకు పుట్టాడు మాకు చెల్లెలు పుట్టింది. అది మా అమ్మ ఆఖరి సంతానం. ఆపిల్ల చక్కని చుక్క. బొమ్మలా ముద్దుగా వుంది. శ్యామ అని పేరుపెట్టాము. బాలరాజు కొడుక్కి కృష్ణారావు అని పేరు పెట్టాం.

తరవాత మా వదినెకు మరి అయిదుగురు సంతానంకలిగి మొత్తం ఏడుగురయ్యారు. చివరికి పుట్టిన వాళ్ళు కవలలు.

◆◆◆

ఈ సంవత్సరంలోనే ఫ్రాన్సిస్ సార్ నన్ను స్కూల్ ఫుట్‌బాల్ టీమ్‌కి గోల్ కీపర్‌గా ఎన్నిక చేసాడు. నేను సన్నగా వున్నా చురుగ్గా వుంటాను. అబ్బసాయిలు మొన్న సెలవుమీద వచ్చినప్పుడు నా బక్క అవతారం చూసి మానాయనతో దేహ ధారుఢ్యానికి క్రీడల్లో

పాల్గొనడం ఎంత అవసరమో చెప్పాడు. అప్పటినుంచీ పాఠ్య ప్రణాళికేతర కార్యక్రమాలలో పాల్గొనడానికి మానాయన అనుమతి దొరికింది.

మా ఫుట్‌బాల్ మైదానం రైలు పట్టాలకు అవతలివైపున వుంది. అక్కడికి చేరాలంటే మేము కొంత ఖాళీ జాగాలో నడిచి ఆ పైన పట్టాలు దాటి పోవాలి. నేను రోజూ ఫుట్‌బాల్ ఆడ్డం అభ్యాసం చేస్తున్నాను. అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు ఒక నెల వున్నాయనగా ఇంకా తీవ్రంగా ప్రాక్టీస్ మొదలు పెట్టాం. స్కూల్ వదిలిన తరువాత కనీసం రోజూ ఒక గంట ఆడేవాళ్లం. అంటే మేం ముగ్గురం అన్నదమ్ములం ఒకేసారి ఇంటికి పోయేవాళ్లం కాదు. ఎవరెవరి కార్యక్రమాలని బట్టి వాళ్లం వెళ్ళేవాళ్లం. ప్రాక్టీస్ అయినతరువాత మా టీచర్ మాకు అరటిపండూ బిస్కెట్లూ పెట్టి ఆటలో నైపుణ్యాలని గురించి వివరించేవాడు. త్వరలోనే లీగ్ మ్యాచ్‌లు ప్రకటించారు. సెంట్ ప్యాట్రిక్స్ స్కూల్, సెంట్ మేరీస్ స్కూల్. ఎస్.పి.జి స్కూల్ టీములు బాగా బలమైన టీములు. మా టీచర్‌కి పోటీలో పాల్గొనే టీముల బలాలూ బలహీనతలూ తెలుసు. అందుకని ఎవరితో ఎట్లా తలపడాలో మాకు బాగా నేర్పించాడు. ఇప్పుడు రోజూ ఒక గంట కాకుండా రెండు గంటలు పాక్టీస్ చేస్తున్నాము. ఒకరోజు అయన నన్ను బయటికి పిలిచి నా చేతిలో కాసిని సీమబాదంపప్పులు పెట్టి 'సత్తి, నువ్వు గోల్ కీపర్ వి మన టీం గెలవాలంటే నువ్ మంచిగాడాలె' అన్నాడు.

నేను అమితోత్సాహంతో బంతిపట్టుకోడానికి గోల్ పోస్ట్ మూలలకు దూకేవాణ్ణి స్కూల్ మొత్తం మీద నేను ఉత్తమ గోల్‌కీపర్‌ని. ఆ ఉత్సాహంలో ఆట సందర్భంలో గాయాలైనా పట్టించుకునేవాడిని కాదు. అందుకే ఆయన నన్ను విడిగా పిలిచి అట్లా చెప్పాడు. 'మీరేం ఫికర్ జెయ్యకుండ్రి సార్! నేన్ మంచిగాడత' అన్నాను. ఆయన సంతోషించాడు నా జవాబుకి.

పోటీలకోసం మాకు టీ షర్ట్ లు, నిక్కర్లు, బూట్లు ఇచ్చారు. మొదటి పోటీ సెంట్ పాట్రిక్ స్కూల్ తో. పోటీ ముందురోజు సాయంత్రం ప్రాక్టీస్ చేసేటప్పుడు ఫ్రాన్సిస్ సార్ బాగా ఆందోళనగా వున్నారు. ఎవరూ కూడా ఒక్కళ్ళే స్వయంగా బంతిని ముందుకు నెట్టవద్దనీ, అది ఒకరినుంచీ ఒకరికి అందాలనీ గట్టిగా చెప్పాడు. గోల్ కోసం ప్రయత్నించే ఆటగాడి బంతిని ఎట్లా గుంజుకుపోవాలో మళ్ళీ నేర్పించాడు. ప్రాక్టీస్ అయినాక మేమంతా మైదానంలో గుండ్రంగా కూచున్నాం. 'మీరంత మంచిగాడి స్కూల్ పేరు నిలబెట్టాలె' అన్నాడు ఆయన చివరికి.

'మేము సెంట్ ప్యాట్రిక్స్‌ని తప్పకుండ ఓడిస్తం సార్' అన్నాం ముక్తకంఠంతో.

'శెబాష్! మనం గెలిస్తే మీ అందరికీ ఆల్ఫా హోటళ్ల మటన్ బిరియాని ఇప్పిస్త. ఓడిపోతే గుద్ద బొక్కలిరగ్గొడుత' అన్నాడు నవ్వుకుంటూ. మేము నిజంగా గెలుపుకోసం గెలవాలనుకున్నాము అదేకాకుండా అందరూ మెచ్చుకునే ఆల్ఫాహోటల్ బిరియానీ కోసం కూడా గెలవాలనుకున్నాము.

మరునాడు మధ్యాహ్నం సరిగ్గా రెండు గంటలకి బార్టన్ స్కూల్ మైదానంలో పోటీ మొదలైంది. ఫ్రాన్సిస్ సార్ మాకు చివరి క్షణాల్లో కూడా కొన్ని సూచనలిచ్చారు, నా వీపు తట్టి 'అరెయ్ సత్తయ్య గెలుపు నీమీదే ఆధారపడి వుంది' అన్నాడు.

'మనం తప్పకుండ గెలుస్తం సార్' అన్నాను నేను తలవంచి ఆయనకు అభివాదం చేస్తూ.

మ్యాచ్ పోటాపోటీగా జరిగింది. ఒక్కొక్క టీమ్ రెండు గోల్స్ దగ్గర డ్రా చేసాయి. రిఫరీ మళ్ళీ మూడు పెనాల్టీ గోల్స్ షూట్ చెయ్యమన్నాడు. నేను బంతికోసం ఎదురుచూస్తూ గోల్ దగ్గర చాలా అప్రమత్తంగా నిలుచున్నాను. నేను బంతి తన్నే ఆటగాడినీ బంతినీ తదేకంగా చూస్తున్నాను. అతను చాలా మంచి ఆటగాడు. బ్యాకర్ స్థానంలో వున్నాడు. అతను బంతిని గోల్ పోస్ట్‌లోకి తన్నడానికి దోవని అంచనా వేస్తున్నాడు. అతను బంతిని తన్నగానే నేను కుడివైపుకి దూకి పడిపోతున్నా లెక్కచెయ్యకుండా దాన్ని గట్టిగా పట్టుకున్నాను. కేకలు చప్పట్లతో మైదానం మార్మోగిపోయింది.. నా మోచెయ్యి చీరుకుపోయి రక్తం కారుతోంది. ఫ్రాన్సిస్ సార్ ప్రథమ చికిత్స పెట్టె పట్టుకుని పరిగెత్తుకుంటూ వచ్చారు నా దగ్గరకి. ఆ సంభ్రమంలో నేను రక్తం కారినా పట్టించుకోలేదు. ఈసారి బంతి తన్నేది మా టీం వాడు. పండరి చాలా మంచి ఆటగాడు. అతడు సునాయాసంగా ఎడమ వైపు నుంచీ గోల్ కొట్టేసాడు. ఇప్పుడు మా స్కూల్ వాళ్ళు ఎగురుతూ నాట్యం చెయ్యడం మొదలుపెట్టారు. ప్రత్యర్థి టీం నుంచీ మరో ఆటగాడు మరోషాట్ వెయ్యడానికి వచ్చాడు. వాళ్ల పి. టి టీచర్ అతనికి చాలా గంభీరంగా సూచనలిచ్చాడు. నా మోచెయ్యి నెప్పి పుడుతోంది కానీ నేను మా సార్ చెప్పినట్లు చావో గెలుపో అనే పట్టుదలలో వున్నాను ఈ సారి. అతను కుడి వైపు చూస్తున్నా, బంతిని నేరుగా మధ్యకి తన్నాడు. దాన్ని పట్టుకోడం ఎమీ కష్టం కాలేదు నాకు. ఇప్పుడు స్కోర్ ఒకటి–సున్న. ఇప్పుడు షూట్ చేసే వంతు మాది. పండరి బహుతేలిగ్గా గోల్ చేసేశాడు. విజయం మాదే!! ఇంక మావాళ్ళు విజయగీతాలు పాడుతూ ఒకటే నాట్యం! మా టీచర్ ఆనందం చెప్పనలవి కాదు. వచ్చి నన్ను కౌగలించుకున్నాడు. మా స్నేహితులు నన్ను భుజాలమీదకి ఎక్కించుకుని జయ జయ ధ్వానాలు చేశారు.

మాట ఇచ్చినట్టుగానే ఆ సాయంత్రం మమ్మల్ని ఆల్ఫా హోటల్‌కి తీసుకు వెళ్ళారు ఫ్రాన్సిస్ సార్. ఇది నాకు ఆటల్లో మొదటి గెలుపు. పాఠ్యేతర కార్యక్రమాల్లో తొలి విజయం. హృదయం గొప్ప సంతోషంతో నిండిపోయింది. ఇంటికి రాగానే బాలరాజు నా మోచేతి గాయం చూసి కోప్పడ్డాడు. ఇంకెప్పుడూ ఆడొద్దని హెచ్చరించాడు. ఈ సంగతి తెలుసుకుని మర్నాడు ఫ్రాన్సిస్ సార్ మా ఇంటికొచ్చారు. నేను భవిష్యత్తులోమంచి క్రీడాకారుణ్ణి అవుతాననీ, చిన్న చిన్న గాయాలను లక్ష్యపెట్టకూడదనీ బాలరాజుకి నచ్చచెప్పారు. క్రీడలపట్ల ఆయనకున్న అంకిత భావం నన్ను ఆశ్చర్యపరిచింది.

◆◆◆

విద్యా సంవత్సరం చివరికొచ్చింది. సంవత్సరాంత పరీక్షలు జరగుతున్నాయి. నాకు నిజమైన పోటీ మదన్‌కుమార్ తోనే. ఈసారి తనకి ప్రథమ స్థానం ఖాయమని అతను నాతో సవాల్ కూడా చేసి వున్నాడు. నేను దీక్షగా చదువుతున్నాను కానీ ఇంటిపనులలో సాయం కూడా చెయ్యాలి. నేను ముఖ్యంగా చెయ్యాల్సిన పనేమిటంటే మా అన్న ఆఖరి షిఫ్టులో (అంటే మధ్యాహ్నం నాలుగింటినుంచీ రాత్రి పన్నెండు దాటేవరకూ) అతనికి రాత్రి ఎనిమిది గంటలప్పుడు బోజనం తీసుకుపోవాలి. రైలు పట్టాలు దాటి భోజనం డబ్బా తీసుకుని క్యాబిన్‌లో పెట్టిరావాలి. మదన్ కుమార్ సవాల్ గురించిన భయంవలన నేను భోజనం డబ్బా తీసుకుపోతూ కూడా ఏదో ఒక పాఠం లోలోపల మననం చేసుకుంటూ వుండేవాడిని. ఆ పాఠంలో ఎంతగా లీనమయ్యానంటే ఒక రోజు పట్టాలు దాటేటప్పుడు వెనకనుంచీ రైలు వచ్చేది కూడా చూసుకోలేదు. అప్పుడు అక్కడ వుండడం తటస్తించిన ఒక పాయింట్స్ మ్యాన్ నన్ను గబుక్కున వెనక్కి లాగివుండకపోతే ఏమై వుండునో ఊహించడం కూడా కష్టం. ప్రాణాలుపోయి వుండేవి. అతను నన్నొక చెంపదెబ్బకొట్టిన దాకా నా పాఠం నుంచీ తేరుకోలేదు నేను. అప్పటినుంచీ మా అన్నకు భోజనం తీసుకుపోయేటప్పుడు పాఠాల జోలికి పోలేదు.

◆◆◆

పరీక్షలై పోయాయి. మళ్ళీ నేనే ప్రథమంగా వచ్చాను. అయినా లెక్కల్లో మాత్రం మదన్‌కుమార్ నాకన్న ముందే వున్నాడు. ఆ సాయంత్రం రిపోర్ట్ కార్డ్ తీసుకుని స్కూల్ బ్యాగ్‌లో పెట్టుకుని ఇంటికి వస్తున్నాను. అప్పుడు నాతో చదువుతున్న ఒక పిల్లవాడి తండ్రి (ఆయిన ఒక గ్యాంగ్ మ్యాన్) నన్ను పిలిచి 'అరె సత్తయ్య, నీ రిపోర్టు ఒకసారి సూడనీ' అన్నాడు. నేను రిపోర్ట్ తీసి ఇచ్చాను. అది చూసి అతను ముఖం చిట్లించుకుంటూ 'ఏందిర మంచిగ జదువవా? నీ కార్డుల ఒక్క ఎర్ర మార్కులేదు! మా పిల్లగనికి అన్ని ఎర్రమార్కులే వుంటయ్ ఎర్రమార్కులుంటే మంచి మార్కులొచ్చినయ్యని జెప్తడు వాడు' అన్నాడు.

నాకు భలే నవ్వొచ్చింది 'ఎర్రమార్కంటే ఫెయిలైనట్టు' అన్నాను బాగా నవ్వుతూ అప్పుడాయనకు తనకొడుకు చేసిన మోసం అర్థం అయింది. వాడు తననొక తెలివితక్కువ వాడికిందకట్టినందుకు బాగా కోపమొచ్చింది. నేను ఇంటికి పోయాను. ఆయన తన కొడుక్కోసం ఎదురుచూస్తూ అక్కడే నిలబడ్డాడు.

◆◆◆

సెలవుల్లో మానాయన మళ్ళీ ఒక పెద్ద ప్రయాణం పెట్టాడు. అయితే ఈసారి అందర్నీ తీసుకుపోవడంలేదు. నన్నూ, నర్సిములునూ, అంజయ్యనూ తీసుకుని అబ్బసాయిలు దగ్గరకి బొంబాయికి బయలుదేరాడు. మేము చాలా ఉత్సాహంగా వున్నాం. మా అమ్మా, వదినా చిన్నన్నయ్యకివ్వడానికి చిరుతిళ్ళు తయారుచేశారు. అబ్బసాయిలును

చూసి ఒక సంవత్సరం అయింది. అతను విక్టోరియా టర్మినస్‌లో సిగ్నల్ మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. అది అప్పుడు ఇండియన్ రైల్వేలో అతిపెద్ద స్టేషన్.

మేము బొంబాయి స్టేషన్ చేరేసరికి అబ్బసాయిలు అక్కడ సిద్ధంగా వున్నాడు. మా అన్నయ్య నన్ను కౌగలించుకున్నది కూడా గమనించకుండా 'అబ్బో! ఎంత పెద్ద స్టేషనో' అని ఆశ్చర్యపోతూ చుట్టూ చూస్తున్నాను. అబ్బసాయిలు తన సహోద్యోగితో కలిసి పరేల్‌లో ఒక చిన్న హోటల్‌లో వుంటున్నాడు. నాకు పన్నెండేళ్ళు అప్పుడు. నేను ప్రపంచంలోని పెద్దనగరాలలో ఒకటైన బొంబాయికి వచ్చానని ఎంత సంభ్రమమో! హోటల్‌కి వెళ్ళే దారిపొడుగునా ఎంతంత పెద్ద భవనాలో! రోడ్డుమీద వాహనాలు మూడు వరసల్లో పోతున్నాయి. రైలు పట్టాల లాంటి పట్టాల మీద ట్రాములు పోతున్నాయి. మనుష్యులు కాలిబాటమీద నడుస్తున్నారు. అబ్బసాయిలు వుండే హోటల్ చిన్నదే కానీ మా జీవితంలో హోటల్లో వుండడం అదే మొదటిసారి. వాళ్ళు మేము పడుకోడానికి మెత్తని పరుపులు అదనంగా ఇచ్చారు. నేను మహోత్సాహంగా వాటిమీద ఎగిరి దూకడం మొదలుపెట్టాను. మరునాడు మా అన్నయ్య స్నేహితుడు మాకు ఊరు తిప్పి చూపించాడు. జుహూ బీచ్, గేట్ వే ఆఫ్ ఇండియా, చేపట్టి మొదలైనవన్నీ చూశాం. అరేబియా సముద్రం చూసి పులకరించిపోయాం. సముద్రం ఎంతుందో! అది అట్లా విస్తరించి విస్తరించీ ఆఖర్న ఆకశాన్ని తాకుతున్నట్లుంది. మేము ఒక స్టీమ్ బోట్ మీద సముద్రంలో విహరించాం. రాత్రి హోటల్లో భోజనం చేశాం. చిరునవ్వులు చిందించే కుర్రవాడొకడు మాకు ఎంతో మర్యాదగా భోజనం వడ్డించాడు. అతని పేరు సఖారామ్. ఇంకా గుర్తే నాకు.

మేం బొంబాయిలో రెండు మూడు రోజులే వున్నాం. ఇంకావుంటే అబ్బసాయిలుకు చాలా డబ్బు ఖర్చు అవుతుంది. అబ్బసాయిలు మాతో స్టేషన్‌కి వచ్చాడు. రైలు ప్లాట్ ఫామ్ వదిలిపెడుతూండగా మాకు చెయ్యి వూపాడు. బొంబాయి పర్యటన ఒక గొప్ప అనుభవం. బొంబాయిలో అబ్బసాయిలు ప్రొబేషన్ పూర్తికావచ్చింది. అతనికిక బదిలీ అవుతుంది. కానీ బొంబాయి డివిజన్‌లోనే వేస్తారు. అప్పుడు కూడా ఇంటికి దూరంగానే వుండాలి. అతన్ని సికిందరాబాద్ డివిజన్‌కి ఎట్లా వేయించుకోవాలా అని మానాయన ఆలోచిస్తున్నాడు.

◆◆◆

నేను ఎనమిదో తరగతిలో వుండగా మేము రైఫిల్ రేంజ్‌లోని కొత్త క్వార్టర్స్‌కి మారాము. అక్కడ రైలు పట్టాలు పరిసరాలకన్న నలభై అడుగుల ఎత్తులో వుండేవి. అక్కడ మూడు రకాల క్వార్టర్స్ వుండేవి. ఒక్క పడక గదివి, రెండు పడకగదులవి, మూడు పడకగదులవి. చిన్న క్వార్టర్స్ కు కూడా బాత్రూమూ లావెటరీ లోపలనే వుండేవి. వాటి నమూనానే మాకు కొత్తగా అనిపించింది. ఉద్యోగస్థుల స్థాయిని బట్టి క్వార్టర్లు వుండేవి. ఇప్పుడిచ్చిన ఇల్లు అదివరకటిదానికన్న కాస్త పెద్దదేగానీ మాకు సరిపోదు.

అయితే అదొక మూలకు వున్నందువల్ల మేము మళ్ళీ షెడ్ వేసుకోడానికి వీలైంది. ఈ క్వార్టర్ లోనే మేము చాలాకాలం, అంటే నా మెట్రిక్, పి. యూ. సి అయిపోయేవరకూ కూడా వున్నాం. ఈ క్వార్టర్స్ మా స్కూల్‌కు బాగా దగ్గర నడిచిపోయేవాళ్లం. అదివరకు లోకల్ రైళ్లల్లో వెళ్ళేవాళ్లం. ఒక్కొక్కసారి 'వర్క్ మ్యాన్' అనే ప్రత్యేకరైల్లో వెళ్ళేవాళ్లం. ఈ నీలంరంగు బోగీల రైలు సికిందరాబాద్ లాలాగూడాల మధ్య ఉదయం ఏడుగంటలకి వర్క్ షాపు ఉద్యోగులకోసం నడిచేది. నేను క్రమం తప్పకుండా ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేసేవాణ్ణి. అయితే చదువు మీద కూడా బాగా శ్రద్ధ పెట్టేవాణ్ణి మానాయన తన సంపాదననంతా మా చదువుమీదా మాతిండి మీదా వెచ్చించేవాడు. ఆయనకూ బాలరాజుకూ కూడా ఇల్లు నడపడమూ, మమ్మల్ని చదివించడమూ చాలా కష్టంగా వుంది. ఖర్చులు తట్టుకోడానికి చాలా మేకల్ని కూడా అమ్మవలసి వచ్చింది. మానాయన స్నేహితులు చాలామంది నర్సిముల్నీ అంజయ్యనీ చదువు మాన్పించి వర్క్ షాపులో కూలీల కింద పెట్టమని సలహా ఇచ్చారు. మేము జొన్న రొట్టే, చింతపండు కారం తిని బ్రతకాల్సివచ్చినా వాళ్ల చదువు ఆపేది లేదని చెప్పాడు మానాయన. ఏం తినవలసి వచ్చినా మేమెప్పుడూ సణగలేదు అంతకన్న మేమేం చెయ్యగలం?.

అప్పుడు రైల్వేశాఖ అప్పుడున్న పట్టాల పక్క. కొత్త పట్టాలు వేస్తోంది. కొత్త పట్టాలపక్కన టన్నులకొద్దీ బొగ్గుబూడిద కుప్పపెడుతున్నారు ఈ బూడిదలో ఇంకా మండిపోకుండా వున్న బొగ్గు ముక్కలు వుండేవి. చాలాబూడిద పొయ్యడం వల్ల అందులో చాలా బొగ్గుకూడావుండేది. రైల్వే క్వార్టర్స్ లో వుండే స్త్రీలూ పిల్లలూ ఈ బూడిదలోనుంచీ బొగ్గుని బుట్టల్లోకి ఏరుకొచ్చుకుని దగ్గర్లో వున్న సున్నం బట్టీల వాళ్లకి బుట్ట మూడు అణాల చొప్పున అమ్మేవాళ్ళు. ఆ దగ్గర్లో ఇలాంటి సున్నపు బట్టీలు చాలా వున్నాయి. మేము నలుగురు అన్నదమ్ములం, ఇద్దరు అక్కచెల్లెళ్ళు అప్పుడప్పుడూ మావదినా కూడా ఇట్లా ఏరిన బొగ్గు బుట్టలు నెత్తిన పెట్టుకుని పద్మారావు నగర్ దాకా ఒక మైలు నడుచుకుంటూ పోయి అమ్ముకొచ్చేవాళ్లం. ఆ విధంగా అందరం రోజూ తలా ఒక రూపాయి సంపాదించేవాళ్లం. ఆరోజులకి ఆడబ్బు ఎక్కువే. ఈ డబ్బు మా కుటుంబానికి బాగా అక్కరకొచ్చింది. నేను చేసిన పనులన్నిటికన్న ఎక్కువ అయిష్టత కలిగించిన పని ఇదే. నర్సిములుకు ఈ పని బాగానే వుండింది. ఎందుకంటే అతను వచ్చిన డబ్బులన్నీ ఇంట్లో ఇచ్చేవాడు కాదు. కొంత తనకోసం దాచుకునేవాడు. ఆ డబ్బుల్తో ఎప్పుడైనా సినిమాకిపోయేవాడు అట్లా చెయ్యమని మాకందరికీ చెప్పేవాడు. మావదినెకి కూడా చెప్పేవాడు. ఆమె తలాడించేది. మేము కూడా ఎప్పుడైనా బుట్టకొక పైసా చొప్పున దాచుకునేవాళ్లం.

ఇట్లా అందరు బొగ్గు సేకరించి అమ్ముకోడం రైల్వే వారికి తలనొప్పిగా పరిణమించింది. దీన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోడం మొదలుపెట్టారు. బొగ్గులేరుకునే వాళ్ళ మీద పోలీసులు దాడి చేసేవాళ్ళు అప్పుడప్పుడూ లాఠీలు పట్టుకుని పోలీసులు

వచ్చేవాళ్లు. బుట్టలు లాక్కుని బొగ్గులేరుకున్న వాళ్లని కొట్టేవాళ్ళు. అప్పుడింక బొగ్గు సేకరణ చాలా కష్టమైంది. తరువాత ఆగిపోయింది. ఈ సమయంలోనే బచ్చమ్మ కు రాజయ్యతో పెండ్లి అయింది. అతనొక బట్టల మిల్లులో పనిచేసేవాడు. రాజయ్య మంచి వస్తాదు. రాణీగంజ్ ప్రాంతంలో బాగా పేరున్నవాడు. రాజయ్య తరఫువాళ్ళు పెళ్ళిమాటలు మాట్లాడేటప్పుడు అన్నీ నిజాలు చెప్పలేదు. తమది చాలా పెద్ద ఇల్లని చెప్పారు. తరువాత మాకు తెలిసిందేమిటంటే వాళ్ళు ఆ పెద్ద ఇంట్లో ఒక చిన్న వాటాలో వుంటారని!ఈ సంగతి తెలిసి మా అమ్మా నాయన చాలా విచారించారు. బచ్చమ్మను ఆరో తరగతి తరువాత స్కూల్ మాన్పించారు. మా అమ్మ ఎప్పుడూ ఆడపిల్లకు ఇంక చదువెందుకని అనేది. ఇప్పుడు ఆమెను చదివించనందుకు మానాయన విచారిస్తున్నాడు. ఆమె మరికాస్త చదువుకుని వుంటే మంచి సంబంధం వచ్చేదనుకుంటున్నాడు. నిజానికి ఆరోజుల్లో అగ్రకులాల్లో కూడా ఆడపిల్ల చదువుకు ప్రాముఖ్యత లేదు. మానాయన ఇట్లా అనుకుని తనను తను ఓదార్చుకున్నాడు.

ఈ సమయంలోనే అబ్బసాయిలుకు బొంబాయినుంచీ జాల్నా బదిలీ అయింది. ఇప్పుడు తరచూ ఇంటికి వచ్చి వెడుతున్నాడు.

◆◆◆

మా ఇంటికి చాలమంది బంధువులు వచ్చేవాళ్లు. మా అన్నకిచ్చిన క్వార్టర్ చిన్నదైనా, ఎప్పుడూ అమ్మ తరఫువారో నాయన తరఫువారో వచ్చి కొన్ని రోజులు వుండి వెళ్ళేవాళ్లు. ముఖ్యంగా వానా కాలంలోనూ చలికాలంలోనూ చుట్టాలొస్తే మాకు చదువుకోడానికి చాలా ఇబ్బందిగా వుండేది. అందరం ఒకే గదిలో ఇరుక్కోవలసి వచ్చేది. అందుకని మా అన్నయ్య వంటగదిని పడకగదికిందా, వరండాని వంట గదికిందా మార్చాడు. ఒక రాత్రివేళ బాత్ రూమ్‌కి పోవాలంటే కిందపడుకున్న వాళ్ళని తొక్కకుండా జాగ్రత్తగా చూసుకుంటూ పోవాలి. దీనికి తోడు మా మేనమామ రామయ్యా అతని భార్యా మాతో వుండడానికి వచ్చారు. వాళ్లని వరండాలో సర్దారు. అంత చిన్న ఇంట్లో నిరంతరంగా వచ్చిపోయే బంధువులని, మాకు కూడా బాగా సరిపోని జీతాలతో ఎట్లా సమర్థించుకు వచ్చారో మా నాయనా అన్నయ్యా అని ఇప్పుడు ఆశ్చర్యంగా వుంటుంది నాకు. ఈ ఆర్థిక సమస్యలకు తోడుగా మానాయనకు చుట్టలు తాగడం, సాయంత్రాలప్పుడు కల్లు పుచ్చుకోడం అలవాటుంది. మాలో ఎవరో ఒకరం అంగడికిపోయి ఒక పింట్ 'దుబారా రాసి కలిపి' తెచ్చిపెట్టేవాళ్లం. పిల్లల్ని కల్లు దాకాణానికి పంపడం బాలరాజుకి ఇష్టం వుండదు. కానీ నాయనకు చెప్పే ధైర్యం లేదు. అట్లా వెళ్ళొచ్చినప్పుడు మేమేం చేస్తున్నామో అని మామీద ఒక కన్నేసి వుంచేవాడు.

◆◆◆

ఈ విద్యా సంవత్సరం కూడా అయిపోవచ్చింది. ఇప్పుడు గత మూడేళ్లుగా మేం నేర్చుకున్నవన్నీ పరీక్షల్లో వస్తాయి. మాకు కొందరు మంచి టీచర్లున్నారు. మాకు భూగోళం చరిత్ర చెప్పే సారంగపాణి సార్ అందులో ఒకరు. ఆయన ఎప్పుడూ పుస్తకం చూస్తూ పాఠం చెప్పేవారు కాదు. కానీ అందులో వుండే విషయాలన్నీ చెప్పేసేవారు. ఆయన అంత స్పష్టంగా పాఠం వివరించే పద్ధతి నాకెంతో నచ్చి, ఇంకా చదవాలనే ఆసక్తి కలిగేది. ఆయనకి చరిత్రలొ అన్ని తేదీలు ఎట్లాగుర్తుందేవో అనిపించేది. నాకవి కంఠస్థం చెయ్యడం కష్టంగా వుండేది. ఆయన పాఠాలు కథలవలె మనసులో నిలిచిపోయేవి. అందుకని చరిత్రలో నాకు మంచి మార్కులు వచ్చేవి. ఇంకొకాయన తెలుగు టీచర్ పరబ్రహ్మశాస్త్రి. శ్రావ్యమైన గొంతుతో పద్యాలు చదివి వినిపించేవాడు. ఆయన పాఠం చెప్పేటప్పుడు తరగతిలో సూదిపడినా వినిపించేటంత నిశ్శబ్దంగా వుండేది. ఆయనకు నేనూ మదన్ కుమార్ ప్రియమైన విద్యార్థులం. ఆయన ప్రతి క్లాసులో ఒకసారైనా మా చేత పద్యాలు చదివించేవాడు. ఆయనొక సారి మమ్మల్ని 'ఖాండిక్య కేశి ద్విజులు' అనే పాఠం మూడు రోజుల్లో కంఠస్థం చేసుకురమ్మని సవాలు చేసారు. అది దాదాపు ఎనిమిది తొమ్మిది పేజీల పాఠం. అందులో చాలా సంస్కృత పదాలున్నాయి. అయినా నేనూ మదన్ కుమార్ ఆ సవాల్ స్వీకరించాము. మూడో రోజున ఒక్క తప్పులేకుండా పాఠం మొత్తం అప్పజెప్పేసాను. టీచర్‌తో సహా మా స్నేహితులందరూ అభినందించారు. నేను అప్పజెప్పేశాను కనుక ఇంక మదన్‌ను అడగలేదు ఆయన.

శాస్త్రి సార్ బ్రాహ్మణుడు. నాకులం ఎమిటో ఆయనకు తెలుసు. అయినా నా యందు బాగా శ్రద్ధ కనపరిచేవారు. నేను అసాధారణమైన విద్యార్థినని మెచ్చుకునేవాడు. ఆయన ప్రభావంతోనే నేను శాకాహారిగా మారాను. హిందూ సంస్కృతి గురించి తెలుసుకున్నాను. మాకు సమీపంలో వున్న వినాయకుడి గుడికి వెళ్ళి హరికథలు వినేవాడిని. ఆ కథలన్నీ దాదాపు రామాయణ మహాభారతాల్లోవే అయివుండేవి. నేను ఆధ్యాత్మికత వైపు మొగ్గుతుండడం చూసి మానాయన అన్నలూ నన్ను 'పంతులు' అని వెక్కిరించేవాళ్లు.

◆◆◆

పరీక్షలైపోగానే వేసవిలో మళ్ళీ మానాయన మరొక యాత్ర పెట్టాడు. ఈసారి దక్షిణ భారతం కొసలో వున్న రామేశ్వరం అనే పుణ్యక్షేత్రం. ఇది సుదీర్ఘమైన ప్రయాణం. ప్రయాణం చేసినంత సేపూ నేను మానాయనని అంటిపెట్టుకునే వున్నాను. మేము సికిందరాబాద్ నుంచి ఒకపగలు ఒకరాత్రీ ప్రయాణం చేసి మద్రాసు స్టేషన్ కు చేరుకున్నాం. స్నానమూ ఫలహారమూ అయనాక ఎగ్మూర్ స్టేషన్‌కు నడిచి వెళ్లాము. అక్కడనుంచీ మీటర్ గేజ్ రైల్లో రామేశ్వరం వెళ్లాలి. ఇక్కడంతా తమిళం మాట్లాడుతున్నారు. సికిందరాబాద్ లోని రైల్వే ఉద్యోగులు చాలామంది తమిళులు అవడం వల్ల మాకా భాష అర్థం అవుతుంది. మా సహప్రయాణీకులు మాట్లాడేది మాకు అర్థం అవుతుంది కానీ

మేము తిరిగి ఆ భాషలో మాట్లాడలేము. దారిలో వచ్చే స్టేషన్ల పేర్లన్నీ నేను చదువుతుంటె మానాయనకి చాలా గర్వంగా వుండేది. ఆయన మాకు రైల్లో ఇడ్లీ సాంబారు తెచ్చిపెట్టాడు. అవి తినడం అదేమొదలు. ఇడ్లీ చాలా బాగుంది. 1958 లో హైదరాబాద్‌లోనూ తెలంగాణాలోనూ ఇడ్లీలు కొత్తవి. అక్కడ ఇరానీ హోటళ్లలో టీ సమోసా బ్రెడ్ అలవాటు. ఆ చిన్న చిన్న హోటళ్లలో కూచుని పౌనా టీ తాగుతూ గంటల కొద్దీ కబుర్లు చెప్పుకుంటారు చాలామంది. పౌనా టీ లో పాలూ మీగడా ఎక్కువగా వుంటాయి. అప్పుడు 'వన్ బై టు చాయ్' చాలా ప్రసిద్ధం అంటే ఒక కప్పు టీ తీసుకుని రెండు కప్పుల్లో పోసుకుని ఇద్దరు తాగడం అన్నమాట. ఇప్పుడీ చిన్న చిన్న ఇరానీ హోటళ్ళు మాయమైపోయాయి. వున్న వాటిలోకూడా పౌనా టీ వుందో లేదో తెలీదు.

మీటర్ గేజి మీద పోయే రైళ్ళు బ్రాడ్ గేజి రైళ్ళంత వేగంగా పోవు. మా రైలు ఒక చోట హఠాత్తుగా ఆగిపోయింది.. రైలు కిటికీలోనుంచీ చూస్తే ఒక అపారమైన జలరాశి. నీళ్ళు తప్ప మరేమీ కనపడలేదు. మేము ఒక సముద్రపు ఒడ్డున ఉన్నామన్నమాట. నాకు భయం వేసి మా నాయన చెయ్యి గట్టిగా పట్టుకున్నాను. 'ఇదేంది నాయనా మనం మునిగి పోతున్నమా?' అన్నాను 'భయపడొద్దు బిడ్డా! మనం సముద్రం మీదకెల్లిపోతున్నం దీన్ని హిందూ మహాసముద్రం అంటరు' అన్నాడు నవ్వుతూ మానాయన.

అప్పుడు నాకు మా చరిత్ర టీచర్ పటంలో చూపించిన హిందూ మహాసముద్రం జ్ఞాపకం వచ్చింది. ఇది పాంబన్ రైల్వే స్టేషన్ అని తెలిసింది. సముద్రంపై నిర్మించిన ఒక పెద్ద వంతెన దాటేలోగా ఇక్కడ ఆగుతుంది. దీన్ని పాంబన్ వంతెన అంటారు. ఏవైనా నౌకలు వంతెన కిందుగా వెళ్ళాలంటే వంతెన మధ్యలో కొంత భాగం పైకి లేచి వాటిని పోనిచ్చి మళ్ళీ యధాస్థితికి వస్తుంది. బ్రిటిష్ ప్రభుత్వపు ఒకానొక సాంకేతిక చమత్కారం ఇది.. ఈ వంతెన మీద రైలు మనిషి నడిచినట్లు అతినెమ్మదిగా నడుస్తుంది. మారైలు వంతెన దాటే వరకూ నేను కళ్ళుమూసుకుని మానాయన చెయ్యి గట్టిగా పట్టుకుని కూచున్నాను. ఏక్షణంలోనైనా నేను నీళ్లల్లో పడి మునిగిపోతానేమో అని భయం వేసింది. రైలు భూభాగం చేరినతరువాత నిశ్చింతగా నిట్టూర్చాను. ఆఖరికి రామేశ్వరం చేరాం. రాముడు రావణుడిపై యుద్ధానికి పోయేముందు ఇక్కడ శివుడిని ప్రార్థించాడట, రాముడు వానర సేన సహాయంతో సముద్రం మీద వంతెన నిర్మించి లంకకు చేరాడని మానాయన చెప్పాడు. ఈ కథ ఒకసారి నేను విన్న హరికథలోకూడావుందని జ్ఞాపకం వచ్చింది.

రామేశ్వరంలోని దేవాలయం చాలాపెద్దది. ఇంత పెద్ద గుడిని నేనిదివరకెప్పుడూ చూడలేదు. చాలా పొడుగున్న నడవ గుండా గర్భగుడికి పోయాం. అక్కడి పూజారి మమ్మల్ని చాలా బావుల దగ్గరకు తీసుకుపోయి వాటిలో నీళ్ళు మా తలలమీద చిలకరించాడు. ఆబావులన్నింటికీ దండం పెట్టుకోమన్నాడు. లోపల దేవుడి ముందుండే పూజారి నాచేతిలో ఏదో ద్రవం పోసాడు. నేనది తీర్థం అనుకుని కళ్లకద్దుకుని నోట్లోపోసుకున్నాను. అది చాలా చేదుగావుంది. అది మంచిగంధం అనీ దాన్ని బుగ్గలకి

రాసుకోవాలనీ తరువాత అందరినీ చూసి తెలుసుకున్నాను. మా అన్నలు కూడా నాలాగే చేసారు. తరువాత మా అజ్ఞానానికి మాకే నవ్వొచ్చింది. ఒక గైడ్ కొంతమందికి ఏవో ఎర్రని చారలు చూపించి అవి హనుమంతుడి నెత్తురు మరకలు అని చెబుతున్నాడు. అక్కడ ఎప్పుడో ప్రతిష్టించిన ఒక శివలింగాన్ని పెకిలించబోగా హనుమంతుని తోక తెగిందనీ అప్పుడు కారిన రక్తమే అది అనీ చెబుతున్నాడు. చాల దూరంనుంచీ ప్రయాణం చేసి వచ్చాం కనుక బాగా అలసిపోయి ఆరాత్రి త్వరగా పడుకుని నిద్రపోయాం. మరునాడే ఇంటికి తిరుగుప్రయాణం. మేం వెళ్ళేసరికి ఇల్లంతా విషాదం అలుముకుని వున్నది. మాచిట్టిచెల్లి శ్యామ అమ్మవారు పోసి చనిపోయింది. మమ్మల్నిచూసి అమ్మ కుప్పకూలిపోయింది. నాయనకూడ బిగ్గరగా ఏడ్చాడు. మా చెల్లి మరణం మమ్మల్నందర్నీకుంగతీసింది. పొరుగునుండే ఒక పెద్దామె మమ్మల్ని ఓదార్చడానికి వచ్చింది. తనని వదిలి వెళ్ళినందుకు మానాయనని బాగా తిట్టింది మా అమ్మ. ఆయన కూడా తప్పు తనదేనని తనని తాను తిట్టుకున్నాడు. చెల్లిని పూడ్చిపెట్టిన చోటికి అందరం వెళ్ళాం. ఆ మట్టికుప్పమీద పడి భోరున ఏడ్చాడు మానాయన. బాలరాజు ఆయన్ని బలవంతాన లేవదిసి ఇంటికి తీసుకొచ్చాడు. శ్యామ పోయినందుకు పదిరోజులు సంతాపం పాటించాం.

◆◆◆

నేను తొమ్మిదవ తరగతిలోకి వచ్చాను. నర్సిములు, అంజయ్యా పదిలోకి వచ్చారు. ఈసారి మా పుస్తకాలకీ ఇంకా మాకు పాఠశాలలో అవసరమైన వాటికోసం సహకార ఋణ సంస్థ నుంచీ అప్పుతీసుకోవలసి వచ్చింది. మమ్మల్ని కళాసీలుగా తయారు చెయ్యకుండా వుండడానికి చేతనైనంత ప్రయత్నం చేస్తున్నాడు. మా నాయన.

అబ్బసాయిలు బొంబాయి డివిజన్‌లోనే అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ అయినాడు. ఈ సంతోష సందర్భంలో మా నాయన బంధువులనూ స్నేహితులనూ పిలిచి మంచి విందు చేశాడు. సికిందరాబాద్ నుంచీ కాజీపేట, దాకా మా కులస్థులందరూ మా నాయన గురించే మాట్లాడుకుంటున్నారు. ఒక నాలుగవ తరగతి ఉద్యోగి అయివుండీ పిల్లల్ని ఎట్లా చదివిస్తున్నాడో మెచ్చుకుంటూ చెప్పుకున్నారు. ఇప్పుడతని ఇంట్లో ఒక అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ వున్నాడని ఒకింత గర్వంతో కూడా చెప్పుకున్నారు. ఇంక మా తాత ఆనందాన్ని వర్ణించలేం. తను వేసిన తొలి అడుగువల్లనే ఇదంతా సాధ్యం అయిందని గర్వపడ్డాడు. నెలకొకసారి ఇంటికి వచ్చినప్పుడల్లా అబ్బసాయిలు నా చదువు ఎట్లా సాగుతున్నదో కనుక్కునేవాడు. అతనితో గడపడం నాకెంతో ఇష్టంగా వుండేది. చదువుల గురించి అడుగుతాడనే అబ్బసాయిలును, నర్సిములూ, అంజయ్యా తప్పించుకు తిరిగేవాళ్ళు. వాళ్ళు ఎట్లా చదువుతున్నారో అబ్బసాయిలుకు చెప్పడం వాళ్ళకి ఇష్టం వుండేది కాదు.

◆◆◆

'ఈ సంవత్సరం ఇంటర్ స్కూల్ కాంపిటీషన్ల నేను ఉండద్దనుకుంటున్న సార్' సందేహిస్తూనే అడిగాను ఫ్రాన్సిస్ సార్‌ని.

ఆయన చాలా గంభీరంగా 'అది కుదరదురా, సత్తి, ఇప్పుడు మనం గెలిచెటట్టున్నం' అన్నాడు.

'ఇప్పుడు నేన్ ప్రీ ఫైనల్ గద సార్! బాగ సదువుకోవాలె' అన్నాను.

'ఈసారికి ఆడు. వచ్చే యేడాది ఫైనల్లో నేనడగను' అన్నాడు విచారంగా మొహంపెట్టి. నేను ఎంత మంచి గోల్ కీపర్నో చెప్పి, స్వల్ప వ్యవధిలో ఇంకొకర్ని తరిఫీదు చెయ్యడం ఎంతకష్టమో చెప్పి, పాఠశాల పేరు నిలబెట్టడానికైనా నేను ఆడాలని ఆయన నన్ను ఒప్పించాడు చివరికి. ఒక సమర్థుడైన టీచరేకాక ఆయన నా గురించి తీసుకున్న శ్రద్ధకూడా తక్కువదేంకాదు కనుక ఆయనంటే చాలా గౌరవం నాకు. నా కుటుంబస్థితి తెలిసి నాకప్పుడప్పుడూ బలవర్ధకమైన చిరుతిళ్ళు పెట్టేవాడు. నాలో శారీరక శక్తి పెరగాలని. ! అవి నేను తిరస్కరించలేకపోయేవాడిని.

ఆ సమయంలో నాకింకొక బహుమతికూడా వచ్చింది. తరగతులమధ్య జరిగిన ఇంగ్లీష్ వ్యాసరచన పోటీలో నాకొక ఆంగ్ల నిఘంటువు బహూకరించారు. అది నాకెంతో విలువైన బహుమతి. దాన్ని నేను నా పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిపోయేవరకూ జాగ్రత్తగా దాచిపెట్టుకున్నాను. తెలుగు మాధ్యమంలో చదువుతున్నప్పటికీ ధైర్యంగా ఇంగ్లీష్ మాట్లాడేవాణ్ణి. మా ఇంగ్లీష్ టీచర్ సీతారామ శాస్త్రి నామీద బాగా శ్రద్ధ చూపించేవాడు. నన్ను ఇంకా వ్రాయమనీ ఇంకా బాగా నేర్చుకోమనీ ప్రోత్సహించేవాడు. ఒకసారి ఆయన పాఠం చెబుతుండగా, మాక్లాసులోకి ఒక ప్యూన్ వచ్చి 'సత్తయ్య ఎవరు?' అని అడిగాడు. నేను లేచినిలబడితే అతను హెడ్ మాస్టర్ నన్ను రమ్మంటున్నాడని చెప్పాడు. టీచర్ అనుమతి తీసుకుని 'నన్నెందుకు రమ్మన్నాడో ఆయన' అనుకుంటూ భయం భయంగా వెళ్ళాను.

సాధారణంగా విద్యార్థులెవరూ అయన గదికి పోరు. నేను మొదటిసారి అందులో అడుగుపెట్టాను. అదొక పెద్ద హాలు. అందులో ఆయన కుర్చీ వెనక గోడమీద మహాత్మా గాంధీ చిత్రపటం వుంది. ఆగోడ దగ్గరే వున్న ఒక. అద్దాల బీరువాలో విద్యార్థులు అనేక పోటీల్లో గెలిచి తెచ్చిన ట్రోఫీలు వున్నాయి. హెడ్మాస్టర్ తన కుర్చీలో హుందాగా కూర్చుని వున్నాడు.

'లోపలికి రావచ్చా సార్?' అని చాలా నెమ్మదిగా అన్నాను.

'రా సత్తయ్యా!' అన్నాడాయన గంభీరమైన కంఠంతో.

నేను చేతులుకట్టుకుని ఆయన ముందు నిలబడ్డాను.

'నువ్వు ఫుట్ బాల్ మాచ్ గెలిచినందుకు కంగ్రాచ్యులేషన్స్ బిడ్డా!' అన్నాడు కిందటి సంవత్సరం సంగతి అది.

'థాంక్యూ సార్ ! అందరం గల్సి గెల్చినం' అన్నాను.

'కాని గోల్స్ పట్టుకుని టీమ్‌ని గెలిపించించింది నువ్వేకదా?'

నేను ఒక చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను.

'చూడు సత్తయ్యా! ఆటల్లోనే కాక చదువులో కూడా నువ్వు ముందున్నావు. భవిష్యత్తులో నువ్వు గొప్పవాడివి కావచ్చు. కానీ అందుకు నీ పేరు ఒక అడ్డంకి కాకూడదు. అందుకని నీపేరు సత్యనారాయణ అని మార్చుకుంటే బాగుంటుందని నా సలహా.'

నాకేం చెప్పాలో తెలియలేదు.

'నేను మీ నాన్న తో మాట్లాడతాను' అన్నాడు ఆయనే మళ్ళీ.

మా హెడ్ మాస్టర్ నా గురించి అంత శ్రద్ధ తీసుకుంటున్నందుకు, ఆఖరికి నా పేరు గురించి కూడా పట్టించుకంటున్నందుకు నాకు చాలా సంతోషమైంది. ఆయనెప్పుడూ విద్యార్థులపైన ఎంతో శ్రద్ధాసక్తులు కనపరుస్తాడు. కులాన్ని తెలపే చాలా మంది విద్యార్థులపేర్లు తల్లితండ్రుల అనుమతితో ఆయన మార్చాడు. నా పేరుకు 'అయ్య'అనే చేర్పు నాకులాన్ని తెలుపుతుందని ఆయన ఉద్దేశం కావచ్చు. నా సహ విద్యార్థి ఒకడి పేరు సింహం అయితే వాడికి నరసంహం అని ఒక హిందూ దేవుని పేరు పెట్టారు. మా పేర్లను సెకండరీ పాఠశాలల బోర్డుకు పంపేముందు ఇట్లా మార్చాడు మా హెడ్‌మాస్టర్. ఈ రోజుల్లో ఎంత మంది అధికారులు ఇంత సునిశితమైన ఆలోచన్లు చేస్తున్నారు? నా జీవితానికి ఆయన ఒక ఆదర్శం అయినాడు.

అట్లా తొమ్మిదవ తరగతిలో నేను సత్యనారాయణ అయినాను.

◆◆◆

అది మండు వేసవి. అంజయ్యా, నర్సిములూ మహబూబ్ కళాశాల పరీక్షా కేంద్రంలో బోర్డ్ పరీక్షలు వ్రాసేసారు. ఇప్పుడిక వాళ్ళు వర్క్ షాపులో పని చూసుకోవాలా, పైకి చదవాలా అని ఇంట్లో చర్చ జరుగతోంది. మానాయన ఖచ్చితంగా వాళ్ళు పైకి చదవాలని నిర్ణయించాడు. ఆయన అబ్బసాయిలుకు సికిందరాబాద్ డివిజన్‌కు బదిలీ అయేలా ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. చివరికి మరాఠవాడాకు చెందిన ఒకాయనతో పరస్పరాంగీకారం కుదిరి ఆయన్ని ఆ డివిజన్‌కూ అబ్బసాయిలును సికిందరాబాద్ డివిజన్ కూ బదిలీ చేశారు. అబ్బసాయిలును దగ్గర్లోని గోదంగుడ అనే ఒక చిన్న స్టేషన్‌కు వేశారు.

ఒక రోజు నేను చదువుకుంటూండగా, మానాయన స్నేహితుడు రామయ్య వచ్చి 'బాలయ్యా! నేను అబ్బసాయిలుకు మంచి పిల్లను జూసిన' అని చెప్పాడు. మానాయనకి బాగా సంతోషమైంది. ఎందుకంటే ఆయన ఇప్పటికే అబ్బసాయిలుకు సంబంధాలు విచారిస్తున్నాడు 'ఎవరి బిడ్డ?' అని చాలా అసక్తిగా అడిగాడు.

'కాజీపేట్‌లో పనిజేసే ముఖద్దం నర్సయ్య బిడ్డ. తెల్లగ మంచిగుంటది స్కూల్‌కు పోతున్నది' అన్నాడు రామయ్య. అయనకు ఎంతమంది బిడ్డలని నాయన అడిగితే ఇద్దరు మగబిడ్డలు ఒక ఆడపిల్ల అనీ అందులో ఒక పిల్లవాడు TXR లో పనిచేస్తాడనీ మరొకడు గ్యాంగ్ మ్యాన్ అనీ చెప్పాడు.

'ఐతే ఈ సంగతి నేను బాలరాజుతో మాట్లాడి చెప్త' అన్నాడు. నేను చదువుతున్నానో వాళ్ల మాటలు వింటున్నానో ఒకకంటితో కనిపెడుతూ.

◆◆◆

మెట్రిక్యులేషన్ ఫలితాలు పత్రికల్లో ప్రకటించే రోజు వచ్చింది. మా నాయన పత్రిక కొనుక్కొచ్చి వరండాలో కూర్చుని ఫలితాలు చూస్తున్నాడు. బాలరాజు కూడా అక్కడే వున్నాడు. అంజయ్యా, నర్సిములూ లోపల కూర్చుని ఆదుర్దాగా ఫలితాలకోసం ఎదురుచూస్తున్నారు. మానాయన మొదటి రెండు శ్రేణులలో ఫలతాలు చూస్తున్నప్పుడు మేమందరం ఆదుర్దాగా వున్నాం. కానీ అందులో వాళ్ల నెంబర్లు లేవు. నాయన నన్ను పిలచి మళ్ళీ చూడమన్నాడు. నేను మళ్ళీ చూస్తే వాళ్ల నంబర్లు మూడో శ్రేణిలో కనపించాయి. మా నాయనకీ బాలరాజుకీ బాగా కోపం వచ్చింది. అది చూసి అంజయ్యా నర్సములూ వాళ్ల ఎదుటికి రావడానికి భయపడ్డారు. చివరికి మా అమ్మ సర్ది చెప్పడంతో నాన్నా బాలరాజూ కాస్త శాంతించారు.

యెలుకటి కుటుంబంలోకి మరి ఇద్దరు మెట్రిక్యులేట్లు వచ్చారు. మానాయన సంకల్పం నెరవేరినట్లే అని చెప్పవచ్చు. వాళ్ళిద్దరూ తక్కువ మార్కులు తెచ్చుకున్నా, మా నాయన వాళ్ల చదువు ఆపదలుచుకోలేదు స్టేషన్ మాస్టర్ అయిన అబ్బసాయిలు ఆయన కోరిక ఒకటి తీర్చగలిగాడు. ఇప్పుడు తన పెద్ద కొడుకులిద్దరి సహాయంతో మిగిలిన వాళ్లని బాగా చదివించాలని ఆయన సంకల్పం. గొప్ప విషయమేమిటంటే మా పెద్ద అన్నలిద్దరూ కూడా తమ తమ్ముళ్ల చదువుకు మనస్ఫూర్తిగా ఆర్థిక సహాయం అందించడానికి సిద్ధంగా వున్నారు.

ఇప్పుడు మా కుటుంబపు ఆర్థిక పరస్థితిలోనూ జీవన శైలిలోనూ కూడా గణనీయమైన మార్పు వచ్చింది. జొన్నరొట్టెల స్థానంలో గోధుమ చపాతీలూ వరి అన్నం, పప్పూ వచ్చాయి. కొన్ని కుండల స్థానంలో అల్యూమినియం గిన్నెలొచ్చాయి. పొద్దున్నే కొంచెం పాలతో టీ పెట్టుకుని త్రాగుతున్నాం. మరికొన్ని కోరికలు తలెత్తాయి. నాకొక రేడియో కావాలని వుండేది. అబ్బసాయిలు పెళ్ళికి వాడి మామ ఇచ్చిన రేడియోతో ఆ కోరిక తీరింది.

◆◆◆

అబ్బసాయిలు ప్రతినెల మొదటి వారంలో ఒకసారి ఇంటికి వచ్చేవాడు. ఈసారి వచ్చినప్పుడు నర్సిములూ, అంజయ్యల ఫలతాలపై చాలా అసంతృప్తిగా వున్నాడు.

అయినప్పటికీ వాళ్లని ప్రీ యూనివర్సిటీ కోర్సు చేయంచాలనే నాయన సంకల్పాన్ని సమర్థించాడు. సికిందరాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీనుంచీ వాళ్లకి ప్రవేశ దరఖాస్తులు తెచ్చాడు. వెనకబడిన కులాలకూ తెగలకూ వున్న ఉచిత విద్యావకాశాల వలన వాళ్లకి సులువుగానే ఆ కాలేజీలో ప్రవేశం దొరికింది. మానాయన వాళ్ళిద్దరికీ చెరి రెండు జతల బట్టలు కుట్టించాడు. మొదటిసారిగా ట్రౌజర్లు వేసుకోడం అన్నమాట. వాళ్ళు కాలేజీకి వెళ్ళొచ్చి కాలేజీల గురించి నాకు రోజూ కొత్త విషయాలు చెప్పేవాళ్ళు. ఆకాలేజీకి వచ్చే పిల్లల్లో ఎక్కువమంది నగరానికి చెందిన ధనవంతులు. ఇంగ్లీష్ మీడియంలో చదివి వచ్చి ఇంగ్లీష్లోనే మాట్లాడేవాళ్ళు. ఆరోజుల్లో కాలేజీల్లో వున్నది ఇంగ్లీష్ మీడియం మాత్రమే. తెలుగు మీడియంలో చదివి వెళ్ళిన నర్సిములుకూ, అంజయ్యకూ అక్కడ ఇమడడం కష్టంగా వుంది. వాళ్లకి అసంతృప్తిగా విచారంగా కూడావుంది.

◆◆◆

బండారు మైసయ్య చిలకలగూడాలో ఒక స్థానిక నాయకుడు. ఒకప్పుడు అబ్బసాయిలు అక్కడ వుండి చదువుకున్నాడు. మైసయ్య కార్పొరేటర్ కూడా !అతనికి ఇటుకలూ సిమెంట్ తో కట్టిన ఇల్లుంది. అందులో ఒక పెద్ద హాలుండేది. పేద హరిజన బాలురను తన ఇంట్లో చదువుకోనిచ్చేవాడు. అతనికి ముగ్గురు కూతుళ్ళు ఒక కొడుకూ. వాళ్ళ పొరుగున వున్నప్పుడు అబ్బసాయిలుకు అతని కూతురు యాదమ్మతో పరిచయం. అయితే బాలరాజు సికిందరాబాద్ లో కాపురంపెట్టి, అబ్బసాయిలు అతని దగ్గరకు వెళ్ళిపోయినాక ఆ పరిచయం కొనసాగలేదు. తరువాత మైసయ్యకు కూడా దూరానికి బదిలీ అయింది. ఒక రోజు హఠాత్తుగా ఆయన మాఇంటికి వచ్చాడు. మానాయినకి ఆశ్చర్యంతో పాటు ఆనందంకలిగిస్తూ. వాళ్ళిద్దరూ వరండాలో కూచుని మాట్లాడుకుంటుంటే మా అమ్మ వాళ్లకి టీ ఇచ్చింది.

'బోనే ! నువ్వు మీ పిలగానికి సంబంధాలు జూస్తున్నవని ఇన్న' అన్నాడు మైసయ్య.

'ఔను వానికి పెండ్లీడచ్చింది'.

'నువ్ నాకిచ్చిన మాట మర్చిపోయినవా, ఏంది?'.

'నేనేం మాటిచ్చిన?' అన్నాడు మానాయన ఆశ్చర్యంగా.

'నా బిడ్డెను నీకోడలు జేస్కుంటనని నాల్గేళ్ల కిందట మాటిచ్చినవ్'.

తను ఎప్పుడు మాట ఇచ్చినదీ గుర్తుచేసుకోడానికి మానాయిన ప్రయత్నించాడు. కానీ గుర్తురాలేదు. వాళ్ళు నాలుగేళ్లకిందట మంచి స్నేహితులే! కానీ ఇచ్చిన మాట మాత్రం గుర్తురావడంలేదు. మైసయ్య మానాయనజ్ఞాపకాలను తవ్వితియ్యడానికి ప్రయత్నించాడు. తాము కల్లుతాగేటప్పుడు మాట ఇచ్చాడని అంటున్నాడు. ఈ సంభాషణంతా లోపలినుంచీ వింటున్న మా అమ్మ మానాయనను లోపలికి పిలిచి నెమ్మదిగా 'నువ్ మాటిచ్చుంటవ్, దోస్తులతో తాగేటప్పుడు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతవ్' అంది.

మానాయన కాస్త నిదానంగా ఆలోచించాడు. నిజంగా తను అట్లా మాట ఇచ్చి వుంటాడా? అంతే కాక అబ్బసాయిలు మైసయ్య కూతుర్ని రహస్యంగా కలుసుకుంటున్నాడని కూడా మా నాయనకు తెలిసింది. అబ్బసాయిలు యాదమ్మను చేసుకుంటెనే అందరికీ మంచిది అనిపించింది ఆయనకి.

'సరె మైసయ్యా! మా పిలగాన్కి గూడ మీ పిల్ల అంటె ఇష్టమున్నట్టున్నది' అన్నాడు.

మైసయ్య చిరునవ్వు నవ్వి మా నాయన కాళ్లకు మొక్కి ఆయన్ని కౌగలించుకున్నాడు.

◆◆◆

అబ్బసాయిలు పెళ్ళి ఆ వేసవిలో జరపడానికి నిశ్చయించారు. యాదమ్మను పెళ్ళి చేసుకుంటున్నందుకు అబ్బసాయిలుకు సంతోషంగా వుంది. గోదంగుడలో వుండగా ఆమెని తరచూ కలుసుకుంటూ వుండేవాడు. ఆ సంగతి మైసయ్యకి కూడా తెలుసు. అతను కూడా చూసీచూడనట్టు వూరుకుని తన అంగీకారాన్ని అట్లా తెలియచేసాడు.

మానాయనా బాలరాజూ పెళ్ళి సన్నాహాల్లో మునిగిపోయారు. తన కూతురి పెళ్ళి వైభవంగా చెయ్యాలనుకుంటున్నాడు మైసయ్య. అతను కొంతమంది రాజకీయ నాయకులనీ, కార్యకర్తలనీ కూడా పెళ్ళికి ఆహ్వానించాడు. పెళ్ళి ముహూర్తం పెట్టుకున్న నాడే అతను చిన్న విందు చేశాడు. భోజనం తరువాత సన్నిహిత బంధువులంతా ఒక చోట చేరి పెండ్లికూతురికి పెళ్ళికొడుకు తరఫున ఏం పెడతారో, అట్లాగే పెళ్ళికొడుక్కి మైసయ్య ఏం ఇస్తాడో అని 'మాటా–ముచ్చట' చేశారు.

'మీ బిడ్డకు మేం రొండు తులాల బంగారం, ఎండి కడాలు, పట్టుచీరె ఇంక పెట్టేటియన్నీ పెడ్తం' అన్నాడు మా నాయన.

'అన్నా మా పిల్లగానికేమిస్తవ్?' అంది మా అమ్మనెమ్మదిగా.

'అత్తులం బటువు జేపిస్తం ఇంటి సామాన్లు, మంచం సైకిల్ ఇంకేమేం గావాల్నో అన్నిస్తం' అన్నాడు మైసయ్య.

నేనొక మూల కూచుని అందరి మాటలు వింటున్నాను. చివరికీ రెండువైపులా అంగీకారం అయింది.

మేనెలలో పెళ్ళి. మొట్టమొదటిసారి ఒక కల్యాణ మంటపంలో పెళ్ళి జరగడం చూస్తున్నాను నేను. అదికూడా మా అన్న పెళ్ళి! పెళ్ళికి చాలామందే వచ్చారు. మా కులంలో పెళ్ళిళ్ళకు సాధారణంగా వుండే డప్పు కాకుండా ఇప్పుడు బ్యాండ్ మేళం పెట్టారు. బైండ్లాయన తనకు వచ్చిన ఒకే శ్లోకం 'శుక్లాంబరధరం' చదివినప్పుడు మా అన్న బ్రాహ్మణ స్నేహితులు నవ్వారు. పెళ్ళి కాగానే మా వదిన యాదమ్మ రైఫిల్ రేంజ్‌లో మా ఇంటికి వచ్చింది. అప్పటినుంచీ ఆమె పేరు కృష్ణవేణి అయింది. అప్పుడు అన్న మకోడి అనే స్టేషన్‌లో పని చేస్తున్నాడు. అతనికింకా క్వార్టర్ దొరకలేదు. అందుకని మా వదినని అక్కడికి తీసుకువెళ్ళలేదు.

◆◆◆

1960 నుంచీ ఒక పదిహేను సంవత్సరాలు మా కుటుంబానికి గడ్డుకాలం. ఆర్థిక పరమైన ఇబ్బందులే కాక మా అమ్మ ఆరోగ్యం కూడా సరిగ్గా వుండేది కాదు. ఒక్కొక్క సారి మైకంలోకి వెళ్ళిపోయేది. మా పెద్ద వదినె ఇంటి దేవత అయిన దుర్గ ఆమెతో పాటు మా ఇంటికి వచ్చిందని కొందరు అనేవాళ్ళు. మా నాయన మా అమ్మని దగ్గర్లోవున్న ఒక సాధువు దగ్గరకు తీసుకు వెళ్ళాడు. ఆయన ఎదుట మా అమ్మ మైకంలోకి వెళ్ళిపోయింది. ఆ సాధువు మా అమ్మని జుట్టు విరబోసుకోమని చెప్పి నుదుటికి వీబూది పెట్టాడు. అప్పుడామె గట్టిగా దేవతలను పిలవడం మొదలుపెట్టింది. తరువాత ఆ మైకంలో పద్మాసనం వేసుకుని కూర్చుని. మోకాళ్ల మీద చేతులు పెట్టుకుని నడుము ఊపడం సాగించింది. నాకు చాలా భయం వేసింది. మా చుట్టూ వున్న వాళ్ళు గుసగుస లాడుకుంటున్నారు.

'ఆమెలో దేవత ఆవరించింది' అని, అప్పుడు సాధువు చేతులు జోడించి ఎవరు నువ్వని అడిగాడు.

'నీకు తెలువదా? నేన్ దుర్గమ్మన్' అంది మా అమ్మ అట్లా ఊగుతూనే.

అతను మా అమ్మ అరచేతిలో కర్పూరం వెలిగించి పెట్టాడు. అసలేమీ మంట లేనట్టే మా అమ్మ తన చేతిని దేవుడి పటాల చుట్టూ తిప్పి కర్పూరాన్ని విసిరి పక్కన పడేసింది. తరువాత స్పృహ తప్పి పడిపోయింది. నేను బాగా ఏడ్చాను. మా నాయన ఆమెను లేవదీస్తే అప్పుడే నిద్ర లేస్తున్నట్టు లేచింది. అరచేతిలో బాగా కాలిన గాయం చూసుకుంటూ అది ఎట్లా అయిందని అడిగింది.

ఈ సంఘటన మా కుటుంబాన్ని బాగా ప్రభావితం చేసింది. పూర్వం పండగలకేగానీ మరెప్పుడూ మేము ఎటువంటి పూజలూ క్రతువులూ చేసేవాళ్లం కాదు. ఇప్పుడు మా అమ్మకి తరచూ ఇట్టాంటి పూనకం వస్తోంది. జుట్టు విరబోసుకుని చేతిలో వీబూది పండు పెట్టుకుని గట్టిగా దేవుళ్ల పేర్లు పిలుస్తూ వుంటుంది. నాయన బాలరాజూ ఆమె ఎదుట భక్తిగా కూర్చుంటారు.

'శరణు తల్లీ!ఎందుకచ్చినవమ్మా?' అంటాడు మా నాయన.

కళ్ళు అరమూసుకుని శరీరాన్ని బాగా ఊపుతూ వెక్కిళ్ళు పెడుతూ 'మీ పిల్లల్ని ఆశీర్వదించనీకి వచ్చిన 'అంటుంది అమ్మ.

అప్పుడు మా చెల్లెలు మమ్మలనందర్నీ కేకేసి పిలుస్తుంది. మేంఅంతా వెళ్ళి మా అమ్మ ముందు సాష్టాంగ పడతాం. అప్పుడు ఆమె మా అందరి నుదుట వీబూది పెడుతుంది. చాలా కాలం పాటు వారానికొక సారి ఇట్లా జరిగేది.

◆◆◆

నన్ను అందరూ సత్యనారయణ అని పిలుస్తుంటే నాకు కొత్తగా వుండేది. ఇంట్లో అంతా సత్యం అంటున్నారు. దక్షణ లాలాగూడాలో మా బడికి ఒక కొత్త భవనం వుండేది.

చాలా అందమైన భవనం అది. ఇప్పుడందులో IRIEST హాస్టలుంది. పాఠశాల మొత్తానికి సీనియర్ విద్యార్థులమూ, పబ్లిక్ పరీక్ష వ్రాయబోయేవాళ్ళమూ కనుక మాకు ఒక ప్రత్యేకమైన గౌరవం వుండేది. ఉపాధ్యాయులంతా తమ తమ సిలబస్ త్వరగా పూర్తిచేసి మా చేత పునశ్చరణ చేయించాలని తొందరపడుతున్నారు. ఫ్రాన్సిస్ సార్ ఇచ్చిన మాట ప్రకారం, నన్ను మళ్ళీ ఆటల్లోకి తీసుకు వెళ్ళడంలేదు. అంతేకాకుండా నేనెట్లా చదువుతున్నానని ఎప్పటికప్పుడు అడుగుతుండేవాడు. ప్రేమకుమార్, మదన్‌కుమార్, షాహబద్దీన్, నేనూ చదువులో బాగా పోటీ పడేవాళ్ళం. అందరికీ పరీక్షల భయం పట్టుకుంది. నేను ఇతర వ్యాపకాలన్నింటికీ స్వస్తి చెప్పి ఎనిమిది తొమ్మిది క్లాసుల పాఠాలన్నీ చదివి పూర్తి చెయ్యడానికి ఒక ప్రణాళిక వేసుకున్నాను. ఒక టైం టేబిల్ వేసుకున్నాను. మేలుకుని ఉన్న ప్రతి క్షణమూ ఈ మూడేళ్ళ పాఠాల్లో మునిగి తేలేవాడిని. నా వ్యూహాన్ని నా ప్రత్యర్థులెవరికీ చెప్పకూడదనుకున్నాను. నేనింకా పరీక్షలకు ఏవిధంగా చదవాలని ఒక ప్రణాళిక వేసుకోలేదని చెప్పేవాణ్ణి. ఆరోజుల్లో పరీక్షా పత్రాలు చాలా కఠినంగా దిద్దేవాళ్ళు. మెట్రిక్యులేషన్‌లో ప్రథమ శేణిలో ఉత్తీర్ణత సాధించడం నా ఆశయం అయినప్పటికీ అది ఎంత కష్టమో తెలుసు.

పరీక్షలు వచ్చేస్తున్నై. మా నాయన ప్రస్తుతం మా తమ్ముళ్ళమీద దృష్టి కేంద్రీకరించాడు. ఇప్పుడు కూడా ఆయన మమ్మల్ని రాత్రి పది గంటల తరువాత మేలుకుని చదనివ్వడం లేదు. ఇప్పుడుకూడా మేము తెల్లవారు ఝామున నాలిగింటికే నిద్రలేచి చదువుకోవాలి. నిజం చెప్పాలంటే మా పరీక్షలకు మేం పడే శ్రమ కన్న మా నాయన పడే శ్రమే ఎక్కువ. మా పరీక్షలప్పుడు ఆయన పదిహేనురోజులపాటు సెలవు పెట్టి మమ్మల్ని కనిపెట్టుకుని వుండేవాడు.

ఇంక నర్సిములు, అంజయ్యల ఆదుర్దా చెప్పడానికి వీల్లేదు. వాళ్ళు చదివే వాచకాలన్నీ ఇంగ్లీష్లో వుండడంతో వాళ్లకవి సరిగ్గా బోధ పడేవి కాదు. అందుకని గైడ్లు కొనితెచ్చుకున్నారు. చదువు మాధ్యమం హఠాత్తుగా మారడంతో వాళ్లకొక పరాయి ప్రపంచంలోకి వచ్చిపడ్డట్లయింది. ఈ సంగతి మానాయనతో గానీ బాలరాజుతో గానీ చెప్పడానికి వాళ్ళకి ధైర్యం చాల్లేదు. కానీ అబ్బసాయిలు గ్రహించాడు ఈ సంగతి... పాపం వాళ్ళూ పాఠాలు కంఠతా పట్టడానికి చాలా శ్రమ పడుతున్నారు. పొద్దున్నే అందరం పాఠాలు బయటికి పెద్దగా చదువుతాం. అయినా ఒకరు చదివేది ఇంకొకరికి ఇబ్బంది అనిపించదు. అదే విచిత్రం. అయిదుగురం వరసగా కూచుని లాంతర్లు ముందుపెట్టుకుని చదవడం తలుచుకుంటే ఇప్పుడు నాకు చిత్రంగా వుంటుంది. ఈమధ్య నా నలుగురు కూతుళ్ళూ తమకి ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా చదువుకోడానికి ఒక గది కావాలన్నారు మరి!.

రైల్వే కాలనీల్లోకి 1961వ సంవత్సరం మొదట్లో విద్యుచ్ఛక్తి వచ్చింది. వీధుల్లో కూడా విద్యుద్దీపాలు వెలిగాయి. లాంతరు దగ్గర్నుంచీ విద్యుద్దీపం కిందకి మారడం ఒక

అద్భుతమైన అనుభవం. ఒక వెలుగు వరద ముంచెత్తినట్లైంది. ఒక్కొక్కసారి వీధి దీపంకింద చదవుకోడం కూడా నాకు బాగుండేది. కానీ మానాయన చూడనప్పుడే! త్వరలోనే లాంతర్లు మూలపడ్డయ్.

ఇంతకు ముందు మా అన్నలు వ్రాసినట్టే నేను కూడా నా మెట్రిక్యులేషన్ పరీక్ష నాకు బొత్తిగా పరిచయంలేని మహబూబ్ కాలేజీలో వ్రాయాల్సొచ్చింది. మా హెడ్మాస్టర్‌తో సహా మా టీచర్లందరూ నేను ప్రథమ శ్రేణి సాధిస్తాననే నమ్మకంతో వున్నారు. మా హెడ్మాస్టర్ నన్ను తనగదికి పిలిచి, 'చూడు సత్తీ ! నీ విజయానికి నీతల్లితండ్రులేకాదు మీ టీచర్లు కూడా చాలా సంతోషిస్తారు నీ పేరులో ఆ చిన్న మార్పు ఎందుకు చేశానో తెలుసా? అది నీకు ఇంకొంచెం ఆత్మ విశ్వాసం ఇస్తుందని. ఒకరోజు నీవు తప్పకుండా గొప్పవాడివౌతావు. ఆల్ ది బెస్ట్' అన్నాడు.

'థాంక్యూ సార్' అంటుంటే నా కళ్లల్లో నీళ్ళొచ్చాయి. కానీ ఆయన ఆకాంక్షలను నేను నెరవేర్చగలనా అని ఒక క్షణం దిగులేసింది.

మొదటిరోజు పరీక్ష హాలులో వుండే గంభీరమైన వాతావరణ చూసి కాస్త ఆందోళన కలిగింది. అక్కడున్న టీచర్లూ ఇన్విజిలేటర్లూ అంతా కొత్తవాళ్ళు. కానీ పరీక్ష మొదలుపెట్టి వ్రాస్తున్న కొద్దీ ఆత్మ విశ్వాసం కలిగింది. నేను లెక్కలు తప్ప అన్ని విషయాలూ బాగా వ్రాసాను. లెక్కల్లో కూడా అన్నీ చేశాను కానీ మంచి మార్కులు వస్తాయన్న నమ్మకం కుదర్లేదు.

నర్సిములూ అంజయ్యా కూడా పీయూసీ పరీక్షలు వ్రాశారు కానీ ఫలితాల గురించి పెద్దగా ఆసక్తి కనపరచలేదు.

◆◆◆

1961 మే చివరివారం మెట్రిక్యులేషన్ ఫలితాలు విడుదలయ్యాయి. మా నాయన వార్తాపత్రిక కొనుక్కొచ్చి చాలా ఆత్రంగా నన్ను పిలిచాడు. బాలరాజు ఆయన దగ్గర్నుంచీ పత్రిక తీసుకుని నా నెంబరుకోసం ప్రథమ శ్రేణిలో చాలా సార్లు వెతికాడు. కానీ దొరకలేదు. ఈలోగా నా స్నేహితులు కొందరొచ్చి నేను ద్వితీయ శ్రేణిలో పాస్ అయ్యానని బయటినుంచీ అరిచారు. నాకు తల తిరిగిపోయినట్లైంది. నమ్మలేకపోయాను పత్రిక తీసుకుని మళ్ళీ మళ్ళీ చూశాను. అవును నేను సాధించింది ప్రథమశ్రేణి కాదు. ద్వితీయ! నేను విచారంలో మునిగిపోయాను. నాకు ప్రథమ శ్రేణి రాలేదంటే మా నాయన కూడా నమ్మలేకపోయాడు.. నేను ఎనిమిది మార్కుల తేడాతో ప్రథమ శ్రేణి కోల్పోయానన్నది నిజం. అయితే ఆ సంవత్సరం మా పాఠశాలలో ఎవరూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులవలేదని తెలిసి మా నాయనకి కాస్త ఊరట కలిగింది.

ఏ ఒక్కరికీ ప్రథమ శ్రేణి రాలేదంటే టీచర్లు కూడా నిశ్చేష్టులయ్యారు. మూడు రోజుల తరువాత మా పాఠశాలకు వెళ్ళి ముందుగా మా టీచర్ సీతా రామశాస్త్రి గారిని

కలిశాను. నాకు ఇంగ్లీష్లో వచ్చిన మార్కులు చూసి ఆయన, 'ఎక్కడో ఏదో తప్పు జరిగింది, సత్యం, నీకు ఇంగ్లీష్‌లో ముప్పై అయిదు రావడమేమిటి? యాభై మార్కులకు సెకండ్ పేపర్ వుందికదా? ఆ పేపర్ అసలు దిద్దలేదేమో! రీ వాల్యుయేషన్ కి అప్లై చెయ్యి' అన్నాడు

నా పట్ల ఆయనకున్న నమ్మకం నాకు కాస్త ఊరట కలిగించింది. ఇంగ్లీష్లో తప్ప ప్రతి సబ్జెక్టులోనూ నాకు అరవై శాతం మార్కులేవచ్చాయి. నాకు బాగా వచ్చింది ఇంగ్లీషే కదా, మరి?ఇదెట్లా సంభవం? అనిపించింది. కాక పోతే నేను మా పాఠశాల మొత్తానికి ప్రథముడిగా రావడం కూడా నా మనశ్శాంతికి దోహదం చేసింది. మానాయన కూడా అందుకు చాలా సంతోషించాడు. టీచర్లందరూ అభినందించారు. ఫ్రాన్సిస్ సార్ కూడా చాలా సంతోషించారు. పై చదువుల్లో కూడా క్రీడల్లో పాల్గొంటూ వుండమని సలహా ఇచ్చారు.

తరువాత ఒక వారానికి పియుసి ఫలితాలొచ్చాయి. నర్సిములూ అంజయ్యా ఇద్దరూ ఉత్తీర్ణులు కాలేదు. మా బంధువుల్లో చాలా మంది ఇంక వాళ్ళు నౌకరీ చెయ్యడం మంచిదని సలహా ఇచ్చారు. మా నాయనకి అసంతృప్తి కలిగిందేగాని వాళ్లని చదువు మాన్పించి పనిలో పెట్టడం ఇష్టం లేదాయనకి. వాళ్లకు మరొకసారి పరీక్ష వ్రాసుకునే అవకాశమివ్వాలని బాలరాజు కూడా అన్నాడు. మా నాయన అబ్బసాయిలు సలహా అడిగాడు. వాళ్ల మార్కులు చూసిన అబ్బసాయిలు, వాళ్ళు తప్పిన సబ్జెక్టులు మాత్రమే మళ్ళీ వ్రాసుకోమని సలహా ఇచ్చాడు. వాళ్ళు ఇంగ్లీష్, బయాలజీలలో తప్పారు. అంటే వాళ్ళు ఆ రెండూ మళ్ళీ వ్రాసుకోడానికి గాను సంవత్సరమంతా ఇంట్లోనే వుండిపోవాలి. మానాయన స్వభావమే అది. మేము బాగా చదవకపోయినా ఆయన మమ్మల్ని ప్రోత్సహించాడే కానీ నిరుత్సాహ పరచలేదు. ఏ పనినీ పూర్తిచెయ్యకుండా వదల కూడదని ఆయన అభిప్రాయం. పరాజయాలలోనుంచీ పాఠాలు నేర్చుకోవాలన్నది ఆయన సూత్రం. ఆయన ఇట్లా ఆలోచించి వుండకపోయివుంటే మేము మాచదువులు కొనసాగించగలిగే వాళ్ళమే కాదు.

కాలేజీలో పాఠాలు అర్థం కావడం ఒక సవాలు వంటిది. మాకెవరి మార్గదర్శకత్వమూ లేదు. పైగా పాఠశాలలో మేము చదువుకున్న భాషతో కాలేజీలో ఏ ఉపయోగమూ లేదు.

కళాశాల వాతావారణంలో కూడా పూర్తిగా తేడావుంది. అక్కడి ఇతర విద్యార్థుల ముందు మాకు ఒకరకమైన ఆత్మన్యూనతాభావం కలిగేది. మాలాగే వెనక బెంచీలలో కూర్చునే మా సామాజిక వర్గపు విద్యార్థులతో తప్ప ఇతర విద్యార్థులతో అధ్యాపకులతో మాట్లాడ్డానికి ధైర్యం చాలేది కాదు. అగ్రవర్ణాలకు చెందిన అధ్యాపకులకూ, విద్యార్థులకూ మేము దళితులమని సులువుగా తెలిసేది. వాళ్ళు మమ్మల్ని చిన్నచూపు చూసేవాళ్లు.

మాకు సమాజంలో వున్న స్థాయి లాగానే మా పేర్లు కూడా హాజరు పట్టీల చివర్న వుండేవి.

మా అన్నల లాగానే నేను కూడా సికిందరాబాద్ కాలేజి ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో చేరాను. వాళ్లకి లాగానే నాక్కూడా మా నాయన రెండుజతల కొత్తబట్టలు కుట్టించాడు. మొదటిసారి ట్రౌజర్స్ వేసుకున్నాను. ఏడో నంబర్ డబల్ డెక్ బస్సొకటి సికిందరాబాద్ స్టేషన్ నుంచీ అఫ్జల్‌గంజ్ వెళ్ళేది. మా కాలేజీకి వేళ్ళేవాళ్ళు పారడైజ్ స్టాప్‌లో దిగాలి. నేను ఎక్కువగా నడిచే వెళ్ళేవాడిని. ఏడాది మొత్తం మీద ఏ పది పదహేనుసార్లో బస్‌లో వెళ్ళి వుంటాను. కాలేజీ చదువు ఒక కొత్త అనుభవం. మా క్లాసులో అరవైమంది పిల్లలుండేవాళ్ళు. క్లాస్‌రూమ్ కిక్కిరిసి ఉండేది. ఇక్కడ సహవిద్య ఇంగ్లీష్ మీడియం. మా ఇంగ్లీష్ అధ్యాపకురాలి పేరు మిసెస్ కూపర్. మా రైల్వే క్వార్టర్స్‌లో నేను చూసిన ఆంగ్లో ఇండియన్స్ లాగా వుండేది ఈవిడ. ఆవిడ ఉచ్ఛారణ నాకు బాగా నచ్చేది. ఆవిడ చెప్పే పాఠాలను చాలా ఆసక్తిగా శ్రద్ధగా వినేవాడిని. ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రయోగాలు చెయ్యడానికి ప్రయోగశాలలకి పోయేవాళ్ళం. నాకు ఇంగ్లీష్ మాట్లాడ్డం బాగానే వచ్చినప్పటికీ అధ్యాపకులతో మాట్లాడ్డానికి కష్టమయ్యేది. ఎందుకంటే ధనికుల పిల్లలకూ, పలుకుబడి కలవారి పిల్లలకూ ఇచ్చే ప్రాముఖ్యత నాలాంటి వాళ్ళకి ఇచ్చేవారు కాదు అధ్యాపకులు కొందరు. పిల్లల సాంఘిక నేపథ్యం వాళ్ల మధ్య ఒక గోడ నిర్మించినట్లైంది. నాకు మెట్రిక్యులేషన్‌లో మంచి మార్కులు వచ్చివుండడం చేత రిజర్వేషన్ వర్గానికి చెందిన విద్యార్థుల జాబితాలో నా పేరు ముందుండేది. ఆ జాబితా ప్రకారం చూస్తే నేనా వర్గానికి చెందిన వాడినో కాదో కనుక్కోడం కష్టం. ఒకరోజు గేటుదగ్గర నన్ను ఇద్దరు విద్యార్థులు కలిసి 'నువ్వు కూడా ఎస్సీవా?' అని అడిగారు. నేను అవునన్నాను. అప్పటినుంచీ వాళ్ళు నాకు స్నేహితులైపోయారు. వాళ్ళ పేర్లు రాజేశం, మల్లేశ్. మా మాటా, మా తీరు మేం దళితులమని చెప్పకుండానే తెలియచేసేవి. మేం ముగ్గురం ఆ కోర్సు అయ్యేవరకూ కలిసే తిరిగేవాళ్లం. నాకు ఇంగ్లీష్ మాట్లాడ్డం వచ్చు కనుక మాముగ్గురి తరఫునా ఏదైనా మాట్లాడవలసి వస్తే నేనే మాట్లాడేవాణ్ణి.

◆◆◆

అబ్బసాయిలుకి సికిందరాబాదు బదిలీ అయింది. అతనికి చిలకలగూడా దగ్గర పద్మారావునగర్‌లో ఆఫీసర్ల బంగళా ఇచ్చారు. ఆ ఇల్లు రైఫిల్ రేంజ్‌లో ఇల్లుకన్న బాగా పెద్దది. రెండు పడక గదులు, పెద్ద వంటిల్లు, పెరడూ కూడా వున్నాయి. గదుల్లో సీలింగ్ ఫాన్లున్నాయి. స్నానాల గది వేరూ లావెటరి వేరుగా వున్నాయి. ఇంట్లోనే నల్లా వుండడం ఇదేమొదలు మాకు. రైఫిల్ రేంజ్‌లో ఆరేళ్ళ నివాసం తరువాత ఇప్పుడు ఇక్కడికి మారాం అందరం. ఇంట్లో సామాన్లు మాత్రం పాతవే! కొత్తగా కుర్చీలు మంచాల లాంటివేంలేవు. అవే నులకమంచాలు అవే బొంతలు. మా అమ్మా మా వదినా రంగు రంగుల పాత

బట్టలతో ఈ బొంతలు కుట్టేవాళ్ళు. ఇంకా స్టీలు గిన్నెలు రాలేదు మా ఇంట్లోకి. మా అమ్మ కుండలు వాడితే, ఇప్పుడు అన్నల హయాంలో అల్యూమినియం గిన్నెలు వాడుతున్నాం. మా నాయన మళ్ళీ పెరట్లో చిన్న షెడ్ లాంటిది వేశాడు. దాన్ని వంటకు వాడేవాళ్ళం. రోజూ పొద్దునా సాయంత్రం బొగ్గులపొగ వచ్చే వంటిల్లు ఆ కాలనీ మొత్తంలో మా ఒక్కళ్ళదే. ఇప్పుడు మాకు వచ్చి చేరిన అదనపు సౌకర్యం ఒక రేడియో. అదికూడా కంపెనీ తయారు కాదు. విడి భాగాలు తెచ్చి కూర్చినది. మానాయనకి కోపం వచ్చినప్పుడల్లా మైసయ్య మా అన్నకు ఇట్టాంటి రేడియో ఇచ్చాడని సణిగేవాడు. అది చూడ్డానికి బాగుండేదికాదు. ఒక పెట్టెలా వుండేది. మీటలు దాని నెత్తిమీద వుండేవి ఏదో ఒకటి. మొత్తానికి ఒకరేడియో. వచ్చింది! అమీన్ సయానీ వ్యాఖ్యానంతో. రేడియో సిలోన్ నుంచీ వచ్చే హిందీ సినిమా పాటలు బాగా వినేవాడిని. బాలరాజు కూడా వినేవాడు. మేము చిలకలగూడాలో చాలా ఏళ్ళు వున్నాం. మా నాయనా, బాలరాజుల అధ్వర్యంలో నడిచిన ఒక పెద్ద ఉమ్మడికుటుంబం మాది. ఇరవై ఇద్దరు సభ్యులున్న కుటుంబంలో సంపాదించేది కేవలం ముగ్గురే! ఎక్కువమందిమి చదువుకునే పిల్లలం. రాత్రిపూట మా భోజనాలు అనేక మందికి ఒకేసారి వడ్డించే లంగార్‌లో వున్నట్టుండేవి. మా అమ్మ పెద్ద పెద్ద గిన్నెలు పెట్టుకుని మధ్యలో కూచుంటే మేం పదిహేను మందిమి ఒకేసారి తినేవాళ్లం. వరన్నమూ చపాతీలూ పెట్టిన అల్యూమినియం పళ్ళాలు మా అందరికీ అందించేది మావదిన.

◆◆◆

అమ్మా నేనూ ఆరోజు. కింగ్ ఎడ్వర్డ్ హాస్పిటల్ (ఇప్పుడు గాంధీ హాస్పిటల్) ఔట్ పేషంట్ వార్డులో నిలుచుని వున్నాం. అమ్మకి వంట్లో బాగాలేదు. ఎప్పడైనా ఒంట్లో బాగుండక డాక్టర్ దగ్గరకు వెళ్ళాలంటే అమ్మ నన్ను తోడు తీసుకుపోయేది. క్యూలోనుంచుని అమ్మ నెమ్మదిగా 'బిడ్డా డాక్టర్‌తో ఇంగ్లీష్‌ల మాట్లాడు అట్లయితే బాగ జూస్తరు' అంది

'అట్లనె అమ్మ! నువ్వేం ఫికర్ జెయ్యకు' అన్నాను ఆమె అమాయకమైన కళ్ళల్లోకి చూస్తూ.

ఇంగ్లీష్‌లో మాట్లాడితే డాక్టర్లు బాగా చూస్తారని ఆమె నిజంగానే నమ్మి అన్నది. నేను డాక్టర్‌తో ఇంగ్లీష్లో మాట్లాడితే చాలా సంతోషపడింది కూడా. నేను ఇంగ్లీష్ మాట్లాడితే ఆమెకి కూడా మానాయనలాగే గర్వంగా వుంటుంది. వాళ్లకి అబ్బసాయిలు ఇంగ్లీష్ మాట్లాడితే మరీ సంతోషంగా వుంటుంది. మా నాయన అంజయ్యనూ, నర్సిములునూ ఇంగ్లీష్ అభివృద్ధి చేసుకోమని ఎప్పుడూ సతాయిస్తూ వుంటాడు.

◆◆◆

నర్సిములూ, అంజయ్యా నిరుడు మిగిలి పోయిన సబ్జెక్టులు పూర్తిచేసుకోడానికి బాగా శ్రమ పడుతున్నారు. నేనేమో నాకేమాత్రం ఆసక్తిలేని సబ్జెక్టులతో కుస్తీ పడుతున్నాను.

నాయన నన్ను గణితం ఫిజిక్స్ కెమిస్ట్రీ తీసుకోమని ఒకటే బలవంతం చేస్తే తీసుకోక తప్పలేదు. నేనెంత కష్టపడ్డా ఆ సబ్జెక్టులు నా వశం కావడంలేదు. నాకు చాలా అసహనంగా వుంది. ముఖ్యంగా గణితం మరీ ఎక్కువ స్టాండర్డ్‌లో వున్నట్టు కనిపిస్తోంది. ఫిజిక్స్ కూడా కష్టంగానే వుంది. పైగా నాకు తెలియచెప్పేవాళ్ళుకూడా ఎవరూ లేరు. మానాయన నామీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. అబ్బసాయిలు తరవాత నేను పెద్ద ఆఫీసర్ అవుతానని! నర్సిములూ, అంజయ్యా ఆయన్ని బాగా నిరాశపర్చారు. అయినా ఆర్థికంగా ఎన్ని కష్టాల్లో వున్నప్పటికీ ఆయన వాళ్ళ చదువు మాన్పించలేదు. ఈ విషయం నన్ను రోజూ వెంటాడి బాధించేది. నేను ఎట్లా అయినా ఆయన కలలు నిజం చెయ్యాలి అనుకునేవాడిని. మా అన్నలు సప్లిమెంటరీ పరీక్షల్లో ఆరెండు సబ్జెక్టులలోనూ ఉత్తీర్ణులయ్యారు. అది ఒక మంచి సంకేతం మాకు. పైచదువులకి పంపిస్తానని నాయన హామీ ఇచ్చాడు వాళ్లకి.

నర్సిములు చాలా చురుగ్గా వుండేవాడు. అతనికి చాలామంది స్నేహితులు వుండేవాళ్ళు. క్లాసులో వెనక కూచునేవాళ్లకి నాయకుడు కూడా. అందుకు భిన్నమైన వాడు అంజయ్య. తనకి చాలా తక్కువమంది స్నేహితులు. ఎక్కువగా బయటికి పోకుండా ఇంట్లో వుండడానికి ఇష్టపడేవాడు. పైగా బాలరాజు ఇంట్లో వుంటే మా స్నేహతులెవరికీ మా ఇంటికొచ్చే ధైర్యం వుండేది కాదు. అయితే నర్సిములు మాత్రం బాలరాజుని ఏమార్చి స్నేహితులతో తిరిగి వచ్చేవాడు. అంజయ్య అందమైన వాడు. మృదు స్వభావి. చిత్రలేఖనం బాగా వచ్చు. మంచి దస్తూరీ అతనిది. హిందీ సినిమా హీరో దేవానంద్‌కి వీరాభిమాని. ఆయన లాగే తలదువ్వుకునేవాడు. అబ్బసాయిలుకి అంజయ్యంటే చాలా ఇష్టం. నిజానికి మేం ముగ్గురం చాలా సన్నిహితంగా వుండేవాళ్ళం. ఎన్నో విషయాలలో మా మధ్య పోలికలుండేవి.

'ఏమైంది ఎందుకట్లున్నవ్?' అన్నాడు బాలరాజు ఒక రోజు ఖిన్నుడై కూర్చున్న అబ్బసాయిలుని.

'నాకు అసిస్టెంట్ యార్డ్ మాస్టర్ గ ట్రాన్స్ఫర్ అయింది. నువ్ పనిచేసే యార్డుకే' అన్నాడు అబ్బసాయిలు.

అబ్బసాయిలుకి ఇది నచ్చలేదు. ఎందుకంటే అసిస్టెంట్ యార్డ్ మాస్టర్ సూచనల ననుసరించి షంటింగ్ మాస్టర్ పాయింట్స్‌మెన్‌కు బోగీలను కలిపి ఒక రైలు తయారు చేయడానికి ఆదేశాలిస్తాడు. బాలరాజు అక్కడ పాయింట్స్‌మన్. అంటే తమ్ముడు అక్కడ అధికారీ. అన్న అతని క్రింది ఉద్యోగీ అన్నమాట. ఇది అబ్బసాయిలుకు బాధాకరంగా వుంది. ఈ సంభాషణంతా మా నాయన వింటూనే వున్నాడు. ఆయన కల్పించుకుని 'అయితే సెలవు పెట్టి మరొక చోటకు ట్రాన్స్ఫర్ కొరకు అప్లై చెయ్' అన్నాడు, అబ్బసాయిలుతో.

'ఎందుకట్లా?' అన్నాడు బాలరాజు.

'నీపై ఆఫీసర్ గ పనిజెయ్యడానికి వానికి మనసొప్పుతలేదు' అన్నాడు నాయన కాస్త విచారంగా.

'నువ్వేం ఫికర్ జెయ్యకురా! నా తమ్ముని కింద పని చేయడం నాకు సంతోషమే నాయనా !' అన్నాడు బాలరాజు.

'అదేంగాదన్నా ! నీపై ఆఫీసర్‌గా పనిజెయ్యలేను, నా వల్లగాదు' అబ్బసాయిలు.

'అదేం పట్టిచ్చుకోకు తమ్మీ! మనందరం పనిజేసేది రైల్వే వాళ్లకే! ఇంట్లో నువ్వు నాపై ఆఫీసర్‌వు గాదుగదా! నీకింద పనిజేయటం నాకు సంబురంగ ఉంటది' అన్నాడు బాలరాజు.

అబ్బసాయిలుకి ఈ పరిస్థితి ఇబ్బందిగా వున్నా బాలరాజుకి మాత్రం తన తమ్ముడు తన పై అధికారిగా వచ్చినందుకు గర్వంగా వుంది. పాయింట్స్‌మన్‌గా బాలరాజు అబ్బసాయిలు కన్న అరగంట ముందు వెళ్ళాలి పనిదగ్గరకు. ఇంట్లో మాత్రం బాలరాజే అందరికన్న పెద్ద. అందరి మీద అజమాయిషీ అతనిదే. పనికి పోయేముందు అబ్బసాయిలు దిండుకింద ఒక అర్ధణా పెట్టేవాడు బాలరాజు. అది అతను పని ప్రదేశంలో టీ తాగడానికి.

◆◆◆

ఇద్దరూ ఒకే చోట పనిచేస్తున్నారు కనుక బాలరాజూ అబ్బసాయిలూ అక్కడి విషయాలను గురించి తీవ్రంగా చర్చించుకునేవాళ్ళు. అట్లాంటప్పుడు మా నాయన కల్పించుకుని ఉద్యోగ సమస్యలు ఇంట్లో చర్చించవద్దని చెప్పేవాడు. నిజానికి మా నాయనా అన్నయ్యలూ కూడా ఆపరేటింగ్ శాఖలోనే పనిచేస్తున్నారు. అందుకని అక్కడి సమస్యల్ని గురించి మాట్లాడకుండా వుండడం ఒక్కొక్కసారి కుదరదు. అప్పుడప్పుడూ వీళ్ళు ఉన్నతాధికారు లను గురంచి కూడా మాట్లాడుకునేవాళ్ళు. వాళ్ళ మాటలు వినీ వినీ వాళ్ళు చేసే పని గురించి క్షుణ్ణంగా అర్థమైపోయింది నాకు.

ఇద్దరు అన్నతమ్ములు ఒకే చోట పనిచెయ్యడం, అన్నపై తమ్ముడు అధికారిగా వుండడం అనే విధి లీల చూస్తే నాకు చిత్రంగా అనిపిస్తూ వుండేది. ఇందుకు కారణం అబ్బసాయిలు చదువేననేవాడు మా నాయన. ఉన్నత విద్యే మనిషిని ఉన్నత స్థాయికి చేరుస్తుందని చెప్పడానికి ఏ చిన్న అవకాశం వచ్చినా వదులుకునేవాడు కాదు మా నాయన. తన పెద్ద కొడుకుని చదవించలేకపోయినందుకు ఎప్పుడూ విచారిస్తూ వుండేవాడు.

◆◆◆

అప్పటి రోజుల్లో అనేక దళిత కుటుంబాల్లో లాగానే మంత్రాలూ దెయ్యాలూ దుష్టశక్తులకు వ్యతరేకంగా చేసే పూజలూ మా ఇంట్లోనూ వుండేవి. 1960 –70లల్లో మా కందరికీ వీటిమీద నమ్మకం వుండేది. ఇంట్లో ఎవరికైనా జబ్బుచేస్తే డాక్టర్ కన్న

ముందు మంత్రగాళ్ళ దగ్గరికి పోయేవాళ్ళం. బాలరాజు కూతురు శ్యామ విషయంలో అట్లాగే జరిగింది. అప్పుడు శ్యామకు మూడో ఏడు. విపరీతమైన జ్వరంతో మూసిన కన్ను తెరవకుండా పడివుంది. ఆ పిల్లను మంత్రాల బాలయ్య దగ్గరకు తీసుకుపోదామంది మా అమ్మ.

'అదే మంచిది. కంటిరెప్పలు లేచి ఉన్నయ్ ఏదో దెయ్యం బట్టి ఉంటది' అన్నాడు నాయన.

శ్యామను మెట్టుగూడ రైల్వే సమాధుల దగ్గర వుండే మంత్రాల బాలయ్య దగ్గరకు తీసుకుపోయారు. అతను నకిలీ వైద్యుడు కాదు. ఒట్టి భూతవైద్యుడు మాత్రమే. అప్పుడతను మాకొక కుటుంబ వైద్య సలహాదారులా వుండేవాడు. అతను శ్యామ మొహం మీద ఉఫ్ మని ఊది ఏవో మంత్రాలు చదివాడు. నిమ్మకాయలు కోసి వాటిని ఆ పిల్ల తల చుట్టూ తిప్పాడు. ఇట్లా చేస్తే ఆమెను ఆవహించిన దుష్టశక్తులు పారిపోతాయని నమ్మకం. అప్పుడప్పుడు అతను తావీజులుకూడా ఇస్తూండేవాడు కానీ ఇప్పుడేమీ ఇవ్వలేదు. అయినా శ్యామ జ్వరం తగ్గలేదు. జ్వర తీవ్రతకి శ్యామ పక్క బట్టలు కూడా వేడేక్కిపోతున్నాయి. మా వదిన పోచమ్మ బాగా దిగులుపడిపోయింది. తన దగ్గర ఏడవడానికి కూడా ఓపిక లేదు. నేను ఆ రాత్రంతా ఆమె పక్కనుండి పిల్లను డాక్టర్‌కి చూపించమని బాగా చెప్పాను. మర్నాడు పొద్దున అబ్బసాయిలు పిల్లను హాస్పిటల్‌కు తీసుకుపోయాడు. ఎప్పుడూ చురుగ్గా వుండే పిల్ల ఇప్పుడు కదలిక లేకుండా అయిపోయింది. అ పిల్లను చూసి డాక్టర్లకే భయంవేసింది. వాళ్లకి మా మీద, చాలా కోపం వచ్చింది. పాపకు వచ్చింది సామాన్యమైన జ్వరం కాదు. పోలియో సోకింది. మా అజ్ఞానం పాప ఎడమ కాలుని చలన రహితం చేసింది. ఒక ఆరోగ్యవంతమైన శిశువుకు అంగవైకల్యం తెచ్చిపెట్టింది. మా వదినె పిల్లను చూసి గుండెలు బాదుకుంటూ ఏడ్చింది. డాక్టర్లు ఆమెను అవతలకు పంపించారు. ఇప్పుడు అదే శ్యామ పట్టుదలతో తన శారీరక ఇబ్బందిని అధిగమించి కెమిష్ట్రీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి, ఒక ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్నది.

మా రెండవ వదిన కృష్ణవేణి కూడా ఇటువంటి మూఢనమ్మకాలతోనే ఒకసారి భూతవైద్యం చేయించుకుంది. ఆమె ఉన్నట్లుండి నడిరాత్రి నిద్రలేచి అంట్లు తోమేది. ఒక వింత గొంతుతో తనలో తనే మాట్లాడుకునేది. నవ్వుకునేది. రాత్రి తనెలా ప్రవర్తంచిందీ పగలు గుర్తులేదని చెప్పేది. నాకుఇప్పుడు అనిపిస్తుంది. ఆమెకేదో మానసిక సమస్య వుండివుండాలని. కాని అప్పుడైతే మానాయనా అన్నయ్యలూ ఆమెకేదో దెయ్యం పట్టి ఇటువంటి చేష్టలు చేయిస్తోందనుకున్నారు. ఈ సారి మంత్రాల బాలయ్య కాకుండా రిచర్డ్ అనే ఆయన దగ్గరకు తీసుకుపోయారు. క్రిష్టియన్లకు కూడా ఇటువంటి భూతవైద్యాలు తెలుస్తాయా అని ఆశ్చర్యపడ్డాను. అతను యువకుడు. మమ్మల్ని ఒక నల్లమేకను, కొన్ని నిమ్మకాయలు నల్లపూసలు, పసుపూ కాస్త కల్లూ తెమ్మన్నాడు. నాన్నా, అబ్బసాయిలూ

కృష్ణవేణీ అతని దగ్గరికి బయలుదేరితే నేనూ వెంటపడ్డాను. మానాయన వద్దన్నాడు కానీ అబ్బసాయిలు రమ్మన్నాడు. మధ్యహ్నం బయలుదేరాం. అతనుండే చోటికి చేరేసరికి సాయంత్రం అయింది. అక్కడ బాగా చెట్లూ పొదలూ వుండి ఒక అడవిలాగా వుంది (అదే ఇప్పుడు ఇందిరా పార్క్ అయింది) రిచర్డ్ నల్లమేకని ఒక చిన్న చెట్టుకు కట్టేశాడు. మా వదినని తనకెదురుగా కూర్చోమన్నాడు. ఆమె పాపిట్లోనుంచీ కొన్ని వెంట్రుకలు తీసుకుని వాటిని ఒక ముడిలాగా వేశాడు. ఒక చిన్నమట్టిమూకడులో బొగ్గులు అంటించి నిప్పుచేశాడు. ఆ నిప్పులమీద కర్పూరంతో పాటు ఇంకేవో వేసాడు. ఏవో మంత్రాలు చదివాడు. అప్పుడు మా వదిన నడుము గుండ్రంగా ఊపుతూ ఏవో శబ్దాలు చెయ్యడం మొదలుపెట్టింది. అప్పుడు ఆయన ఒక చిన్న వేపకొమ్మతో మా వదిన్ని కొడుతూ,

'ఎవరు నువ్వు? మగ దయ్యానివా? ఆడదయ్యానివా?ఎందుకొచ్చినవ్?' అన్నాడు

మా వదిన గట్టిగా నవ్వుతూ వెక్కిళ్ళు పెడుతూ, 'నేన్ బాపన దయ్యాన్ని నాకు పెరుగన్నం గావాలె' అంది.

పెరుగన్నం తెచ్చిపెడితే పెద్ద ముద్దలు చేసుకుని తినడం మొదలపెట్టింది. అది చాలా ప్రమాదకరమైన దెయ్యం అనీ దాన్ని తను నల్లమేకలో బంధిస్తాననీ చెప్పాడు రిచర్డ్. కల్లంతా ఒక్క గుక్కలో తాగేసి సీసా విసిరేసాడు. మంత్రాలు చదువుతూ మేక మీద పసుపు చల్లాడు. దాన్నినేలమీద పడేసి తన పళ్లతో దాని గొంతు కొరికి చంపేశాడు. అతని బలం చూసి ఆశ్చర్య పడ్డాను. మానాయన రిచర్డ్ దెయ్యాన్ని చంపేశాడని ప్రకటించాడు. ఈలోగా మా వదిన స్పృహ తప్పి పడిపోయింది. మేం ఆమె ముఖం మీద నీళ్ళు చల్లితే లేచికూర్చుంది. ఆశ్చర్యమేమిటంటే ఈ సంఘటన తరువాత ఆమె మామూలు మనిషైపోయింది. మా నాయనకూ, బాలరాజుకూ ఇటువంటి విషయాల్లో నమ్మకం వుండడంతో ఈ వైద్యాలు మా ఇంట్లో చాలా కాలం కొనసాగాయి.

ఇది కాకుండా మా ఇంట్లో సంవత్సరానికొక సారి దుర్గమ్మ పూజ జరిగేది. తెల్లవార్లూ ఒక పూజారీ ఆయన సహాయకుడూ ఈ పూజ నిర్వహించేవాళ్లు. డప్పులమోగించేవాళ్ళు. మా అమ్మ పూజారి ఎదుట కూర్చునేది. ఆయన అమ్మలోకి దుర్గమ్మను ఆవాహన చేసేవాడు. అమ్మ మైకంలోకి వెళ్ళిపోయేది. బ్రాహ్మణులతో సహా మా ఇరుగు పొరుగు అగ్రకులస్థులంతా ఇళ్ళ తలుపులు వేసుకుని లోపలుండిపోయేవారు. మేం వుంటున్న మూడవ తరగతి ఉద్యోగుల క్వార్టర్స్‌లో మా కులం ఎవరికీ తెలీదు. మేము కూడా వింత ఆచారాలు పాటించే శూద్రులమని అనుకునేవారు. గట్టిగా చదివే మంత్రాలూ డప్పుల మోతా చూసి వాళ్లకి భయం వేసేది. పొద్దున్నే పూజారి ఒక కథ చెప్పి, డప్పు మోగిస్తూ ఒక మేకని చంపేవాడు. దుష్టశక్తులను పారదోలడానికని దాని రక్తాన్ని ఆవరణంతా చల్లేవాడు. దీన్ని బలివ్వడం అని చెప్పేవాడు నాయన. తరువాత విందు జరిగేది. ఇక్కడ పూజారి నేలమీద వేసిన ముగ్గు లాగానే వజ్రయాన బౌద్ధుల

ఆచారం ప్రకారం దలైలామా రంగులతో నేలమీద గీసిన చిత్రం గుర్తొచ్చింది ఆ రెండింటికీ పోలికలు కనపడుతున్నాయి.

◆◆◆

ఎదురు చూసిన పి.యు.సి. ఫలితాలు రానే వచ్చాయి. నేను మూడవ శ్రేణిలో ఉత్తీర్ణుణ్ణయినందుకు మా నాయనా మా పెద్దన్నలూ విచారించారు గానీ నాకు మాత్రం పెద్ద ఆశ్చర్యమూ ఆశాభంగమూ కలగలేదు. ఎందుకంటే నేను ఈ మాత్రం కూడా ఆశించలేదు. పైగా ఒక సంవత్సరం వృధా కానందుకు సంతోషం కూడా కలిగింది. ఇప్పుడు మేము ముగ్గురం పై చదువు చదవాలి. మేమేం చదవాలో అబ్బసాయిలు ఆలోచించాడు. అబ్బసాయిలు సలహా ప్రకారం నర్సిములూ అంజయ్యా నేనూ బి. ఎస్ సి లో చేరాం. నాకు మళ్ళీ గణితం ఫిజిక్స్, కెమిస్ట్రీ, వాళ్లకి బాటనీ జూవాలజీ కెమిస్ట్రీ సూచించాడు అబ్బసాయిలు. వాళ్లకి ఒక విద్యా సంవత్సరం నష్టం అవడంతో ముగ్గురం ఒకే క్లాసులోకి వచ్చాం. వాళ్ళు సికిందరాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోనే కొనసాగగా నేను మాత్రం నిజాం కాలేజిలో చేరాను.

నిజాం కళాశాలని ఒకప్పుడు జాగీర్దార్ కాలేజి అని పిలచేవాళ్ళు. నిజామ్ కళాశాల ఆరోజుల్లో ఆ పరిసరాల్లోనే ఉత్తమ కళాశాల. అక్కడ చదివిన విద్యార్థులలో ఎంతోమంది ప్రభుత్వంలో ఉన్నతాధికారులయ్యారు. మంచి పారిశ్రామికవేత్తలయ్యారు. వ్యాపారవేత్త లయ్యారు. రాజకీయ నాయకులయ్యారు. దౌత్యవేత్తలుకూడా అయ్యారు. ఇప్పటికీ ఆ ప్రతిష్ఠ నిలుపుకున్న ఈ కళాశాలలో తమ పిల్లలని చేర్చడానికి ఉన్నతాధికారులూ, పారిశ్రామకవేత్తలూ రాజకీయనాయకులూ ప్రయత్నిస్తారు. నాకు అక్కడ ప్రవేశం దొరికినందుకు అబ్బసాయిలు చాలా సంతోషించాడు. నన్ను సికిందరాబాద్ కాలేజిలో చేర్చవద్దని బాలరాజుతో వాదించాడు.

ఇప్పుడు నేను ఉన్నత విద్యాన్వేషణలో వున్నాను. కానీ రోజూ కాలేజీకి వెళ్లడం పెద్ద సమస్య అయింది. సికిందరాబాద్ నుంచీ బషీర్‌బాగ్ దాకా రోజూ చాలాదూరం వెళ్ళాలి. అంటే ట్యాంక్‌బండ్ మీద నుంచీ పోవాలి. మా నాయన నన్ను సైకిల్ మీద పొమ్మన్నాడు కానీ నాకు ఇష్టంలేదు. అంతదూరం సైకిల్ మీద పోవడం కష్టం. పైగా నా స్నేహితులెవరూ సైకిల్ మీద పోరు. కొన్నాళ్ళు నడిచిపోయాను. తరువాత బాలరాజు నాకు బస్‌పాస్ ఇప్పించాడు. అప్పట్లో బస్‌పాస్ పదిరూపాయలు కూడా లేదు. కానీ మాలాంటి పెద్ద కుటుంబానికి పదిరూపాయలు చాలా పెద్ద మొత్తమే. నేను ఏడవనంబర్ డబుల్ డెక్కర్ బస్సు మీద మూడు సంవత్సరాలు కాలేజికి వెళ్ళాను.

ఒకేజాతి పక్షులు ఒకేగూటికి చేరతాయని సామెత చెప్పినట్టు అక్కడ స్నేహాలు కూడా వర్గాలను బట్టి వుండేవి. కార్లల్లో వచ్చేవాళ్ళు కార్లున్నవాళ్లతో, మోటర్ బైక్‌లున్నవాళ్లు అట్లాంటి వాళ్లతో, స్నేహం చేసేవాళ్లు. గ్రామాలనుంచి వచ్చిన భూస్వాముల కొడుకులు

ఒక ప్రత్యేక బృందంగా వుండేవాళ్లు. వీళ్ళల్లో ఎక్కువగా రెడ్లు వుండెవాళ్లు. వాళ్లల్లో వాళ్ళు మాతృభాషలో మాట్లాడుకునేవాళ్ళు. ఇంగ్లీష్లో మాట్లాడ్డం రానందుకు న్యూనత పడేవాళ్ళు. వాళ్లు మాట్లాడే హిందీకూడా నగరంలో మాట్లాడే హిందీలా వుండేదికాదు. నా స్నేహబృందం కూడా నాలాగే ఆర్థికంగా కిందమెట్టుమీద వున్నవాళ్ళే. నేను మొదటిరోజు క్లాసుకు వెళ్ళినప్పుడు జానకీ మనోహర్ చివరి వరుసలో కూర్చుని వున్నాడు. నేనతని పక్కన కూర్చుని 'నాపేరు సత్యనారాయణ' అని పరచయం చేసుకున్నాను అతను మొదటిరోజునుంచీ నన్ను 'సత్యం' అని పిలిచేవాడు. నాస్నేహితులు చాలామంది నన్ను అట్లాగే పిలుస్తారు. నాకింకా కె.ఎన్. శ్రీనివాసరావు, రవిప్రకాష్, భరద్వాజ్, షణ్ముఖం అనే స్నేహితులు కూడా వుండేవాళ్ళు. అందరికన్న మనోహర్ తో ఎక్కువ సన్నిహితంగా వుండేవాడిని. షణ్ముఖం కూడా నా బస్సులోనే వచ్చేవాడు. అతని తండ్రికి నేతి వ్యాపారం. పొద్దున్నే బాగా ఫలహారం చేసివస్తాడు కాబోలు బస్ ఎక్కగానే నిద్రకిపడేవాడు. దిగవలసిన స్టాప్ వచ్చినప్పుడు అతన్ని లేపవలసి వచ్చేది ఒక్కొక్కసారి.

◆◆◆

మొదటి సంవత్సరం ముగియబోతూండగా ఒక రోజూ నేనూ మనోహర్ ఒక పెద్ద చింతచెట్టు కింద నిలబడి వున్నాం. అతను సెలవల్లో తన స్వంతవూరు వరంగల్ వెళ్ళే విషయం చెబుతున్నాడు. అంతలోనే మా స్నేహితుడు ధర్మరాజు పరిగెత్తుకుంటూ వచ్చాడు. అతనుకూడా నాలాగే దళితుడు. అతను నన్ను మనోహర్కి దూరంగా చెయ్యిపట్టుకుని లాక్కుపోయి నా చెవిలో రహస్యంగా 'అరె సత్యం! నేను ఆఫీస్లో స్కాలర్షిప్ లిస్టు జూసిన. పైన నీపేరుంది. నువు గూడ ఎస్సీ వేనా?అని అడిగాడు.

'ఔను అయితేంది?' అన్నాను.

'మనం ఆ లిస్టును నోటీస్ బోర్డ్ మీద పెట్టొద్దని క్లర్క్కి చెప్పుదాం. మనం ఎస్సీలని తెలిస్తే మన ఫ్రెండ్స్ మనని చిన్న చూపు చూస్తారు' అన్నాడు ధర్మరాజు.

అతను చెప్పిందీ నిజమే. మా స్నేహితులలో చాలామందికి మా కులం తెలియదు. ఆఫీసుకు వెళ్ళి ధర్మరాజు గుమాస్తాతో మాట్లాడి ఆ జాబితా నోటీస్ బోర్డ్ మీద పెట్టకుండా చేసాడు. నాకు వచ్చినట్టే మా అన్నలు నర్సిములూ అంజయ్యలకు కూడా స్కాలర్షిప్ వచ్చింది. ఆ డబ్బులోనుంచీ మేము తలకొక జత బట్టలు బూట్లు కొనుక్కున్నాము. మేము బూట్లు వేసుకోడం అదే మొదటిసారి. మా నాయన మాకొచ్చిన స్కాలర్షిప్ని మాకోసమే ఖర్చు చేసేవాడు కానీ ఇంటికెప్పుడూ వాడేవాడుకాదు.

◆◆◆

నేను బి.ఎస్.సి. రెండో సంవత్సరంలో వుండగా మా నాయన స్వచ్ఛందంగా నౌకరి విడిచిపెట్టవలసి వచ్చింది. ఒక రోజు ఆయన ఒక్కడే చాలా దిగులుగా పెరట్లో

కూర్చుని వున్నాడు. మా అమ్మ ఆయన దగ్గరకు వెళ్ళి చాలా నెమ్మదిగా 'ఏమైంది, బాలరాజా? ఎందుకు ఫికర్ చేస్తున్నవు?' అనడిగింది.

'నేను మెడికల్ టెస్ట్‌కుపోయాను. టెస్ట్ లో ఫెయిలైన' గొణుగుతున్నట్లు అన్నాడాయన.

ఆ విషయం విని అమ్మ కలవర పడింది. కాసేపు ఇద్దరూ మాటలు రానట్టు వుండిపోయారు.

'నా కండ్లు సరిగ కనవడ్తలేవు. చెప్రాసి ఉద్యోగంలో వెడ్తనన్నడు. ఈ విషయం పిల్లలతోని మాట్లడాలె' అన్నాడు నాయన.

'మరెట్ల? పిల్లల చదువు బంజేద్దామా?' అంది అమ్మ కళవెళ పడుతూ'.

మా అమ్మ భయం సమంజసమే అయినా ఆమాటకి ఆయన చలించిపోయాడు. తన కలల సౌధం కుప్పకూలిపోయినట్టు బాధపడ్డాడు. తరువాత ఆవిషయాన్ని గురించి అమ్మా నాయనా, బాలరాజూ, అబ్బసాయిలూ చర్చించారు. మా చదువులు ఆగిపోకుండా వుండడం కోసం తక్కువ జీతంతో తక్కువ స్థాయి నౌకరిలో చేరడానికి సిద్ధపడిపోయాడు నాయన. కానీ అట్లా చెయ్యడానికి మా అన్నలు ఒప్పుకోలేదు.

'నువ్వు చెప్రాసిగా పంజెయ్యాల్సిన అవసరంలేదు నాయనా' అన్నాడు బాలరాజు

'తమ్ముండ్లను మేం చదివిస్తాం. మేము నీకు మాటిస్తున్నం' అన్నాడు అబ్బసాయిలు.

'నేనిట్ల గూసుంటె ఎట్ల గడుస్తది, బిడ్డా?' అన్నాడు నాయన.

'వద్దు నాయనా, నువ్వు చెప్రాసిగ పంజేస్తుంటే మేం జూడలేం. మేమన్నీ చూసుకుంటం నువ్వేం ఫికర్ జెయ్యకు' అన్నాడు బాలరాజు.

చివరికి బాలరాజూ అబ్బసాయిలూ ఆయన్ని ఒప్పించడంతో మా నాయన స్వచ్ఛందంగా నౌకరి విరమించుకున్నాడు. అది ఆయనకు చాలా బాధకలిగించిన విషయం. అందుకు జీవితాంతం పశ్చాత్తాప పడ్డాడు.

మేము పుస్తకాలు కొనుక్కోకుండా లైబ్రరీ నుంచీ తెచ్చుకుంటూ మా అన్నలకి చెయ్యగల సహాయం చేసాం. అంతకన్న ఏంచెయ్యగలం?.

◆◆◆

అబ్బసాయిలు రైల్వేలో ఆఫీసర్ అయినప్పటికీ అతను పూర్తిచేసింది హైస్కూల్ విద్య మాత్రమే. మేం ఉన్నత విద్య అభ్యసిస్తుంటే అతనిలోకూడా ఇంకా చదువుకోవాలనే కోరిక వెంటాడుతూవుంది. ముగ్గురు కూతుళ్ళు పుట్టాక. అప్పుడు సికిందరాబాద్ కాలేజీలో పి.యు.సి. లో చేరాడు. అందుకోసం నైట్ డ్యూటీలు వేయించుకునేవాడు. అతనుకూడా మాపక్కన కూచుని చదువుకుంటూ వుంటే నాకు సంభ్రమంగా వుండేది. రాత్రిపూట అందరం వరుసగా పుస్తకాలు పట్టుకుని కూర్చుంటే మా ఇల్లొక విద్యాలయం లాగా వుండేది. అతని సబ్జెక్టులు వేరైనా అప్పుడప్పుడు తన నోట్సు నాకు చూపించి తన ఇంగ్లీష్ గురించి సూచనలు అడిగేవాడు. అతని పిల్లలు అతన్ని అప్పుడప్పుడూ కదిలిస్తూ

వుండేవాళ్లు. కానీ అదేదీ అతని కృతనిశ్చయాన్ని సడలించలేదు. మానాయన మాత్రం రాత్రిపూట ఎవరూ రేడియో పెట్టకుండా కనిపెట్టి వుండేవాడు. ఇప్పుడు బాలరాజు మాకొక మర్ఫీ రేడియో కొన్నాడు.

◆◆◆

ఇప్పుడు మేము పెద్దవాళ్లమై కళాశాల విద్యార్థులమైనాం కనుక ఇంటికి స్నేహితులను రానిస్తున్నారు మానాయనా, బాలరాజూ! వచ్చేది ఎక్కువగా నర్సిములు స్నేహితులే. అంజయ్యకూ నాకూ మాదిరిగా కాక అతనికొక స్నేహితులగుంపు వుండేది. దాదాపు అంతా వ్యాపారస్థుల కొడకులు. మాలాగా కాకుండా మా స్నేహతులు కొంతమంది దగ్గర ఖర్చుపెట్టుకోడానికి కాస్త డబ్బుండేది. నాకు బాలరాజు నెలకొక రూపాయి ఖర్చుపెట్టుకోమని ఇచ్చేవాడు. ఇప్పుడా విషయం చెబితే మా అమ్మాయిలు నవ్వుతారు. 'సరేలే నాయనా! నమ్మమనే చెబుతున్నావా?' అంటారు. మరి వాళ్ల ప్రమాణాల్లో అది స్వల్పాతిస్వల్పం. కానీ ఆరోజుల్లో నాకది ఎక్కువే. దాన్ని నేను చాలా జాగ్రత్తగా ఖర్చుపెట్టుకునేవాడిని. రోజూ టీ తాగడానికి, గన్ ఫౌండ్రీలోని ఒలింపియా హోటల్‌కి నలుగురం పోయేవాళ్ళం. వరస ప్రకారం ప్రతి నాలుగోరోజూ నేను డబ్బులిచ్చేవాణ్ణి. కప్పు టీ అయిదు పైసలు. అంటే నాలుగురోజుకొకసారి ఇరవై పైసలు ఖర్చు అన్నమాట. ఒక్కొక్కప్పుడు నా దగ్గర పైసలుండేవి కాదు అందుకని టీ తాగవద్దనుకునేవాణ్ణి. కానీ అప్పుడు నా బదులు మనోహర్ ఇచ్చేవాడు. టీ తాగుతూ గ్రామొఫోన్‌లో వచ్చే పాటలు వినేవాళ్ళం.

అప్పటికి ఇంకా నాకు గణితం చాలా కష్టంగానే అనిపించేది. మనోహర్‌కి బాగా వచ్చు. అందుకని ఆదివారాల్లో వాళ్ళింటికి వెళ్ళి చెప్పించుకునేవాడిని. ఫిజక్సూ కెమిస్ట్రీ ఫరవాలేదు. ఒక్కొక్కసారి అర్థంకాక పోయినా కంఠస్థం చెయ్యగలిగేవాడిని.

ఇప్పుడు మా నాయనకు సంపాదన లేదు, చుట్టలు కొనుక్కోడానికి కూడా మా అన్నల మీద ఆధారపడవలసి వచ్చింది. అయితే మా అన్నలు ఆయన అవసరాలు చాలా శ్రద్ధగా చూసుకుంటున్నారు. అయినా ఆయన దిగులుగానే వుంటున్నాడు. నౌకరి విరమణ తరువాత తనకు రావల్సిన ప్రావిడెంట్ ఫండ్ గ్రాట్యుటీల కోసం రైల్వే ఆఫీస్‌కు తిరగుతూ వుంటే కొంత కాలక్షేపం అయేది.

◆◆◆

ఆరోజు సాయంత్రం మేం ఒక్కొక్కరమే కాలేజి నుంచీ ఇంటికి వస్తున్నాము. మా నాయన మా తమ్ముళ్ళకోసం ఎదురుచూస్తున్నాడు. అంతలోనే బాలరాజు చేతిలో ఒక కాగితం పట్టుకుని రొప్పుకుంటూ వస్తున్నాడు.

'ఏమైంది బిడ్డా?' అన్నాడు నాయన ఆదుర్దాగా.

'టెలిగ్రామొచ్చింది తాత సచ్చిపోయిండు' అంటున్న బాలరాజు కంఠం వణికింది.

ఆ పిడుగులాంటి మాట విని మా నాయన తల పట్టుకుని నేలమీద దబ్బున కూలబడ్డాడు. మా అమ్మ గుండెలు బాదుకుంటూ ఏడవబట్టింది. మా అన్న తమ్ములందరం ఏడుస్తున్నాం. మా తాత తరం అయిపోయింది. భార్య శవాన్ని భుజానేసుకుని వంగపల్లి వదిలిపెట్టిన ఒక అస్పృశ్యుడు, మళ్ళీ ఆ గ్రామాన్ని తిరిగి చూడలేదు. ఇప్పుడిక లోకానికే వీడ్కోలు చెప్పాడు. ఆయనట్లా ఊరొదిలి వచ్చి రైల్వేలో చేరకపోయివుంటే మా కుటుంబం పరిస్థితి వేరుగా వుండేది. ఆయన మరణం మాకు అత్యంత బాధను కలుగచేయకుండా ఎట్లా వుంటుంది? ఆయన మేకల్ని తోలుకుపోతూంటే ఆయన వెంట పోయి ఆడుకున్న ఆటలు ఇప్పటికి కూడా గుర్తొస్తూనే వుంటాయి నాకు. మేం మామేనత్త వుండే నెక్కొండ కు బయలుదేరాం. అక్కడే ఆయన చనిపోయాడు. మా నాయన పెద్ద కొడుకు కనుక అంత్యక్రియలు చెయ్యాలి. అందుకని ఆయనక్కడ పదిరోజులు వుండిపోయాడు.

◆◆◆

మానాయనకు రైల్వేనుంచి రావలసిన డబ్బు వచ్చింది. ప్రావిడెంట్ ఫండ్ గ్రాట్యుటీ కలిసి కొన్ని వేల రూపాయలొచ్చాయి. అప్పటికింకా రైల్వే ఉద్యోగులకు పెన్షన్ లేదు. స్వంత డబ్బుంటూ కాస్త కనపడగానే మా నాయనకు మళ్ళీ కాస్త ఆత్మవిశ్వాసం వచ్చినట్లైంది. మానాయనా మా పెద్దన్నలూ అప్పుడప్పుడూ కల్లంగడికి స్నేహితుల్లాగా పోయి బాగా తాగేసి వస్తుండేవాళ్ళు.

'బిడ్డా!నేను మన ఊరు వంగపల్లికి పోయొస్త' అన్నాడు అట్లాంటి ఒకరోజున మానాయన. ఎందుకని అడిగాడు బాలరాజు.

'అక్కడ మన తాతల భూముంది. మీ ముత్తాతకు పొలముండేది. నేనండ్ల ఎగుసం జేద్దామనుకుంటున్న'.

'అద్దు నాయనా! పైసల్ ఖర్చు వెట్టొద్దు. వాకర్ టౌన్ల మంచి ఇల్లున్నది. నీ దగ్గరున్న పైసల్తోని ఇల్లుగొందాం' అన్నాడు అబ్బసాయిలు.

ఆ డబ్బుతో ఇల్లుకొనడం కలలో మాత్రమే సాధ్యమయ్యే పని. కల్లుతాగి వుండకపోతే అబ్బసాయిలు ఇట్లా అనేవాడు కాదేమో!.

నాయన అతని వంక గంభీరంగా చూసి 'ఎందుకు? నేను వోయినంక మీరుకొట్లాడుకో డానికేనా? మీ అందరికి మంచి సదువులు జెప్పిచ్చిన. మీరే సొంతంగా ఇళ్ళు కొన్నుక్కోండ్రి. మా నాయన ఇడ్సిపెట్టిన భూమి నేను సొంతం జేస్కోవాలనుకుంటున్న' అన్నాడు.

మానాయన కొంచెంతాగి వున్నప్పటికీ నిజమే మాట్లాడాడు. మా అమ్మ వచ్చి సర్ది చెప్పేదాకా వాళ్ళు ముగ్గురూ వాదించుకుంటూనే వున్నారు.

మరునాడు పొద్దున ఆయన తను చేపట్టబోయే కార్యక్రమాన్ని గురించి శ్రద్ధగా ఆలోచించాడు. తన స్వంత ఊరికి వెళ్ళి వ్యవసాయం చెయ్యాలనే నిర్ణయించుకున్నాడు. మా ఇంట్లో ఎవరికీ ఆయన ఉద్దేశం నచ్చకపోయినా తను మాత్రం ఆ నిర్ణయం మీదే వున్నాడు. తను ఖచ్చితంగా ఆ భూమిని స్వాధీనం చేసుకోగలనని గట్టిగా నమ్మాడు. ఆ సంగతి తన తమ్ముడు ఎల్లయ్యకు చెప్పాడు. ఆయన కూడా నాయనని సమర్థించాడు. ఇద్దరూ కలిసి వంగపల్లి పోవాలని నిశ్చయించుకున్నారు.

◆◆◆

నేను నా డిగ్రీ రెండో సంవత్సరం ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణుడనయ్యాను. అంజయ్యా నర్సిములూ కూడా విజయం సాధించారు, ఇక మూడవ సంవత్సరం మా ముగ్గురికీ కూడా కష్టమనిపిస్తోంది. ఈ లోగా అబ్బసాయిలు సికిందరాబాద్ కాలేజీలో బి.ఎ.లో చేరాడు. మా అందర్లోకీ అతనే బాగా చదువుతాడనేది నిజం. మళ్ళీ చదువులో అడుగుపెట్టి అటు ఉద్యోగమూ ఇటు పిల్లలతో ఎన్ని ఇబ్బందులు పడుతున్నా, మొక్కవోని దీక్షతో చదువు సాగిస్తున్నాడు. మా నాయనకు కొద్దిగా చదవడం వ్రాయడం వచ్చినా, మా కుటుంబంలో మొదటి విద్యావంతులం మేమే. మమ్మల్ని ఎట్లా అయినా ఉన్నత విద్యావంతులను చెయ్యాలనే మానాయన ధృఢ సంకల్పమే ఇందుకు కారణం. కొన్ని శతాబ్దాల కాలంగా అస్పృశ్యులను విద్యకు దూరంగా వుంచారు. తరాలకు తరాలు ఇతర కులాలకు సేవకులుగా మిగిలిపోయారు వాళ్ళు. స్వంతంగా ఆలోచించలేక, ప్రశ్నించడం నేర్చుకోక వాళ్ల మనసులు అట్లా స్థబ్దంగా వుండిపోయాయి. బీడు భూమి ని సాగులోకి తేవాలంటే ఎంతో శ్రమ పడాలి. కలుపుతియ్యాలి. అరక దున్నాలి. భూమిని తడపాలి. అట్లాగే శతాబ్దాలతరబడీ స్థబ్దుగా వున్న మెదళ్ళు జ్ఞానాన్ని అందుకోవాలంటే ఎంతో శ్రమకి ఓర్చాలి. ఇప్పుడు మా పిల్లలు చదువును ఆస్వాదించి అందుకున్నంత తేలిగ్గా మేము అందుకోలేకపోయాము. మా పరిస్థితులు, పరిసరాలు ఇప్పటి పరసరాలకు పరిస్థితులకు పూర్తి భిన్నంగా వుండేవి. మా నాయన స్నేహితులు చాలా మంది నిరక్షరాస్యులు. వాళ్లతో మేము మాట్లాడి నేర్చుకునేందుకు ఏమీ వుండేది కాదు. ఇంట్లో వాతావరణం కూడా అన్ని దళిత కుటుంబాలలో వున్నట్టే వుండేది. జ్ఞాన సముపార్జనకు దోహదం చేసే మాధ్యమాలేవీ మాకు అందుబాటులో వుండేవికావు. విద్యావంతులతో మేధావంతులతో మెలిగి వారినుంచీ ఏమైనా నేర్చుకునే అవకాశాలూ లేవు. ఇప్పుడవన్నీ మేము మా పిల్లలకు అందజెయ్య గలుగుతున్నాం. అప్పటి పరిస్థితిలో మేము చదువుకోడానికి చాలా కష్టపడవలసి వచ్చింది. వేసిన ప్రతి అడుగూ కష్టాలలోనుంచే! ఇంట్లో కానీ విద్యాలయాల్లో కానీ! మాలో ఆత్మ విశ్వాసం తక్కువగా వుండేది. పైగా ఒక ఆత్మ న్యూనతాభావం ఎప్పుడూ మమ్మల్ని వెన్నాడుతూ వుండేది.

మేము ముగ్గురం మా డిగ్రీ ఆఖరి సంవత్సరం పరీక్షలు 1965 వేసవిలో వ్రాసాం. పరీక్ష వ్రాసినప్పటినుంచీ నాకు గణితం లో ప్యాసవుతానని నమ్మకం లేకపోయింది. అదే నిజమైంది కూడా! అట్లాగే నర్సిములూ, అంజయ్యాకూడా బాటనీలో తప్పారు. ముగ్గురిలో ఏ ఒక్కరూ నెగ్గలేకపోయినందుకు మా కుటుంబంలో విచారం కమ్ముకుంది. నేను ఎలాగూ గణితంలో తప్పుతానని అనుకున్నాను కనుక నాకు పెద్ద ఆశాభంగం కలుగలేదు. మా వదినెలు నన్ను ఓదార్చారు. నాకున్న బాధంతా ఒకటే. మళ్ళీ పరీక్ష వ్రాసి డిగ్రీ పూర్తిచేసుకోడానికి అనుమతి వస్తుందో రాదో అని! ఈ విషయం మీద ఇంట్లో బాగా చర్చలు జరిగాయి. చివరికి మేము సప్లిమెంటరీ పరీక్షలు వ్రాయాలని అబ్బసాయిలు నిర్ణయించాడు. అందుకు అతనికి కృతజ్ఞత చెబితే, నేను ఈ పరీక్షలో నెగ్గితే నన్ను ఇంకా పైకి చదివిస్తానని చెప్పాడు అబ్బసాయిలు.

ఆ రోజుల్లో మా అమ్మ అప్పుడప్పుడూ దోమల్‌గూడాలో ఒక పెద్ద బంగళా తాలూకు ఔట్ హౌజ్‌లో వుండే తన పిన్నమ్మ ఇంటికి వెడుతూ వుండేది. ఆవిడ అక్కడ బంగళాలో ఇంటిపని చేసేది. ఆవిడ మా అమ్మతో చాలా ప్రేమగా వుండేది. అప్పుడప్పుడు మా ఇంటికి కూడా వచ్చేది. మేమూ తరచు ఆవిడ దగ్గరకు వెళ్ళే వాళ్ళం. అప్పుడు మా అమ్మ నాతో పాటు ఏడోనంబర్ డబల్ డెక్కర్ ఎక్కేది. మేం లిబర్టీ దగ్గర దిగేవాళ్ళం. అక్కడనుంచీ నడిచి ఆవిడింటికి పోయేవాళ్ళం. అప్పుడు రోడ్డుకి రెండుపక్కలావున్న పెద్ద పెద్ద భవనాలను ఎంతో కుతూహలంగా చూస్తూ 'నువ్వు ఆఫీసరైనంక ఇంత పెద్ద ఇల్లుగడితె చూడాలనుంది బిడ్డా!' అనేది. నేను మా అమ్మ మొహంలోకి చూసేవాడిని. తన బిడ్డలు తన కలను నిజం చేస్తారనే నమ్మకం ఆమె కళ్ళల్లో ప్రకాశించేది 'తప్పకుంట కడతమ్మా!' అనేవాడిని నవ్వుతూ.

ఆమెకు గొప్ప కలలున్నాయి. ఆ కలలు కనే అర్హత కూడా ఆమెకున్నది. మాకు చదువు చెప్పించడంలో ఆమె పాత్ర మహోన్నతమైనది. మాకోసం ఎండకు వానకు వెరవక, పొలం పనికి పోయేది. ఆమె కలలు నిజం కావాలనీ ఆమెకు మేము సుఖప్రదమైన జీవితం ఏర్పాటుచెయ్యాలనీ ఎప్పుడూ కోరుకునేవాణ్ణి. ఆమెకు నాతో అనుబంధం ఎక్కువ. చిన్నప్పుడు ఒక సందర్భంలో ఆమెకు నేను పునర్జన్మనిచ్చానని ఆమె నమ్మకం. అదేమిటంటే ఒకప్పుడు ఆమెకు రొమ్ముల్లో తిత్తులవంటివేర్పడ్డాయి. చుట్టుపక్కల వాళ్ళు అవి ప్రాణాంతకాలని ఆమెని భయపెట్టారు. ఒక సారి ఆమె రొమ్ములు పాలతో నిండిపోయి బాగా సలపరింతలు పెట్టినపుడు నేను ఆమె పాలు త్రాగాను. అప్పటినుంచీ ఆ సమస్య దానంతటదే నయమై పోయింది. నా వల్లనే తన సమస్య తీరిపోయిందని ఆమె నమ్మకం.

◆◆◆

ఒకరోజు. ఒకాయన తెల్ల ధోవతి కట్టుకుని చారల చొక్కా వేసుకుని మాఇంటికి వచ్చాడు. 'నమస్తే పటేల! ఏం కష్టం గాలేగదా ఇల్లుకనుక్కోనికి?' అన్నాడు మా నాయన ఆయన్ని చూస్తూనే. ఆయన్ని చూడగానే వూర్నించి వచ్చినట్టు తెలిసింది.

'ఏం కష్టం గాలె రామస్వామీ' అంటూ తన చేతిసంచీ మా నాయన కిచ్చాడాయన

అనుకోకుండా వచ్చిన ఈ కొత్తాయన్ని చూసి మానాయన తప్ప మేం అందరం ఆశ్చర్యపోయాం. బాలరాజు అప్పుడే డ్యూటీకిపోబోతున్నాడు. అతనివంక చూస్తూ 'బిడ్డా! ఈయన నర్సింహారావు. మనవూరు పటేల్. మిమ్ములను సూద్దామని అచ్చిండు' అన్నాడు మానాయన.

మా అన్న చిరునవ్వు నవ్వి ఆయన్ని కూర్చోమన్నాడు. నేనాయనకు మంచినీళ్ళిచ్చాను. పక్కగదిలోనుంచీ మా అమ్మ అతనెవరని మా నాయనను అడిగింది.

'మన వూర్ల గల్సినప్పుడు మనకి సాయం జేస్తనని మాటిచ్చిండు' అన్నాడు నాయన.

'ఈయన మనింట్ల ఉంటడా?' అనడిగింది అమ్మ అమాయకంగా. పటేల్ అగ్ర కులంవాడు.

'ఇక్కడ ఆయనను ఎవరు గుర్తుపట్టరు మంచోడు. మనింట్లనె ఉంటాడు' అన్నాడు నాయన.

వచ్చినాయన స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు. మా నాయనతో స్నేహంగా మాట్లాడాడు. మాకు తిరిగి భూమి వచ్చేందుకు సాయంచేస్తానని అమ్మకి చెప్పాడు. మంచివానిలాగే కనపడ్డాడు. మా నాయన ఆయనకు ప్రత్యేకమర్యాదలు చేశాడు. కల్లు కూడా తాపించి మంచి భోజనం పెట్టించాడు. మా మర్యాదలకు అయన సంతోషించాడు. మర్నాడుపొద్దున్నే నైట్ డ్యూటీ నుంచి వచ్చిన అబ్బసాయిలు ఈ కొత్త వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయి 'ఆడ పండుకున్న మనిషెవరు సత్తీ?' అని నన్ను అడిగాడు. ఆయన వంగపల్లి నుంచి వచ్చిన నరసింహారావు పటేల్ అని చెప్పాను.

'అయితె ఇక్కడేం పని?' అన్నాడు తీవ్రంగా. నాయనకు పొలం స్వాధీనంచేసుకోడానికి సాయం చెయ్యడానికొచ్చాడని చెప్పాను. మా అన్న పక్క గదిలోకి వెళ్ళాడు బట్టలు మార్చుకోడానికి.

పటేల్ మాఇంట్లో మూడు రోజులుండి మేం చేసిన మర్యాదలు బాగా ఆస్వాదించి జంటనగరాలు సందర్శించి వచ్చాడు. మూడో రోజు వెళ్ళబోతూ, మా నాయనను వీలైనంత త్వరగా వంగపల్లి వెళ్ళి మా పొలందగ్గర ఒక గుడిసె వేసుకుని వుండమని సలహా ఇచ్చాడు. అట్లా చేస్తే మా నాయనకు పొలం మీద హక్కు సాధించడం తేలికౌతుందన్నాడు.

'అయితె ఆడ నన్ను గుడిసేసుకోనిస్తరా దొరా!' అన్నాడు నాయన సందేహిస్తూ.

'అట్లేం లేదు! నువ్వు గుడిసేసెటప్పుడు నేను అక్కన్నే నిలవడ్త. నువ్వాడ కొన్ని రోజులున్నంక నేనే పంచాదిలో మాట్లాడి నీ పొలం నీకిచ్చేటట్ల చేస్త' అన్నాడు పటేల్.

ఈ మాట వింటే మానాయనకు మళ్ళీ మాకు పొలం దక్కుతుందనే ఆశ చిగురించింది. త్వరలోనే ఊరికి వెళ్ళి గుడిసె వేసుకుని ఉంటానని పటేల్‌కు చెప్పాడు. ఇప్పుడు నాయన దగ్గర కాస్త డబ్బుంది. దానితో కలిగిన ఆత్మవిశ్వాసం కూడా వుంది.

అందుకని తన తండ్రి వదిలి వచ్చిన పొలాన్ని స్వాధీనం చేసుకోవాలనే కోరిక మరింత బలపడింది. మా అమ్మని తీసుకుపోయి అక్కడుండి వ్యవసాయం చేసుకోవాలని ఆయన కోరిక. ఆమె మాత్రం ఆయన్ని నిరుత్సాహపరచడానికి ప్రయత్నించింది.

'నిజంగా మనకా పొలం వస్తదా, నాయనా?' అని అడిగాను, పటేల్‌ను పంపించి మానాయన స్టేషన్ నుంచీ రాగానే.

'తప్పకుండ' అన్నాడాయన.

'ఏం చేస్తవు దాంతో?' అని అడిగాను.

'ఏం జేస్తనంటవ్ రా! అది మాతాత అస్తి. మనకక్కున్నది. ఎగుసంజేసి పంట పండిస్త' అన్నాడు నన్నొక తెలివితక్కువ వానికింద చూస్తూ.

'నిజంగ?' అన్నాను ఆశ్చర్యంగా.

'ఔను బిడ్డా! నేను రైల్వేలో జేరకముందు చేన్ల కూలిపని జేస్తుంటి. ఇప్పుడు మీరు సదువుకోవాలంటే పైసలు గావాలెగదా! అందుకనే ఊళ్ళె ఎగుసం జేసి పైసలు సంపాయిస్తా' అన్నాడు. ఆయన ధృఢ నిశ్చయానికి నేను విస్మయంచెందాను. ఈ నిశ్చయం కేవలం మా చదువులు కొనసాగడాకేనని అర్థమైంది. ఆయన అనుకున్న విధంగా మేము విజయం సాధించ లేకపోయినందుకు సిగ్గుపడ్డాను. కానీ మేము బాగానే కష్టపడి చదివామనీ, ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించలేదని కూడా నాకు తెలుసు. మేము తీసుకున్న సబ్జెక్టులు మాకు బాగా అర్థం కాకపోవడం మూలానే మేము తప్పాము కానీ కృషిలోపం వల్లకాదు. మాకుటుంబం మాకిస్తున్న ప్రోత్సాహమే మమ్మల్ని నిరుత్సాహపడకుండా ముందుకు నడిపిస్తున్నది.

మేము ముగ్గురమూ డిగ్రీ పూర్తిచేసి యెలుకటి కుటుంబంలో మొదటి విడత పట్టభద్రులముగా నిలిచినప్పుడు మానాయన హర్షాతిరేకం మాటల్లో చెప్పనలవికానిది. తన ఆనందాన్ని ఆస్వాదించడానికి తనివితీరా కల్లు తాగాడు.

'మన పిల్లలు పరీక్ష ప్యాసైండ్రు బాలరాజా! వాళ్లను ఇంకా చదివిస్తా!' అన్నాడు మా అమ్మతో.

బాగా తాగివచ్చి ఆయన మాట్లాడిన మాటలకి ఆమెకు కోపం వచ్చింది. 'నువ్విట్ల తాగితే వాళ్లు సదివినట్టే ! సదివింది సాల్లే! వాళ్లని నౌకరి జేస్కోనియ్యి' అంది.

అప్పటికింక ఆమెతో వాదన పెట్టుకోలేదు ఆయన. అన్నం తినమని బ్రతిమలాడితే కొంచెంతిని పడుకున్నాడు.

◆◆◆

1967 అక్టోబర్‌లో పటేల్ సలహా ప్రకారం వంగపల్లిలో ఒక పెద్ద బావి పక్కన మా నాయన ఒక గుడిసె వేశాడు. దసరా పండగ తరువాత మా నాయనా, మా అమ్మా, చెల్లెలూ అక్కడికి వెళ్ళారు. మా నాయన ఆ యింట్లో అన్ని సౌకర్యాలు ఏర్పరిచాడు.

ఇరుగుపొరుగులు అప్పుడప్పుడూ గుడిసెలోకి తొంగిచూసి ఇల్లు చక్కగా సర్దుకున్న వైనాన్ని మెచ్చుకునేవాళ్ళు. దాదాపు ప్రతిసాయంత్రం వూళ్ళో వాళ్లు కొందరు మా నాయన పాక దగ్గర కొచ్చేవాళ్లు అట్లా పరిచయాలు మొదలయ్యాయి. ఆ పరిచయాలు కాస్త బలపడడం కోసం మానాయన వాళ్లకు కల్లు తాపించేవాడు. మా ఇంట్లో ఒక కుట్టు మిషన్ వుంది. దాన్ని ఇంటికొచ్చిన వాళ్ళందరికీ కనపడే చోట పెట్టారు. అదొక ప్రత్యేక ఆకర్షణ అక్కడ. అంతేకాక రెండు మంచాలూ రెండు కుర్చీలూ కూడా అమర్చారు. ఆమాత్రం వుండడం కూడా ఆ వూళ్ళో అరుదే! పట్నంలో వుండొచ్చిన మా చెల్లెలు లక్ష్మీబాయి కూడా అక్కడి స్త్రీలకి బాగా నచ్చింది. వాళ్ళామె ప్రతి కదలికనీ గమనిస్తూ వుండేవాళ్ళు. లక్ష్మీ బాయ్ మిషన్ కుట్టుకుంటున్నప్పుడు వాళ్ళు పట్నపు జీవితం గురించి అడుగుతూ వుండేవాళ్ళు. మానాయన కొత్తగా పట్టభద్రులైన మమ్మల్ని కూడా అక్కడ కొన్నాళ్ళుండమని అడిగితే మేమూ సరే అన్నాం. నేను గుడిసె చుట్టూ తిరుగుతూ వుండేవాణ్ణి. మా అన్నలు మాత్రం బయటికి పోయేవాళ్ళు. మాఇంటి దగ్గరే బావి!. అది గుండ్రంగా పది అడుగుల వ్యాసార్ధంలో వుండేది. లోపలంతా రాతికట్టడం. బావి పైన ఒక చెక్కకు గిలక బిగించి వుండేది. దానిపైన ఒక తాడు వేలాడుతూ వుండేది. అందులోనుంచీ నీళ్ళు తోడి పొలాలకు పెట్టే దృశ్యాన్ని రోజూ చూస్తూ వుండేవాణ్ణి. ఒక కాడికి రెండు ఎద్దులు కట్టేవాళ్ళు. ఆ కాడినుంచీ ఒక గట్టి లావుపాటి తాడు వేలాడేది. ఆతాడుకు ఒక బొక్కెన కట్టేవాళ్లు. ఆ బొక్కెన అడుగున ఒక ఏనుగుతొండమంత తోలు గొట్టంవుండేది. ఈతాడును బావి గిలకకు తగిలించేవాళ్ళు. ఎద్దులను ఏటవాలు దారిలో ముందుకూ వెనక్కీ నడిపించేవాళ్లు. అవి ముందుకు వెళ్ళినప్పుడు బొక్కెన బావిలో మునిగేది. వెనక్కి వెళ్ళినప్పుడు నీళ్ళతో పైకి వచ్చేది. తోలు ట్యూబు ముడుచుకునేది. మరో తాడు సాయంతో దీన్ని వొంచేవాళ్ళు. అపుడు బొక్కెనలో నీళ్ళు ట్యూబ్‌లోకి వచ్చేవి. ట్యూబ్‌లో నుంచీ ఒక కాలువద్వారా పొలాల్లోకి పారేవి. మళ్ళీ ఎద్దులు వెనక్కి వెళ్ళి బావిలో బొక్కెన ముంచేవి. ఇట్లా తోడిన నీళ్లను ఒక మనిషి ఒక పార సాయంతో ఒక మూడు నాలుగు గంటల్లో ఎన్నో ఎకరాలకు మళ్ళించేవాడు. పొలాలకు నీళ్ళు పెట్టె స్థానిక సంప్రదాయ విధానం అది. మా నాయన రోజూ పటేల్ నరసింహారావును కలిసేవాడు. కానీ ఇక్కడ మాత్రం వాళ్లు మాట్లాడుకునేటప్పుడు దూర దూరంగా నిలబడేవాళ్ళు. ఎన్నో సంప్రదింపులయ్యాయి. మా భూమి మా తాత పాలొల్ల అధీనంలో వుంది. దాన్ని వదులుకోడం వాళ్లకి అసలు ఇష్టం లేదు. అసలు ఒప్పుకోలేదు. మానాన్న కోర్టు సహాయం తీసుకుందామన్నాడు. కాని పటేల్ అదంత తెలివైన పని కాదనీ కొంతకాలం ఆగమనీ అన్నాడు. మాతాత ఆపొలం విడిచి వెళ్ళి దాదాపు ఏభై సంవత్సరాలు అయింది కనుక కేసు బలంగా వుండబోదన్నాడు. అయినా మా నాయన పట్టు వదలలేదు. ఆయన తమ్ముడు కూడా ఆయన్ని సమర్థించాడు. వాళ్ళిద్దరూ కలిసి హుజూరాబాద్ జిల్లా కోర్ట్ లో కేసు వేసారు.

మేం వంగపల్లి వచ్చి నాలుగు నెలయింది. మమ్మల్ని పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులో చేరడానికి రమ్మని కబురుపెట్టాడు అబ్బసాయిలు. మానాయన ఒక్క రోజు కూడా ఆలస్యం చెయ్యకుండా మమ్మల్ని సికిందరాబాద్ పంపేశాడు. తప్పడం ప్యాసవడం గురించి చింతించకుండా పైకి చదువుతూ పొమ్మని చెప్పాడు. ట్రెయిన్‌లో కూర్చుని, మాచదువులకి డబ్బు ఒనగూర్చడం కోసం మానాయన గ్రామానికి రావడాన్ని గురించే ఆలోచించాను. మా అన్నల సంపాదన మీద బ్రతకడం కూడా ఆయనకు కష్టంగా వుందని గ్రహించాను. అయితే నా విచారం ఒక్కటే! ఆయన ఆశలు నేను నెరవేర్చగలనా? అని. ఇప్పటికే ఒకసారి పరీక్షతప్పి ఆయనకు కొంతఖర్చూ మానసిక వేదనా కూడా కలిగించి వున్నాము. నర్సిములు నన్ను కుదపడంతో ఆలోచనల్లోంచి మేలుకున్నాను.

'సత్తీ లే! టీసీ ఒస్తున్నడు. మనం కాజీపేట దగ్గరికి ఒచ్చినం. టీసీ వచ్చే లోపల దిగిగిపోదాం' అన్నాడు. నేను ఒక్క గెంతులో తలుపుదగ్గరకు పోయి ప్లాట్‌ఫామ్ మీదకు దూకాను. చాలామంది రైల్వే ఉద్యోగుల పిల్లల్లాగే మేమూ టికెట్లు లేకుండా రైల్లో ప్రయాణం చేసేవాళ్ళం. టీసీ ఎప్పుడైనా పట్టుకుని అడిగితే 'స్టాఫ్ పిల్లలం' అని చెప్పేవాళ్లం. చాలామంది టీసీలు ఊర్కునేవాళ్లు. కొంతమంది మా స్టేషన్ రాకముందే దిగిపొమ్మనేవాళ్లు. అప్పుడు ఇంకో రైలు పట్టుకుని పోయేవాళ్లం. ఒక్కొక్కసారి మేం రైలెక్కేముందే మా నాయనలు టీసీలకు చెప్పివుంచేవాళ్ళు. అప్పుడు ఏ బాధా వుండేది కాదు.

మేం ఇంటికొచ్చేసరికి అబ్బసాయిలు బి.ఎ. ప్యాసయినాడని తెలిసింది. 1967–68 విద్యా సంవత్సరం మాకుటుంబానికి ఎంతో ప్రాముఖ్యత గల సంవత్సరం. బాలయ్య కొడుకులు నలుగురు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరబోతున్నారు. ముగ్గురం సైన్స్ లోనూ, ఒకరు సోషల్ సైన్సెస్ లోనూ. ఏ కోర్సులు చేస్తే ఉద్యోగాలు త్వరగా వస్తాయి. మేం ఏకోర్సులు చేస్తే మంచిది అనే విషయంపై అబ్బసాయిలుకు కూడా పెద్దగా అవగాహన లేదు. నేను మాత్రం నా ఎంఎస్‌సిలో కెమిస్ట్రీ తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. బిఎస్‌సిలో నాకు ఆ సబ్జెక్టులో మంచిమార్కులొచ్చాయి. నర్సిములు బాటనీ, అంజయ్య జూవాలజీ ఎంచుకున్నారు. అబ్బసాయిలు ఎం.ఎ. సోషియాలజీలో చేరాడు. అతను ఇంకా రైల్వేలో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తూనే వున్నాడు.

మా జీవితాలలో నూతనాధ్యాయం ప్రారంభమయింది. తన పిల్లల్ని ఉన్నత చదువులు చదివించడమే తన కర్తవ్యంగా ఎంచుకున్న బాలయ్య ఆశయం సిద్ధిస్తున్నది, చాలా దళిత కుటుంబాలలో (రైల్వే ఉద్యోగుల కుటుంబాలలో కూడా) పిల్లల్ని మెట్రిక్యులేషన్ వరకూ చదివించడం కూడా కష్టంగా వుండేది. సికిందరాబాద్ నుంచీ కాజీపేట దాకా అంతా మానాయన గురించే మాట్లాడుకుంటున్నారు. పిల్లల్ని యూనివర్సిటీలకు పంపినందుకు పెద్ద పేరొచ్చింది ఆయనకు. మా నాయన చేసింది రైల్వేలో చాలా తక్కువ స్థాయి ఉద్యోగమైనా పెద్ద ఆఫీసర్లకు కూడా ఆయనంటే గౌరవం.

◆◆◆

ఆ సంవత్సరమే యాదగిరి ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లోని ఇంజినీరింగ్ కాలేజీలో చేరాడు. యాదగిరి మా తోబుట్టువులందరిలోకీ తెలివికలవాడు. తెల్లని వాడు, చూడచక్కనివాడు. వాడు మా అందరికన్న భిన్నంగా వుండేవాడు. నాలాగా కాకుండా వాడికి లెక్కలు బాగావచ్చేవి. ఎప్పుడూ అందులో క్లాసులో ప్రథమంగా వచ్చేవాడు. వాడు మిడిల్ స్కూల్ కు వచ్చేవరకూ మా ఇంట్లో చదువుకు అనువైన ఒక మంచి వాతావరణం నెలకొన్నది. మాకొక రేడియో వున్నది. వార్తాపత్రిక కూడా తెప్పించుకునేవాళ్ళం. పెద్దపిల్లలమైన మాకు అందని లోక జ్ఞానం వాడికి చేరువైంది. వాడు హైయ్యర్ సెకండరీ పరీక్షల్లో అద్భుతమైన మార్కులు తెచ్చుకున్నాడు ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రవేశం పొందాడు. 1970 ల నాటికి తెలంగాణాలో వరంగల్ లోని రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీ కాక అదొక్కటె ఇంజినీరింగ్ కాలేజీ. రిజర్వేషన్లో కాకుండా మెరిట్ లో ప్రవేశంపొందాడు వాడు. మా కుటుంబంలో అట్లాంటి కోర్సులో ప్రవేశించిన మొదటివ్యక్తి మా యాదగిరి. ఆ విజయాన్ని ఒక పండగ చేసుకున్నాం మేము. వాడు చాలా తెలివైన వాడూ, అందరికీ ప్రేమాస్పదుడూ కనుక బాలరాజు వాడికి మాకన్న కాస్త ఎక్కువ పైసలు ఇచ్చేవాడు. యాదగిరి ఎప్పుడూ అమ్మని అంటుకు తిరిగేవాడు. ఆమెను మమ్మీ అని పిలిస్తే ఆవిడ మహా సంతోషపడిపోయేది. అయితే వాడు స్వల్ప విషయాలకే వాదన పెట్టుకునేవాడు. సంపన్నమైన జీవితం గురించి చిన్నప్పటినుంచీ కలలుకనేవాడు. మా పేదరికాన్ని ఏవగించుకునేవాడు. తన ధనవంతులైన స్నేహితులగురించి ఎప్పుడూ చెప్పేవాడు. వాళ్ల జీవితం ఎంత సౌఖ్యంగా వుంటుందో వర్ణించేవాడు. ఇంట్లో వండినవి నచ్చక ఒక్కొక్కసారి అన్నంతినేవాడుకాదు. ఎంత కష్టమైనా వాడికి నచ్చింది వండిపెట్టడానికే ప్రయత్నించేది అమ్మ. కానీ పెద్ద వాడైన కొద్దీ వాడి ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఆరోజుల్లో చాలామంది ఇంజినీరింగ్ విద్యార్థులవలె వాడిని కూడా వామపక్షభావజాలం ఆకర్షించింది.

◆◆◆

ఒక రోజు హఠాత్తుగా మా లాబొరేటరీ గుమ్మంలో మానాయన ప్రత్యక్షమయ్యాడు. నేను ఆశ్చర్యపడుతూనే ప్రొఫెసర్ అనుమతితీసుకుని బయటికొచ్చాను. ఆయన ప్రత్యేక సందర్భాలలో వేసుకునే తెల్లని ధోవతి, చొక్కా, దానిపైన నీలంరంగు బ్లేజర్ వేసుకుని వున్నాడు. అప్పుడే ఊరినుంచి వచ్చినట్లున్నాడు. నా వంక కాస్త గర్వంగా చూశాడు. నా మొహంలో ఆందోళన కనిపెట్టి 'ఏంలేదు బిడ్డా! నిన్నూ నీ కొత్త కాలేజీని సూద్దామని అచ్చిన. నువ్వు లోపటికి బో' అన్నాడు. రాత్రి భోజనాలప్పుడు తెలిసింది. ఆయన అమ్మనూ చెల్లినీ తీసుకురాలేదని. వాళ్ళు రానందుకు దిగులనిపించింది. తరువాత మానాయన చెప్పాడు గుడిసె వేసుకునేటప్పుడు ఎవరూ తన జోలికి రాకుండా పటేల్ తన తరఫున నిలబడ్డాడని తనకు మద్దతుగా వున్నాడని.

'అయితే ఆ పొలం మనకొస్తదా?' అనడిగాడు బాలరాజు.

'ఒస్తది బిడ్డా! నేను హుజూరాబాద్ కోర్టులో కేసేసిన'.

'మీ నాయన ఆ పొలమిడ్సిపెట్టి శానేడ్లయింది. మీ సుట్టాలే దాన్ని దున్నుకుంటున్నారు. అలా నోటిదగ్గర కూడెందుకు గుంజుకుంటవు? అన్యాయం గదా! నాయనా?' అన్నాడు యాదగిరి.

'నోర్ముయ్! నీకేం దెలుసు? అది మన తాతల ఆస్తి. దానిమీద మనకి అక్కున్నది పెద్దోల్ల మాటలళ్ళ కల్గ జేస్కోకు' అన్నాడు నాయన చాలా కోపంగా.

యాదగిరి మా నాయన కళ్లల్లోకి చూడకుండా తప్పించుకుని అవతలికిపోయాడు. నాకు కూడా మనసులో అట్లాగే అనిపించింది. కానీ ఏమైనా సరే ఆభూమిని దక్కించుకోవాలని నాయన నిర్ణయించుకున్నాడు. ఆయన తమ్ముడు ఎల్లయ్యేకాక మా పెద్దన్నలిద్దరూ కూడా ఆయనకు వత్తాసుపలికారు.

అక్కడ క్లాస్ త్రీ రైల్వే క్వార్టర్స్‌లో వుంటున్న వాళ్లల్లో మాకుటుంబమే పెద్దది. మూడు జతల తల్లితండ్రులు, పదిహేనుమంది పిల్లలూ. మొత్తం ఇరవై ఒక్కమంది కుటుంబసభ్యులం. ఒక కుటుంబం కోసం ఇచ్చిన క్వార్టర్లో మూడు కుటుంబాలు వున్నాయన్నమాట. బాలరాజుకు ఏడుగురు పిల్లలు. అబ్బసాయిలుకు ముగ్గురు. సాయంత్రాలప్పుడు మేము చదువుకునేగది కిక్కిరిసి వుండేది. కొంతమంది పైకి గట్టిగా చదువుతూ వుండేవాళ్ళు. కొంతమంది వ్రాసుకుంటూ వుండేవాళ్లు. ఎవర్నీ ఎవరూ పట్టించుకునేవాళ్ళు కాదు. ఎవరి పని వాళ్ళు చేసుకుపోయేవాళ్ళు. మేం చదవడం అయిపోయాక మా వదిన మాకు అన్నం పెట్టేది. మా అందరికీ బాలరాజు మాటే ఒక చట్టం. అతను మమ్మల్ని బాగా క్రమశిక్షణలో పెట్టేవాడు. అతని అనుమతి తీసుకునిగాని మేమెవరమూ బయటకుపోకూడదు.

◆◆◆

1968-69 చాలా గడ్డుకాలం. అది ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిన సమయం. అది రాజకీయరంగు పులుముకుని, మాకొక విద్యాసంవత్సరం నష్టమైంది. అయినప్పటికీ నాజీవితంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమైన సమయం. కళాశాలలన్నీ మూతబడ్డ ఆ సమయంలో, ఒక గ్రామంలోని పాఠశాలలో నాకు ఉపాధ్యాయుడుగా ఉద్యోగమిస్తున్నట్లు జిల్లాపరిషత్ నుంచీ లేఖ వచ్చింది. జిల్లా పరిషత్ అనేది జిల్లాస్థాయిలో పని చేసే ఒక స్వయంపాలక సంస్థ, అప్పుడు పట్టభద్రులైన ప్రతివాళ్ళూ ఎంప్లాయిమెంట్ ఎక్స్ ఛేంజ్ లో తమ పేర్లు నమోదుచేసుకునేవాళ్లు, ఖాళీలున్న ఉద్యోగాలకు ఎక్స్ ఛేంజి అభ్యర్థులను సూచించేది. ఆ ఉత్తరం అబ్బసాయిలుకు చూపించాను.

'తప్పకుండా వెళ్లి చేరు సత్తీ! నీకిదొక మంచి ఛాన్స్' అని నా చూపుల్లో సంశయాన్ని గ్రహించినట్టు 'చూడు సత్తీ నీకిప్పుడు కాలెజీ బందైంది గదా! విలేజిల పంజేస్తే నీకు ఎక్స్‌పీరియెన్స్ వస్తది' అన్నాడు అబ్బసాయిలు.

చిన్నన్న చెప్పింది నాక్కూడా నచ్చింది. నాకు ఉద్యోగం వచ్చిన వూరిపేరు కర్నకోట. అక్కడికి వెళ్ళడానికే నిర్ణయించుకున్నాను. అయితే ఆ వూరు మంత్రగాళ్లకీ చేతబడులకీ బాగా పేరుపడ్డవూరు కనుక అప్పుడు సికిందరాబాద్ వచ్చిన మా అమ్మ అక్కడికి పోనే పోవద్దంది. ఆమెని ఒప్పించడం చాలాకష్టమైంది. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే అక్కడినుంచీ వచ్చేస్తానని మాట ఇచ్చిన మీదట ఒప్పకుంది. కానీ నేను బయలుదేరి వెళ్ళేటప్పుడు బాగా ఏడ్చింది.

మా పెద్ద కుటుంబాన్ని వదిలి ఇట్లా వంటరిగా వెళ్లాల్సొచ్చినందుకు దిగులనిపించింది. ముఖ్యంగా నర్సిముల్నీ, అంజయ్యనూ విడిచి వెళ్ళబుద్ధికాలేదు. ఒక చిన్న పెట్టె తీసుకుని బయలుదేరాను. తాండూర్ వరకూ రైల్లో పోయి అక్కడనుంచీ బస్సెక్కి మరో వూరు పోవాలి. ఆవూరినుంచీ కర్నకోటకు బస్సులేదు. ఆవూరు అన్ని రవాణా సౌకర్యాలకీ దూరంగా వుంది. అక్కడ విద్యుత్తు కూడాలేదు. బాలరాజూ అబ్బసాయిలు నాకు వీడ్కోలు ఇవ్వడానికి స్టేషన్కి వచ్చారు. అక్కడి పరస్థితి విన్నాక వాళ్లకి నేను వెళ్ళడం నచ్చలేదు. చివరవరకూ నన్ను వెళ్లవద్దని నిరుత్సాహపరిచారు. నేను మాత్రం వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను. రైలు కదులుతూ వుంటే నాకు కన్నీళ్ళొచ్చాయి. వెళ్ళగానే ఉత్తరం వ్రాయమని చెబుతూ వాళ్ళుకూడా కళ్ళుతుడుచుకోడం చూశాను.

రైలు మధ్యాహ్నానికి తాండూర్ చేరింది. వెంటనే బాగా రద్దీగా వున్న ఒక బస్సెక్కి కర్నకోటకు దగ్గరగా వున్న ఒక వూరు చేరాను. ఆవూరే వెడుతున్న కొంతమందితో కలిసి ఒక చెత్తో పెట్టెపట్టుకుని పొలాలకి అడ్డంపడి నడిచాను. అంతకుముందురోజు బాగా వర్షం పడ్డట్టుంది. నల్లమట్టి బాగా జారుతోంది. నా బూట్లు మట్టిలో ఇరుక్కుపోయి పైకి రావడం కష్టమైపోతోంది. చివరికి వాటిని విప్పేసి వొట్టికాళ్లతో నడవడం మొదలుపెట్టాను. ఒక్కొక్కసారి పెట్టె నెత్తిమీదపెట్టుకుంటున్నాను. అదొక మర్చిపోలేని అనుభవం. నా స్వంత సంపాదనతో బ్రతకబోయేముందు ఇది నాకొక పరీక్ష అనిపించింది. చివరికెట్లాగో ఆవూరు చేరాం.

జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ అక్షరం 'ఎల్' ఆకారంలో వున్న కొత్త భవనంలో వుంది. ఊరికి కాస్త దూరంగా వుంది. అప్పుడే పాఠశాల విడిచిపెట్టినట్లుంది. పిల్లలు కబుర్లు చెప్పుకుంటూ బయటకు పోతున్నారు. నేను హెడ్మాస్టర్ నర్సింహకు నా అప్పాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చాను. ఆయన నా అలసిపోయిన వాలకాన్నీ మట్టిగొటుకున్న దుస్తుల్నీ పరిశీనగా చూస్తూ.

'ఓ! నువ్వేనా సిటీ నుంచొచ్చినవ్! గ్రాడ్యుయేట్ వా? ఈపాటికి ఊరెంత లోపలికుందో తెలుసుకునే వుంటావ్!' అన్నాడు. నేను అవునన్నాను.

'నువ్వేమో హైదరాబాద్ వాడివి. ఇక్కడుండగల్గుతవా?' అని తన సందేహాన్ని నిర్మొహమాటంగా బయటపెట్టాడు.

'వుంటాను సార్!' అన్నాను. వున్నదానికన్న ఎక్కువ ఆత్మవిశ్వాసం ప్రకటిస్తూ.

'సరే అయితే! కాని నువ్వు ఈ రోజూ రేపూ స్కూల్లోనే పడుకోవాలె. తరువాత స్టూడెంట్స్ టీచర్స్ నీకు ఇల్లు చూసిపెడతారు' అన్నాడు.

స్కూల్ వాచ్‌మన్ నాపెట్టెనూ నన్నూ లైబ్రరీ లోకి తీసుకుపోయాడు. అక్కడున్న రెండు పొడవాటి టేబుల్స్‌ని జతచేసి వాటినే మంచం అనుకోమన్నాడు ఆరాత్రికి. మరునాడు పొద్దున ఊరు చూడ్డానికిపోయాను. ఆ వూరంతా ఒక కోట చుట్టూనూ దాని లోపలా వుండడం ఆశ్చర్యం కలిగించింది. ఆ కోటకు ఒకే ఒక్క కొయ్య గుమ్మం వుంది. అది ఇరవై అడుగుల ఎత్తువుంటుంది. కోటలోపల మూడువందల ఇళ్ళుంటై. అట్లాగే బయట కూడా అన్నే వుండొచ్చు. వూరిచుట్టూ పెద్ద కందకం వుంది. బహుశా అది శత్రువులనుంచీ రక్షణకోసం ఎప్పుడో తవ్వివుండొచ్చు. గ్రామంలో ఇళ్లన్నీ రాతికట్టడాలే. తరువాత నేను కనుక్కున్నదేమంటే ఆ చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఇళ్ళు రాతితోనే కట్టారనీ ఆరాయిని షాబాద్ రాయి అంటారనీ! ఆ చుట్టుపక్కల అన్నీ రాతిగనులున్నాయి. ఇక్కడ దొరికే రాయిని నగరాల్లో నేలమీద పరుస్తారు కానీ ఈ వూళ్లల్లో గోడలు కూడా వీటితోనే కట్టారు. కోట గుమ్మం ఎదురుగా పెద్దరావిచెట్టు క్రింద హనుమంతుడి గుడివుంది. ఆ గుడి వందేళ్ళనాటిదని గ్రామస్థులు చెప్పారు. రోజూ తెల్లవారేటప్పటికి ఒక పెద్ద తాచుపాము ఆ చెట్టుపైకి పాకి పడగవిప్పి సూర్యుడికి నమస్కరిస్తుందని కూడ చెప్పారు. నేను చకితుణ్ణయ్యాను. తరువాత వళ్ళుగగుర్పొడిచే కథలు కూడా మరికొన్నికూడా విన్నాను.

అయిదో తరగతి చదివే హనుమంతు నేనుండడానికి ఒక గది చూసిపెట్టాడు. విశాలమైన గది. నేను అక్కడ పిల్లలకు పాఠాలు చెప్పింది కొద్దికాలమే అయినా, ఆగ్రామం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. ఆ పాఠాలు తరువాత జీవితంలో నేను స్వయంశక్తితో బ్రతకడానికి చాలా ఉపయోగపడ్డాయి. అక్కడ నేను నా కులం గురించి అబద్ధం చెప్పాను. మా అన్న మా కులం సంగతి రహస్యంగా వుంచమన్నాడు. లేకపోతే ఊళ్ళో ఇల్లుదొరకదన్నాడు. అప్పటికింకా గ్రామాల్లో కులవివక్ష ప్రత్యక్షంగానే వుంది. నేను తెలుగువాణ్ణి, శూద్రుడిని అని చెప్పేవాడిని. అయితే నా అబద్ధం తెలిసిపోతే ఎంత ప్రమాదమో తలుచుకుని రోజూ భయపడుతూ వుండేవాడిని. గ్రామంలో తెలుగువాళ్లు నన్ను పరామర్శించడానికి వచ్చేవాళ్లు. మా కుటుంబం గురించీ నాకు వివాహం అయిందా కాలేదా అనీ ప్రశ్నించేవాళ్ళు. కొంతమంది భోజనానికి కూడా పిలిచేవాళ్ళు. అయితే నాకు నాకులం గురించి ఎప్పుడు ఎవరికి తెలిసి పోతుందో అని ఒకటే ఆందోళన

గావుండేది. తెలిస్తేమాత్రం నన్ను ఊళ్ళోనుంచీ తరిమి వెయ్యడం ఖాయం అనుకునేవాణ్ణి. ఇప్పుడా పరిస్థితి తలుచుకుంటే వణుకొస్తుంది.

అది అన్ని ప్రాథమిక సదుపాయాలున్న కొత్త స్కూలు. నేను చేరేనాటికి ఇంకా లైబ్రరీ పుస్తకాలూ, ప్రయోగశాలకు చెందిన పరికరాలూ విప్పకుండా బంగీల్లోనే వున్నాయి. నేనొక్కడినే అక్కడ పట్టభద్రుడైన ఉపాధ్యాయుడిని. హెడ్మాస్టర్‌తో సహా అంతా మెట్రిక్యులేషన్ తరువాత సెకండరీగ్రేడ్ ట్రెయినింగ్ అయిన వాళ్ళే. మామూలుగా గ్రామస్థులకు ఉపాధ్యాయులంటే చాలా గౌరవం. ఎంతో గౌరవంగా 'మాస్టర్' అని పిలుస్తారు. నేను పట్టభద్రుణ్ణే కాక పట్నం నుంచీ వచ్చినందుకు నాకు మరింత గౌరవం లభించింది. నన్ను పెద్దక్లాసులకు గణితం సైన్సూ చెప్పమన్నారు. స్కూల్ కార్యకలాపాల్లో హడావుడిగా వుండేవాణ్ణి. ఒకరోజు పదోక్లాసు పిల్లలకు ఆక్సిజన్ గురించి చెబుతుండగా ఒకమ్మాయి లేచి 'కంటికి కనిపించని దాని స్వభావాన్ని గురించి, గుణాన్ని గురించీ ఎట్ల చెబుతున్నారు సార్?' అని అడిగింది.

ఆ అమ్మాయి ప్రశ్నకు ఆశ్చర్యపోయాను. నిజంగానే ఆ ప్రశ్నలో అర్థం వుందనిపించింది 'అదినీకు కనపడకపోయినా వున్నట్టు తెలుసుకోగలవు' అన్నాను.

'నిజమే సార్! గాలి తెలుస్తుంది అందులో ప్రాణ వాయువే కాక ఇంకా అనేక వాయువులున్నయ్ గదా?' అంది నా సమాధానంతో తృప్తిపడక.

'ప్రయోగాల ద్వారా దాని గుణాలను బట్టి దాన్ని గుర్తించవచ్చు' అని చెప్పి ప్రయోగంచేసి చూపిస్తానని ఆ అమ్మాయికి మాట ఇచ్చాను.

ఆ సాయంత్రం ఆక్సిజన్ తయారికి అవసరమైన పరికరాలూ రసాయనాలూ ఉన్నాయోలేవో చూసుకున్నాను. మరునాడు ఉదయం ఆక్సిజన్ తయారు చేసేపద్ధతిని ప్రయోగం ద్వారా పిల్లలకు ప్రదర్శించాను. తరువాత తయారైన ఆక్సిజన్ గుణాలను నిరూపించే పరీక్షలు చేసి చూపించాను. నేను చేసింది ఒక ఘనకార్యం ఏమీ కాకపోయినా, పిల్లలు బాగా ప్రభావితులైనారు. ఆ స్కూల్‌లో ఇట్లా సైన్స్ ప్రయోగాలు చెయ్యడం అదే మొదటిసారి. సహ ఉపాధ్యాయులు కూడా నన్ను అభినందించారు. అప్పటినుంచీ గ్రామస్థులంతా నా గురించి మాట్లాడుకోడం మొదలు పెట్టారు. అప్పటినుంచీ నాకు మా స్కూల్లోనే కాక బయటినుంచీ కూడా బాగా ఆదరణ లభించింది. సాయంత్రం అయేసరికి విద్యార్థులు నాగదికి వచ్చేవాళ్ళు. ఊళ్ళో వాళ్ళు నన్ను భోజనాలకు పిలిచేవాళ్ళు. చాలా తక్కువ వ్యవధిలోనే మాస్కూల్ పిల్లల, ఉపాధ్యాయుల హృదయాలలోనే కాక ఊరివారి హృదయాల్లో కూడా స్థానం సంపాదించాను.

సాయంత్రాలప్పుడు కొన్నిసార్లు పిల్లలూ ఉపాధ్యాయులూ వాలీబాల్ ఆడేవాళ్ళు. పిల్లలు నాకు బాగా అతుక్కుపోయారు. రాత్రిపూటకూడా నా గది వదిలేవాళ్ళుకాదు. నాకు పాములంటే భయం అని తెలిసి కొంతమంది పిల్లలు నాగదిలోనే పడుకునేవాళ్ళు.

ఆ ప్రాంతంలో పాములు ఎక్కువగా వుండేవి. అప్పుడప్పుడు ఇళ్లల్లోకి వచ్చేవి. అక్కడివాళ్లకి పాములంటే నాకున్నంత భయంలేదు. పైగా పాములవాళ్ళు వాటిని తేలిగ్గా పట్టుకునేవాళ్ళు. పాముకాటుకు మందుకూడా వేసేవాళ్ళు. నాకు గదిచూసిపెట్టిన హనుమంతు నా అవసరాలన్నీ కనుక్కునేవాడు. ఒక వ్యక్తిగత కార్యదర్శిలా వుండేవాడు. ఎంతకోప్పడినా వినకుండా నాకు వండిపెట్టడంకోసం క్లాసులు ఎగ్గొట్టేవాడు. ఆ పిల్లవాడంటే నాకు చాలా ఇష్టం అని వేరే చెప్పక్కర్లేదు.

ఆరోజు ఆదివారం. పొద్దున్నే హనుమంతు వచ్చి, 'ఈతకు పోదాం రండి మాస్టర్! ఈ దగ్గర ఒక దిగుడు బాయి వుంది' అన్నాడు. అప్పటికే మా చుట్టూ చాలామందిపిల్లలు మూగారు. నాకు ఈత రాదన్నాను.

'మీరేం ఫికర్ చెయ్యకండి సార్! మేము నేర్పిస్తాం' అన్నారు వాళ్లంతా ఒకేసారి. నాకు భయం వేసింది. వెళ్ళడానికి సందేహించాను.

'చాలా ఎండగా వుంది సార్! రండి పోదాం ! మేం ఈత గొడ్తూ మీకు నేర్పిస్తాం' అన్నారు వాళ్ళు. హనుమంతు అప్పటికే నాకోసం ఒక ధోవతి తీసిపెట్టాడు. ఇష్టం లేకపోయినా వాళ్ల వెంటవెళ్ళాను.

మేము ఒక పెద్ద బావిదగ్గరకు పోయాం. దాంట్లోకి దిగడానికి మెట్లున్నాయి. పిల్లలంతా నీళ్లల్లోకి దిగిపోయారు. అందరూ ఈత ప్రవీణులే! ఈదుతూ ఒకర్నొకరు పట్టుకుంటూ నీళ్లలో ఆడుతున్నారు. కొందరు నీళ్ళలో మునిగిపోయి కొన్ని క్షణాల తరువాత పైకి తేలుతున్నారు. హనుమంతు నా నడుముకి తాడు బిగించినట్టు ధోవతి కట్టాడు. మెట్లుదిగి నీళ్ళల్లోకి రమ్మన్నాడు. నేను ఒడ్డున కూచుని నీళ్లలో కాళ్ళుమాత్రం ముంచాను. అంతలోనే ఎవరో నన్ను నీళ్లల్లోకి తోశారు. నేను మునిగిపోయానని భయపడిపోయాను. కానీ ఒక్క క్షణంలో వాళ్ళు నా ధోవతిపట్టుకుని నన్ను పైకి లాగారు. వాళ్ళని కోప్పడుతూ మళ్ళీ నేను మెట్లమీద కూర్చున్నాను. హనుమంతూ, వాడి స్నేహితులూ గట్టిగా నవ్వి, ఇలాగే భయం పోగుట్టుకుని ఈత నేర్చుకోవాలన్నారు. వాళ్ళు చెప్పింది అర్థం చేసుకుని అట్లాగే నేర్చుకోడం మొదలుపెట్టాను, నేను బావి అంచుల దగ్గరగా ఈదుతూ వుంటే వాళ్ళు నా ధోవతి పట్టుకునేవాళ్లు. కొన్ని వారాల్లోనే ఈత వచ్చేసింది నాకు. అప్పటినుంచీ ప్రతి ఆదివారం ఈత అభ్యాసానికి పోయేవాణ్ణి.

నా గదికి వచ్చే కొంతమంది తరుచు దయ్యాలగురించి చెప్పేవాళ్లు. అవి రాత్రిపూట ఎట్లా గజ్జెలు మోగించుకుంటూ వస్తయ్యో వర్ణించేవాళ్లు.

'మాస్టర్ ! నేన్ నిన్న స్కూలవతలకు సెంబట్కక పోయిన. సూస్తే నేనేమొ ఇంకోదిక్కు మైల్ దూరంలోవున్న' అన్నాడు ఒకరోజు మొగులప్ప, అతను పెద్దవాడే. తరుచూ నాగదికి వచ్చేవాడు. అతనికోరికమీద అతనికి చదువుచెబుతున్నాను నేను.

'అదెట్లయితది?' అన్నాను నేను విస్మయంతో.

'నన్నొక దయ్యం అటువైపుకు తీసుకపోయింది మాస్టర్' అన్నాడు తమలపాకులు నములుతూ.

నేనుండే గది యజమాని రాములు ఒక మంత్రగాడు. ఒక్కొక్క సారి సాయంత్రమప్పుడు నాతో కూర్చుని మంత్రగాళ్ళని గురించీ చేతబడులగురించీ గంటలకొద్దీ చెబుతూవుంటాడు. ఎవరికైనా దెయ్యం పడితే వాళ్ళు ఎట్లా వదలగొడతారో చెప్పేవాడు.

'మాస్టర్! మీరు శానా తెలివైనోళ్ళు. మీకు నేను మంత్రాలు నేర్పుత. మీరు సిటీకి వోయినప్పుడు గరీబోళ్ళకి సేవ చెయ్యటానికి పన్కొస్తది' అన్నాడు ఒకరోజు రాములు.

ఇది వింతగా అనిపించి అతన్ని చూసి చిరునవ్వు నవ్వాను. దాన్ని అంగీకారంగా తీసుకున్నాడతను. అవ్వన్నీ మూఢనమ్మకాలని తెలుసు. కానీ నాలో ఎక్కడో ఆ మంత్రాలు నేర్చుకోవాలనేకోరిక మొలకెత్తుతోంది. అమావాస్య రాత్రి సమీపిస్తుండగా నేనేం చెయ్యాలో చెప్పడం మొదలుపెట్టాడు. అదంతా చాలా కష్టమైన క్రతువు అని చెప్పాడు. శ్మశానానికి వెళ్ళి ఒక సమాధి తవ్వి అందులోనుంచీ ఒక పుర్రె తేవాలన్నాడు. దాన్ని రెండు చేతుల్తో పట్టుకుని ఆ తవ్విన సమాధిదగ్గర కూర్చుని మంత్రాలు చదవాలన్నాడు. మంత్రాలు తప్పు చదివితే ప్రాణాలు పోతయ్యన్నాడు, పుర్రె చేత్తోపట్టుకు కూర్చుని తప్పుల్లేకుండా మంత్రాలు చదవడం అన్న ఊహే నాకు వెన్నులోనుంచీ వణుకు తెప్పించింది. అయినా నేనేం వెనక్కి తగ్గలేదు. ముందురోజు సాయంత్రం సమాధి తవ్వడానికి ఒక మనిషిని ఏర్పాటుచేశాడు రాములు. నేను తనకి తగిన శిష్యుడిని అవునో కాదో అని పరీక్ష చేశాడు. నా ఎడమ చేతి మీద ఉన్న పుట్టుమచ్చ చూసి, వెంటనే 'మాస్టర్! మీమీద మంత్రాలు, చేతబడులు పంజెయ్యవు. నేన్ గూడ నేర్పియ్యలేను. మీమీద మంత్రాలెవరూ ఎయ్యలేరు. అవిపారవి. మీ చేతిమీదున్న పుట్టుమచ్చ ఎటువంటి మంత్రాలూ పారనియ్యదు' అన్నాడు.

ఆ భయంకరమైన అనుభవం తప్పిపోయినందుకు నాక్కూడా తెరిపిగావుంది. అంతకుముందే ఇటువంటి పిచ్చి ఆలోచన చేసినందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

అప్పుడు రాములు అడిగాడు' మాస్టర్ !ఇక్కడొచ్చిన మొదటిరాత్రి మీరు స్కూల్లో ఒక్కరే పండుకున్నరా?' అని! అయితే ఏమయింది అని అడిగాను.

'ఇప్పుడు సమజైంది సార్! స్కూళ్ళ కతర్నాక్ దయ్యాలున్నై. ఇంకోడైతే ఇప్పటికి సచ్చిపోయి ఉండెటోడు' అని నవ్వాడు.

నాకు చిరాకేసింది. రాములు చెప్పింది నిజంకాకూడదనుకున్నాను.

◆◆◆

నేను ప్రతినెలా మొదటివారం క్రమం తప్పకుండా ఇంటికి వెళ్ళేవాణ్ణి. అట్లా వెళ్ళినప్పుడొకసారి రాత్రి చాలా పొద్దుపోయింది. మర్నాడు ఉదయం ఆలస్యంగా నిద్ర లేచి టీ తాగుతుండగా మా నాయన నావైపు కోపంగా చూస్తూ దగ్గర కొచ్చాడు. నాకు ఆయన మొహం చూడ్డానికి భయమేసింది.

'ఆవూరికి పోయి పన్జెయ్యాల్సిన అవసరమేమొచ్చింది సత్తీ?' అన్నాడు. కోపంతో ఆయన కళ్ళు ఎర్రగావున్నాయి. నేను నా చదువు మధ్యలో వదిలేస్తానని ఆయన భయపడు తున్నాడని అర్థం చేసుకున్నాను.

'మా కాలేజీ బందైంది గద నాయనా తెరువంగనె ఈ జాబ్ మానేస్త' అన్నాను. అప్పుడాయన కాస్త శాంతించాడు. 'ఏంలేదు బిడ్డా! ఒకసారి సంపాయించడం మొదలైతే చదువుమీద ఇంట్రెస్ట్ పోతది. అదే నాభయం' అన్నాడు.

ఆయనకా భయం అక్కర్లేదనీ నేను నా చదువు పూర్తిచేస్తాననీ మాట ఇచ్చాను.

◆◆◆

నాయన వంగపల్లికిలో వుండబట్టి ఇప్పటికి కొన్ని నెలలయింది. వ్యాజ్యం మీద చాలా డబ్బు ఖర్చుచేశాడు. అయినా కేసు ఆయనకు వ్యతిరేకంగానే వస్తున్నది. ఆయన దగ్గర భూమిపన్ను కట్టిన రశీదులు లేవు. చాలా వాయిదాలయినాక తీర్పు మా నాయనకు వ్యతిరేకంగానే వచ్చింది. పైగా కేసుకైన ఖర్చులన్నీ కూడా అయనే భరించవలసి వచ్చింది తీర్పు వచ్చిన నాడే మానాయన సామాను సర్దుకుని అక్కడనుంచి వచ్చేశాడు. వాళ్ళకి చాలా నష్టం జరగింది, మా నాయన డబ్బుఖర్చైపోయింది, అమ్మ ఆరోగ్యం చెడిపోయింది. చాల నిరాశ నిస్పృహ ఆవరించింది.

ఆమెకు చక్కెర వ్యాధి సంక్రమించింది. ఈ ఓటమి మా నాయనకు ఒక పెద్ద దెబ్బ. అందులోనుంచీ తేరుకోడానికి చాలా కాలం పట్టింది.

ఆ విద్యా సంవత్సరం దాదాపు ముగియవస్తూండగా ఒకరోజు ఇంటిదగ్గర్నుంచీ టెలిగ్రామ్ వచ్చింది 'యాదగిరి కనిపించడం లేదు, నువ్వు వెంటనే వచ్చెయ్' అని.

ఆ పిడుగులాంటి వార్త చదివి బాగా రోదించాను, మాకెంతో ప్రియమైన తమ్ముడు యాదగిరి! ఏ మాత్రం జాప్యం చెయ్యకుండా హెడ్మాస్టర్ అనుమతి తీసుకుని పెట్టె సద్దుకుని, నాకు స్వయం ఆధారితంగా బ్రతకడం నేర్పిన ఆవూరికి, నాప్రియ శిష్యుడు హనుమంతుకు వీడ్కోలు చెప్పి బయలుదేరాను. బస్సులో కూర్చున్నంత సేపూ యాదగిరి ఎందుకు వెళ్ళాడు ఎక్కడికి వెళ్ళుంటాడని మథన పడ్డాను. ఓపిక అయిపోయేవరకూ ఆలోచించాను.

యాదగిరి అదృశ్యం మానెత్తిన పడ్డ ఒక పిడుగు. ఆరోజు యాదగిరి ఎప్పట్లాగే బాలరాజుకు రాత్రి భోజనం పట్టుకు వెళ్ళాడు. మరిక తిరిగి రాలేదు. పోలీసు కంప్లయింట్ కూడా ఇచ్చారు. ఫలితం మాత్రం లేదు. నన్ను చూస్తూనే కుప్పకూలిపోయింది మా అమ్మ. నన్ను గట్టిగా పట్టుకుని 'నీ తమ్ముడు కనిపించక వారం అయింది' అని నాభుజం మీద తలపెట్టుకుని విపరీతంగా ఏడ్చింది. ఆమెను సముదాయించబోతే నాకూ దుఃఖం ఆగలేదు మేం దుఃఖసాగరంలో మునిగిపోయాం. రేడియో మూగబోయింది, ప్రతి చిన్న అలికిడికీ యాదగిరి వచ్చాడని తలపు వైపు చూస్తోంది అమ్మ.

నేనింటికి వచ్చేటప్పటికే మా నాయన యాదగిరిని వెతకడానికి బొంబాయికి పోయివున్నాడు. అక్కడ వెతికి వేసారి వాడి ఫోటో పట్టుకుని మద్రాసు కలకత్తా వంటి మహానగరాలు కూడా తిరిగాడు. వచ్చిన తరువాత సాధువులను, సంతులను మంత్రాలవాళ్లను, సుద్దులు చెప్పేవాళ్లను ఎంతమందినో వాడిజాడకోసం సంప్రదించాడు. ఏ ప్రయత్నమూ ఫలించలేదు. యాదగిరి అదృశ్యం ఒక రహస్యంగానే వుండిపోయింది. అతన్ని ఇంట్లో ఎవరూ తిట్టేవాళ్ళుకాదు. పరుషంగా మాట్లాడేవాళ్ళుకాదు. ఎందుకు మమ్మల్ని విడిచిపోయాడో అర్థం కాలేదు. మాకందరికీ ఇంత విషాదాన్నీ దుఃఖాన్ని మిగిల్చి పోయాడు. మాకుటుంబంలో ఒక సభ్యుడుగానే కాదు, ఒక మేధావంతుడైన యువకుడిగా, మాకుటుంబానికే మొదటి ఇంజినీరుగా వన్నెతేవలసి వుండిన అపురూపమైన వ్యక్తిని కోల్పోయాం మేము.

◆◆◆

1970లో మాచెల్లెలు లక్ష్మీబాయికి పెండ్లయింది. అప్పటికింకా మా పెద్ద కుటుంబం ఇద్దరి సంపాదన మీదే నడుస్తున్నది. ఆ ఇద్దరిమధ్యా మెల్లిమెల్లిగా అభిప్రాయభేదాలు పొడగట్ట సాగాయి. ముఖ్యంగా పిల్లల విషయంలోనూ ఇద్దరి సంపాదనల్లో వున్న అంతరం విషయం గానూ. ఆ విభేదాలు ఒక్కొక్కసారి మా నాయన కల్పించుకుని పరిష్కరించేవరకూ నడిచేవి.

నేనూ అబ్బసాయిలూ కూర్చుని కుటుంబ పరిస్థితులను నిర్మొహమాటంగా చర్చించే వాళ్ళం. నేనూ అంజయ్యా, నర్సిములూ చదువులు పూర్తయి ఉద్యోగాలలో ప్రవేశించబోతున్నాం కనక, తను విడిగా కాపురం పెట్టాలని అబ్బసాయిలు భావిస్తున్నట్టు అర్థం అవుతోంది నాకు.

'చూడు సత్తీ! నేను మీ ముగ్గురు చదువుకు సాయం జెయ్యాల్ననుకున్నాను. ఇంక నాపిల్లలను చూస్కోవాలె గద! వాళ్లకన్యాయం జేసే పరిస్థితి రావద్దు' అన్నాడు. అబ్బసాయిలు, నేను నా పోస్ట్ గ్రాడ్యుయషన్ చివరి పరీక్ష వ్రాసిన తరువాత.

'నాకు తెలుసు చిన్నన్నా! మాముగ్గురికి జాబ్స్ రాగానే వెళ్ళిపోదువుగాని' అన్నాను.

'ఔను. ఇంకో రెన్నెల్లు ఆగుతాను' అన్నాడు చిన్నన్న.

మానాయన అక్కడికి రావడంతో మా సంభాషణ ఆగిపోయింది. ప్రభుత్వం ఆ సంవత్సరం చాలా జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయడంవల్లనూ, అధ్యాపకుల కొరత వల్లనూ కూడా నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన కెమిస్ట్రీకి ఆ సంవత్సరం బాగా గిరాకీ వుండింది. పరీక్షా ఫలితాలు కూడా రాకముందే నాకు నిర్మల్‌లో ప్రభుత్వ జూనియర్, కళాశాలలో ఉద్యోగం వచ్చింది. ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్ ఒక చిన్న పట్టణం. దాని చుట్టూ చాలా గ్రామాలున్నాయి. నిరుద్యోగ బాధ అసలు అనుభవించకుండా వెంటనే ఒక ఉద్యోగం దొరికినందుకు చాలా ఆనందం కలిగింది నాకు. చాలామందికి

చదువైపోయిన చాలాకాలానికి కూడా ఉద్యోగం దొరకక బ్రతుకు మీద విరక్తికూడా కలిగే స్థితి వస్తూ వుంటుంది. నేను ఒక్కరోజుకూడా జాప్యం చెయ్యకుండా నిర్మల్ బయలుదేరిపోయాను. నేనింకా డిగ్రీ చేతికి తీసుకుని కళాశాల అధ్యాపకునికుండవలసిన పూర్తి అర్హత సాధించక పోయినా, ఇక్కడ బాగా పాఠాలు చెప్పగలిగాను. అందుకు నాకు టీచర్‌గా పనిచేసిన అనుభవం అక్కరకొచ్చింది. ఏమయినా నగరంలో పెరిగి వచ్చిన వాడిని కనుక అక్కడి అధ్యాపకులకన్న మెరుగ్గావుండేవాడిని. దానికితోడు, నావేష భాషలు కూడా విద్యార్థులను ప్రభావితం చెసేవి. అప్పటికింకా నర్సిములుకి, అంజయ్యకూ ఉద్యోగాలు రాలేదు.

త్వరలోనే పరీక్షాఫలితాలొచ్చాయి నలుగురమూ ఉత్తీర్ణులమైనాము. నాయన ఆనందం గురించి చెప్పడానికి మాటలు చాలవు. నలుగురు కొడుకుల్ని పోస్ట్ గ్రాడ్యుయేట్లని చేశాడాయన! ఆ ఆనందాన్ని ప్రకటించుకోడానికీ ఆ వార్తను అందరికీ వెల్లడించడానికీ బంధువుల, స్నేహితుల, పరిచయస్థుల ఇళ్ళకు వెళ్ళొచ్చాడు. ఆ వెంటనే భైంసా అనే వూళ్ళో అంజయ్యకు జువాలజీ లెక్చరర్ గా ఉద్యోగం వచ్చింది. నర్సిములు గజెట్ నోటిఫికేషన్ ద్వారా నర్సింగరావు అని పేరు మార్చుకుని వున్నాడు. అతనికి కూడా హైదరాబాద్‌లో ధర్మవంత్ జూనియర్ కాలేజీ అనే ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలో ఉద్యోగం వచ్చింది. కొద్ది నెలల్లోనే ముగ్గురు కుటుంబ సభ్యులు సంపాదన పరులయినందుకు పెద్ద పండగచేసుకున్నాం మేము. అయితే అబ్బసాయిలు కుటుంబం విడిగా వెడుతున్నందుకు బాగా విచారించాడు నాయన.

◆◆◆

ఇన్నాళ్ళుగా ఉమ్మడి కుటుంబ నిర్వహణలో అబ్బసాయిలుది చాలా విశిష్టమైనపాత్ర. అతని సహాయంలేనిదే మా చదువులు కొనసాగేవి కాదు. మేం పరీక్షల్లో తప్పినా మమ్మల్ని మళ్ళీ చదవమని ప్రోత్సహించాడే కానీ ఎప్పుడూ నిరుత్సాహపరచలేదు. మాకు సంపాదన లొచ్చేవరకూ మమ్మల్ని వదలలేదు. అంతేకాదు తనకు ఇచ్చిన క్వార్టర్ మాకిచ్చి తను అద్దె ఇంటికి మారాడు. మా చిన్నన్న నాకు ప్రియాతిప్రియమైన స్నేహితుడు. కుటుంబంలో మొదటి పోస్ట్ గ్రాడ్యుయేటు. తొలి ప్రొఫెసర్.

పన్నెండేళ్ళు రైల్వేలో పనిచేసి ఒక ఉన్నతాధికారిగా రిటైరవ్వవలసిన అబ్బసాయిలు ఆ ఉద్యోగానికి రాజీనామా చెయ్యడాన్ని మానాయన తట్టుకోలేకపోయాడు. ఇప్పుడు అబ్బసాయిలు విద్యార్హతలవలన అతని పదోన్నతికి ఎన్నో అవకాశాలున్నాయి కూడా. నేను మా అన్నను క్రమం తప్పకుండా కలుస్తూ వుండేవాణ్ణి. అతను రైల్వే ఉద్యోగానికి రాజీనామా ఇవ్వడం నన్ను కూడా కలవరపరచింది. తను అంతబాగా కుదురుకున్న ఉద్యోగానికి రాజీనామా ఎందుకు ఇవ్వవలసివచ్చిందో అని విచారపడ్డాను. అదీకాక చిన్నన్న ఇప్పుడు అయిదుగురు పిల్లలను పెంచాలికూడా. ఆ సంగతే అతన్ని అడిగాను.

'నేను ఎం.ఏ. అయిపోగానే రైల్వేజాబ్ మానేద్దామనుకున్నాను. ఇప్పుడు సత్యమ్మా నర్సింహారావు కాలేజీలో చేరాను' అన్నాడు.

'అది ప్రయివేటు కాలేజీకద? అక్కడ జాబ్ సెక్యూరిటీ వుండదు'.

'అవును నేను రిస్క్ తీసుకుంటున్నాను ఆసంగతి నాకు తెలుసు' అన్నాడు.

'నీకు అయిదుగురు పిల్లలున్నారుగదా! అంత రిస్క్ ఎందుకు తీసుకుంటున్నావు?' అన్నాను నా అయిష్టత తెలియజేస్తూ.

అప్పుడు మాకు టీ తీసుకుని వచ్చిన మా వదిన కన్నీళ్ళు పెట్టుకుంటూ 'చూసినావా, సత్యం ! ఆయన ఎంత రిస్క్ తీసుకుంటున్నాడో! నాకు నా పిల్లలకు సెక్యూరిటీ ఏదీ?' అంది.

'నేనీ నిర్ణయం తొందరపడి తీసుకోలేదు సత్తీ! రైల్వే చాలా విస్తృతమైన సంస్థ. అందులో మహా అయితే ఏ స్టేషన్ సూపరింటెండెంట్ గానో రిటైరవుతా. నాగ్గావల్సింది అదిగాదు. నేనొక ప్రొఫెసర్ని కావాలనుకుంటున్నాను' అన్నాడు చిన్నన్నయ్య. తన నిర్ణయం మారదన్నట్టు కృత నిశ్చయంతో. అతను చాలా ఆత్మవిశ్వాసంతో వున్నందుకు, ఇప్పుడు చేసే ఉద్యోగంలోని అభద్రత పట్ల ఏమాత్రం విచారం కనపరచనందుకు సంతోషమైంది నాకు.

'నువ్వేం వర్రీకాకు వదినా! అన్నీ బాగనే జరుగుతాయనుకుందాం. ఈ నిర్ణయం మీ అందరికీ ఇంకా మంచి జీవితాన్ని ఇస్తుందని ఆశిద్దాం' అని అమెకు సద్ది చెప్పాను. అబ్బసాయిలు తీసుకున్న ఈ నిర్ణయం పర్యవసానంగా అతనికిచ్చిన క్వార్టర్ ఖాళీ చెయ్యవలసి వచ్చింది. మేము మళ్ళీ రైఫిల్ రేంజ్‌లోని బాలరాజు చిన్న క్వార్టర్‌కి మారాల్సొచ్చింది. బాలరాజు ఏడుగురుపిల్లలూ, మాఅమ్మా నాయనా నర్సింగరావూ ఇంతమంది అందులో ఇమడడం చాలా కష్టమైంది. ఇప్పుడు మనకు కాస్త స్తోమత వున్నది కనక ఇంకొంచెం పెద్ద ఇంట్లోకి పోదామన్నాడు నర్సింగ్. మేము ఇల్లు మారాము. కానీ ఇన్నాళ్ళుగా మాకు అలవాటైన రైల్వే కాలనీల్లో కాకుండా వివిధ వర్గాల వాళ్ళు ఉండే చోటికి పోవలసివచ్చింది. ఇల్లు దొరకడం కూడా కష్టమైంది. ఇల్లు అద్దెకిచ్చే యజమానులు అద్దెకుండేవారి కులం తప్పకుండా అడుగుతారు. అడిగిన తరువాత ఇల్లు ఇవ్వరు. చివరికి మేము సీతాఫల్మండిలో ఒక సర్దార్జీ ఇంట్లోకి మారాము.

◆◆◆

మా అందరికన్న చిన్నవాడూ మానాయన గారాల పట్టి అయిన లక్ష్మణ్‌కి చదువుమీద ఆసక్తిలేక పోయింది. మాకు లేని ఎన్నో సౌకర్యాలున్నప్పటికీ వాడికి చదువుపట్ల ఆసక్తి కలగలేదు. హైస్కూల్ చదువుకూడా బాగా నిర్లక్ష్యం చేశాడు. ఎక్కువ కాలం స్నేహితులతో తిరిగేవాడు. ఇంటర్మీడియట్‌లో చేరాడు కానీ మధ్యలో వొదిలిపెట్టేశాడు. అంచేత గట్టి విద్యార్హతలు లేకుండానే ఉద్యోగం వెతుక్కోవలసి వచ్చింది. తరువాత మేం

అన్నదమ్ములం అతని చేత ఒక చౌకధరల దుకాణం పెట్టించాము. కానీ అదికూడా సరిగ్గా నడపలేక నష్టాలతో మూసేశాడు. తరువాత చాలా కష్టపడి ఒక కేంద్రప్రభుత్వ సంస్థలో ఉద్యోగం సంపాదించాడు.

పసి వాళ్లైన కవలలు తప్ప బాలరాజు పిల్లలందరూ బడికి పోతున్నారు. మాకుటుంబంలో బడికి పోతున్న రెండో తరం ఇది. వాళ్లకి మాకున్నన్ని అసౌకర్యాలూ అవరోధాలూ, ఆంక్షలూ లేవు. నగరంలో పుట్టిపెరగడం వలన మేము అనుభవించిన కుల వివక్షకూడా వాళ్లకి లేదు. పైకి కఠినంగా కనిపించినా బాలరాజు హృదయం సుతిమెత్తనిది. ఇంటిమొత్తంమీద హాస్య ప్రియత్వం నాకే వుండేది. జోకులు చెప్పి నవ్వించేవాణ్ని. అందుకని నేనంటే బాగా ఇష్టపడతాడు బాలరాజు.

ఇప్పుడు మా కుటుంబం ఆర్థికంగా కుదురుకున్నది. అబ్బసాయిలు వెళ్ళిపోయినా. ఇద్దరం ఇంటికి దూరంగా వున్నా నలుగురం సంపాదిస్తున్నాం. ఇప్పుడు మా జీవనశైలిలోకూడా మార్పు వచ్చింది. ఆహారంలో మార్పు వచ్చింది. ఇప్పుడు భోజనంలో వరి అన్నం గోధుమ చపాతీలూ కూరలూ వుంటున్నాయి. మానాయన మాత్రం అప్పుడప్పుడూ జొన్నరొట్టెలు కావాలంటాడు. వ్రాసుకోడానికి టేబుల్సు, కుర్చీలు సీలింగ్ ఫ్యాన్లవంటి సౌకర్యాలనుకూడా అమర్చుకున్నాం.

మానాయన ఎక్కువ సమయం భైంసాలో అంజయ్యతో వుండేవాడు. మా ఆరుగురిలోనూ మానాయనకు అంజయ్యతోనూ, అంజయ్యకు నాయనతోనూ ఎక్కువ అనుబంధం. మా నాయన ఇప్పుడు మాకు మంచి సంబంధాలు చూసేపనిలో పడ్డాడు. మా కులస్థులు చాలామంది మానాయనని కలిసి సంబంధాల విషయం మాట్లాడుతున్నారు. అయితే మానాయన మాత్రం నిదానంగా ఆలోచించి ప్రతి ప్రతిపాదననూ మా అమ్మతో చర్చిస్తున్నాడు.

◆◆◆

నేను నిర్మల్‌లో అయిదునెలలపాట పనిచేసిన తరువాత నాక్కూడా నర్సింగరావు పనిచేస్తున్న ధర్మవంత్ కాలేజీలో ఉద్యోగం వచ్చింది. నిర్మల్‌లో నేను పనిచేసేది ప్రభుత్వ జూనియర్ కళాశాల. అంటే అందులో ఉద్యోగ భద్రతా సరైన జీతమూ వున్నాయి. ప్రావిడెంట్ ఫండ్, మెడికల్ బెనిఫిట్స్, ఉద్యోగవిరమణానంతరం పెన్షన్ మొదలైన అదనపు సౌకర్యా లున్నాయి. అయితే ప్రభుత్వం నడిపే కాలేజీల్లో తరుచూ బదిలీలుంటాయి. నేను నగరంలో వుండాలని అనుకుంటున్నాను కనుక ధర్మవంత్ కాలేజీలోనే 1970లో జూనియర్ లెక్చరర్ గా చేరిపోయాను. నాయనకు మేము ప్రభుత్వ సంస్థల్లో పనిచెయ్యాలని కోరిక. నేను ప్రభుత్వ సంస్థను విడిచి ఖాసీ ప్రభుత్వసంస్థకు రావడం ఇష్టంలేదాయనకు. కొన్ని నెలలకే నర్సింగ్‌కు సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగం వచ్చింది. అప్పుడే నాకు కూడా గోదావరిఖనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగం

వచ్చింది. జూనియర్ కళాశాల లెక్చరర్ కన్న డిగ్రీకళాశాల లెక్చరర్ హోదా ఎక్కువ. అప్పుడు ఎవరు వేరే వూరుపోవాలి ఎవరు అమ్మా నాయనలతో వుండాలి అని చర్చ వచ్చింది.

'అంజి ఇప్పటికే భైంసాలో ఉన్నడు కనుక మనలో ఒకరం అమ్మనాయనల దగ్గర ఉండటం అవసరం. నీకు తెలుసుగద సత్తీ! వచ్చే సంవత్సరం మన కాలేజీ గూడ డిగ్రీ కాలేజీ అవుతది' అన్నాడు నర్సింగ్.

'అయితే నువ్వే ఇక్కడుండు 'నేను గోదావరిఖని వెళ్ళి డిగ్రీ కాలేజీలో చేరిపోతా' అన్నాను.

'అట్ల గాదు సత్తీ! ఇక్కడ నాకు డిగ్రీలకు పోయే అవకాశంలేదు. నాకంటే సీనియర్ ఆయన బాటనీ లెక్చరర్ ఉన్నాడిక్కడ. నాకు డిగ్రీ ప్రమోషన్ అవకాశాల్లేవు. నీకు అవకాశం వుంది' అన్నాడు నర్సింగ్.

అన్న చెప్పింది నిజమే. మాలో ఒకరం ఇక్కడుండాలని అతను చెప్పిందీ సబబే. నేను ఇక్కడే వుండిపోయాను. మా అన్నలిద్దరూ ప్రభుత్వోద్యోగాల్లోకి వెళ్ళారు. మా నాయనకు నా నిర్ణయం అసంతృప్తి కలిగించింది.

నర్సింగ్‌కు పట్టుదల ఎక్కువ. అనుకున్నది సాధించికానీ వదలడు. తనలక్ష్యం సాధించడానికి ఎన్ని సార్లయినా ప్రయత్నిస్తాడే కానీ పరిస్థితులతో రాజీపడి ఊర్కోడు. అతను జూనియర్ కాలేజీలో చేరినప్పుడే రిసెర్చి చేయాలని నిశ్చయించుకున్నాడు. కష్టపడి పిహెచ్.డి. సాధించాడు. తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ అయ్యాడు కూడా.

పిల్లలంతా బడికి పోయారు. బాలరాజు స్నానాలగదిలో పళ్ళుతోముతూ గొంతు గరగరలాడిస్తున్నాడు. నేను పాఠం సరిచూసుకుంటున్నాను. నాయన నాపక్కనే కూర్చుని వున్నాడు. మా అమ్మా, వదినా వంట హడావుడిలో వున్నారు. అప్పుడొక తెల్లటి యువతి గుమ్మంలో ప్రత్యక్ష్యమైంది. ఆమెకి ఇరవై ఏళ్ళుండవచ్చు ఆమె ఎందుకో ఏడుస్తున్నట్టు కనిపించింది. చేతిలో ఒక గుడ్డసంచీ వున్నది. ఇంటినుంచీ పారిపోయి రాలేదు కదా?

'ఎవరమ్మా నువ్వు?' అన్నాడు నాయన.

అప్పుడే గదిలోకొచ్చిన బాలరాజు 'ఆమెని ఎరుగుదువా?' అని మానాయన్ని అడిగాడు. అతని గొంతువిని ఆ అమ్మాయికి నోటమాటపెగలలేదు. వణికిపోయంది. నాయన ఆమెకు తాగేందుకు నీళ్ళిచ్చి కూర్చోపెట్టాడు.

అప్పటికి తేరుకుని అతి కష్టం మీద 'నేను వరలక్ష్మిని నన్ను ఇంట్లోనుంచీ వెళ్ళగొట్టారు' అన్నది.

'ఎందుకు ఎళ్ల గొట్టింద్రు? అయితె ఇక్కడెందుకొచ్చినవ్?' అన్నాడు నాయన ప్రశాంతంగా. ఆయనకి సంగతి అర్థమైనట్లుంది.

కానీ బాలరాజు అసహనంతో ఇక్కడికెందుకొచ్చావని గట్టిగా అరిచాడు.

'మీ తమ్ముడు నర్సింగరావు' అని వెక్కి వెక్కి ఏడ్చింది.

'నిన్ను పెండ్లి జేసుకుంటనని మాటిచ్చిండా?' నాయన అడిగాడు.

అప్పుడాఅమ్మాయికి కాస్త ధైర్యం వచ్చినట్టుంది 'అవును మేం ప్రేమించుకున్నాం. పెండ్లి చేసుకుంటానని మాటిచ్చాడు' అన్నది.

'మీరెవరు? మీకులమేంది?' బాలరాజు అడిగాడు.

ఆ ప్రశ్నకామె తాము బ్రాహ్మణులమని చెప్పింది. అప్పుడు బాలరాజుకి ముందు ఆశ్చర్యమూ తరువాత కోపమూ వచ్చాయి. వెంటనే నాయనను పక్కగదిలోకి తీసుకుని వెళ్ళి.

'ఆ పిల్లను ఇప్పుడే పంపించెయ్ నాయనా! ఇంట్లనుంచి ఎల్లగొట్టిన పిల్లను, మనమెట్ల పెండ్లికి ఒప్పుకుంటం? పైగా ఆమె బాపనోల్ల పిల్ల' అన్నాడు.

'జర్రాగు బిడ్డా! ఆ పిల్ల మనింటి పంచ గోరి వచ్చింది. వాళ్ల అమ్మనాయన ఎళ్ళగొట్టింన్రు. ఎక్కడికి వోతది చెప్పు' అన్నాడు నాయన.

'అయితేంది! పెండ్లికాని పిల్లని ఇంట్ల వెట్టుకోడమేంది? మనకులపోళ్ళు ఏమనుకుంటరు? మనింట్ల పెండ్లికాని మగపిల్లలున్నరుగదా!' బాలరాజు.

'అదంత నాకు తెలుసు బిడ్డా! కాని ఇప్పుడాపిల్ల ఎక్కడవోతది? మనమొద్దంటే మీ తమ్ముని దగ్గర్కు వోతది. ఆల్లిద్దరు పేండ్లి జేస్కుంటరు. అప్పుడు మన పెత్తన మేమైతది?'

ఈ విషయంలో మానాయన చాలా నేర్పుగా వ్యవహరిస్తున్నాడు. ఆపిల్ల ఏకులానికి చెందినా ఆయనకేం ఫరవాలేదు. కులస్థులు ఏమి వ్యాఖ్యానించినా లెక్కలేదు. ఆయన ఇప్పుడు ఒక మానవత్వమున్న మనిషిలాగా ఆలోచిస్తున్నాడు. ఆయన సంఘసంస్కర్తల రచనలేమీ చదువుకోలేదు. ఆయనకున్న అనుకంపనమే ఆయన్నలా పలికించింది. హృదయంలో మానవతా లక్షణాలుండడానికి పుస్తకాలు చదవక్కర్లేదని ఆయన ఆక్షణంలో ఋజువు చేసాడు. అస్పృశ్యుల వాణి అయిన అంబేడ్కర్ పుస్తకలేవీ ఆయన చదవక పోయినా పాత సంప్రదాయాలను బద్దలుకొట్టి మా కుటుంబంలో మొదటికులాంతర వివాహాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానించిన వాడు. మానాయన గొప్ప దార్శనికుడు. తాము అంబేడ్కరైట్స్ అని చెప్పుకుంటూ కులాంతరవివాహాలను వ్యతిరేకించే చాలామందికన్న గొప్పవాడు.

ఆమెను నాయన ఇంట్లోకి రమ్మని పిలిచినప్పుడు బాలరాజుకి అసంతృప్తిగానే వుంది. మా అమ్మా, మావదినా ఆమెను లోపలికి తీసుకుపోయి మాట్లాడారు. తరువాత మా అమ్మ బయటకు వచ్చి నాయనతో.

'బాలరాజా! ఆమె బాపన పిల్ల. మనకొడుక్కెట్ల జేసుకుంటం? మనకులపోళ్ళు ఏమనుకుంటారు? తక్కిన కొడుకుల మాటేంది?' అన్నది.

'కులపోళ్ళ సంగతి ఫికర్ చెయ్యకు. మనోడు ఆమెను పెండ్లి జేస్కుంటన్నడు. మన దగ్గరికి పొమ్మన్నడు. ఆడొచ్చేదాక ఈ పిల్లను ఇక్కడె వుండనియ్' అన్నాడు నాయన.

బాలరాజు లాగానే అమ్మకికూడా ఏమాత్రం సంతోషంగా లేదు కానీ నాయనను వ్యతిరేకించవద్దనుకున్నది.

◆◆◆

మాఇంట్లో కొత్తగా అడుగుపెట్టిన వరలక్ష్మి అందరినీ మంచిచేసుకోడం కోసం ఇంటిపనుల్లో కలుగచేసుకునేది. నేను కాలేజీకి బయలుదేరుతుంటే నా దస్తీ సంగతి కలంసంగతి గుర్తుచేసేది. అదినాకు ఇబ్బందిగా వుండేది. ఆమె మావదినెకు వంటలో సహాయంచేసేది. అయితే ఆమె వంట తియ్యగానూ నూనె ఓడుతూనూ వుండేది. అదిరుచిగా వున్నా అటువంటి వంట మాకు అలవాటులేదు. ఆమెకు మా తరహా వంట నేర్పించమని నాయన వదినెకు సలహా ఇచ్చాడు. వరలక్ష్మితో మా అన్నకు మూడేళ్ళుగా పరిచయంవుందని తెలిసింది. ఆమె దిగువ మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంనుంచి వచ్చింది. ఒక ప్రయివేటు ప్రైమరి స్కూల్లో టీచరుగా పనిచేసేది. ఆమె తండ్రి రైల్వేలో గుమాస్తా. మా అక్క బచ్చమ్మకు ఈ ప్రేమ వ్యవహారం తెలుసు. ఆమె మద్దతుకోసం. నర్సింగరావే ఆమెతో చెప్పివున్నాడు. 1972లో మా కుటుంబంలో మొదటి కులాంతర వివాహం జరిగింది. ఒక మాదిగ అబ్బాయికీ ఒక బ్రాహ్మణ అమ్మాయికి! సాధారణంగా పెళ్ళికి వధూవరుల తల్లితండ్రులిద్దరూ హాజరుకావాలి. వధువును ఆమె తండ్రో లేక సోదరుడో వరునికి అప్పగించాలి. వరలక్ష్మి తల్లితండ్రులు ఆమెను బహిష్కరించారు కనుక, హమాలీ బస్తీలోని సంఘ సేవిక భారతి ఆమె తల్లి స్థానంలోనూ నర్సింగరావు స్నేహితుడు రమేష్ ఆమె సోదరుని స్థానంలోనూ నిలబడి వివాహం జరిపించారు. పెండ్లి యాదగిరి నరసింహస్వామి ఆలయంలో మంత్రోఛ్ఛారణలమధ్య జరిగింది. ముప్పై సంవత్సరాలకు ముందువలె కొండక్రింద కాకుండా గర్భగుడి సమీపంలో జరిగింది.

పెళ్ళివేడుక పూర్తవుతూనే మా అమ్మ దుఃఖించడం చూసి నేను విస్మయం చెందాను. ఆమె దుఃఖానికి కారణం ఆ పెళ్ళికి వధువు తల్లితండ్రులు హాజరుకాలేదని. అందుకు పాపం వధువు ఎంత బాధపడిందో అని!.

ఇప్పుడు మా జీవన శైలిలో పూర్తి మార్పొచ్చింది. విద్య మాలో ఎన్నో విధాలైన పరిణామాలకు కారణమైంది. మా వేష భాషలలో వచ్చిన మార్పువలన మేము ఏ అగ్రకులస్థులకూ భిన్నంగా లేము. దళితులను ప్రత్యేకంగా ఎత్తిచూపించే చిహ్నాలు గ్రామాల్లో వున్నాయేమో గానీ నగరాల్లో మాయమయ్యాయి. అదివరకు మోకాళ్ళపైకి చీరె కట్టిన దళిత స్త్రీలు ఇప్పుడు హిందూ స్త్రీలవలె పాదాల వరకూ కడుతున్నారు. వెండి నగల స్థానంలో బంగారు నగలొచ్చాయి. పురుషులు కూడా పూర్వంలాగా అర్థ నగ్నంగా వుండడంలేదు. ఇప్పుడు దళితులను వేరుచేసి చూడ్డం హిందువులకు కష్టం.

అయితే ఇంకా నగరాల్లోకూడా కులం తెలియనంత వరకూ అగ్రకులాలకు చెందిన ఇంటి యజమానులు దళితులతో మర్యాదగానే ప్రవర్తిస్తారు. తెలిసిన తరువాత ఇల్లు ఖాళీచేసేదాకా సతాయిస్తారు. కులం దాచిపెట్టడం అసంభవం. ఎందుకంటే ఇంటికొచ్చిన బంధువుల రూపురేఖల్లోనో వేష భాషల్లోనో ఆ విషయం వెల్లడవుతుంది. మాక్కూడా ఇట్లా జరిగి ఇళ్ళుమారవలసి వచ్చేది. మేము దళితులమైనంత మాత్రాన ఇంటినుంచి ఇంటికి పదేపదే మారడం ఎంత వేదన? ఎంత వేసట?.

◆◆◆

పెళ్ళికావల్సిన ఆడ పిల్లల తల్లి తండ్రుల దృష్టి మా నాయన మీదే వుండేది. ఎందుకంటే మాకులంలో వుండే విద్యావంతుల కుటుంబాలలో ఇప్పుడు మాది ఒకటి. ఇప్పుడు అంజయ్యకు ఇరవై ఎనిమిదేళ్ళు. నాకు ఇరవైఏడు. మాకిద్దరికీ పెండ్లి చెయ్యాలని మానాయన తొందర పడుతున్నాడు. ఇప్పటిలాగ అప్పుడు యువకులకి వారి జీవన భాగస్వాముల్ని స్వయంగా ఎంచుకునే అవకాశంలేదు. ఏదైనా రహస్యంగా ఎంచుకుంటేతప్ప. సరైన అమ్మాయిలకోసం బంధువులు సూచించిన సంబంధాలన్నీ విచారిస్తున్నాడు నాయన. అట్లా నాయన చూసిన కుటుంబాలలో శివరామ్‌ది ఒకటి. ఆయన ఇంజిన్ డ్రయివర్. ఆయనకు ముగ్గురు కొడుకులు, ముగ్గరు కూతుళ్ళు. ఇద్దరు కొడుకులు డాక్టర్లు. ఒకాయన ఆర్కిటెక్ట్. చాలా కుటుంబాల్లో లాగానే ఆడపిల్లలకు పాఠశాల స్థాయి వరకే చదువు చెప్పించాడు. ఆయన కూతురు రుక్మిణితో అంజయ్యకు పెళ్ళి స్థిరపర్చాడు నాయన, ఆసమయంలోనే ప్రభుత్వంలో అత్యున్నత స్థాయి పదవిలో వున్న టీ.వీ. నారాయణ గారి దృష్టిని నేను ఆకర్షించాను. ఆయన భార్య దళిత రాజకీయవేత్త టి.ఎన్. సదాలక్ష్మి. నేను పనిచేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ దాదె ప్రసాద్ టీ.వీ. నారాయణ గారి స్నేహితుడు. మానాయన రైల్వేలో చాలాతక్కువ స్థాయి ఉద్యోగి అయినప్పటికీ మేమందరం అధ్యాపకులం అయిన పద్ధతి ఆయనకు చాలా నచ్చింది. నా విద్యార్హతా, నేను ఎంచుకున్న ఉద్యోగమూ కూడా బాగా నచ్చాయి. ఆయన కూడా స్కూల్ టీచర్ గానే ఉద్యోగం ప్రారంభించి వున్నాడు. టీవీ నారాయణ గారమ్మాయి గాయత్రి కోసం వాళ్ళు మానాయనకు ప్రతిపాదన పంపారు. వాళ్లతో సంబంధం కలుపుకునేటంత సామాజిక స్థాయి మాకులేదని బాలరాజు అభిప్రాయపడ్డాడు. ఆ అమ్మాయి మన ఇంటి పరిస్థితులలో ఇమడలేదేమో అని కూడా అన్నాడు. నారాయణ గారు ఉన్నతాధికారి పదవిలో ఉండడం నాకు లాభిస్తుందని నాయన భావించాడు. మా బంధువులలో ఈ వార్త పాకింది. తమకన్న ఉన్నత స్థితిలోవున్న కుటుంబంలోని పిల్లతో సంబంధం కలుపుకోవడం పిల్లవాడి కుటుంబానికి మంచిదికాదని కొంతమంది మమ్మల్ని నిరుత్సాహపరిచారు. అయినప్పటికీ అమ్మానాయనా కొంతమంది బంధువులతో కలిసి పిల్లని చూసుకోడానికి ఒక తేదీ నిర్ణయించారు.

మా కుటుంబం అంతా వాళ్ళింటికి వెళ్ళారు. అక్కడ వైభవంగా చేసిన ఏర్పాట్లూ అశేష జనమూ చూసి ఆశ్చర్య పోయారు. అసలింటికి వచ్చామా మరొక ఇంటికి వచ్చామా అనుకున్నారు. నిజానికి అమ్మాయి తల్లితండ్రులు ఆమెకు త్వరగా పెండ్లి ఖాయం చెయ్యాలనుకుంటున్నారు. మా అమ్మా నాయనలకు అమ్మాయి నచ్చుతుందనే నమ్మకంతో. ఎంగేజిమెంటుకు అన్ని ఏర్పాట్లు చేసారు. మా అమ్మకు కూడా బాలరాజు వంటి అభిప్రాయమే వున్నా పిల్ల నచ్చింది. అన్నీ అనుకూలంగా జరిగిపోయి ఎంగేజిమెంట్ కూడా అయిపోయింది. నా పెండ్లి మే 23, 1973 నాటికి నిశ్చయమైంది.

నాపెండ్లికి సరిగ్గా మూడురోజుల ముందే అంజయ్య పెళ్ళి జరిగింది. మే ఇరవైన రైల్వే ఆడీటోరియంలో! ఈ పెండ్లి మా ఇంట్లో జరిగిన పెళ్ళిళ్లన్నిటికన్న భిన్నంగా జరిగింది. వైభవంగా జరిగిందని చెప్పాలి. మొదటిసారిగా వివాహవేదికను పూలతో అలంకరించడం, ఒక బ్రాహ్మణ పూజారి పెళ్ళి జరిపించడం ఇదే మొదలు. నర్సింగరావు పెళ్ళికూడా బ్రాహ్మణ పూజారే జరిపించాడు కానీ అది దేవాలయంకదా! ఈ పెళ్లికొచ్చినవారంతా దాదాపు నగరవాసులు. పెళ్ళి తంతుకూడా హిందువుల పెళ్ళి మాదిరి జరిగింది.

నా వివాహం కూడా మా అత్తమామలు బషీర్‌బాగ్‌లోని లేడీ హైదరీ క్లబ్‌లో వైభవంగా జరిపించారు. మా అత్తమామలు బాగా ధనవంతులుకాక పోయనా సమాజంలో గుర్తింపూ, ప్రతిష్ఠా కలవారు. అందువలన పెళ్ళికి చాలామంది ప్రముఖులు వచ్చారు మా కళాశాల అధ్యాపక బృందం, నా స్నేహితులు రామారావు, సుబ్బారావు కూడా వచ్చారు. నా వివాహం ఆర్య సమాజపద్ధతిలో జరిగింది. బ్రాహ్మణులూ వారు ఆచరించే క్రతువులూ లేవు. ఈ వేడుక చూస్తూ మావాళ్లంతా వెనక కూర్చున్నారు. భోజనాలు మూడు గదుల్లో ఏర్పాటుచేశారు. కూర్చుని టేబుల్ మీద తినేవారికొకచోట, బఫే ఒకచోట, అతిముఖ్యమైన అతిథుల కొకచోట ఏర్పాటుచేసారు. భోజనంలోకి అన్ని పదార్థాలను చూడ్డం ఇదే మొదటిసారి. మావాళ్లకి. అట్లా వాకర్ టౌన్‌లోని మాఇంటికి ఇద్దరు కొత్త సభ్యులు వచ్చి చేరారు.

◆◆◆

1970–80ల మధ్య మాకుటుంబంలో అనేక మార్పులు జరిగాయి. వివాహం నా జీవితంలో నూతనాధ్యాయాన్ని ప్రారంభించింది. అదొక మైలురాయి. మా మామగారి పలుకుబడి వల్ల అంజయ్యకూ, నర్సింగ్‌కూ నగరానికి బదిలీఅయింది. మొదట్లో మామామగారి స్నేహితులు ఇచ్చే విందుల్లో పాల్గొనడం నాకు ఊపిరాడనట్లుగా వుండేది. సమాజంలో అంతగా కలిసి తిరగడం నాకు పెద్దగా అలవాటులేదు.

మా ఉమ్మడికుటుంబం విడిపోనారంభించింది. అందరికీ ఎవరి కాపురాలు వాళ్లకు ఏర్పడ్డాయి. ముందు అంజయ్య తన కుటుంబంతో తన ఇంటికి వెళ్ళిపోయాడు. అంజయ్య

ఇప్పటికీ అప్పటికీ మానాన్నకు ప్రియపుత్రుడే, వాళ్ళిద్దరదీ గొప్ప అనుబంధం. మా వదిన రుక్మిణి మంచి గృహిణి. ఇల్లు తీర్చిదిద్దగలనేర్పరి, అంజయ్యకి ఏదిగులూ చింతాలేదు. ఆ ఆలుమగలు ఒకరికోసం ఒకరన్నట్లు వుంటారు.

అంజయ్య తెలుగు మీడియం విద్యార్థులకి జూవాలజీ బోధిస్తాడు. మంచి అధ్యాపకుడిగా పేరుతెచ్చుకున్నాడు. ఉన్నదానితో తృప్తిపడే మనిషి. అన్న అతన్ని రీసెర్చికి వెళ్లమన్నా వెళ్లలేదు. చివరికి గవర్నమెంట్ సిటీ కాలేజి ప్రిన్సిపల్‌గా రిటైరయినాడు.

అంజయ్య వేరే ఇంటికి వెళ్ళిపోయాక మేము బోయిగూడలో కాస్త చిన్న ఇంటికి మారాము. రెండళ్ల తరువాత నర్సింగరావు కూడా వేరే వెళ్లిపోయాడు. అప్పొడతనికొక పిల్లవాడు పుట్టాడు. ఇప్పుడు బాలరాజూ లక్ష్మణ్ మా అమ్మా నాయనా మిగిలాము. ఆ వెంటనే బాలరాజు కూడా రైఫిల్ రేంజ్‌లోని తన రైల్వే క్వార్టర్‌కి వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఆ ఇంట్లో నేనూ నా భార్యా, నా మొదటి సంతానం, మా అమ్మా నాయనా లక్ష్మణ్ మాత్రం వున్నాము. మా రెండో అమ్మాయి పుట్టాక 1977 లో మేము ఎంఎల్ఎ క్వార్టర్స్‌కి వెళ్ళాము. మా అత్తగారు శాసనమండలి సభ్యురాలవడం వలన ఆమెకు ఆ క్వార్టర్ వచ్చింది. అప్పుడు మా అమ్మకి చక్కెర వ్యాధి స్థిరపడిపోవడంతో తరుచూ డాక్టర్ దగ్గరకు తీసుకుపోయేవాడిని.

◆◆◆

రైల్వేలో ఉద్యోగం మానేసిన తరువాత అబ్బసాయిలు కష్టాల్లో కూరుకుపోయి నట్లయింది. అతను పనిచేసే సత్యమ్మ కళాశాలలో బాగా తక్కువ వేతనం ఇచ్చేవాళ్ళు. అది కూడా సకాలానికి ఇచ్చేవారుకాదు. అయినా అతను ఏమాత్రం నిరుత్సాహపడకుండా ఎం.ఫిల్ చేసాడు. మా వదిన కూడ ఏవో చిన్న చిన్న పన్లుచేసి అతనికి పెద్ద అండగానిలిచింది. నేను మా చిన్నన్నకు ఏవిధమైన ఆర్థిక సహాయంచెయ్యలేక పోయినందుకు బాధపడేవాడిని. మేము పెళ్ళిళ్ళకు చేసిన అప్పులు తీరుస్తూ వుండడం వలన అది సాధ్యం కాలేదు. తరువాత అబ్బసాయిలుకు ఉస్మానియాయూనివర్సిటీలో ఉద్యోగం వచ్చింది. అది అతనిజీవితంలో పెద్ద మలుపు. మా కుటుంబంలో మొదటి డాక్టరేట్ తీసుకున్నది అబ్బసాయిలే. మొదటగా ప్రొఫెసర్ అయిందీ అతనే.

1970 వ దశకం మధ్యలో చిన్నన్న ఒక పేపర్ ఇవ్వడానికి ఆస్ట్రేలియా వెళ్ళినప్పుడు చూడాలి మా నాయన సంతోషాతిరేకం! తన కొడుకు స్టేషన్ మాస్టర్ కావాలని మాత్రమే తను కోరుకుంటే అతను అంతకన్న ఉన్నతస్థాయికి ఎదిగి, విమానమెక్కి మరో దేశానికి పోతున్నాడు. నాయన కళ్లల్లోనుంచీ ఆనందాశ్రువులు జలజల రాలాయి. ఆస్థాయికి వెళ్ళడం మా అన్నకేమీ నల్లేరుమీద నడకకాదు. ఎన్నో కష్టాలకోర్చి పట్టువిడవకుండా ఆ విజయం సాధించాడు. విమానాశ్రయానికి వెళ్లడం మా అందరికీ ఒక కొత్త అనుభవం. ఆరోజుల్లో విమానాశ్రయం టెర్రేస్ మీదనుంచీ విమానాలు బయలుదేరడాన్నీ, వచ్చి

ఆగడాన్నీ చూడ్డానికి వీలయ్యేది. అలా మేము మాఅన్న విమానం బయలుదేరడం చూశాము.

◆◆◆

మేము బోయిగూడాలో వుండగానే మాపెద్దమ్మాయి మాధవీ రెండో అమ్మాయి ఆరాధనా జన్మించారు. మూడో పిల్ల జ్యోతిశ్రీ మేము ఎం. ఎల్. ఎ క్వార్టర్స్‌కి మారాక పుట్టింది. నాకు కొడుకు పుట్టాలని కోరుకున్న మా అమ్మానాయనలకు కాస్త ఆశాభంగం కలిగింది.

ఎం.ఎల్.ఎ. క్వార్టర్స్‌లో జీవితం బాగావుండేది. మాధవి సికిందరాబాద్ సెంట్ ఆన్స్ స్కూల్లో చేరింది. తనకి తాతతో మంచిస్నేహం. ఆపిల్ల తన స్నేహితులతో 'కాన్వెంట్' ఇంగ్లీష్ మాట్లాడుతుంటే సంబరపడేవాడు. ఆయన మాధవిని రోజూ స్కూల్లోదింపేవాడు. తరువాత మా సోదరులలో ఎవరో ఒకరింటికి నడిచి వెళ్ళొచ్చేవాడు. మాధవికి తాతంటే ఎంతో ఇష్టం. ఆయనకు చుట్టలు తేవడం మర్చిపోవద్దని నాకు గుర్తుచేసేది.

మా అన్నలకు దూరంగా వుండడం నాకేమీ సంతృప్తిగాలేదు. మా ఉమ్మడి కుటుంబం నాకు చాలా ఇష్టంగా వుండేది. నాకిప్పుడు ఏమనిపిస్తుందంటే కుటుంబ సభ్యులందరికి స్వంతసంపాదనలు లభించడం, ఎవరి అభిరుచులు వారికి ఏర్పడడమే ఉమ్మడికుటుంబాల విచ్ఛిన్నానికి కారణమేమోనని! అంతే కాదు వాళ్లకి బాగా వారసత్వపు ఆస్తివున్నా కలసివుండలేరు. మావిషయంలో అయితే మాకేమీ ఆస్తిలేదు. మా నాయిన ఇచ్చిన చదువుతప్ప. ఉమ్మడి కుటుంబాలు వేరైపోవడం పిల్లల పుట్టుకతో ప్రారంభం అవుతుంది. ఉమ్మడి కుటుంబంలో ఎక్కువ సంపాదించే వ్యక్తికి తన పిల్లలకు ఎక్కువ సౌకర్యాలు కలుగచేయాలనే తలంపు కలుగుతుంది. అంతేకాకుండా మిగిలిన వాళ్ళు కుటుంబానికి ఎంత ఇస్తున్నారో తనూ అంతే ఇవ్వాలనుకుంటాడు. అట్లా కుటుంబంలో అధిక సంపాదన గల సభ్యులంతా స్వంతానికి కొంత దాచుకుంటూ వుంటారు. ఇందుకు మా ఉమ్మడికుటుంబం కూడా మినహాయింపుకాదు.

మా పెండ్లయిన కొత్తలో మమ్మల్ని ఒక పనిమనిషిని పెట్టుకోమని మా అత్తగారు ఒత్తిడి చేసింది. ఇది మాకు చాలా కొత్త అలవాటు. అంతకుముందు మాపని మేమే చేసుకునే వాళ్ళం. పనిమనిషికి పనులు పురమాయించడానికి సందేహించేవాళ్ళం. ఈ ఏర్పాటు మా అమ్మానాయనలకు ఇబ్బందికరంగా వుండేది. ఆమె ఎదుట ఎట్లా ప్రవర్తించాలో తెలిసేదికాదు. పనిమనిషి చేత పని చేయించుకోడం నా భార్యకి కొత్తేమీకాదు. తనకు సహాయపడే మనిషి దొరికినందుకు సంతోషించింది కూడా.

1970–79 దశాబ్దం మా అందరి కుటుంబాలలోకూడా చాలా మార్పుతెచ్చింది. మా రెండో తరం పిల్లలు కాన్వెంట్ స్కూళ్ళల్లో చదవడం వల్ల మధ్యతరగతి కుటుంబాలతో సమానంగా వుంటున్నారు. వాళ్ళకిప్పుడు ఫీజు తగ్గింపుకోసం అభ్యర్థించే అవసరం లేదు.

స్కూల్‌కి సంబంధించినంత వరకూ వాళ్ళకు దళితులమనే ప్రత్యేకత లేదు. కుల ప్రసక్తి లేకుండా వాళ్ళు అగ్రకుల విద్యార్థులతో పోటీపడి చదువుకుంటున్నారు.

◆◆◆

మా అమ్మా నాయనలు నాలుగేళ్ళుగా నాతోనే వుంటున్నారు. తక్కిన కొడకులు తమ గురించి పట్టించుకోడం లేదనీ తాము నాకు భారమౌతున్నామనీ అనుకోడం మొదలుపెట్టారు. ఒకరోజు నేను మర్నాటి పాఠాలు తయారుచేసుకుంటూ వుండగా, మా అమ్మ నాతో,

'మీ అన్నలతో మాట్లాడు బిడ్డా! మేమెప్పుడు నీతోనే వుండాల్నా? మమ్మల్ని చూసే బాధ్యత వాళ్లకి లేదా?' అన్నది గంభీరంగా.

ఆమె అన్న తీరుచూసి ఎక్కడో ఏదో తప్పు జరిగివుంటుందనీ, నేనో నా భార్యో ఆమెని నొప్పించి వుంటామనీ అనిపించింది.

'ఏమైందమ్మా? నేనుగాని నీకోడలుగాని ఏమన్న తప్పు చేసినమా?' అన్నాను. అదేమీ కాదంది. మరి తను ఇక్కడ సంతోషంగా లేదా అని అడిగాను.

'అదేంగాదు బిడ్డా! నువుగాక ఇంకా నలుగురు కొడుకులున్నరు. మమ్ములను జూసే బాధ్యత వాళ్ళకు కూడుంది గదా?' అన్నది.

'అదేందమ్మా? నేనొక్కోన్నే కొడుకై వుంటే మిమ్ములను జూసుకోలేనా?' అన్నాను.

'అది వేరే సంగతి. మాకు ఇంకా నలుగురు సంపాదిస్తున్న కొడుకులున్నరు. నీభార్య పాణంగూడ బాగుండది. నాగ్గాడ మంచిగుంటలేదు. ఇద్దరిని జూసుకోవడం నీకు కష్టం గద బిడ్డా!'.

'సరె అమ్మా!నాకు పిల్లలెట్ల భారంగారో, మీరూ అట్లాగే భారం కారు. అన్నలతో మీరు మాట్లాడితే మాట్లాడండి నేను మాట్లాడే అవసరం లేదు' భావోద్వేగంతో నాకళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

మా అమ్మ నన్ను కౌగలించుకుని దుఃఖించింది. మా నాయన మౌనంగా మమ్మల్నిద్దర్నీ చూస్తూ వున్నాడు. తరువాత మా అమ్మ చెప్పింది సబబేనన్నాడు.

మా నాయన పిలుపు మేరకు మేం అందరం ఆదివారం నాడు బాలరాజు ఇంట్లో సమావేశమయినాం. ఆ చిన్న యింట్లోనే మా బడి చదువులు పూర్తయినాయి. ఆ రోజుల జ్ఞాపకాలు నామనసులో మెదులుతున్నాయి. నేను చాలా ఇబ్బందిగా అసౌకర్యంగా కూర్చునివున్నాను. ఎందుకంటే ఇప్పుడు మేం చర్చించబోయే విషయం చాలా సిగ్గుపడవలసిన విషయం. మా అమ్మానాయనలను మేం ఎట్లా చూసుకోవాలో అని చర్చించాలా? నేను ఇట్లా చెయ్యొద్దని మానాయనకు చెప్పాను. కాని ఆయన ఇట్లాగే జరగాలని పట్టుబట్టాడు. మా అమ్మానాయనలు తమకు భారమని మా అన్నదమ్ములం ఎవరమూ అనుకోడం లేదు. ఇప్పుడు కూడా మా తల్లితండ్రులు వంతులవారీగా మా

ఇళ్ళల్లో వుండడం అనే ఊహే నాకు నచ్చదు 'భారం' పంచుకోడం' లాంటిమాటలే నచ్చవు. ఇది వారసత్వపు ఆస్తి పంచుకోడం వంటిది కాదు. మా అమ్మానాయనలు ఎన్ని ఆర్థిక ఇబ్బందులెదురైనా. మమ్మల్ని చిన్న చిన్న పన్లకు పెట్టకుండా వాళ్ళ కడుపుకట్టుకుని ఎంతో కష్టపడి చదువుచెప్పించారు. వాళ్ళిప్పుడు వాళ్ల భారాన్ని మేం ఎట్లా పంచుకోవాలా అని అడుగుతున్నారు. ఇంతకన్న సిగ్గుపడవలసిన విషయం మాకేముంటుంది?.

అంజయ్యా, నరసింగరావూ ఒకరిమొహాల్లోకీ ఒకరు చూస్తూ కూచున్నారు. వుండీ వుండీ వాళ్ల భార్యల మొహాల్లోకి చూస్తున్నారు. బాలరాజూ అబ్బసాయిలూ విషయం చర్చిస్తున్నారు.

'అమ్మా నాయనలను ఇంకా సత్తి దగ్గర వుంచడం న్యాయంగాదు పెద్దన్నా! వాడికి చిన్నపిల్లలున్నరు. పైగా అతని భార్యకుకూడా ఆరోగ్యం బాగాలేదు' అన్నాడు అబ్బసాయిలు.

'సరే! నాదగ్గరే వుంచుకుంటాను' అన్నాడు బాలరాజు.

'వద్దు. మేం ఎవరింట్లోనూ ఉండం. మాకు వేరే ఇల్లు జూసి పెట్టండి' అన్నాడు మానాయన ధృఢచిత్తంతో.

'అది కుదరదు నాయనా ! మిమ్మల్ని అట్ల వెరే ఉంచం. ఈ వయసులో అమ్మకు సాయం అవసరం' అన్నాడు అబ్బసాయిలు.

'అయితే మేం పెద్దవాడిదగ్గరే వుంటాం. మీ అందరూ వానికి సాయం జేయండి. వానిది పెద్ద కుటుంబం' అంది అమ్మ మా అమ్మకి నా తరువాత బాలరాజు ఇంట్లోవుండడమే సమ్మతం. ఆమెకు పెద్దకోడలు పోచమ్మతో అనుబంధం ఎక్కువ. ఆమె మాకుటుంబంతో కలిసి కష్టకాలాన్ని పంచుకున్న మనిషి. అమ్మను బాగా అర్థంచేసుకున్న మనిషి.

అప్పుడు మానాయన చెప్పాడు. మేమందరం ప్రతినెలా మొదటి తేదీన బాలరాజుకు తలా రెండు వందలు ఇవ్వాలి. అదికూడా అడిగించుకోకుండా ఇవ్వాలి.

'నేను అస్తి పంచలేదు బిడ్డలూ ! నా ఖర్చు పంచుతున్నాను' అంటూ దుఃఖించాడాయన.

అత్యంత ఆవేదనాభరితమైన ఈ దృశ్యం నా మనసులో చిరకాలం నిలిచిపోయింది. ఇట్లా జరగనిచ్చినందుకు నన్ను నేనెప్పటికీ క్షమించుకోలేను. మా అన్నలుకూడా అట్లాగే చింతాక్రాంతులైనారు. అందరి అంతరంగాలలోనూ దుఃఖమే! మళ్ళీ అందరూ అమ్మానాయనలను తమతో వుండమని అడిగారు. ఏ పిల్లలనైతే పెద్ద చదువులు చదివించాలనే ఒకే ఒక ధ్యేయంతో ఎంతో శ్రద్ధగా ప్రేమగా పెంచాడో ఆ పిల్లలనే తన ఖర్చుకు ఆ తండ్రి డబ్బు అడగవలసి రావడం అనే భావం నామనశ్శరీరాలను ఒక్క కుదుపుకుదిపింది. నేను సిగ్గుతో నిస్సహాయతతో కుంచించుకుపోయాను. నేను మరీ మరీ అడిగాను మానాయనను నాతో వుండమని. ఆయన నన్ను కౌగలించుకుని 'బిడ్డా,

సత్తీ ! నీతో నాలుగేండ్లున్నం ఇప్పుడు అన్నతో వుండనీ! నా మనుమరాళ్లను చూడాలనిపిచ్చినప్పుడు ఒస్తుంట' ఆమాట నాకు కాస్త ఉపశమనం కలిగించింది.

◆◆◆

1979 లో మాకళాశాలలో ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. ఉద్యోగులకు జీతాలివ్వడానికి యాజమాన్యం వద్ద డబ్బులేదు. కళాశాల నిర్వాహక వర్గం ఆర్థిక వ్యవహారాలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. అధ్యాపకులూ, అధ్యాపకేతర సిబ్బందీ సమ్మె చేసారు. అప్పుడు యాజమాన్యం ప్రిన్సిపల్‌ని మార్చాలనుకుని నన్ను ఆపదవిలో వుండమని ప్రతిపాదించింది. ఆ విషయాన్ని నేను నా సన్నిహిత మిత్రులైన రామారావు సుబ్బారావులతో చర్చించాను. సుబ్బారావు మితభాషి, కానీ అతని ఆలోచనలు సూటిగా, నిష్పక్షపాతంగా వుంటాయి. రామారావు ఆ ఇద్దరిలో నాకు మరికాస్త సన్నిహితుడు. ఎప్పుడూ నాపక్షానే మాట్లాడతాడు. మేమిద్దరం కోఠీలోనో ఆబిడ్స్ లోనో కూచుని గంటలకొద్దీ మాట్లాడుకుంటాము. మా స్నేహబంధం చాలాగట్టిది. ఆ ఇద్దరూ కూడా నన్ను ప్రిన్సిపల్ పదవి అంగీకరించమని చెప్పారు. నా స్నేహితుల సలహా వల్లనైతేనేం నామామగారి సలహా వల్లనైతేనే నేను అంగీకరించాను. ముప్పై మూడు సంవత్సరాలకే ప్రిన్సిపల్ పదవి వచ్చిన వాడిని అక్కడ నేనే.

కొత్తగా ఏర్పడిన కళాశాల కనుక అక్కడ చాలా సమస్యలున్నాయి. యాజమాన్యం మద్దతు వున్నప్పటికీ ఏరోజుకారోజు కళాశాల నిర్వహణ ఒక సవాలు. కానీ నేను చాలా కష్టపడి ప్రభుత్వం నుంచీ నిధులు తెప్పించాను. ఒక అధికారికుండే వైఖరితో కాక మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాను. ఈ కాలంలో రామారావు నాకు వీలైనంత సహాయ సహకారాలందించాడు. కళాశాల సిబ్బందిలో ఎక్కువమంది బ్రాహ్మణులూ కమ్మ వారూ, రెడ్లు వున్నారు. నేను దళితుడిని. అయితే నా బ్రాహ్మణ సహోద్యోగలతో నాకెటువంటి పేచీ లేకపోయింది. వాళ్ళు నా ఉద్యోగవిరమణ వరకూకూడా నాతో స్నేహంగా వున్నారు. ఒక రెడ్డికి మాత్రం అసూయగా వుండేది. ఒకరోజు నేను ఫిజిక్స్ ల్యాబ్‌లో కూర్చుని రామారావుతోనూ మరొక కళాశాల అధ్యాపకునితోనూ మాట్లాడుతున్నాను. అతనూ నావలె మాదిగ కులంవాడు, పేరుకూడా సత్యనారాయణే. సత్యనారాయణ నాతో ఏదో చెప్పాలను కుంటున్నట్లు గ్రహించాను. రామారావు ఒక విద్యార్థికి ఎదో వివరించడానికి పోగానే నేను సత్యనారాయణని ఆఫీసుకు తీసుకుపోయాను. అతను నాతోమాత్రమే ఏదో ముఖ్యమైన విషయం చెప్పాలనుకుంటున్నాడు.

'మొన్న మీ బాటనీ లెక్చెరర్ రెడ్డి నా దగ్గర కొచ్చిండు' అన్నాడు సత్యనారాయణ చాలానెమ్మదిగా. ఎందుకని అడిగాను.

'వాడేమన్నడో తెలుసా? తను ఒక మాదిగోని కింద పనిజెయ్యాల్సి వచ్చిందన్నడు వాడికి నేను మాదిగనని తెల్వదు' అన్నాడు.

నాకు చాలా కోపం వచ్చింది. మొహం ఎర్రబడింది 'నువ్వేమన్నవు ? అన్నాను
'నేన్ నోర్మూస్కొని ఉన్నాననుకున్నావ? చెప్పుతీసుకున్నాను చెంపమీద కొడుదామని. ఎవడో అచ్చి అపిండు'.

అతనికి ఒక గ్లాసు మంచినీళ్ళిచ్చాను. దాంతో కొంత చల్లబడ్డాడు.

'కులం కంపుకొట్టే ఈ సమాజంలో మనపట్ల అగ్రవర్ణాలకుండే అసహనం. శత్రుత్వం పోవు. అట్లాగే నిలిచివుంటాయి. అతను ఒక రెడ్డి కనుక మనం ఎప్పుడూ వాడి పాదాల కింద వుండాలనుకుంటడు. కానీ ఇప్పుడు మన దగ్గరా విద్య అనే బలమైన ఆయుధం వుంది. మనం దాన్ని ఉపయోగించుకుందాం. మరీ అంత ఆవేశం వద్దుదోస్త్!' అన్నాను. నాకూ చాలాకోపమొచ్చింది. కానీ తమాయించుకున్నాను.

'కాదు దోస్త్! వాడితో జాగ్రత్తగా వుండుఅన్నాడు.

'వాడు నా వెంట్రుక కూడా పీకలేడు. నువ్వేం భయపడకు' అన్నాను.

కుల తత్వం అసలు రంగు ఈ మనిషి (రెడ్డి) ద్వారానే అర్థమైంది నాకు. అతను నాతో మర్యాదగా ప్రవర్తించేవాడు. నా వెనక గోతులు తీసేవాడు. నేను ప్రిన్సిపాల్ పదివి వదిలిపెట్టే లాగా కొన్ని సందర్భాలను సృష్టించేవాడు. ఒక సారి అతను ఒక విద్యార్థి నాయకుడిని వుపయోగించుకుని ఒక పరీక్షల వివాదంలో నన్ను ఇరికించాలని చూశాడు. కానీ ఆ ప్రణాళిక బెడిసికొట్టి తిరిగి అతని మీదకే వచ్చింది. క్లిష్టపరిస్థితిలో పడిపోయాడు. ఆ విద్యార్థి మూడేళ్ళ పాటు రెడ్డికి కంటికి కునుకూ మనసుకు శాంతీ లేకుండాచేశాడు. ఆఖరికి వీధిలోకూడా వెంటాడాడు. ఈ విషయంలో అతనెన్ని అధ్యాపక సంస్థల్ని సంప్రదించినా ఆఖరికి ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్ళినా ఫలితంలేకపోయింది. అతని పదవీ విరమణ సమయంలో నేను ఆతని పెన్షన్ కాగితాలు పంపనేమో అని కూడా భయపడ్డాడు. కానీ అందరు ఉద్యోగస్తుల కాగితాలు పంపినట్టే అతనివీ పంపనప్పుడు అతను చకితుడై, అప్పుడు తను చేసినపని అంగీకరించాడు.

మాదిగ అవడం వల్ల నాకు అధికారిగా వుండే అర్హతలేదంటూ ఒక లైబ్రరీ అసిస్టెంట్ వ్యాఖ్యానించాడు ఒకసారి. ఈ వ్యాఖ్యానానికి నేను కలవరపడ్డానేకానీ అతనిమీద కోపంరాలేదు. ఈ దేశంలో వున్న వర్ణవ్యవస్థ, అది ఇచ్చిన అగ్రకుల అహంకారం అతనిచేత అట్లా మాట్లాడించాయనుకున్నాను. దళితుల సంక్షేమంకోసం ఎన్ని చట్టాలొచ్చినా కుల వివక్ష నిలిచేవుంది. స్వతంత్ర భారతదేశంలో వారింకా అస్పృశ్యులే.

అణచబడిన వర్గాల అభివృద్ధికోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన అవిరళకృషి కూడా అగ్రవర్ణాల ఆలోచనా విధానాన్ని మార్చలేకపోయింది. ఆయన భారత రాజ్యాంగ చట్టాన్ని రూపొందిస్తూ అన్నమాటలు;

"నేనీ చట్టసభలోకి ఏపెద్ద ఆశతోనూ రాలేదు. దళితుల హక్కులను కాపాడడం కోసమే వచ్చాను." గుర్తొచ్చి ఈ పిల్లవాడికి ఒక పాఠం నేర్పాలనుకున్నాను. అందుకని అతన్ని నా ఆఫీస్ తలుపు పక్కన ఒక స్టూల్ మీద కూచుని నేను గంటకొట్టిపిలిచినప్పుడల్లా

నాముందు హాజరుకమ్మని చెప్పాను. ఈ విధంగా ఆరునెలలు కొనసాగింది. అప్పుడు అతనిపై అధికారిగా వుండడానికి నేనెట్లా అర్హుడినో అతనికి అర్థమైంది. అప్పుడు నా కాళ్లమీద పడి పశ్చాత్తాపం ప్రకటిస్తూ తనని క్షమించమని అడిగాడు. అతని తప్పుతెలుసుకున్నందుకు సంతోషించాను.

శాసన మండలి సభ్యురాలిగా మా అత్తగారి పదవీకాలం ముగియడంతో నాజీవితం మరొక మలుపు తీసుకుంది. మేము ఎం.ఎల్.ఎ. క్వార్టర్స్ ఖాళీచేసి కిషన్ గూడా ఇంటికి వెళ్ళాము. అది హైదరాబాద్ శివార్లలో వుండే చిన్న గ్రామం. ఒక వందమంది జనాభా వుంటుంది. అక్కడ మా అత్తగారికి ఒక పౌల్ట్రీ ఫామ్, ఒక ఒక బియ్యం మిల్లు వున్నాయి. ఊళ్ళో ఎక్కువమంది కల్లుగీత పనివారు. గౌడ కులానికిచెందిన వాళ్ళు. ఈవూళ్ళో కులవివక్ష కనపడదు. ఒక విశేషమేమంటే నగరానికి దగ్గరగా వుండి ఆ ఛాయలు వూరిమీద కనపడతాయి. మా అత్తగారు దళితమహిళ అయినప్పటికీ మాజీ మంత్రి అవడం వలన అక్కడామెకి గౌరవప్రతిష్ఠలు బాగావున్నాయి. అక్కడున్నప్పుడు నేనుకూడా అప్పుడప్పుడూ పౌల్ట్రీ ఫామ్, బియ్యంమిల్లుల నిర్వహణలో పాల్గొనేవాడిని. కానీ అది నాకు ఇష్టంలేనిపని.

కిషన్ గూడా నుంచీ రోజూ అంతదూరం వెళ్లడం కష్టం కనుక మా అమ్మాయి మాధవిని సెంట్ ఆన్స్ స్కూల్ హాస్టల్ లో చేర్చవలసి వచ్చింది. నేను రోజూ పదిహేను మైళ్ళు స్కూటర్ మీద కాలేజీకి పోయేవాడిని. ఆ దినచర్య చాలా అలసటగావుండేది. మా అత్తగారిమీద వుండే గౌరవంతో ఆమె కోరికను మన్నించి నా కుటుంబం సంగతి ఆలోచించకుండా కిషన్ గూడా వచ్చాను. ఆమె మనసు మంచిది కానీ ఆమెకి ఎవరైనా తన మాట వినకపోతే వెంటనే కోపం వచ్చేది. ఆమెతో విభేదిస్తే మా ఇద్దరిమధ్యా అంతరం ఏర్పడుతుందని కూడా అనిపించింది. నన్నామె ప్రేమగా 'బేటా' అనిపిలిచేది. స్వతంత్రజీవనాన్ని గురించి చెబుతూ వుండేది. ఉద్యోగం వదిలిపెట్టి వ్యాపారం చేసుకోమని కూడా చెబుతూవుండేది. కానీ అదిమాత్రం నాకు నచ్చేదికాదు. బదులుచెప్పకుండా ఆమెచెప్పేదంతా వినేవాడిని. ఇప్పుడు ఆమె నాకుటుంబంపై పెత్తనం చేస్తోందేమో అనిపించసాగింది.

నేను కిషన్‌గూడాలో వుండడం మా అమ్మానాయనలకుగాని, నా అన్నలకు గాని నచ్చలేదు. నా దగ్గరకు రావాలంటే వాళ్ళు చాలాదూరం రావాలి. నేను మా అత్తగారి మాట తోసివేయలేకపోవడం వల్లనే ఇటువంటి చిక్కులో ఇరుక్కున్నాననిపించింది. నేను తరుచు అమ్మానాయనలను చూసేందుకుపోయేవాడిని. అట్లా వెళ్ళినప్పుడొకసారి, మానాయన 'నాకోడలు మనుమరాళ్ళు బాగున్నరా, బిడ్డా!' అంటూ ప్రారంభించాడు. బాగున్నారని చెప్పాను.

'మేం అందరం ఇక్కడుంటే నువు అంతదూరం ఎందుకు వొయినవు బిడ్డా?' అన్నాడు నేనాయనకు సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తూండగానే ఆయన,

'నువ్వు నీ డబ్బుగల్ల అత్తమామల అధీనమై పొయినవ్! అందుకే ఆల్లతో వుంటున్నవ్' అన్నాడు.

'అదేంగాదు నాయనా వాళ్లకు సాయం జేస్తున్నా అంతే'.

'ఎవరు నమ్ముతరు బిడ్డా! నువ్వు ఎవరిమీద ఆధారపడకుండా స్వతంత్రంగా ఫకర్ తో బతుకుతవని నీకు మంచి సదువు జెప్పించిన'.

ఈ మాటలకు నాదగ్గర సమాధానంలేదు. ఆయన భావాలు నాకర్థం అయ్యాయి.

'నీకు నువ్వే ఇంకొకరికి పంచనిచ్చె పొజిషన్లో వున్నవ్. ఇంకొకరి పంచన నువ్వెప్పుడుండొద్దు బిడ్డా! మీ అమ్మ నాయనలు నిన్ను జూసి ఫకర్ పడేటట్టు నువ్వుండాలె' ఉద్వేగం ఎగిసివస్తోంది ఆయన మాటల్లో. ఆయన చెప్పింది నిజం. వాళ్ళునాకోసం అహరహమూ శ్రమించబట్టే ఈ రోజు నేనీస్థితిలో వున్నాను. మా అత్తగారిమీద నేను ఆధారపడడం వాళ్ల మనోభావాలను చాలా నొప్పించింది.

"కోపమొద్దు నాయినా! నేను త్వరలో సిటీకే వస్తాను. నీ మనుమరాళ్లను కాన్వెంట్ స్కూల్లో జేర్పిస్త".

మా నాయనా, అప్పటివరకూ అంతావింటూ కూర్చున్న మా అమ్మా కూడా నా మాటవిని సంతోషించారు.

మానాయన ఎప్పుడూ సంపన్నుడు కాడు. ఎప్పుడూ స్వంత ఇల్లులేదు. కానీ తనకొడుకులకు ఆయన ఆఅదృష్టం కలుగచేశాడు. ఆయన అంబేడ్కర్ రచనలేమీ చదవలేదు. కానీ మానాయనకూ ఆయనకూ ఆలోచనల సారూప్యం వుంది. నాయనకు తనవైన కొన్ని నమ్మకాలున్నాయి. విశ్వాసాలున్నాయి. 'నీ బానిసత్వాన్ని నువ్వే నిర్మూలించుకోవాలి, ఆత్మగౌరవాన్ని పణంపెట్టి బ్రతకడం అవమానాల్లోకెల్లా అవమానం. ఆత్మగౌరవం మనిషికి ప్రాణం. అదిలేని మనషి ఒట్టి సున్నాతో సమానం. ఆత్మగౌరవంతో హుందాగా జీవించాలంటే కష్టాలు భరించాలి. నిరంతర పోరాటంలోనుంచే శక్తి జనిస్తుంది. ఆత్మవిశ్వాసమూ, గుర్తింపూ గౌరవం వస్తాయి' అన్నాడు డాక్టర్ అంబేడ్కర్, నాసిక్ జిల్లాలోని యావల అనే వూరిలో ఒక ఊరేగింపులో స్త్రీలనుద్దేశించి. 'నాకు మానాయన మాటలు గుర్తొచ్చాయి' బిడ్డా! తిండిలేకపోయినా 'ఆత్మగౌరవాన్నికుదువెట్టకు' అని! ఆయన చదువుకున్న పండితుడుకాకపోవచ్చు కాని ఆత్మగౌరవాన్ని నమ్మిన వాడు. క్రమశిక్షణే జీవన విధానం చేసుకున్నవాడు.

మేము కిషన్‌గూడాలో వుండగానే మానాలుగో అమ్మాయి నిశ్చల జన్మించింది. మాధవి తరువాత పిల్లలిద్దరూకూడా పెద్దవాళ్ళౌతున్నారు. వాళ్లని స్కూల్ కి పంపించాలి. దగ్గర్లో వున్న స్కూల్ కి పంపమని మా అత్తగారు అన్నది కానీ నేను పంపనని చెప్పేశాను. వాళ్ళు మంచిస్కూళ్ళకు పోవాలి. అందుకని ఇంక నేను నగరంలో కాపురం పెట్టే సమయం వచ్చింది. వాళ్లని రెసిడెన్షియల్ స్కూళ్ళలో పెట్టమని కూడా ఆవిడ సూచించింది.

అందుక్కూడా నేను ఇష్టపడలేదు. ఆవిడకి నచ్చకపోయినా నేను నగరానికి మారాలనే తీర్మానించుకున్నాను. అయితే ఆమె సలహా మేరకు ఒక దగ్గరబంధువు ఇంట్లో అద్దెకి దిగాను. అందువలన ఆమె మమ్మల్ని తరచూ చూసివెళ్ళే అవకాశం వుంటుంది.

1980 ఏప్రిల్‌లో మళ్ళీ మేము నగరంలోకి వచ్చాము. నాకూ మా అమ్మానాయనలకూ కూడా పెద్ద ఊరట ఇది. ఈ మార్పుకు ఎక్కువ సంతోషించింది. మా నాయనే! ఇప్పుడాయన తరచూ వచ్చి మనుమరాళ్లతో గడుపుతున్నాడు. మాధవి హాస్టల్ నుంచీ వచ్చేసింది. ఆరాధనా జ్యోతిశ్రీ కిండర్ గార్టెన్‌లో చేరారు. ఇప్పుడు వాళ్లను చూసుకోడానికొక ఆయాకూడావుంది. జీవితం విలాసవంతంగా లేదుకానీ సౌఖ్యంగావుంది. మాఇంట్లోకి మొదటిసారిగా టెలిఫోన్ వచ్చింది. క్రమక్రమంగా ఒక రిఫ్రిజిరేటర్, సోఫాసెట్, డైనింగ్ టేబుల్, టెలివిజన్ కూడా వచ్చి చేరాయి. ఆనాటి చెరిగిపోని మధుర జ్ఞాపకాలలో ఒకటి మానాయన సోఫామీద కూర్చుని 'చందమామ' చదువుకోడం. అమ్మ ఆయనను వెక్కిరించడం!! అమ్మకూడా చాలా సంతోషంగావుంది. మళ్ళీ నేను ఆమె ఆరోగ్యంగురించి శ్రద్ధ తీసుకోగలుగుతున్నాను. ఆమె బ్లడ్ గ్లూకోస్ చూపించుకోడానికి డాక్టర్ దగ్గరకు తీసుకుపోతున్నాను. మా అమ్మా నాయనలనూ పిల్లలనూ తిప్పడానికి ఒక కారుంటే బాగుండేదనిపించేది. కానీ మానాయన జీవించివుండగా ఆకోరిక తీరలేదు.

◆◆◆

అబ్బసాయిలు, అంజయ్యా, నర్సింగరావు అధ్యాపకులుగా వివిధ కళాశాలలలో చక్కగా కుదురుకున్నారు. ఒకే కుటుంబంలో నలుగురు కళాశాల అధ్యాపకులం!. అందరి జీవితాలూ బాగున్నాయి. అందరికుటుంబాలూ క్రమక్రమంగా సంస్కృతీకరణ చెందుతున్నట్లు గమనించాను. మేం ఉమ్మడికుటుంబంగా వున్నప్పుడు దుర్గమ్మ, తొట్టెల, నరసింహస్వామీ తప్ప మాకేదేవుళ్ళూలేరు. వాళ్లకి కూడా మా అమ్మానాయనలు రోజువారీ పూజలు చేసేవాళ్లుకాదు. మానాయన అప్పుడప్పుడూ దుర్గమ్మకు అన్నమూ మాంసమూ అప్పుడప్పుడూ. ఒక సీసా కల్లూ నైవేద్యంపెట్టి కాసేపు ఏదో ప్రార్థన చెసేవాడు. తరువాత అవి తనే తినేవాడు, తాగేవాడు. ఉపవాసాలుండడం, పూలతో పూజచెయ్యడం శాకాహార వంటలు చేసి వాటిని రుచికూడా చూడకుండా నైవేద్యం పెట్టడం అట్లాంటివి ఎప్పుడూ లేవు. ఇప్పుడు మా ఇళ్ళల్లోకి సరస్వతి, లక్ష్మి, గణపతి వెంకటేశ్వరస్వామి పటాలొచ్చాయి. మాఅన్నలు కొంతమంది ఇళ్ళల్లోకి వాస్తుపట్టింపులూ, తులసిమొక్కలూ కూడా వచ్చాయి. అంజయ్యా, నర్సింగరావూ రోజూ పూజచెసి గంట మోగిస్తున్నారు.

మా ఇంట్లో మా మామగారు అచ్చమైన ఆర్యసామాజికుడు. మా పిల్లలకు కూడా గాయత్రిమంత్రం నేర్పాడు. వారాంతంలో అందరూ 'హవన్' చుట్టూ కూర్చునిమంత్రాలు చదివేవారు. నాకు వాటిలో ఆసక్తిలేదు. మాపిల్లలకు కూడా ఇష్టం కలుగలేదు. తమమీద ఈ కార్యక్రమం బలవంతంగా రుద్దినట్లు భావించేవాళ్ళు. కేవలం వాళ్ల తాత సంతృప్తికోసం

ఆచరించేవాళ్ళు. ఇప్పుడు మా అన్నతమ్ములకుటుంబాలు తిరుపతి, విజయవాడ శ్రీశైలం మొదలైన తీర్థయాత్రలకు కూడా వెళ్ళడం ప్రారంభించాయి.

మా అమ్మ తిరుపతి వెళ్ళాలనుకుని నన్ను తీసుకుపొమ్మని అడిగిందొకసారి. ఆమెను నేను అన్ని సౌకర్యాలు అమర్చి తీసుకువెళ్ళగలిగాను. ఆమెకోరిక తీర్చడం నా అదృష్టంగా భావించాను. సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లో ఆమె అదివరకెన్నడూ ప్రయాణం చేసివుండలేదు. చాలా సంతోషపడింది అదిచాలా సుఖవంతమైన ప్రయాణంగా భావించింది. మా పిల్లలు సంతోషాతిరేకంతో వున్నారు. కిటికీ దగ్గర కూచోడానికి పోటీపడ్డారు. పూర్వం మేము మానాయనతో చేసిన దూరప్రయాణాల జ్ఞాపకం వచ్చాయి నాకు. నేను తిరపతి నుంచీ కొండమీదకు టాక్సీ ఏర్పాటు చేశాను. కొండమీద వసతి ఏర్పాటుచేశాను. స్వామి ప్రత్యేకదర్శనంకూడా ఏర్పాటుచేశాను. దీనికంతా చాలా ఖర్చయి వుంటుందని అమ్మ కాస్త బాధపడింది.

'అయ్యా! నువు మాకు దర్శనం ఏర్పాటు చేసినందుకు సంతోషం! కని చాలా పైసలు ఖర్చై వుంటై నీకు' అంది ఆ ప్రయాణంలో ఆమె అట్లా అనడం అదిరెండవసారి.

'పైసల గురించి ఇంకెప్పుడు మాట్లాడకమ్మా! నీ సుఖంకన్న పైసలు ముఖ్యంగాదు అన్నాను. తరువాత ఎప్పుడు అమె ఖర్చు ప్రసక్తి తేలేదు.

ఇంకొకసారి ఆమెను మా ఇలవేల్పు దుర్గమ్మను దర్శించుకోడానికి విజయవాడ కనకదుర్గమ్మ గుడికి తీసుకువెళ్ళాను. ఆమె సంతోషానికి అవధులులేవు. అప్పుడు వేసవికాలం. మేము ఒక మంచి ఎయిర్ కండిషన్డ్ హోటల్లో బసచేసాం. అమ్మ ఆ సౌకర్యాలు చూసి సంబరపడింది.

◆◆◆

1982వ సంవత్సరంలో డిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (NIEPA) అధ్వర్యంలో జరిగిన పునశ్చరణ తరగతులకు నేనుకూడా హాజరైయాను. దేశంలోని యాభై కళాశాలల ప్రిన్సిపల్స్ మూడువారాలపాటు జరిగిన ఈ తరగతులకు హాజరయ్యారు. విద్యాసంస్థల నిర్వహణలో అమలు చెయ్యదగ్గ కొన్ని నవకల్పనల గురించి తెలుసుకునే అవకాశం ఇది. అందులో పాల్గొన్న ప్రిన్సిపల్స్ అందర్లోకీ నేనే వయసులో చిన్నవాడిని. ఆ కోర్స్ డైరక్టర్ డాక్టర్ శర్మ నన్నుభారతదేశంలోని కళాశాలల ప్రిన్సిపల్స్ అందరికన్న పిన్నవయస్కుడనని సంబోధించాడు. అదినాకు సంతోషాన్ని కలుగచేసి నా ప్రాముఖ్యతని కూడా గుర్తు చేసింది. ఈ తరగతులు కళాశాలల నిర్వహణలో ప్రిన్సిపల్స్‌కు బాగా ఉపకరించేలా రూపొందించబడ్డాయి. కొంతమంది సీనియర్ ప్రిన్సిపల్స్ తమ అనుభవంద్వారా చాలానేర్చుకుని ఉన్నామనీ ఇక్కడనేర్చుకునేందుకేమీలేదనీ అన్నారు. భవిష్యత్తులో నాకు ఉపకరించే కొత్త విషయాలు వీలైనన్ని తెలుసుకోవాలనే ఉత్సాహంతో వున్నాను నేను.

షెడ్యూల్డ్ కులాల, తెగల, విద్యార్థుల అభివృద్ధి గురించిన చర్చ కూడా జరిగింది, ఒకరోజు. దానికి సంబంధించి ప్రిన్సిపల్స్ ఎటువంటి క్రియాశీలమైన చర్యలు తీసుకోవాలని చర్చించారు. అది చాలా ముఖ్యమైనదీ, ఆసక్తికరమైనదీ అయిన చర్చనీయాంశం. అప్పుడే నాకు ఈ కులాలవిద్యార్థుల పట్ల హిందువుల వైఖరులెట్లావుంటాయో బోధపడింది. ఈ విద్యార్థుల సమస్యలను ఎట్లా పరిష్కరించాలి, వారి సామాజిక ఆర్థిక సమస్యలను ఎట్లా తీర్చాలి, అస్పృశ్యతా, కులవివక్షా ఎట్లా నిర్మూలించాలి, అని తీవ్రంగా చర్చించడానికి బదులు, ఆ అంశాన్ని పక్కదోవకు మళ్ళించి, ఇంకెన్నాళ్ళు వాళ్లకి రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతివాళ్ళూ మాట్లాడసాగారు. ఆ విద్యార్థులపట్ల వాళ్లకున్న విరోధభావం స్పష్టంగా కనపడింది. విద్యా సంస్థలకు అధిపతులైన వీళ్ళెవరికీ కూడా దళిత విద్యార్థులకు రిజర్వేషన్లు ఉండడం పట్ల సానుకూల ఆలోచనలేదు. ఒకాయనైతే చాలా అవహేళనగా 'మీరెంత రిజర్వేషన్లు ఇచ్చినా, వాటిని ఎంతకాలం పొడిగించినా ఈ హరిజనులు బాగుపడేదిలేదు. వాళ్ల పిల్లలు స్కాలర్ షిప్ డబ్బులకోసం కాలేజీలకి వస్తారు' అన్నాడు. అగ్రవర్ణ అహంకారం బుసలుకొట్టింది ఆయన మాటల్లో. దళిత విద్యార్థుల అభివృద్ధి దిశగా ఒక్క సూచన కూడా చెయ్యకపోగా వారిపట్ల తనకుండే ద్వేషాన్నీ అసహ్యాన్నీ బయటపెట్టుకున్నాడు. ఇంక నేను సహించలేక పోయాను.

'దళిత విద్యార్థులపట్ల మీరు చేసిన వ్యాఖ్యలకు నేను తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాను. మీ మాటలు అవహేళనతోనూ అవమానకరంగానూ వున్నాయి. ఒక ప్రిన్సిపల్ కే ఇటువంటి వైఖరి వుంటే ఆయన దగ్గర వుండే దురదృష్టవంతులైన విద్యార్థులకు సామాజిక న్యాయం ఎట్లా లభిస్తుందనుకుంటాం?' అన్నాను. నా మొహంఎర్రబడింది. నేనట్లా విరుచుకుపడినందుకు అందరూ తెల్లబోయారు. అణగారిన వర్గాలకు ఇవ్వబడిన చట్టబద్ధమైన హక్కులకు వ్యతరేకంగా ఇన్ని మాటలు మాట్లాడుకుంటున్నా, మౌనంగా వుండిపోయినందుకు డైరక్టర్ కూడా క్షమాపణ అడుగుతున్నట్లు చూశాడు నావంక. పైగా తను చర్చకు పెట్టిన అంశం తప్పుదారిపడుతున్నా మౌనం వహించినందుకు. కూడా ఆయన బాధపడినట్లున్నాడు. తరువాత నేను మహాత్మాజ్యోతిరావ్ ఫూలే, అంబేద్కర్ల ఆలోచనలను ఉల్లేఖిస్తూ ఒక అరగంట మాట్లాడాను. జ్యోతిరావ్ ఫూలే బ్రాహ్మణులూ అగ్రవర్ణశూద్రులూ ఇతర శూద్రులకూ తక్కువకులాలనబడే వారికీ పాఠాలు చెప్పడాన్ని వ్యతిరేకించాడు, ఇప్పుడు ఆయన చెప్పిన మాటలు ఋజువయ్యాయి "ప్రతి గ్రామంలోనూ శూద్రులకు బడులు తెరవండి. కానీ బ్రాహ్మణ ఉపాధ్యాయులను నియమించకండి. శూద్రులే దేశానికి ప్రాణమూ బలమూకూడా. వారి ఆర్థిక, రాజకీయ సమస్యల పరిష్కారం వాళ్లనే చేసుకోనివ్వాలి కానీ బ్రాహ్మణులకు అప్పచెప్పకూడదు" అన్నాడాయన.

ఆవేశపూరితమైన నా ప్రసంగం నన్ను అందరిదృష్టికీ తీసుకుపోయింది. అప్పటినుంచీ అందరూ నన్ను గుర్తించడం మొదలుపెట్టారు. అక్కడకు వచ్చిన ప్రిన్సిపల్స్

లో నేను తప్ప దళితులెవరూ లేరు. నేను దళితడననితెలిసి అందరికీ ఆశ్చర్యంకలిగింది. ఆ సంగతి వాళ్ళకి ముందు తెలిసి వుంటే చర్చ ఇంత తీవ్రంగా వుండేదికాదేమో! అంతకుముందు అవమానపూరితమైన వ్యాఖ్యలు చేసిన వ్యక్తి తరువాత నన్ను క్షమాపణ కోరాడు.

అయితే ఈ కార్యక్రమం నాకు ఉపయోగపడిందనే చెప్పాలి. ఎందుకంటే ప్రిన్సిపల్‌గా నాకు అనుభవం చాలాతక్కువ. దేశం వివిధ ప్రాంతాలనుంచీ వచ్చిన వారితో పరస్పర చర్చలతో సంభాషణలతో నాకు ఎన్నో కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం కలిగింది.

ఇంటికి తిరిగివచ్చిన నన్ను చూసిన పిల్లల ఆనందం చెప్పనలవికాదు. ఇల్లువదిలిపెట్టి వెళ్ళి ఇంతకాలంవుండడం ఇదేమొదటిసారి. పిల్లలంతా నా వొళ్ళో కూచోడానికి పోటీలు పడ్డారు. అందరూ ఒకేసారి మాట్లాడుతూ నా దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్లకోసం డిల్లీనుంచీ నేనేంతెచ్చానో చూడాలని ఆతృత ఒకవైపూ, మళ్ళీ నావళ్ళోనుంచీ లేచి వెళ్ళడానికి అయిష్టత మరొకవైపూ! అందుకే నన్ను గట్టిగా పట్టుకు కూర్చుని స్నానానికైనా పోనిచ్చారు కాదు.

మరునాడు అమ్మానాయనలను చూడ్డానికి పోయినాను. మా అమ్మను ఎండోక్రినాలజిస్ట్ కు చూపించాల్సిన పని వుంది. అందుకోసం ఆమె నాకోసం నిరీక్షిస్తోంది. నన్ను చూడగానే సంతోషంతో 'ఎట్లున్నవ్ బిడ్డా! ఎప్పుడచ్చినవ్?' అన్నది. మా నాయనకు నా చేతిలో వున్న సంచిలో ఏముందో చూడాలని ఆత్రంగా వుంది. నేను మా అమ్మకొక స్వెట్టర్, మానాయనకు మంచి కంపెనీ తయారుచేసిన చుట్టలు, ఒక విస్కీ సీసా తెచ్చాను. వాళ్లు చాలా సంతోషించారు. ఆ మరునాడే మానాయన తన పాత దోస్తులను పిలిచి తనకొడుకు తనకోసం తెచ్చిన విదేశీ విస్కీ తో సత్కరించాడు. తన పిల్లలు తనకోసం విదేశీ విస్కీ, కంపెనీ చుట్టలూ తెచ్చిస్తున్నారని మానాయన చెప్పుకునే పద్ధతి అది.

◆◆◆

ఆ సాయంత్రం పొద్దుపోతున్నా ఇంకా నేను ఆఫీస్ లోనే వుండిపోయాను. అప్పుడు మానాయన వచ్చాడని ఒక అటెండర్ వచ్చి చెప్పాడు. నాయన ఆసమయంలో ఎందుకు వచ్చాడోనని ఆశ్చర్యపడ్డాను. ఆయన లోపలికి వస్తూ చిరునవ్వు నవ్వినప్పటికీ, బాగా అలసిపోయి వున్నట్టూ ఆయన దుస్తులుకూడా మాసిపోయివున్నట్టూ గమనించాను. ఆయన ఎప్పుడూ తెల్లని ధోవతీ, ముడతలు లేని చొక్కా వేసుకునిగానీ బయటికిరాడు. ఆయన్నట్లాచూసి నేను కంపించిపోయాను. ఆయన నుదిటిమీద చెయ్యివేసి చూస్తూ 'ఏమైంది నాయనా ?ఒంట్లో బాగలేదా?' అన్నాను ఆయన ప్రశాంతంగా కూర్చుని 'బాగుంది బిడ్డా!' అని మౌనం వహించాడు. అయినా, నేను మా అమ్మ ఎట్లావుందని అడిగాను. తటిల్లున నాకొక విషయం గుర్తొచ్చింది. ఆరోజు పదిహేనోతేదీ. ప్రతి పదోతేదీన నేను

వాళ్లకు పంపవలసిన డబ్బు ఇంకా పంపలేదు. నాకు లోలోపల చాలా దుఃఖం వచ్చింది. మానాయన ఏదో చెప్పాలనుకుని చెప్పలేకపోతున్నాడని అర్థం అయింది. ఆయనెప్పుడూ ఒక బిడ్డ గురించి మరోబిడ్డ దగ్గర చెప్పడు. నేను చేసేపని కట్టిపెట్టి ఆయన్ని స్కూటర్ మీద ఎక్కించుకుని బజారుకు తీసుకువెళ్ళి ధోవతులు, చొక్కాలూ లోదుస్తులూ ఒక మూడుజతలు కొనిపెట్టాను. ఆయన సంతోషించాడేకానీ అవి తీసుకువెళ్ళడానికి సందేహించాడు. ఆయన సందేహానికి కారణం అర్థమై, మరునాడు నేను వాళ్లను చూడ్డానికి వచ్చినప్పుడు తెచ్చి యిస్తానని చెప్పాను.

◆◆◆

మా సోదరులందరిలోకీ బాలరాజుదే పెద్ద కుటుంబం. అతనికి నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు. అతనిపిల్లలొక్కరే రైల్వే స్కూల్లో చదివారు. ఉమ్మడికుటుంబం విడిపోయాక అతనికి గడ్డుకాలం ఎదురైంది. అతనూ నేనూ కలిసివున్నప్పుడే అతని పెద్దకూతురికి పెండ్లి అయింది. మాధవి పుట్టినప్పుడే అతను తన క్వార్టర్‌కి వెళ్ళిపోయాడు. బాలరాజు తప్ప మిగతా సోదరులంతా ఏదో ఒక అభిప్రాయభేదమో తగాదానో వచ్చి విడిపోయారు. తన క్వార్టర్ తనకుండగా నాకు బరువుకావడం ఎందుకన్న ఉద్దేశంతోనే బాలరాజు విడిపోయాడు కానీ పోట్లాట వచ్చి కాదు. మా ఇద్దరికీ ఎటువంటి అభిప్రాయభేదాలూ లేవు. ఇప్పుడుకూడా బాలరాజు ఇంటికి వెడితే నా స్వంత ఇంటికి వెళ్ళినట్లే అనిపిస్తుంది. నా బాల్యమూ నేను బడికిపోయిన దినాలూ గుర్తొస్తాయి. ఈ ఇంట్లో ప్రతి భాగమూ, ఈ ఇంటి పరిసరాలూ, ఎన్నో మంచిజ్ఞాపకాలనూ కుటుంబంతో మాకున్న అనుబంధాన్నీ మనసునిండా నింపుతాయి. మా అందరిజీవితాలనూ తీర్చిదిద్దడంలో ఈ ఇల్లుపోషించిన పాత్ర ఎంతో ప్రముఖమైనది. విద్యుచ్ఛక్తి లేని ఆరోజుల్లో కిరసనాయిలు లాంతర్ల మసక వెలుతురులో మా పాఠశాల చదువంతా ఇక్కడే! నామీద చిన్నప్పుడు చూపించిన ప్రేమాభిమానాలే ఇప్పటికీ చూపిస్తాడు బాలరాజు. నేనెప్పుడు వెళ్ళినా నాకు తినడానికేమీ పెట్టకుండా పంపదు మావదిన!! పిల్లలుకూడా నామీద ఎంతో వాత్సల్యం చూపిస్తారు. ఉమ్మడికుటుంబం విడిపోయాక తను ఇరవై ఏళ్ళక్రింద ఖాళీ చేసిన ఆయింట్లోకే మళ్ళీ ప్రవేశించాడు బాలరాజు. మా చదువూ, ఉద్యోగాలూ పెళ్ళిళ్ళూ అన్నీ అయ్యేవరకూ మాతోనే వున్నాడు. తన తమ్ముళ్ళ చదువులు, ఉద్యోగాలూ అన్నీ చూసుకుని అప్పుడు తిరిగి తన పాత ఇంటికి వచ్చేశాడు. ఏడుగురు పిల్లలతో అతనికి సంసార నిర్వహణ కష్టంగనే వుంది. అయినప్పటికీ ఇద్దరు కొడుకులకు ఇంజినీరింగ్ చెప్పించాడు. ఒక కూతురు లెక్చెరర్ అయింది. మేం విడిగా వున్నప్పటికీ ఏదైనా ముఖ్యనిర్ణయం తీసుకోవాలంటే నన్ను సంప్రతించకుండా వుండడు.

మేమంతా కలిసి వున్నప్పుడు అనుసరించిన కొన్ని సంప్రదాయాలను ఇంకా పాటిస్తున్నాడు బాలరాజు. ప్రతి దసరాకూ మమ్మల్నందర్నీ దుర్గమ్మ పూజకు తన ఇంటికి

ఆహ్వానిస్తాడు. అన్నతమ్ములం అందరం భార్యాబిడ్డలతో సహా ఆ చిన్న ఇంట్లో కలుస్తాం. పూజ తరువాత భోజనం వుంటుంది. బాలయ్య పిల్లలంతా కలిసేది ఈ ఒక్క సందర్భంలోనే. దీనికోసం సంవత్సరమంతా ఎదురుచూస్తాం. పిల్లలకు కూడా బాగాసరదాగావుంటుంది. మా అమ్మకు తన పాతికమంది మనుమలూ మనుమరాళ్లను ఒకసారి చూసుకోడానికి ఇదే అవకాశం. అందరిపేర్లు కూడా గుర్తు చేసుకోవాల్సి వుంటుంది అప్పుడు. అందరు పిల్లల్లా కాకుండా మా అమ్మాయి మాధవి ఎప్పుడూ తాతను అంటిపెట్టుకుని వుంటుంది. ఇద్దరూ ఏదో ఒకటి చర్చించుకుంటూ వుంటారు. మానాయనకి మాధవి ఇంగ్లీషులో మాట్లాడితే వినడం ముచ్చట. మా నాయనా అన్నలూ తాగుతూ రాత్రి పొద్దుపోయేవరకూ మాట్లాడుతూ వుంటారు. ఎక్కువ తాగినమీదట వాదోపవాదాల్లోకి దిగుతారు. మాపెద్దన్నలిద్దరూ, మా బావగారూ ఉమ్మడి సంసార నిర్వహణలో తమ పాత్ర ప్రాముఖ్యత గురించి వాదించుకుంటారు. అవి చిన్నచిన్నపోట్లాటల్లోకి దిగుతాయి. మానాయన వాళ్ళని శాంతింపచేస్తూవుంటాడు.

◆◆◆

యూనివర్సిటీలో రీడర్ అవడంతోటే అబ్బసాయిలు ఆర్థిక కష్టాలు గట్టెక్కాయి. సీతాఫల్మండిలోని మేడిబావిలో ఇల్లుకొనుక్కున్నాడు. అతని పెద్దకూతురు తార అందమైనపిల్ల. కానీ అప్పుడప్పుడూ వింతగా ప్రవర్తించేది. అటువంటప్పుడు మానసిక వైద్యుడిని సంప్రతించేవాళ్ళు. పదోక్లాసుదాకా చదివింది. ఒక బ్యాంక్ ఉద్యోగస్థునితో పెళ్ళి చేసారు. ఆపిల్ల ఒక రోజు ఎవరూ ఇంట్లోలేని సమయంచూసుకుని బావిలో దూకి ఆత్మహత్యచేసుకుంది. ఇది మాకుటుంబానికి శరాఘాతం. మా అన్న కళ్లల్లో నీళ్లన్నీ ఇగిరిపోయినట్లుగా రాయివలె వుండిపోయాడు. కానీ తారను బావిలోనుంచీ బయటికి తీసాక ఏడుస్తూ నామీద వాలిపోయాడు. నాకుకూడా విపరీతమైన దుఃఖం వచ్చింది. తార మొహం నిద్రపోతున్నదానివలె ప్రశాంతంగావున్నది. బిడ్డ శవం వంక చూసినప్పుడల్లా మా వదినెకు స్పృహ తప్పుతున్నది. మాకుటుంబం అంతటి లోకీ అందమైన పిల్ల తార! తన పదినెలల పసిగుడ్డును వదిలి మాకు అందనంత దూరం వెళ్ళిపోయింది.

అబ్బసాయిలునూ వదనెనూ చూడ్డానికి నేను తరచు వెళ్ళేవాడిని. మా అన్న పసిబిడ్డను తండ్రి దగ్గరకే పంపడానికి నిర్ణయించాడు. మావదినెకు ఇష్టంలేకపోయినా.

◆◆◆

తార మృతి మా నాయన మనసుమీదా ఆరోగ్యం మీదా బాగా దెబ్బతీసింది. మా అమ్మ ఎప్పుడూ డాక్టర్ దగ్గరకు వెళ్ళేది కానీ ఆయనెప్పుడూ వెళ్ళేవాడుకాదు. ఆయనకు మృత్యుభయం లేదు. మనిషికి ఎప్పటికైనా మరణం తప్పదని అంటూండేవాడు. ఆయనకు రోజూ చుట్టలూ, కల్లు వుంటే చాలు. ఇప్పుడాయన మొహం మీద వృద్ధాప్యపు చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు ధృఢంగా వుండే ఆయన కండలు ఇప్పుడు వదులుగా

వేలాడుతున్నాయి. కొన్ని పళ్ళుకూడా వూడిపోయాయి. అమ్మానాయనా పెద్దన్న దగ్గర వుంటున్నప్పటికీ మా నాయన మా అందరిళ్ళకి వస్తూ పోతూ వుండేవాడు. అదివరకు ఎంతదూరమైనా నడిచేవెళ్ళేవాడు. ఇప్పుడు కీళ్ళనొప్పులొచ్చి ఎక్కువగా ఇంట్లోనే వుంటున్నాడు. ఆయన ఆరోగ్యం ఇంత హఠాత్తుగా దిగజారిపోవడం అందరినీ కలతపెట్టింది. మా అక్కా చెల్లీ మా అమ్మకు సాయంగా ఎక్కువకాలం ఆమెదగ్గరే వుంటున్నారు.

మూడునెలలతరువాత ఆయన్ని చూసి చలించిపోయాను. ఆయన స్నానాలగదిలో పడిపోవడం వల్ల ఇప్పుడు కర్ర పట్టుకునిగానీ నడవలేకపోతున్నాడు కాలకృత్యాలకు వెళ్ళాలన్నా ఇతరుల సాయం అవసరమౌతున్నది. దాదాపు మంచం పట్టినట్లే! నాకు దుఃఖం ఆగలేదు. మా అమ్మ నాచెయ్యిపట్టుకుని అవతలికి తీసుకుపోయి,

'ఏడ్వకు బిడ్డా!మీనాయన బాగనే వున్నడు' అన్నది. అంటూ తనుకూడా కళ్ళుతుడుచుకున్నది.

'మీరు నాదగ్గరకు ఒచ్చెయ్యండమ్మా!' అన్నాను.

'ఒద్దు బిడ్డా! మీ అన్న బాధ పడుతడు మాకిక్కడ బాగనెవుంది' అన్నది. ఆమె దృష్టిలో అందరు బిడ్డలూ సమానులే! అంతా మంచివాళ్ళే.

'ఇట్లా ఒకరిమీద ఆధారపడిపడి బతకాలంటే విసుగొస్తున్నది బిడ్డా! 'అన్నాడు నాయన నేను సాయంపట్టి కుర్చీలో కూర్చోబెడితే !. ఆయన కళ్ళుతడిగా వున్నాయి. గడ్డం మాసిపోయివుంది. ఆయన పెద్ద పెద్ద కళ్ళు లోపలికి పీక్కుపోయి గుంటలుపడ్డాయి. సరిగ్గా కనపడడంలేదు. చాలాపళ్ళు ఊడిపోయాయి.

'ఫికర్ జెయ్యకు నాయనా నువ్వు మంచిగైతవ్' అని, ఆయన పొడవాటికర్ర కుర్చీపక్కపెట్టాను.

యౌవ్వనంలో మహా బలిష్ఠుడైన మా నాయన శరీరం పరిస్థితులకు లొంగిపోవాల్సి వచ్చింది. ఒకప్పుడాయన క్వింటాల్ బరువు బస్తాలను అవలలగా ఎత్తేవాడు. ఆయన శరీర ధారుఢ్యం చూసి వస్తాదులూ ఫైల్ మన్లూ కూడా దడిసేవారు. ఇప్పుడాయన కర్రపట్టుకుని నిస్సహాయంగా ఒక కుర్చీలో కూర్చునివున్నాడు. జీవితమంతా ప్రతికూలశక్తులతో పోరాడి జయించిన మనిషి, ఇప్పుడు అనారోగ్యంతో పోరాడుతుండగా ఆయన కొడుకులు తండ్రిని చూసిపోవడానికి కూడా సమయం లేని హడావుడి జీవితాలలో మునిగితేలుతున్నారు. తను ఇంత పరాధీనంగా అయిపోయినందుకు తనని తనే తిట్టుకుంటున్నాడాయన. ఆయన గురించి పట్టించుకుని అందరూ అలసిపోయారేమో అనిపించింది నాకు.

◆◆◆

ఈ సమయంలోనే నేను కళాశాల నిర్వహణలో మునిగివున్నాకూడా రీసెర్చి మొదలు పెట్టాను. అయితే నేను తలపెట్టిన పరిశోధనకు చేయవలసిన ప్రయోగాలకు అవసరమైన సౌకర్యాలు కొరవడినందువల్ల ఆ పని ముందుకు సాగడంలేదు. అవినేను విజయవంతంగా

చెయ్యగలనోలేదో అని చింతిస్తున్నాను. నా సహాధ్యాయీ, స్నేహితుడూ అయిన డాక్టర్ చంద్రపాల్ మార్గదర్శకత్వంకోసం ఎదురుచూస్తున్నాను. ఆయనిప్పుడు ఉస్మానియా యూనివర్సిటీలో కెమిస్ట్రీ శాఖలో వున్నాడు. నా రీసెర్చి పర్యవేక్షకుడు ఆయనే. నేనాయన దగ్గరకుపోయి, 'సర్ నా ప్రయోగానికి సంబంధించినపని చాలావరకూ పూర్తయింది. కొంచెమే మిగిలివుంది' అని చెప్పబోయాను.

'ఆ సంగతి నాకు తెలుసు సత్యనారాయణా! నీపని పూర్తికావడానికి నీకు దేవీప్రసాద్‌ని సాయంచెయ్యమని చెబుతాను. అయితే నవ్వు నిజాం కాలేజికీ పోవాల్సి వుంటుంది' అన్నాడు చంద్రపాల్.

'ఫరవాలేదు సర్! నేను తక్కిన పనంతా నిజామ్ కాలేజిలో పూర్తిచేస్తాను' అన్నాను.

నా పరిశోధన పూర్తికాబోతోందని ఆయన సంతోషించాడు. ఆయన కూడా తన కార్యనిర్వహణ బాధ్యతల్లో మునిగివుండి నాకోసం సమయం వెచ్చించలేకపోయాడు.

దేవీప్రసాద్ చిన్నవాడు. నేనంటే గౌరవం కలవాడు. నా పరిశోధన కొన్ని నెలలలోనే పూర్తవుతుందని ధైర్యమిచ్చాడు. నేను సంతోషించాను. రోజూ ఉదయం అయిదుగంటలకే నిజామ్ కాలేజీకి పోయి అక్కడి లాబ్‌లో ప్రయోగాలు చేసుకునేవాడిని. అయితే నా సిద్ధాంత గ్రంథంలో మొదటి అధ్యాయం పూర్తయే సరికి అతనిలో హఠాత్తుగా ఏదో మార్పు వచ్చింది. నన్ను తప్పించుకు తిరగడం ప్రారంభించాడు. నా వ్రాతప్రతిని చూపించడానికి వెళ్ళినప్పుడల్లా నన్ను తప్పించుకుపోయేవాడు. అతనుకూడా దళితుడే. ఒక్కొక్కసారి అతను బయటికొచ్చేవరకూ అతని తలుపు దగ్గర అరగంట నిలబడవలసి వచ్చేది. ఒక్క క్షణం నేను ఆలస్యం చెస్తే అసలు దొరికేవాడుకాదు. నాకది చాలా అవమానకరంగా వుండేది. నాకు కళాశాలలో పెద్ద పదవి లభించడం అతనికి ఇష్టంలేదని తెలుస్తోంది. అట్లా పదినెలలు గడిచాక చివరికి నాకు సహాయంచెయ్యడానికి తన దగ్గర సమయం లేదని చెప్పేశాడు. నాకు విసుగొచ్చేసింది, ఇంక పి. హెచ్. డి. ఆశ వదులుకుందా మనుకున్నాను.

ఒకరోజు డాక్టర్ రామారావుతొ కూర్చుని కాఫీ తాగుతూండగా. ' ఏమైంది నీ రీసెర్చి ?'అని అడిగాడాయన.

'ఇంక విరమించుకుందామనుకున్నాను' అన్నాను గొణిగినట్లు.

'నీ కేమైనా పిచ్చా? ఇంతదూరం వచ్చి ఇప్పుడెవరైనా వదిలేస్తారా?' అన్నాడతను.

'ఏంచెయ్యను?. అతనసలు పట్టంచుకోడం లేదు పైగా ఇప్పుడు తనకి వీలుకాదని చెప్పేశాడు'.

రామారావు కలతచెందాడు. నేను కూడా నా రీసెర్చి పూర్తిచెయ్యాలని అతని కోరిక. తనెప్పుడో డాక్టరేట్ సంపాదించాడు. నేను రిసెర్చి చేస్తున్నట్టు పోజు కొడుతున్నానని ఎవరో అంటుండగా విన్నాడట. అతనికి కోపంవచ్చింది.

'అతను నీకెందుకు సాయంచెయ్యడు?అతనుకూడా దళితుడేగా?' అన్నాడు కోపంగా రామారావు.

'నేను డాక్టరేట్ తీసుకుంటే అతని ఉద్యోగానికి ముప్పు అనుకుంటున్నాడేమో?' అన్నాను.

'అతన్ని గంగలో దూకమను ! వెళ్ళి చంద్రపాల్‌ని కలు! అతనే నిర్ణయిస్తాడు. అంతేగాని ఇంత దూరం చేసి ఇప్పుడు వదిలెయ్యడమేమిటి? అందరూ నవ్వుతారు. ఇప్పటికే నీకు రిసెర్చిచేసే సామర్థ్యంలేదని అనుకుంటున్నారు' అన్నాడు రామారావు. నేను వెళ్ళి చంద్రపాల్‌ని కలుస్తానని రాముకి చెప్పాను. ఆపని మర్నాడే చెయ్యమన్నాడతను.

మర్నాడు ఉదయమే చంద్రపాల్‌ని అతనింటి దగ్గర కలిసాను. అంతావిని అతనుకూడా అదిరిపడ్డాడు.

'జరిగినదానికి నాక్కూడా బాధగా వుంది దోస్త్! దేవీప్రసాద్ ఇట్లాచేస్తాడని అనుకోలేదు. అతని సంగతి వదిలెయ్ మనం నీపని త్వరగా పుర్తిచేద్దాం' అన్నాడు.

'థాంక్యూ!!అసలు నేను రిసెర్చి వదిలేద్దామనుకున్నాను' అన్నాను.

'వద్దొద్దు. అదెట్లా? నువ్వు దాదాపు పనంతా పూర్తిచేశావు. ఇంకా సమయం వృధాకాకుండా నీ సిద్ధాంత గ్రంథంపూర్తయేలాగా నేను చూస్తాను' అన్నాడు. జరిగినదానికి అతనుకూడా విచారించాడు నన్ను నిరాశ చెందకుండా పనిపూర్తిచెయ్యమని ఉత్సాహపరిచాడు. ఇద్దరం కలిసిపనిచేద్దామనీ ఆరునెలల్లో పూర్తిచేద్దామనీ మాట ఇచ్చాడు.

◆◆◆

మానాయన జీవించి వుండగానే నా డాక్టరేట్ తీసుకోవాలని ఆశపడ్డాను. కానీ ఆకోరిక ఒక్కటే తీరలేదు.

1983 జూలై 13 న యెలుకటిబాలయ్య అనే రామస్వామి జీవితం ముగిసింది. తనపిల్లలకు క్రమశిక్షణ నేర్పి, దేనికీ రాజీ పడని స్థిరచిత్తులుగా వాళ్లని మలచిన మనిషి, వాళ్ళని, విద్యలో ఉన్నతస్థాయికి నడిపించి, సమాజంలో సముచిత స్థానం కల్పించిన మనిషి; ఇకలేడు!. దళిత కుటుంబాలకు ఆయన ఒక ఆదర్శం. దళితులకే కాదు, సికిందరాబాద్ నుండి కాజీపేటదాకా రైల్వే ఉద్యోగులందరికీ ఆదర్శం!. ఆయనేమీ సంఘసేవకుడు కాదు. సంస్కర్త కాడు. అంబేడ్కర్ రచనలు చదవలేదు, కానీ తనదైన ఒక రాజీలేని పద్ధతిలో సాంఘిక దురాచారాలమీద పోరాటం చేశాడు. జీవితాంతం ఆయన ఎవరికీ తలవంచడానికి ఇష్టపడలేదు. అందుకే అందరిగౌరవం సంపాదించు కున్నాడు. అగ్రకులస్థులుకూడా ఆయన్ని గౌరవించేవారు.

మా పెద్దన్న ఇంట్లో మా నాయన మృత దేహం వుంది. అమ్మ ఆయన పాదాల దగ్గర కూచుని శోకిస్తున్నది. యాభైసంవత్సరాల సహజీవనం వాళ్లది. పిల్లలను పెంచుతూ, పెద్ద కుటుంబ బాధ్యతను పంచుకుంటూ కలిసి మెలిసి సుదీర్ఘ ప్రయాణం చేసారు ఆ దంపతులు. !! తనని అట్లా ఒంటరిని చేసిపోయినందుకు తన జీవన సహచరుణ్ణి దూషిస్తూ ఏడుస్తోంది ఆమె. ఆమె చేతుల్లోనే ఆయన చివరిశ్వాస వదిలాడు. అన్నికోరికలూ తీర్చుకుని

సంతృప్తిగా కళ్ళుమూశాడు. పిల్లలంతా చక్కగా కుదురుకున్నారు. మనుమలూ మనుమరాళ్లతో ఆడాడు.

అందరం శోక సముద్రంలో మునిగివున్నాం. ఓదార్చేవాళ్ళెవరూ లేరు. ఒక్కొక్కరు వచ్చినప్పుడల్లా అమ్మ దుఃఖం కెరటంలా ఎగసిపడుతోంది. మాధవి తాత దగ్గర కూచుని ఏడుస్తోంది. మిగతా పిల్లలూ దుఃఖిస్తున్నారు.

అన్నతమ్ములం ఒక మూలచేరి అంత్యక్రియలగురించి మాట్లాడుకుంటున్నాం.

'అక్కకు జెప్పంపిచ్చిన ఆమె నెక్కొండ నుంచి ఒచ్చేదాక ఆగుదం' అన్నాడు బాలరాజు.

'ట్రెయిన్ వచ్చేవరకు నాలుగైతది. ఇంతల వేరే ఏర్పాట్లు జేద్దాం' అన్నాడు అబ్బసాయిలు.

కాజీపేట నుంచీ సికిందరాబాద్ రైల్వేస్టేషన్ వరకూ వున్న పరిచయస్థులూ బంధువులూ స్నేహితులూ ఒక్కొక్కరే వస్తున్నారు. రైల్వే ఆఫీసర్లు మానాయన మీద పుష్పగుచ్ఛం వుంచారు. సాధారణ ఉద్యోగులెవరికీ దక్కని అరుదైన గౌరవం అది. ఆ కాలనీ మొత్తం విచారగ్రస్తమైంది. కాలనీలో అందరూ వచ్చి బాలరాజుని పరామర్శించి నాయన మృతికి సంతాపం వెలిబుచ్చారు.

పాడెకు కావలసిన సరంజామా కొనడానికి సమీపబంధువులైన పెద్దవాళ్ళు అయిదుగురు వెళ్ళాలి. ఈ సామానుకొనేముందు వాళ్ళు కల్లుతాగడానికి పోయొస్తారు. వాకిట్లో శవానికి దగ్గరగా నిప్పురాజేసి దానిమీద చిన్న మట్టిముంతతో కొంచెం అన్నం వండుతారు. ఆ నిప్పుమీదే నీళ్ళుకాచి శవానికి స్నానంచేయిస్తారు. నలుగురు మనుషులు పాడె భుజానికెత్తుకోగా ఆడామగా అంతా స్మశానానికి ఊరేగింపుగా బయల్దేరతారు. పెద్దకొడుకు ఒక కుండ భుజాన పెట్టుకుని ముందు నడుస్తాడు. డప్పు వాదనకు అనుగుణంగా కొందరు నృత్యంచేస్తూ సాగుతారు. పూర్వం అస్పృశ్యులు శవాలను పూడ్చిపెట్టేవాళ్లు. ఇప్పుడు దహనం చేస్తున్నారు.

నాయన అంతిమ యాత్ర బాలరాజు ఇంటినుంచీ బయలుదేరేసరికి సాయంత్రం ఆరుగంటలైంది. మా నాయన ఆఖరి ప్రయాణం అది. అశేషమైన జనసమూహంతో ఊరేగింపుసాగింది. నాయనను కడసారి మోసేటందుకు ఒకరితరువాత ఒకరుగా భుజాలు మార్చుకుంటున్నాం మేము. ఒక డజను మంది మాదిగ కులస్థులు డప్పు మోగిస్తుండగా కొంతమంది నృత్యంచేసారు. అక్కడక్కడా ఆగుతూ రెండుగంటలపాటు సాగి మెట్టుగూడాలోని శ్మశాన వాటికకు చేరింది ఊరేగింపు. అక్కడ మాదిగ అనుబంధ కులానికి చెందిన ఒక జంగం అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించాడు.

మా నాయన తనదైన రీతిలో గొప్పవాడని నాకు తెలుసు. ఆయన స్మృతి చిరస్థాయిగా నిలిచి వుండాలనే ఈ పుస్తకం వ్రాసాను. ఇదే ఆయనకు నా హృదయపూర్వక ఘననివాళి.

◆◆◆

**వై. బి సత్యనారాయణ** ఒక పేద దళిత కుటుంబంలో, బాలయ్య, నర్సమ్మల ఆరవ సంతానంగా జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీనుంచీ 1971 లో మాస్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ తీసుకుని. మొదట నిర్మల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. తరువాత హైదరాబాద్‌లోని ధర్మవంత్ సైన్స్ అండ్ కామర్స్ కాలేజిలో కెమిస్ట్రీ అధ్యాపకులుగా చేరి, తన ముప్పైమూడవ ఏటనే ఆ కాలేజీ ప్రిన్సిపల్ అయ్యారు. పదవీ విరమణవరకూ 25 సంవత్సరాలు ప్రిన్సిపల్ గా కొనసాగారు. కెమిస్ట్రీలో పి. హెచ్. డి. సాధించారు. విద్యాసంస్థల సంబంధమైన అనేక పాలక మండలులలో సభ్యులుగా వున్నారు కాకతీయ యూనివర్సిటీ ఉస్మానియా యూనివర్సిటీల ఎక్జిక్యుటివ్ కౌన్సిల్స్ లో సభ్యులుగా వున్నారు.

డాక్టర్ అంబేద్కర్ సిద్ధాంతాలలో ధృఢ విశ్వాసం గల సత్యనారాయణ, 1990 నుంచీ, దళితసాహిత్యాన్ని. చరిత్రనూ, వివిధ రంగాలలో వారు సాధించిన అభివృద్ధినీ శ్రద్ధగా అధ్యయనం చేశారు. 2006 అక్టోబర్ 14 న వేలాదిమంది దళితులతో కలిసి హిందూమతాన్ని వదిలి బౌద్ధాన్ని స్వీకరించారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెంటర్ పర్ దళిత్ స్టడీస్‌కు అధ్యక్షులుగా వున్నారు.

**పి. సత్యవతి** కథా రచయిత్రి. సత్యవతి కథలు, ఇల్లలకగానే, మంత్రనగరి, మెలకువ కథా సంపుటాలు, రాగం భూపాలం వ్యాస సంపుటి ప్రచురించారు. ఇస్మత్ చుగ్తాయ్ కథలు తెలుగులోకి అనువదించారు. విజయవాడలో వుంటారు.



# యెలుకటి బాలయ్య

స్వాతంత్ర్యానికి ముందూ, ఆ తరువాతా ఈ దేశంలో ఒక దళితుని మనుగడ ఎట్లా వుందో చాలా శక్తివంతంగా పదునుగా చెప్పిన పుస్తకం ఇది. **– ద హిందూ** (మార్చ్ 3, 2012)

ఈ కథ ఒక విజయ పరంపర. అయితే ఈ ప్రయాణం ఇంకా కొనసాగవలసి వున్నది. "మా నాయన బాలయ్య" బహుశా సారంగంలో ప్రయాణం చేసిన తరువాత ప్రత్యక్షమయిన వెలుగు అనుకోవచ్చు. **– దక్కన్ హెరాల్డ్** (ఫిబ్రవరి 19, 2012)

అలెక్స్ హేలీ 'ఏడుతరాలు' రాసి ప్రపంచాన్ని ఓ కుదుపు కుదిపాడు. ఆ పుస్తకం నల్లవాళ్ళ బైబిల్‌గా ప్రసిద్ధికెక్కింది. ఇప్పుడు వై.బి. సత్యనారాయణ మూడు తరాల ఆత్మకథ రచించి చరిత్ర సృష్టించాడు. సాహిత్యంలో మరాఠీ ఆత్మకథ విజయకేతనం ఎగురవేస్తే ఇప్పుడు తెలుగులో తొలిజెండా ఎగురవేసిన ఈ పుస్తకం సాహిత్య చరిత్రలో ఓ మైలురాయి. మాదిగల చరిత్రను అక్షరీకరిస్తే అది రామాయణ, మహాభారతాలను మించిపోతుంది. ఇది ఒక బాలయ్య ఆత్మకథ మాత్రమే కాదు, లక్షలాది బాలయ్యల భార చరిత. రచయిత తన అపూర్వ మేధతో, పరిశీలనతో, రచనా శిల్పంతో ఈ పుస్తకాన్ని అమూల్యం చేశాడు. ఈ పుస్తకం చదివితే మాట తప్పని మానధనులైన మాదిగల మహోన్నత మనస్తత్వం, స్వేచ్ఛ, వారి అమాయకత్వం పరోపకార ప్రియత్వం, బహుభాషా పరిజ్ఞానం, సౌందర్యాత్మక దృష్టి మరియు చెప్పుల నిర్మాణంలో గొప్ప కళాసృష్టి పాఠకుల దృష్టిని ప్రగాఢంగా ఆకర్షిస్తాయి. **– ఎండ్లూరి సుధాకర్**

దళిత జీవిత చరిత్రలలో ఓ మైలురాయి వంటిదీ పుస్తకం. ఈ జీవిత కథలో అప్పటి రైలు మార్గాల నిర్మాణం వలెనే బాలయ్య కూడా అంతే వేగంగా మూడు తరాలను ఆధునికతలోకి ప్రయాణం చేయించాడు. ఆధునికతని పోరాట సాధనంగా చేసుకున్నాడు. **– గోపాల్ గురు**

తెలంగాణ గ్రామీణ జీవితాల్లో పొరలు పొరలుగా ఎదురయ్యే పేదరికం. సామాజిక వెలి, అంటరానితనం, శ్రమ దోపిడీ, కష్టాల కడగండ్ల వంటి వాటన్నింటిపై ఓ దళిత కుటుంబం సాగించిన యుద్ధాన్ని కళ్ళకు కట్టే రచన ఇది. వాళ్ళీ క్రమంలో చేసిన ప్రయత్నాలనూ, అనుభవించిన వేదననూ నిజాయితీగా ఆవిష్కరిస్తుందిది. విద్యకోసం, ఆత్మగౌరవం కోసం, స్వేచ్ఛకోసం జరిపే పోరాటంలో విజయం ఎంత ప్రధానమో బలంగా నొక్కి చెప్పే ఈ రచన – మనల్ని కల్లోల పరుస్తుంది, అదే సమయంలో ఎంతో స్ఫూర్తినీ రగులుస్తుంది. **– శాంతా సిన్హా**